# పిల్లలు – భాష – భాషాభ్యాసనం

# ప్రాథమిక స్థాయి తెలుగు

# ఉపాధ్యాయ శిక్షణామార్గదర్శి

2018

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణాసంస్థ,

హైదరాబాద్, తెలంగాణ.

SCERT TELANGANA

**Government of Telangana, Hyderabad**

**First Published 2018**
**SCERT Publication Vol. No.00___ of 2018**
**(తెలుగు)**

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

SCERT TELANGANA

# ముందుమాట

భాష భావ వినిమయ సాధనం మాత్రమే కాదు, ఆలోచనకు హేతువు కూడా! 'ఆలోచన – వ్యక్తీకరణ' రెండూ కూడా భాష ద్వారానే జరుగుతవి. బడికి రాకముందు పిల్లలు వినడం, మాట్లాడడం వంటి భాషాసామర్థ్యాలను కల్గిఉన్నారు. బడిలో చేరిన తర్వాత చదువడం, రాయడం సామర్థ్యాలను వృద్ధిపరచాలి. బడికి రాకముందు 3 సం॥రాలకే అత్యంత సంక్లిష్టమైన భాషను అలవోకగా గ్రహించి, వినియోగించే సామర్థ్యమును కల్గిఉన్నారు. పిల్లలకు చదువడం, రాయడం మాత్రమే నేర్పిస్తున్నాం. భాష మీద పట్టుకలిగిన పిల్లలు బడిలో చేరినా వైఫల్యం చెందుతున్నారు.

2017 నవంబర్ 13వ తేదీ జరిగిన జాతీయ స్థాయి సాధన పరీక్షలో 3వ తరగతి 68% మంది, 5వ తరగతిలో 67% మంది విద్యార్థులు మాత్రమే ప్రగతి కనబరచారు. వీరిలో 75% కంటే ఎక్కువ ప్రశ్నలను చేయగల్గినవారు 3వ తరగతిలో 42% మంది, 5వ తరగతిలో 22% మంది మాత్రమే ఉన్నారు. ఇది కూడా పఠనావగాహనను పరీక్షించడానికి బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహించిన పరీక్షలో! ఒకవేళ స్వీయరచన, వ్యాకరణాంశాలు వంటి ఇతర సామర్థ్యాలను పరిక్షిస్తే పరిస్థితి మరింత ఆందోళన కల్గిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. ఇలా ఎందుకు జరుగుతున్నది? పిల్లల్లో నేర్చుకొనే శక్తి లేదా? లేదా మనమే నేర్పడంలో విఫలమైతున్నామా? అంతర్మథనం చేసుకోవాలి.

భాషను అర్థవంతంగా నేర్పడానికి వీలుగా పాఠ్యపుస్తకాలను కూడా ఆధునీకరించుకున్నాం. అనేకమార్లు గతంలో శిక్షణలు కూడా ఇచ్చారు. ఐనా మార్పు రాకపోవడం గురించి ఆలోచించాలి.

ఈ మధ్యకాలంలో జాతీయస్థాయిలో 'పిల్లలు – భాషాభ్యసనం' మీద అనేక పరిశోధనలు జరిగినవి. వాటిని అధ్యయనంచేసి 'భాషాభ్యసనం' గురించిన నూతన దృక్పథాన్ని, వైఖరులను పెంపొందింపచేయడానికి తద్వారా అర్థవంతంగా, భాషా సామర్థ్యాలను పెంపొందింపచేసే విధంగా పాఠ్యపుస్తకాలను వినియోగించడానికి వీలుగా 2018లో ప్రాథమిక స్థాయిలో 'తెలుగు'లో పిల్లలు – 'భాష – భాషాభ్యసనం' గురించి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం జాతీయస్థాయి విషయనుపుణులు, అజీంప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం వారి సహకారంతో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకోసం శిక్షణాంశాలను నిర్ధారించి కరదీపికను రూపొందించారు.

ఈ కరదీపికలో "పిల్లలు – భాషను ఎలా నేర్చుకొన్నారు?", అభ్యసనంలో భాష యొక్క పాత్ర, భావనల నిర్మాణంలో భాష, భాషాభ్యసనంలో సమగ్ర ఉపగమం, సామాజిక సాంస్కృతిక, విమర్శనాత్మక దృక్పథం, పాఠ్యపుస్తకాల తాత్త్వికత, పఠనం, లేఖనం, జాతీయసాధన స్థాయి పరీక్ష ఫలితాల విశ్లేషణ, అభ్యసనా ఫలితాలు, మన రాష్ట్రంలో తప్పనిసరి బోధనాంశంగా తెలుగు అమలు... వంటి అధ్యాయాలను పొందుపర్చారు. వీటిని అధ్యయనం చేయడం ద్వారా భాషపట్ల, భాషాభ్యసనం పట్ల, భాషాసామర్థ్యాలు (ప్రధానంగా పఠనం, లేఖనం) పెంపొందించడం గురించి అవగాహన కలుగుతుంది. మన దృక్పథంలో మార్పు కూడా చోటుచేసుకొంటుంది. నూతన వైఖరులతో మరింత అర్థవంతంగా భాషాభ్యసనం జరిగేలా మన తీరు కూడా మారుతుందనే విశ్వాసం ఉంది. కాబట్టి దీని ఆసాంతం చదివి, అర్థంచేసుకొని పిల్లల్లో భాషాసామర్థ్యాను పెంపొందించడానికి కృషిచేస్తారని ఆశిస్తున్నాను. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణకోసం రాష్ట్రస్థాయిలో విషయనిపుణుల శిక్షణ నిర్వహించి సేవలందించిన అజీంప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం వారికి ధన్యవాదాలు. ఈ కరదీపిక రూపకల్పలో పాల్గొన్న స్టేట్ రిసోర్సు గ్రూపు సభ్యులకు అభినందనలు.

**– సంచాలకులు**

SCERT TELANGANA

# రూపకల్పనలో పాల్గొన్నవారు

1) **శ్రీ సువర్ణ వినాయక్,** ప్రధానోపాధ్యాయుడు, తెలుగు పాఠ్యపుస్తక కో-ఆర్డినేటరు, కన్నాల, మంథని (మం.), పెద్దపల్లి జిల్లా.

2) **సంబరాజు రవిప్రకాశరావు,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గోవిందాయపల్లి తండా, కద్తాల (మం.), రంగారెడ్డి జిల్లా.

3) **డా॥ జి. త్రివేణి,** భాషోపాధ్యాయిని, ప్రా.పా, అంగరాజుపల్లి, చెన్నూరు (మం.), మంచిర్యాల జిల్లా.

4) **కె. సుకన్య,** ఉపాధ్యాయిని, ప్రా.పా., మేదర్‌బస్తి, ముషీరాబాదు (మం.), హైదరాబాదు.

5) **కె. ఉపేందర్ రావు,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., పీర్యాతండ, తుర్కపల్లి (మం.), యాదాద్రి భువనగిరి జిల్లా

6) **రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., మందపల్లి, కరీంనగర్ జిల్లా.

7) **వద్దెపల్లి సంధ్య,** ప్రా.పా. చింతకుంట, కొత్తపల్లి (మం.), కరీంనగర్ జిల్లా.

8) **ఎం. వీణ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., బేతల్‌వాడ, చెన్నూరు (మం.), మంచిర్యాల జిల్లా.

9) **వడవత సునీత,** ఉపాధ్యాయిని, ప్రా.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్ జిల్లా.

10) **ఎ. శైలజారాణి,** స్కూ.అ. (తెలుగు), ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

## ఎడిటింగ్, విషయనిపుణులు

**శ్రీ సువర్ణ వినాయక్,**
ప్రధానోపాధ్యాయుడు,
తెలుగు పాఠ్యపుస్తక కో-ఆర్డినేటర్,
కన్నాల (మం.) మంథని జిల్లా.

**డా॥ యం.రమాదేవి,**
ప్రొఫెసర్, ఐ.ఎ.ఎస్.ఇ. కళాశాల,
మాసబ్‌ట్యాంక్,
హైదరాబాదు.

## సలహా, సమన్వయకర్తలు

**డా॥ పి.రేవతి రెడ్డి,**
ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్.

**శ్రీమతి తహసీన్ సుల్తానా,**
ప్రొఫెసర్, కో-ఆర్డినేటర్ (భాషా విభాగం),
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

## ప్రధాన సలహాదారులు

**శ్రీమతి బి. శేషుకుమారి,**
సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి.
హైదరాబాద్.

**శ్రీ టి. విజయకుమార్, ఐ.ఎ.ఎస్.,**
సంచాలకులు, పాఠశాల విద్య,
తెలంగాణ.



SCERT TELANGANA

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజి |
|---|---|---|
| (అ) | **పిల్లల భాషాభ్యసనం - సామర్థ్యాలు** | |
| 1. | పిల్లల భాష - తరగతి గది అన్వయం | 1 |
| 2. | అభ్యసనంలో భాష పాత్ర - తరగతి గది అన్వయం | 7 |
| 3. | భావనల నిర్మాణం - భాష | 15 |
| 4. | భాషాభ్యసనం - సమగ్ర ఉపగమం - సామాజిక, సాంస్కృతిక విమర్శనాత్మక దృక్పథం | 20 |
| 5. | పాఠ్యపుస్తకాలు - వాటి తాత్త్వికత - తరగతి గది అన్వయం | 26 |
| 6. | పఠనం - పఠన వ్యూహాలు - తరగతి గది అన్వయం | 32 |
| 7. | లేఖనం - లేఖనం వ్యూహాలు - తరగతి గది అన్వయం | 52 |
| 8. | భాషాభివృద్ధి - గ్రంథాలయం | 60 |
| 9. | భాషాసామర్థ్యాలు - అభ్యసనా ఫలితాలు | 64 |
| 10. | జాతీయ సాధనాస్థాయి పరీక్ష - ఫలితాల విశ్లేషణ | 70 |
| (ఆ) | **అనుబంధం** | |
| 1. | రకరకాలైన ఆటలు | 76 |
| 2. | తప్పనిసరి బోధనాంశంగా తెలుగు అమలు | 81 |
| 3. | బాలలపై లైంగిక వేధింపులు - బాలల సంరక్షణ - పాఠశాల పాత్ర | 86 |
| 4. | పిల్లలూ - భాష<br>*ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి* | 94 |
| 5. | పిల్లలు భాష నేర్చుకొన్నట్టే రాయడమూ నేర్చుకోగలరా?<br>*ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి* | 98 |
| 6. | భాషా బోధనలో భిన్న ధోరణులు<br>*చదువు విజ్ఞానం* | 101 |
| 7. | పిల్లలు చదివే కథల పుస్తకాలు ఏవి?<br>*కొడవటిగంటి కుటుంబరావు* | 106 |
| 8. | మన చదువుల్లో కథల స్థానం<br>*ప్రొ॥ కృష్ణకుమార్* | 110 |
| 9. | పిల్లలూ - పుస్తక ప్రపంచం<br>*కీర్తి జయరాం* | 116 |
| 10. | సార్వత్రిక గురువులు | 121 |




SCERT TELANGANA

SCERT TELANGANA

# 1. పిల్లలు - భాష - తరగతి గది అన్వయం

మానవ నాగరికతను మలుపు తిప్పింది భాష. ఆదిమ మానవుడి నుంచి నేటి ఆధునిక మానవుడి వరకు జరిగిన అనేక పరిణామాలలో భాషది ప్రధానపాత్ర. ఇప్పుడు భాష సార్వత్రికం, సార్వజనీనం. లిపిలేని భాషలున్నాయికాని ధ్వనుల్లేని, మాటల్లేని భాషలులేవు. అత్యంత ప్రాథమిక స్థాయి భాష సైతం అద్భుతంగా ఆయా జాతుల అవసరాలను తీర్చగల స్థాయిలో ఉంది. అవసరాలు పెరిగిన కొద్దీ భాష తనకుతాను అద్భుతంగా మార్పులకు లోనవుతుంది. ఇంత గొప్పదైన, క్లిష్టమైన భాషను పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు? అసలు పిల్లల సహజ స్వభావమేమిటి? వారిలో ఏయే శక్తి సామర్థ్యాలున్నాయి? భాష విషయంలో పిల్లలు బడికి రాకముందే ఏమి చేయగలుగుతున్నారు? పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు? అన్న విషయాలను ఈ అధ్యాయంలో వివరంగా చర్చిద్దాం.

**పిల్లల స్వభావం :**

స్వాతి ఒక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నది. 12 సంవత్సరాల బోధనానుభవం ఆమెకుంది. పాఠశాల పరిశీలనలో భాగంగా పరిశీలనాబృంద సభ్యురాలైన జయంతి, స్వాతి పనిచేస్తున్న బడికి వెళ్ళింది. తను పరిశీలించాల్సిన అంశాలన్నీ పూర్తైన తర్వాత స్వాతి టీచర్‌తో సాధారణ విషయాలపై మాట్లాడింది. పిల్లలు ఎలా ఉన్నారు? వారు ఏమేమి చేస్తారు? అని ప్రశ్నించింది. అప్పుడు స్వాతి టీచర్ పిల్లలు బాగా అల్లరిచేస్తారని, ఒక్క నిమిషం ఊరికే ఉండకుండా మాట్లాడుతారని, చెప్పినట్టువినరని, ఇచ్చిన ఆదేశాలను ఒక్క నిమిషం పాటించి మరల వారిపనివారు చేస్తారని, పనులకు ఆటంకం కలిగిస్తారని, ఒక్కచోట కూర్చోకుండా చీటికిమాటికి లేచి అటూయిటూ తిరుగుతుంటారని, తనవద్దకు వచ్చి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తుంటారని చెప్పింది. ఈ విధమైన అల్లరి చేయకుంటే, తను చెప్పినట్లు వింటే వారికి మరింత బాగా చదువు వచ్చేదని అభిప్రాయపడింది. స్వాతి టీచర్ మాటలను మీరు ఇప్పుడు చదివారు కదా? మీరు తనతో ఏకీభవిస్తారా? వేరొక అభిప్రాయాన్ని వెల్లడిస్తారా? కొద్దిసేపు ఆలోచించండి. స్వాతి టీచర్ మాటలను విశ్లేషించండి. పిల్లల సహజ లక్షణాలేమిటో గుర్తుకు తెచ్చుకొని వాటిని టీచర్ చెప్పిన మాటలతో పోల్చి చూసినప్పుడు ఈ కింది నిర్ధారణలకు మనం వస్తాము.

**పిల్లల సహజ లక్షణాలు :**

- ప్రశ్నించే స్వభావాన్ని కలిగి ఉంటారు.
- స్థిరంగా ఒకదగ్గర కూర్చోరు.
- తమ అనుభవంలోకి వచ్చిన విషయాలను ఉపాధ్యాయులతో, తోటిపిల్లలతో, కుటుంబ సభ్యులతో పంచుకోవడానికి ఆరాటపడతారు.
- పిల్లలకు మాట్లాడడం చాలా ఇష్టం.
- కొత్తదనం కోరుకుంటారు.
- ఫిర్యాదు చేసే స్వభావముంటుంది.
- తోటివారితో సమయం గడపడానికి ఇష్టపడతారు.
- వారిలోని తప్పులను వెతికితే కుంచించుకుపోతారు.

- చిన్నపొగడ్తకే మహదానందపడతారు.
- సహజంగా బిడియంగా ఉంటారు. కొత్తవారితో అంత సులభంగా కలిసిపోరు.
- ఆటపాటలు, పజిల్స్ వంటివి ఇష్టపడతారు.
- తాము చూసినవి, చేసినవి చెప్పడానికి ప్రయత్నంచేస్తారు.

మరి పిల్లల సహజ లక్షణాలు ఈ విధంగా ఉన్నప్పుడు స్వాతి టీచర్ మాట్లాడిన మాటలు పిల్లల స్వభావం తెలియక మాట్లాడినట్టుగా ఉన్నవి కదా! టీచర్‌కు పిల్లలపట్ల ఉన్న అభిప్రాయం కేవలం అపోహమాత్రమే. ఇప్పుడు మనం చేయవలసిన ఆలోచన మరొకటి ఉంది. అదే పిల్లల శక్తి సామర్థ్యాలను గురించి తెలుసుకోవడం. పిల్లల స్వభావం, శక్తిసామర్థ్యాలు ఉపాధ్యాయునికి తెలిసినప్పుడే అర్థవంతమైన అభ్యసనానికి దారులు వేయగలుగుతాడు. మన నిత్య జీవితంలో మన పిల్లలు తమ ప్రతిభాసంపత్తులతో, వినూత్న ఆలోచనలతో, సృజనాత్మకతతో, జవాబుచెప్పలేని ప్రశ్నలతో ఆశ్చర్యపరిచారు కదా! ఇప్పుడు మనం పిల్లల శక్తి సామర్థ్యాలను గురించి తెలుసుకుందాం!

పిల్లవాడిలోని శక్తి సామర్థ్యాలకు కొన్ని ఉదాహరణలు చూద్దాం. రాము, రాణి దంపతులకు మూడు సంవత్సరాల పిల్లవాడు ఉన్నాడు. రాము వద్ద స్మార్ట్‌ఫోన్ ఉంది. ఆ ఫోన్‌ను పిల్లవాడు కొద్దిరోజులు గమనించాడు. అర్థం చేసుకున్నాడు. వాడికి బాహుబలి పాట అంటే చాలా యిష్టం. ఎప్పుడూ దాన్నే అడుగుతాడు. ఒకటి రెండు సార్లు తండ్రి యూట్యూబ్‌లో దానిని పెట్టడాన్ని చూశాడు. తరువాత తనకు ఇష్టమైనప్పుడల్లా సెల్‌ఫోన్‌ను తీసుకొని, యూట్యూబ్‌లోకి వెళ్ళి తన కిష్టమైన పాటను పెట్టుకోవడం మొదలుపెట్టాడు. చాలా ఏళ్ళుగా ఫోన్‌ను వాడుతున్న పెద్దవారు చేయలేని అనేక పనులు పిల్లలు చేయడం మీ అనుభవంలో తప్పకుండా ఉంటుంది. వాటిని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. ఆశ్చర్యానికి లోనవుతారు.

పిల్లలు ఒక సమూహంగా ఏర్పడి ఆటలు ఆడుకుంటున్నప్పుడు తమకుతామే నియమాలను ఏర్పరచుకుంటారు. నియమాలను రూపొందించుకోవడం అంత చిన్నపనా? తోటి పిల్లలను తికమకవేసే ప్రశ్నలు వేస్తుంటారు. సందర్భానికి తగినట్టుగా పేరడీలు పాడగలుగుతారు. ఎవ్వరూ నేర్పకున్నా చిత్రలేఖనం చేయగలుగుతారు. సృజనాత్మకంగా భావాలను వ్యక్తం చేయగలుగుతారు. తాము జరుపుకున్న పండుగ గురించి చాలా వివరంగా మాట్లాడగలుగుతారు. చెప్పే విషయాన్ని క్రమపద్ధతిలో చెప్తారు.

### పిల్లల శక్తిసామర్థ్యాలు :

పిల్లవానిలో అనంతమైన శక్తి సామర్థ్యాలుంటాయి. ఉపాధ్యాయులు 'పిల్లలు అత్యంత సమర్థులు' అనే నిజాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. పిల్లల్లో ఉండే భాషాసామర్థ్యం అద్భుతమైనది. తమకొచ్చిన భాషలో తమ సంపూర్ణ అవసరాలను వారు తీర్చుకుంటారు. తాము బోధిస్తున్నాము కాబట్టే వారిలో శక్తిసామర్థ్యాలు పెంపొందుతున్నాయి లేకుంటే వారు వట్టి తెల్లకాగితంగా మిగిలిపోయేవారని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతుంటారు. పిల్లలలో భాషకు సంబంధించిన సామర్థ్యాన్ని పరిశీలించినప్పుడు మనం నమ్మలేని అనేక నిజాలు బయటపడుతాయి. నాలుగు సంవత్సరాల పిల్లలు తమ ఆలోచనలను, అవసరాలను అందరికీ అర్థమయ్యేటట్లుగా వెల్లడిచేస్తారు. భావనలను ఏర్పరచుకుంటారు. సరియైన కారణాలను చెప్పగలుగుతారు. కాబట్టి నాలుగు సంవత్సరాలున్న పిల్లలను భాషాపరంగా చూసినప్పుడు వయోజనులుగానే భావించాలి. తమ చుట్టూ ఉన్న ప్రపంచంతో నిమగ్నమవడం ద్వారా పిల్లల్లో అంచనావేయడం, సంఖ్యలకు సంబంధించిన జ్ఞానాన్ని కలిగి ఉండడం, దృశ్యీకరించుకోవడం వంటి ఎన్నో సామర్థ్యాలను పొందుతారు. ఇలా పిల్లలు పొందిన నైపుణ్యాలలో అత్యుత్తమమైనది భాష.

SCERT TELANGANA

మరి భాషలో పిల్లలకున్న శక్తిసామర్థ్యాల గురించి ప్రముఖ భాషావేత్త హృదయ్‌కాంత్ దివాన్ ఏమన్నాడో చూద్దాం.

**పిల్లలు నేర్చుకున్న నైపుణ్యాలలో అత్యుత్తమమైనది భాష. భాష మన ఉనికికి, గుర్తింపుకు చాలా ముఖ్యం.**

## భాషాపరమైన సమస్యలను, సన్నివేశాలను పిల్లలు ఎదుర్కొనగలరు :

పిల్లలు తమ చుట్టూ ఉండే సమాజంతో చర్యలను, ప్రతిచర్యలను సమర్థవంతంగా జరుపుతారు. ఎంతటి క్లిష్టమైన సామాజిక, సాంస్కృతిక, భాషా వాతావరణానికి సంబంధించిన సన్నివేశాలు ఎదురైనా తన భాష ద్వారా వాటిని ఎదుర్కొంటారు. తన భావాలను వెల్లడిచేయగలుగుతారు. ఉత్సాహంగా పాల్గొనగలుగుతారు. సందర్భోచితంగా భాషను మార్చుకోగలుగుతారు. సన్నివేశాలకు అనుగుణంగా ప్రవర్తించగలరు. తమకు తగినట్టుగా పరిస్థితులను మార్చుకునే చాతుర్యం పిల్లలకుంటుంది. తమ కోరికలను వ్యక్తీకరించడానికి, తమ అనుభవాలు, అనుభూతుల గురించి మాట్లాడడానికి భాషను ధారాళంగా ఉపయోగిస్తారు.

## పిల్లలలోని భావనలు

హరిత నాలుగు సంవత్సరాల అమ్మాయి. వయసుకు తగిన విధంగా ధారాళంగా మాట్లాడగలదు. తన బంధుగణంలోని చాలామందిని వరుసలు పెట్టి పిలుస్తుంది. తాతయ్య, ఆయన అన్నదమ్ముల మధ్య సంబంధాలు మొదలగు తేడాలను చెప్పగలుగుతుంది. తనది వ్యవసాయ కుటుంబం కావడంతో ఆ రంగానికి చెందిన భావనలు హరితలో పుష్కలంగా కనబడుతాయి. పండుగలు, మొక్కలు, ఇంటిపని మొదలగు భావనలు కూడా ఆమెలో చాలా ఉన్నవి. పిల్లలు సమాజం నుండి 'స్పాంజి'లాగా సమాచారాన్ని తీసుకుంటారు. వారి దృష్టిలో యిది అవసరమైనది, యిది అవసరమైనది కాదు అని ఉండదు. మొత్తంగా గ్రహిస్తారు. అందుకే వారు మాటల పిట్టలవుతారు. ఆపినా ఆగరు. ఇవే కాకుండా పిల్లలు తమ వాదనలకోసం, హక్కులను కాపాడుకోవడం కొరకు, పరిస్థితుల విశ్లేషణకు, తమ ఊహా ప్రపంచ నిర్మాణానికి భాషను ఉపయోగిస్తారు.

## వాక్యనిర్మాణం - పిల్లలు :

పిల్లలలో సహజంగానే వాక్యనిర్మాణ శక్తి ఉంటుంది. దీనిని అంతర్గత సామర్థ్యంగా భావించవచ్చు. ఏ పదాన్ని ఏ విధంగా పలుకాలో, ఉచ్చారణలో ఎక్కడ హెచ్చు ఉండాలో, ఎక్కడ తగ్గి ఉండాలో పిల్లలకు తెలుసు. క్రమపద్ధతిలో మాట్లాడడం వారికి వెన్నతో పెట్టిన విద్య. పిల్లలు మాట్లాడే వాక్యాలలో ఎలాంటి వ్యాకరణ దోషాలుండవు. సందర్భానుసారం క్రియా రూపాలను వందశాతం ఖచ్చితంగా, సరిగ్గా వాడుతారు. నామవాచకాల, సర్వనామాల జ్ఞానం అపారంగా ఉంటుంది. కాలాలు, వచనాలు, లింగం, సరైన ప్రత్యయాలను వాడడంలో ఏ పిల్లవాడు తప్పులు చేయడు. ప్రతి నిత్యం పిల్లల పదసంపద పెరుగుతూనే ఉంటుంది. తెలుసుకున్న పదాలను నిత్య జీవితంలో అవసరమైన సందర్భాలలో జంకుగొంకు లేకుండా వినియోగిస్తుంటారు. ఆ పదాల విభిన్న రూపాలు గతంలో వారికి పరిచయం లేనప్పటికీ వ్యాకరణ సూత్రాలకనుగుణంగానే వాటిని ప్రయోగిస్తారు. ఇలాంటి ఎన్నో విషయాలను భాషాశాస్త్రవేత్తలు గుర్తించారు. వాటికి వ్యాకరణ పుస్తకాల్లో స్థానం కల్పించారు. ఇంకా గుర్తించనివి చాలా ఉన్నవి. కానీ పిల్లలకు యివేమీ పట్టవు. వారు పదాలను సరియైన అవగాహన ద్వారానే వాడుతారు. అందుకే వారి వాక్య నిర్మాణం కూడ సరిగ్గా ఉంటుంది.

## దీనిని పిల్లలు ఎలా నేర్చుకున్నారు?

మనుషులు పరస్పరం మాట్లాడుకోకుంటే భాష అభివృద్ధిచెందదని మనకు తెలుసు. వేరువేరు నేపథ్యాల నుండి, సమాజాల నుండి వచ్చిన పిల్లలలో ఉండే సామర్థ్యాలు కూడ వేరువేరుగా ఉంటాయని, వారి అనుభవాలు జ్ఞానాన్ని ప్రభావితం చేస్తాయనడానికి తగిన సాక్ష్యాలున్నవి. అవి మన అనుభవంలో కూడ ఉన్నవి. పిల్లల అభ్యసనంలో వైయక్తిక భేదాలుంటాయి. అయినప్పటికీ అభ్యసనంలో కొన్ని సామూహిక లక్షణాలు, దశలు ఉంటాయి. పిల్లల అభ్యసనానికి పెద్దల సహకారం ఉంటుంది. పిల్లలకు పెద్దల తోడ్పాటు ఉండడం వారికి ఎంతో ఆత్మస్థైర్యాన్ని యిస్తుంది. తమకు గుర్తింపు ఉండడంవల్ల వారు ఎంతో సంతృప్తిని పొందుతారు. పిల్లల అభ్యసనకు ఈ గుర్తింపు, ప్రోత్సాహం ఎంతో ముఖ్యం. అయితే పెద్దల మార్గదర్శనం, వల్లెవేయించడం, ప్రోత్సహించడం కొంత మేరకే ప్రయోజనం. ఈ విధమైన పద్ధతుల ద్వారా పొందిన దానికంటే స్వీయ జ్ఞానం, సామర్థ్యం ద్వారా పొందేదే ఎక్కువ. పెద్దలకు తెలియని ఎన్నో విషయాలను పిల్లలు నేర్చుకుంటారు. అర్థవంతమైన, సందర్భోచితమైన సన్నివేశాల ద్వారానే పిల్లలు నేర్చుకుంటారనేది మనందరికి తెలుసు. తన చుట్టూ ఉన్న వాతావరణం, రకరకాల మనుష్యులతో జరిపే నిరంతర ప్రతిచర్యలు పిల్లల్లో సామర్థ్యాల వృద్ధికి ప్రధాన కారణం.

**పిల్లలు అనుకరణ ద్వారా నేర్చుకుంటారా?**

పిల్లలు అనుకరణ ద్వారా నేర్చుకుంటారన్న ఒక నమ్మకం యిప్పటికీ చాలా మందిలో ఉంది. అందువలన దీనిని గురించి చర్చించడం అవసరం ఎందుకంటే మనం పిల్లలకు కల్పించే అనుభవాలను అది చాలా ప్రభావితం చేస్తుంది. మనుషులు అనుకరణ ద్వారా నేర్చుకునేటట్లయితే అభ్యసన ప్రక్రియ ఈ విధంగా ఉంటుంది.

- చేసే దానిని పరిశీలించడం.
- ఉపాధ్యాయుడు చేసిన పనిని అనుకరించడం.
- తప్పులు చేసినప్పుడల్లా సరిదిద్దడం.
- తప్పుగా చేసిన పనిని మళ్ళీ మళ్ళీ చేయించడం.

ఈ రకమైన అభ్యసనం పిల్లల్లో నిర్మాణాత్మకంగా జ్ఞానమును కలిగిస్తుందా? అని ప్రశ్నించుకున్నప్పుడు 'కాదు' అనే సమాధానం వస్తుంది. కుటుంబ వాతావరణంలోగాని, సమాజవాతావరణంలోగాని మనం తరగతి గదిలో ఆచరిస్తున్న సవరణాత్మక బోధన ఎవరైనా చేస్తున్నారా? అంటే 'లేదు' అని జవాబు చెప్పవచ్చు. పిల్లలు బడికి రాకముందు భిన్న విషయాలను ఎలా నేర్చుకుంటున్నారు అని ఆలోచించినప్పుడు పైన చదివిన అనుకరణ ప్రక్రియ సరైనదికాదని అర్థమవుతుంది. అనుకరణను పూర్తిగా కొట్టిపారవేయలేము. పిల్లలలో అభ్యసనలో అనుకరణ ప్రభావం కొంత శాతమే అనేది దీని సారాంశం.

**అభ్యసన జరిపే పిల్లల లక్షణాలు**

- ప్రపంచాన్ని శోధించాలన్న మానవుని కోరిక అభ్యసన ప్రక్రియలో ఒక కీలకాంశం. ఈ శోధనలో పిల్లలు మరిన్ని ఎక్కువ అనుభవాలు పొందాలని, దాని సంబంధాలను పెంచుకోవాలని కోరుకుంటారు. కొత్త అనుభవాలు పొందాలని, కొత్త పనులు చేయాలని, సవాళ్ళను అవగాహన చేసుకునే సామర్థ్యం పొందాలని వారికి అంతర్గతంగా ఒక ఆశ ఉంటుంది.
- రెండవ కీలకాంశం పట్టుదల, పనులుచేయాలని, తొందరంగా ఓటమి పొందకూడదని పిల్లలకుంటుంది.
- తను స్వంతంగా పనులు చేసుకుంటూ, అన్నీ తామే వ్యక్తీకరించాలనుకోవడం మూడవ లక్షణం. పిల్లలకు ఫలితంకన్నా ప్రక్రియలో వారి పాత్ర ఎంత అన్న విషయమే ముఖ్యం.
- ఏమి జరుగుతుంది? ఎవరికి? ఎందుకు? అనే ఆసక్తి నాలుగవ లక్షణం. ఈ ఆసక్తి పిల్లల్లోని అంతర్గత లక్షణం. ఇది పిల్లల శోధనకు, వారి పనులు వారే చేసుకోవడానికి దారితీస్తుంది. ఈ లక్షణమే పిల్లలను కొత్త అనుభవాలకై వెతికేలా, కొత్త పరిస్థితులు, సవాళ్ళు, సాహసాల్లో నిమగ్నమయ్యేలా చేస్తుంది.

**- హృదయ్‌కాంత్ దివాన్**

ఇదంతా చదివిన తర్వాత పిల్లలలో అనంతమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని ఎటువంటి విషయాన్నైనా సులభంగా నేర్చుకోగలుగుతారని అర్థమైంది కదా! పిల్లలు ఏదైనా నేర్చుకోవాలంటే వారికి మొదట ఉపాధ్యాయునిపై నమ్మకం కలగాలి. "ఆ నమ్మకానికి కారణం ఇదీ అని ఇదమిత్థంగా చెప్పలేకపోవచ్చు. కాని చదువు చెప్పేవారి మీద కలిగే నమ్మకమే పిల్లవాడి చదువుకు శ్రీకారం చుడుతుంది. పునాది అవుతుంది" అన్న జాన్‌హోల్ట్ మాటలు ఈ సందర్భానికి అతికినట్టుగా సరిపోతాయి.

> *"తరగతి గదిలో నూతన విషయాలను అభ్యసన జరపాలంటే పిల్లవాడికి ఏదో సాహసకృత్యం చేస్తున్నట్లే ఉంటుంది. అపరిచిత ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లు ఉంటుంది. తప్పుగా చదువుతాననో, తప్పుగా చెప్తాననో, అలాచేస్తే అవతలివారు ఏమనుకొంటారనో పలుపలువిధాలుగా మదనపడతాడు.*
>
> *ఈ సాహసయాత్రలో బయలుదేరాలంటే కొంత ప్రోద్బలం కావాలి. ధైర్యం కావాలి. అన్నిటికన్నా మించి తప్పులు చేస్తే కొంపలు అంటుకుపోవన్న హామీ కావాలి. భద్రతా భావం కావాలి కాని మామూలుగా తరగతి గదిలో వాతావరణం ఇందుకు అనుకూలంగా ఉండదు. దాంతో పిల్లలు అభ్యసనంపై అంత ఆసక్తి చూపరు."*
>
> **- 'నేర్చుకోవడం పిల్లల నైజం' - జాన్‌హోల్ట్**

**'హృదయ్‌కాంత్ దివాన్'** గారి 'పిల్లల సామర్థ్యం' విశ్లేషణా వ్యాసం చదివారు కదా! దాని నుండి మనం ఎలాంటి నిర్ధారణలకు రావాలి? పిల్లల విషయంలో మనం అనుసరించాల్సిన విధానాలు ఏమిటి? బోధనాపద్ధతులు ఏవి అనుసరించాలి? అన్న విషయాలపై అది మనకు స్పష్టతనిస్తుంది. పిల్లలు తప్పులు మాట్లాడినంతలో, చదివినంతలో, రాసినంతలో భూగోళం మునిగిపోదని తెలుపుతుంది.

మనము ఇంటి వాతావరణాన్ని, సంస్కృతిని ఒక్కసారి గుర్తుకుతెచ్చుకుందాం. మన ఇంట్లోని పిల్లలు ఏ పదాన్నైనా తప్పుగా పలికినప్పుడు కుటుంబ సభ్యులు ఆనందిస్తారా? లేక వాడిని తిట్టి సరిగ్గా పలికిస్తున్నారా? ఇంట్లోవాళ్ళు ఆనందపడతారనేది జగమెరిగిన సత్యం. పిల్లలు రామును 'లాము' అంటారు. తాతయ్యను 'తాతి' అంటారు. అమ్మమ్మను 'అమ్మి' అంటారు. పిల్లల తప్పు మాటలను పెద్దలు పండుగలా జరుపుకుంటారు. దీనిని 'సెలబ్రేషన్ ఆఫ్ ఎర్రర్స్' అని భాషాశాస్త్రవేత్తలు పిలుస్తారు. పిల్లవాడు తప్పుగా పలికిన మాటలను ఉపయోగిస్తూ పెద్దలు వానితో మాట్లాడుతారు. అప్పుడు పిల్లవాడు తన భాషకు విలువ ఉందని, అది అర్థవంతమైనదని మరింత మాట్లాడడానికి ప్రయత్నిస్తాడు. అర్థవంతమైన, సందర్భోచితమైన సన్నివేశాలలో స్వయంగా పాల్గొని తన తప్పులను కాలక్రమేణా సవరించుకుంటాడు.

అప్పుడే ఒక శిశువుకు జన్మనిచ్చిన తల్లిని "అమ్మా! నీ పిల్లవాడికి మాటలు వస్తాయా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, ఆ తల్లి "బ్రహ్మాండంగా వస్తాయి" అని జవాబిస్తుంది. అది తన పిల్లల పట్ల తల్లికుండే నమ్మకం. సరిగ్గా అలాంటి నమ్మకమే తరగతి గదిలోని ఉపాధ్యాయునికి తన విద్యార్థులపట్ల ఉండాలి. పిల్లలపై అపార నమ్మకముంటేనే ఉపాధ్యాయుడు బోధించడానికి మానసికంగా సంసిద్ధమవుతాడు.

### తరగతి గది అన్వయం :

- తరగతి గదిలో చిన్న తప్పుచేయగానే సరిదిద్దడానికి ప్రయత్నిస్తాము. దానికి బదులుగా బోధనా వ్యూహాలనుపయోగించి తన తప్పును తానే సరిచేసుకునేటట్లు చూడాలి. 'వీడికి ఎంత చెప్పినా రాదు!' అనే నిర్ధారణకు ఎప్పుడూ రాకూడదు.
- తన తరగతిలోని విద్యార్థులు చదువగలరు, రాయగలరు, చేయగలరు అనే నమ్మకం ఉపాధ్యాయునిలో ఉండాలి. అప్పుడే బోధనాభ్యసన ప్రక్రియ చురుకుగా జరుగుతుంది. అభ్యసనం అర్థవంతమవుతుంది.
- పిల్లల అభ్యసనలో వైయక్తిక భేదాలు సహజం కాబట్టి ఒకరిని మరొకరితో ఎప్పుడూ పోల్చకూడదు. పోల్చితే పిల్లలు ఆత్మన్యూనతకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- పిల్లలు కుటుంబ, సమాజ వాతావరణంలో అర్థవంతమైన, సందర్భోచితమైన సన్నివేశాల ద్వారా అనేక విషయాలను నేర్చుకుంటున్నారు కాబట్టి తరగతి గదిలో కూడ అలాంటి సన్నివేశాలను కల్పించాలి.



SCERT TELANGANA

- అభ్యసన కృత్యాలలో అందరూ పాల్గొనేటట్లు చూడాలి.
- పిల్లల స్వభావం, శక్తి సామర్థ్యాలకు అనుగుణమైన బోధన జరగాలి. యాంత్రికంగా పనులు కల్పిస్తే పిల్లల్లో విసుగు, అసహనం పుడుతాయి. దీనిని మనం అల్లరిగా భావిస్తాము. అర్థవంతమైన పనులు కల్పిస్తే అల్లరికి చోటుండదు.
- ప్రశ్నించే స్వభావాన్ని అలవాటుచేయాలి.
- అభ్యసనలో అన్వేషణకు చోటు కల్పించాలి.
- పిల్లల అభిప్రాయాలకు తరగతి గదిలో గౌరవముండాలి.
- నేర్చుకోవడం పిల్లల కిష్టం. అందులో భాషకు ప్రత్యేక స్థానముంది. భాష బాగావస్తే అది అన్ని విషయాలపై తనదైన ముద్రవేస్తుంది.
- పిల్లల స్థాయికి సవాలు విసిరేటట్టు, చేసిన పనిని వివరించేటట్లు కృత్యాలు ఉండాలి.
- తరగతి గదిలో పిల్లల భాషకు పెద్దపీటవేయాలి. వారి సంస్కృతి గౌరవించబడాలి.

**ముగింపు :**

చివరగా మనం దీనిపై ఒక సమగ్ర అవగాహనకు వద్దాం. పిల్లలకు శక్తిసామర్థ్యాలుంటాయని, పిల్లలపై నమ్మకముంచాలని, ఎటువంటి క్లిష్టవిషయాలనైనా నేర్చుకుంటారని, అర్థవంతమైన అభ్యసన కృత్యాలు కల్పించాలని వీటన్నింటికంటే ముందు పిల్లవాడికి మనపై నమ్మకం కలిగేలా చూసుకోవాలని దీని సారాంశం. అప్పుడు ఉపాధ్యాయుడు తరగతి గదిలో పిల్లలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించగలడు. తద్వారా పిల్లలను బోధనాభ్యసన ప్రక్రియలో మానసికంగా నిమగ్నం చేయగలడు. అప్పుడు మన అంతిమ లక్ష్యమైన 'పిల్లల అభ్యసనం' అర్థవంతమవుతుంది. మెరుగుపడుతుంది.

❖ ❖ ❖

SCERT TELANGANA

# 2. అభ్యసనంలో భాష పాత్ర - తరగతి గది అన్వయం

భాష మానవునికి ప్రసాదించబడిన ఒక వరం. భావగ్రహణకు, భావప్రకటనకు తోడ్పడేది భాష. భాష వల్లనే మానవుడు తన జ్ఞానాన్ని పెంచుకోగలుగుతున్నాడు. సంఘంలోని యితర వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడడానికి భాష ఉపకరిస్తుంది. మానవునిలోని జ్ఞానాభివృద్ధికి భాషయే మూలకారణం. ఇలాంటి ఎన్నో విషయాలను మనం ఉపాధ్యాయ విద్యలో, శిక్షణా కార్యక్రమాలలో చదువుకొన్నాం. భాష కేవలం భావగ్రహణ, భావప్రకటనలకు మాత్రమే పరిమితమా? లేదా వాటికతీతంగా భాషాప్రభావం ఏమైనా ఉందా? 'భాష'ను మనం ఎలా అర్థం చేసుకోవాలి? దాని ప్రాధాన్యత ఏమిటి? తరగతి గదిలో నిరంతరంగా జరిగే బోధనాభ్యసన ప్రక్రియల్లో దాని పాత్ర ఏమిటి? అన్న విషయాలను ఈ అధ్యాయంలో వివరంగా చర్చిద్దాం.

### 'భాష' అనగా ఏమి? :

మనలో చాలా మంది 'భాష పరస్పర భావప్రసరణ కొరకే' అని భావిస్తారు. ఆలోచనలకు, అనుభూతులకు, ప్రతిస్పందనలకు భాష ప్రధాన సాధనము అని మరచిపోతుంటారు. నిజంగా ఆలోచిస్తే భాష విస్తృత ప్రయోజనకారి అని అర్థమవుతుంది. బాల్యంలో పిల్లల మూర్తిమత్వాన్ని, సామర్థ్యాలను నిర్మాణాత్మకంగా అభివృద్ధిచేయడంలో భాష కీలకపాత్ర వహిస్తుంది. అంతేకాక పిల్లల అవగాహన, ఆసక్తులు, సామర్థ్యాలు, వైఖరులు, విలువలపై భాష ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. ఏదైనా ఒక విషయాన్ని అర్థం చేసుకోవడానికి భాష చాలా ప్రధానం. దీనిని బట్టి 'విద్య'లో భాష కీలకమైన పాత్రవహిస్తుంది అని అర్థం చేసుకోవచ్చు. మరి పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారన్నది మనకర్థమైతేనే తరగతి గదిలో భాషా విషయంలో మంచి ఫలితాలు వస్తాయి. పిల్లలు పాఠశాలలకు వచ్చేసరికి వారు గతంలో భాషను నేర్చుకొన్న సహజ విధానానికి, తరగతి గదిలో నేర్చుకొంటున్న కృత్రిమ విధానానికి తేడా ఉంటుంది. దాంతో అభ్యసనంపై అది చెడు ప్రభావం చూపుతుంది. పిల్లవాడిలో అనాసక్తత మొదలవుతుంది. ఉపాధ్యాయుడు తాను ఒక 'భాష'ను బోధిస్తున్నానని ఆలోచించడం, దానికనుగుణంగా ఆ భాషలో ఉండే నియమాలు, వాక్యనిర్మాణ విధానాలు, పదజాలం మొ॥ విషయాలను చెప్పడం మొదలుపెట్టేసరికి పిల్లల్లో అయోమయం మొదలవుతుంది. తాము నేర్చుకుంటున్నది తమకు తెలిసింది కాదనే భావన మొదలవుతుంది. క్రమంగా వారు అభ్యసనానికి దూరమవుతారు.

తన మాతృభాష ఏదైనా సరే! ప్రపంచంలోని ప్రతి బిడ్డ తన అవసరాలను, ప్రయోజనాలను తీర్చుకోవడానికి, నెరవేర్చుకోవడానికి భాషను ఉపయోగించుకుంటూ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే భాష ప్రధాన ఉద్దేశ్యం. దీనిని మనం అర్థం చేసుకొంటే తరగతి గదిలో సరిగ్గా బోధించగలుగుతాం.

***భాష అంటే మనం ఏమనుకుంటున్నాం?***

*భాష అనగానే భావ వినిమయ సాధనం అని నిర్వచించడం మనకు బాగా అలవాటయిపోయింది. ఈ అలవాటులో భాషను ఒక ఆలోచనా సాధనంగా విషయాలకు అనుభూతి పొందించే, ప్రతిస్పందింపజేసే సాధనంగా దాని ప్రయోజనాన్ని తరచుగా మరిచిపోతూ ఉంటాం. చిన్న పిల్లలతో పనిచేయాలనుకొనే వారికి భాషకు సంబంధించిన ఈ విస్తృత ప్రయోజనం ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే బాల్యంలో భాష పిల్లల వ్యక్తిత్వ, సామర్థ్యాల అభివృద్ధిలో ఒక నిర్మాణాత్మక పాత్రను నిర్వహిస్తుంది. ప్రపంచం పట్ల అవగాహనను, ఆసక్తులను, సామర్థ్యాలను చివరికి విలువలను, ఆలోచనా సరళులను (వైఖరులనూ) పిల్లలలో రూపొందించడంలో భాష సూక్ష్మమైనదే అయినా బలమైన శక్తిగా పనిచేస్తుంది.*



SCERT TELANGANA

ప్రతి పిల్లా, పిల్లవాడూ తన మాతృభాష ఏదైనప్పటికీ కొన్ని తక్షణ ప్రయోజనాల పరిపూర్తి కోసం భాషను ఉపయోగిస్తారు. ఒక ముఖ్యమైన ప్రయోజనం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. దీనికి భాష ఒక అద్భుతమైన సాధనంగా పనిచేస్తుంది. పిల్లవాడి దృక్పథాన్ని స్వీకరించి, అతని జీవితంలో భాష నిర్వహించే కార్యకలాపాలను అవగాహన చేసుకుంటే తప్ప అధ్యాపకులుగా, వారి మంచిచెడ్డలు చూసేవారిగా, తల్లిదండ్రులుగా మనం మన పాత్రను సముచితంగా నిర్ధారించుకోలేం.

**భాష - చేష్ట :**

పిల్లల భాష వాళ్ళు తమచేతులతో, శరీరాలతో చేసే పనులకు, వాళ్ళ పరిధిలోకి వచ్చిన వస్తువులకు సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటుంది. బాల్యంలో మాటలూ, చేష్టలూ ఒకటిగా ఉంటాయి. చేష్టలూ అనుభవాలూ మాటల అవసరాన్ని సృష్టిస్తాయి. అనుభవం పూర్తయిన తర్వాత మాటలు ఆ అనుభవాన్ని అందుబాటులోకి తెస్తాయి. పిల్లలు తమ పరిధిలోకి వచ్చిన వస్తువులతో మాటల సహాయం ద్వారా సంబంధానిని సుసంపన్నం చేసుకుంటారు. మరో విధంగా చెప్పాలంటే చేష్టలుగాని వస్తువులతో సంబంధాన్ని లేకపోయినట్లయితే పిల్లలకు మాటలు శూన్యంగానూ, ప్రాణరహితంగానూ తయారవుతాయి. పిల్లి పరిగెత్తడం, పడడం, నీలం, నది, గురువుకు వంటి మాటలు తొలిసారి ఆ వస్తువుతోగాని, చర్యతోగాని పిల్లవాడు ప్రత్యక్షంగా పాల్గొన్న సందర్భంలో వాడకపోయినట్లయితే పిల్లవాడికి వాటితో అంత లాభం ఉండదు. ప్రత్యక్ష సంబంధం తర్వాత మాత్రమే ఈ మాటలు ఒక ఆకారంతో అన్వయిస్తాయి, భవిష్యత్తులో ఒక అర్థవంతమయిన ప్రయోగానికి ఉపయోగపడతాయి.

పిల్లవాడి ఈ భౌతిక అనుభవాలకూ మాటలకూ మధ్య ఉన్న సంబంధం పెద్దల మీద ముఖ్యంగా అధ్యాపకుల మీద ఒక విశిష్టమయిన బాధ్యతను ఉంచుతుంది. ప్రస్తుతం నీ అజమాయిషీలో ఉన్న పిల్లలకు అప్పటికే తల్లిదండ్రులు ఒక విస్తృత పరిధిలో అనుభవాలను కలిగించి ఉంటారని ఒక అధ్యాపకునిగా నీవు ఆశించవచ్చు. కాని ఎంతో మంది తల్లిదండ్రుల విషయంలో ఇది నిజం కాకపోవచ్చు. బాల్యంలోనే ఒక విస్తార వస్తుశ్రేణితో తమ పిల్లలకు పరిచయం కలిగించేంత ఆత్మవిశ్వాసం చాలా మంది తల్లిదండ్రులకు ఉండదు. పిల్లలు ఒక పని చేయాలన్నా, దేనినైనా గమనించాలన్నా మెల్లగా చేస్తారు. దీన్ని భరించే ఓపిక, తీరిక చాలా మంది తల్లిదండ్రులకు ఉండదు. పిల్లలు పంపుదగ్గర నీటిధార కింద వేళ్ళు పెట్టి ఒక అరగంట నిలబడ్డా, పాత్రలన్నీ తీసి నేలమీద పెట్టినా, గొడుగును అనేకమార్లు తెరవడం మూయడం చేసినా పెద్దలకు అసందర్భంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు వస్తువులుపాడైపోకుండా ఉండడం కోసం, పిల్లలకు హాని కలగకుండా ఉండడం కోసం కొద్ది అనుభవాలకు మాత్రమే పరిమితం చేసి తక్కిన అన్ని అనుభవాలనూ పెద్దలు నిషేధిస్తారు.

తల్లిదండ్రులు ఏమిచేసినా, చేయకపోయినా ఉపాధ్యాయుని పని మాత్రం సుస్పష్టమే. జీవితానుభవాలకు, వస్తువులకు భాష ఉపయోగాన్ని జోడించడానికి పిల్లలు నిరంతరం ప్రయత్నించడాన్ని అనుమతించే వాతావరణాన్ని ఉపాధ్యాయుడు కల్పించాలి.

- పిల్లలు అనేక రకాల వస్తువులను (ఆకులు, రాళ్ళు, ఈకలు, ఈనెలు, పగిలిన వస్తువులు మొదలైనవి) తీసికొనివచ్చి, వాటి గురించి మాట్లాడవచ్చు, చదవవచ్చు, రాయవచ్చు.
- బడి వెలుపల తమ అనుభవాల గురించి పిల్లల్ని మాట్లాడమని, రాయమని, చదువమని అడగవచ్చు.
- పిల్లల్ని తరగతి గది నుండి బయటకు తీసుకువెళ్ళి బడిచుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూపించి, వాళ్ళు సాధారణ వస్తువులను (ఉదా: కూలిపోయిన వంతెన, బురదగుంట, చచ్చిన పురుగు, గుడ్లతో నిండిన గూడు మొదలైనవి) జాగ్రత్తగా పరిశీలించి వాటి గురించి మాట్లాడేటట్లు చేయవచ్చు. బడికి సన్నిహితంగా చుట్టుపక్కల ప్రదేశాలకు ఇటువంటి అధ్యయన విహారాలు భాష నేర్చుకోవడానికి విలువయిన సాధనాలను సమకూర్చవచ్చు.

పై విధమైన వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించవచ్చు. ఏ పాఠశాలలో పిల్లలు తమ చేతులతో అనేకరకాల పనులు చేయరో, కేవలం కూర్చుని ఉపాధ్యాయుడు చెప్పేదే వింటూ ఉంటారో, తాకడానికి, వాడడానికి, పగలగొట్టడానికి, పునర్నిర్మించడానికి వస్తువులుండవో అది భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి తగిన మంచి స్థలం కాదు.

**పిల్లలు భాషతో చేసే పనులు :**

పిల్లల భాషను అధ్యయనం చేసిన వాళ్ళు పిల్లలు మాట్లాడడంలోని ప్రాథమిక సామర్థ్యాల మీద అధికారం సంపాదించగానే భాషను ఆశ్చర్యకరంగా వివిధ ప్రయోజనాలకు ఉపయోగించడం ప్రారంభిస్తారని చెప్తారు.

***1) తన కార్యకలాపాలను నిర్దేశించుకోవడం :***

పిల్లలు ఒక పనిచేసేటప్పుడు ఆ పని గురించి తరచుగా మాట్లాడుతూ ఉంటారు. ఒక విధంగా అది తమ పని మీద తాము స్వగతంగా చేస్తున్న వ్యాఖ్య. తరచుగా ఈ వ్యాఖ్యానం వాళ్ళు తమ పనిని దీర్ఘకాలం కొనసాగించడానికి తోడ్పడుతున్నట్లుగా తోస్తుంది. ఆ పనిలో ఆసక్తిని నిలబెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. చాలాసార్లు అది కేవలం మెల్లగా వినిపిస్తున్న గొణుగుడే కావచ్చు.

***2) ఇతరుల కార్యకలాపాలను, ధ్యానాన్ని నిర్దేశించడం :***

మన సమయంలో చాలా భాగం పిల్లల కోరికలు తీర్చడానికే సరిపోతుంది. ఇవి మేధోపరమైనవి కాని, భావాత్మకమైనవికాని కావచ్చు. తమకు కుతూహలాన్ని కలిగించే, ఆసక్తి కలిగించే వాటివైపు దృష్టిని మరలించడానికి పిల్లలు భాషను ఉపయోగిస్తారు. తమ ధ్యానాన్ని ఆకర్షించిన దాని పట్ల తమ మాటలు వినేవాళ్ళు కూడా ఆసక్తిని చూపించాలని పిల్లలు కోరుకుంటారు.

***3) ఆడుకోవడానికి :***

రెండున్నర ఏళ్ళపైబడ్డ పిల్లలు చాలామందితో ఆడుకోవడానికీ, వినోదానికీ ఒక గొప్ప సాధనంగా మాటలుపయోగపడతాయి. రకరకాల గొంతుల్లో మాటలను పునరుచ్చరించడం, వాటిని వికృతం చేయడం, విచిత్రమైన పదబంధాలను కల్పించడం మొదలయిన ప్రక్రియలన్నీ వాళ్ళకెంతో వినోదాన్ని చేకూరుస్తాయి. మాటలతో ఆటలు సృజనాత్మకతనూ, శక్తిని వ్యక్తం చేయడానికి గొప్ప సాధనాలుగా ఉపయోగపడతాయి.

***4) విషయ వివరణం :***

ఒక విషయం ఎట్లా జరిగిందో తమ జ్ఞానాన్ని చూపించుకోవడానికి ఆ విషయం గురించి పిల్లలు మాట్లాడతారు. ఉదాహరణకు ఒక మూడేళ్ళ పిల్లవాణ్ణి వర్షం ఎట్లా కురిసిందని అడిగారనుకోండి, ఆకాశాన్ని నల్లని మబ్బులు కప్పివేశాయని, తర్వాత చిన్న చిన్న తుంపరలు మొదలయ్యాయని, ఆ తర్వాత మనకేమీ కనిపించనంతగా పెద్దవాన కురిసిందనీ పిల్లవాడు మనకు చెప్పవచ్చు. ఈ విషయ వివరణం నుండే కథలు పుడతాయి. ఈ విధంగా చూసినప్పుడు కథలన్నీ విషయ వివరణలే. రాజకీయాలలోగాని, ప్రపంచంలోగాని జరిగిన సంఘటనలను వివరించాలనే కోరిక పెద్దవాళ్ళలో ఎంతగా ఉంటుందో చిన్న పిల్లలలో కూడా తమ జీవిత సంఘటనలకు అర్థం చెప్పాలనే కోరిక అంతగానే ఉంటుంది.

***5) జీవితానికి ప్రాతినిధ్యం :***

భాష ఉపయోగాలన్నిటిలోనూ ఇది ఇమిడి ఉంది. పెద్దల్లాగానే పిల్లలు కూడా గతాన్ని నెమరువేసుకోడానికి – ఒక సంఘటనను గాని, వ్యక్తిని గాని, మరో చిన్న విషయాన్ని గాని గుర్తుచేసుకోవడానికి భాషను ఉపయోగిస్తారు.



SCERT TELANGANA

**6) తన్మయీభావం :**

ఎవరైనా చెప్తూ ఉన్న కథను విన్నప్పుడు – అది అతని అనుభవమయినా కావచ్చు. మరెవరి అనుభవమయినా కావచ్చు – ఈ కథలోని పాత్రలతోనూ సన్నివేశాలతోనూ తన్మయమై స్పందిస్తాము. ఒక ఆటబొమ్మ అనుభూతుల్ని గురించి అడిగినప్పుడు పిల్లవాడు తనను ఆ ఆట బొమ్మగానే ఊహించుకుంటాడు. ఇతరులు పొందుతున్న అనుభవాన్ని తాముకూడా పొందడానికి భాష ఉపయోగపడుతుంది.

**7) భావిని ఊహించడం :**

విచిత్ర పరిస్థితులలో ఏం జరుగుతుందని తామనుకుంటారో దాన్ని గురించిన భయాలనూ, ప్రణాళికలనూ, ఊహలనూ పిల్లలు తరచుగా వ్యక్తం చేస్తారు. ఒక భవిష్యత్తు చిత్రాన్ని నిర్మించుకోవడంలో వారికి మాటలు ఉపయోగపడతాయి.

**8) ప్రశ్నించడం, హేత్వీకరణం :**

పిల్లలంతా సరయిన హేతువులను మాటల్లో వ్యక్తం చేయలేకపోవచ్చు. వ్యక్తం చేయగలిగిన పిల్లలు తమ పెద్దలు ఒక విషయాన్ని గురించి ప్రశ్నించడానికి, వాదించడానికి పెద్దలు ప్రోత్సహించే ఉంటారు. పిల్లవాడు హేతువును తెలుసుకోవడానికి, ఒక తెలియని విషయాన్ని గురించి ప్రశ్నించడానికి భాషను సాధనంగా ఉపయోగించడమే ముఖ్యం. పెద్దలు భాషను ఈ విధంగా ఉపయోగించడాన్ని పిల్లవాడు ఎంత ఎక్కువగా వింటే, భాషను ఈ పద్ధతిలో ఉపయోగించడం పిల్లవాడికి అంత అందుబాటులోకి వస్తుంది.

**మనం అనే మాటలు మనసు ప్రభావితం చేస్తాయి :**

భాష మన ఆకాంక్షలకు రూపునిస్తుంది. ఓర్పుగా, ఒక పద్ధతి ప్రకారం విషయ వివరణం చేసే వ్యక్తి ఇతరులు కూడా అట్లాగే చేయాలని కోరతాడు. విషయాలను గురించి లోతుగా విచారించే వ్యక్తి ఎదుటి వాళ్ళు కూడా ఆ విచారణలో అటువంటి ఆసక్తిని కలిగి ఉంటారని భావిస్తాడు. భాషను వివరణలకు, విచారణకు ఉపయోగించడం ద్వారా ఇటువంటి వ్యక్తులు వివరణ, విచారణల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తారు. ఒక సమాజంలో కాని, సంస్థలో కాని భాషను ఇటువంటి ప్రయోజనాలకు వాడకపోయినట్లయితే అక్కడ పెరుగుతున్న పిల్లలకు జాగ్రత్తగా వివరించడమూ, ఓపికగా వాదించడమూ అలవాటుకాదు. తల్లిదండ్రులుగాని, ఉపాధ్యాయులుగాని భాషను కేవలం పిల్లల్ని అదుపులో పెట్టడానికి మాత్రమే వినియోగిస్తే, పిల్లలు కూడా ఇతరుల్ని అదుపులో పెట్టే సాధనంగా మాత్రమే భాషను గుర్తిస్తారు. ఆజ్ఞలిస్తే తప్ప పని చేయని వ్యక్తులుగా ఎదుగుతారు.

పిల్లవాడి వ్యక్తిత్వాన్ని అవగాహనలు, సామర్థ్యాలు, ధోరణులు, ఆసక్తులు, విలువలతో సహా భాష ఏవిధంగా రూపొందిస్తుందన్న ప్రశ్నతో ఈ అధ్యాయాన్ని ప్రారంభించాం. భాష సృష్టించిన వాతావరణంలోనే శిశువు జీవిస్తాడు, పెరుగుతాడు కాబట్టి భాష వాడి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుతుందని మనం ఇప్పుడు జవాబు చెప్పవచ్చు. ఈ వాతావరణానికి ఉపాధ్యాయుడు చాలా ముఖ్యమైన తోడ్పాటునిస్తాడు. పిల్లవాడి జీవితంలో భాష వివిధ ప్రయోజనాల స్పృహ ఉపాధ్యాయుడికి ఉన్నట్లయితే పిల్లవాడి మేధో, భావనాత్మక అవసరాలకు చక్కగా ప్రతిస్పందించగలుగుతాడు. వివిధ సందర్భాలలో పిల్లవాడు ఉపయోగించిన భాషకు ఉపాధ్యాయుని స్పందనలు చాలా ముఖ్యమైనవి. భాషను ఒక పద్ధతిలో ఉపయోగించడంలో పిల్లవాడి లక్ష్యాన్ని ఉపాధ్యాయుడు అర్థం చేసుకున్నట్లు ఈ స్పందనలు వెల్లడిచేస్తే అటువంటి స్పందనలు ఆ మార్గంలో పిల్లవాడి భాషా ప్రయోగాన్ని వృద్ధి చేస్తాయి. దీనికి భిన్నంగా ఏది సరయినది, ఏది కాదు అనే విషయంలో ఉపాధ్యాయుడి స్పందనలు ముందే ఏర్పరచుకున్న భావాలపై ఆధారపడినట్లయితే అటువంటి స్పందనలు భావ వ్యక్తీకరణ, భావ వినిమయాలలో పిల్లవాడి స్వాతంత్ర్యాన్ని నిరోధిస్తాయి.

**– కృష్ణకుమార్**

'కృష్ణకుమార్' వ్యాసం చదివారు కదా! ప్రముఖ విద్యావేత్త రోహిత్ ధన్‌కర్ గారు భాష గురించి భాషాపరమైన అంశాల గురించి ఏమంటున్నారో చూద్దాం!

**భాషాపరమైన అంశాలు :**

"మౌఖిక భాషకు మూలభాగం పదం. పదం అనేది కొన్ని శబ్దాల కలయిక. ఈ శబ్దాల కలయికను ఒక భావనకు ముడిపెట్టనట్లయితే అవి నిరర్థకమైన శబ్దాలుగానే మిగిలిపోతాయితప్ప పదాలుగా మారవు. ఒక ప్రత్యేక శబ్దాల కలయికను ఒక ప్రత్యేక భావనతో ముడిపెట్టడానికి హేతుబద్ధమైన నియమాలేవి లేవు. ఇలా ముడిపెట్టడం నిర్హేతుకమైనదే కానీ ఒక భాషకు సంబంధించి అది స్థిరమైనది, సార్వత్రికమైనది ఉదాహరణకు 'చెట్టు' అన్నప్పుడు ఏర్పడే శబ్దాల కలయిక వలన ఏదైతే భావన ఏర్పడుతుందో అది సార్వత్రికంగా, స్థిరంగా ఉంటుంది. రేపటి రోజు 'గోళీలాట' అనే శబ్దాల కలయికను 'చెట్టు' అనే భావనకు ముడిపెట్టడం జరగదు. 'చెట్టు' అనే భావన చెట్టుదే, 'గోళీలాట' భావన గోళీలాటదే. వేటి స్థానాల్లో అవి నిర్హేతుకమైనప్పటికినీ ఆ భావనలు స్థిరంగా ఉంటాయి.

అర్థవంతమైన భాషానిర్మాణానికి పదాలను కొన్ని నియమాలననుసరించి వాడుతారు ఉదా: సరియైన అర్థాన్ని కల్పించుటకు పదాలను ఒక సరియైన వరుసలోనే వాడుతారు. ఈ నియమాలు కూడా నిర్హేతుకమయినప్పటికినీ, సార్వత్రికంగా స్థిరంగా ఉండడం వాటి స్వభావం. మౌఖిక గుర్తుల ద్వారా నియమబద్ధమైన పద్ధతిలో మానవులు అర్థాన్ని సృజించడమే భాష. ఈ పద్ధతి పూర్తిగా మానవులచే నిర్మించబడి వ్యవస్థీకరించబడింది. ఏ భాషకు చెందిన శబ్దాల కలయికలైనా పరిమితమే అయినప్పటికి, అర్థాలను సృష్టించే సమర్థత అపరిమితమైనది.

ఒక భాషను నేర్చుకోవడమంటే ఆ భాషపట్ల నియంత్రణ కలిగి, దాని అర్థాన్ని నిర్మించడానికి, అర్థాన్ని తెలుసుకోవడానికి, అర్థాన్ని వ్యక్తీకరించడానికి వాడడమే.

ఎలాగైతే కొన్ని శబ్దాలు మౌఖిక భాషకు రూపం కల్పిస్తాయో అలాగే కొన్ని గుర్తులు లిఖిత భాషకు రూపం కల్పిస్తాయి. ఈ గుర్తులే అక్షరాలు. వర్ణమాలలోని అక్షరాలు శబ్దాలను సూచిస్తాయి. ఈ గుర్తులు శబ్దాల మధ్య సంబంధం కూడా నిర్హేతుకమైనదే కానీ స్థిరమైనది, సార్వత్రికమైనది. మనమెప్పుడూ మానసికంగా లిఖిత భాషను, మౌఖిక భాషలోకి అనువదించి అర్థం చేసుకుంటాము. మౌఖిక భాషతో పోలిస్తే లిఖిత భాషను అర్థం చేసుకోవడానికి ఎక్కువ సోపానాలు ఉన్నాయి.

మనం మాట్లాడుతున్నప్పుడు కొంత 'అమౌఖిక భావప్రసారానికి అవకాశం ఉంటుంది. (ఉదా: ముఖ కవళికలు, చేతుల కదలికలు). వెంటనే స్పష్టత పొందే అవకాశం కూడా ఉంటుంది సాధారణంగా, లిఖిత భాషలో ఇది సాధ్యపడదు. అందుకే లిఖిత భాష కొన్ని అదనపు గుర్తులను వాడుతుంది, మరింత నియమబద్ధంగా ఉంటుంది.

ఈ వ్యాసం ఉద్దేశ్యం భాషావిశ్లేషణకాదు. ప్రాథమిక స్థాయిలో బోధనాభ్యసనను ప్రభావితం చేసే కొన్ని అంశాలను చర్చించడమే.

ఈ సంక్షిప్త వ్యాసంలో మనం నిర్ధారణకు వచ్చిన అంశాలు :

1) పిల్లల విషయంలో భాష, అవగాహన ఒకదానిపై ఒకటి పూర్తిగా ఆధారపడి ఉంటాయి.

2) భావనల, శబ్దాల కలయికల (పదాల) సంబంధాలు నిర్హేతుకమైనవి. వాటికి కారణాలు లేవు. కానీ అవి స్థిరమైనవి, సార్వత్రికమైనవి.

3) పదాల ద్వారా వాక్యనిర్మాణం జరిపే నియమాలు కూడా నిర్హేతుకమైనవే కానీ అవి కూడా స్థిరమైనవి సార్వత్రికమైనవి.

4) కనుక భాష ఒక చక్కటి వ్యవస్థీకృతమైన గుర్తుల విధానం.

5) అర్థాలను కల్పించే సమర్థత అపరిమితమైనది.

6) లిఖిత భాషలోని అక్షరాలు శబ్దాల కలయికను సూచిస్తాయి. ఈ సంబంధం కూడా నిర్హేతుకమైనదేకానీ స్థిరమైనది, సార్వత్రికమైనది.

7) లిఖిత భాషలో అర్థాన్ని చేరుకోవాలంటే, మౌఖిక భాష కంటే ఒక సోపానం ఎక్కువగా ఉంటుంది.

ఈ నిర్ధారణలకు ప్రాథమిక స్థాయి బోధనాభ్యసనలో ఎన్నో అన్వయాలు ఉన్నాయి. వాటిలో రెండు : నిర్హేతుకమైనదాన్ని పిల్లవాడు ఒక్కడే అర్థం చేసుకోలేడు. ఈ నిర్హేతుక సంబంధంపై పట్టు కలిగిన ఇతరులు (ఆ భాషను ఉపయోగించేవారు) పరిశీలించడం అవసరం. ఇక్కడ భావనల అవగాహన కంటే ముందు భాషను సాధన చేయడం ముఖ్యపాత్ర వహిస్తుంది. నియమబద్ధభాషపై పట్టు సాధించాలంటే పిల్లలు భావనలను అర్థంచేసుకోవడంలో నిమగ్నమై ఉండాలి. అప్పుడు భాషను వల్లెవేయడం కంటె భావనల అవగాహన ముఖ్యపాత్రవహిస్తుంది. భాషాభ్యసనకు రెండూ అవసరమేకానీ అభ్యసన ప్రక్రియకు భావనల అవగాహననే కొలమానంగా ఉంటుంది.

ఇంత చిన్న వ్యాసానికి సంబంధించి కూడా కొన్ని వివాదాస్పద అంశాలున్నాయి. వాటి గురించి స్పష్టత ఇచ్చే ప్రయత్నం.

పదాలంటే నిర్హేతుకమైన శబ్దాల వరుస లేదా కలయిక అని చెప్పడం జరిగింది.

పదాలు ఏర్పడడంలో శబ్దాల కలయికలు కొన్ని సార్వత్రిక నియమాలను అనురిస్తాయనడానికి తగిన భాషాపరమైన పరిశోన జరిగింది.

ఈ నియమాలను అనుసరిస్తామని చెప్పినా చాలా వరకు నిర్హేతుకమయిన కలయికలను, వాటిని భావాలకు ముడిపెట్టడాన్నే నమ్ముతున్నారు.

**రెండవ అంశం :** అతి చిన్న అర్థవంతమైన భాషాభాగం 'పదం' అనేది. కానీ అతి చిన్న అర్థవంతమైన భాషాభాగం 'వాక్యం' అనే భావన ఆధిపత్యంలో ఉంది.

ఒక అభ్యర్థన, ఒక వివాద అంశం, ఒక ప్రశ్న మొ॥నవి వ్యక్తీకరించడానికి వాక్యమే సరైన భాగం అనేది నిజమే అయినప్పటికి, మనసులో ఒక భావన రేకెత్తించడానికి ఒక పదం సరిపోతుంది. భావన రేకెత్తించడమంటే అర్థాన్ని రేకెత్తించడమనే పరిగణించాలి.

**మూడవ అంశం :** అన్ని మానవ భాషలలో సార్వత్రిక అమరికలుంటాయని, అవే వాక్యంలో పదాల వరుస క్రమాన్ని నిర్దేశిస్తాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ నియమాలు పిల్లల్లో స్వాభావికంగా ఉంటాయని అందుకే వారు ఈ వరుసక్రమం తప్పరనీ కొన్ని వాదాలున్నాయి. కానీ ఒక వాక్యాన్ని నిర్మించడంలో ఒకటి కంటే ఎక్కువ సరైన వరుసక్రమాలు ఉన్నాయి. పిల్లలు తప్పులు చేస్తారు. కనుక భాషను నేర్చుకోవడంలో అనుభవాల పాత్ర ఉంటుంది. అవును సార్వత్రిక అమరికలున్నాయి. అవి కొన్ని భాషలకే పరిమితమా లేదా అవి మానవ మేథకు స్వాభావికమా అనేది వివాదాస్పదమైన విషయం. కనుక నిర్హేతుకమనేది ఈ విషయంలో కాస్త పరిమితి కలిగిన భావన.



SCERT TELANGANA

*ఈ వ్యాసంలో చాలా సందర్భాలలో ఒక భాషలో శబ్దాల కలయికలు, అర్థాల మధ్య సంబంధాన్ని స్థిరమైనది, సార్వత్రికమైనదిగా చెప్పడం జరిగింది. ఇది ఒక కాలపరిమితికి అని అర్థం చేసుకోవాలి. భాషలు తమ శైలిని, పదాల అర్థాలను, సమయానుసారంగా భాషను ఉపయోగించే వారి పరంగా మార్చుకుంటాయి. సామాన్యంగా అందరికీ అర్థమయినప్పుడు "స్థిరత్వం, ఒప్పుకోలు" అనే లక్షణాలు భాషకున్నట్టే భావించాలి."*

**- రోహిత్ ధన్‌కర్**

## భాషా ప్రాముఖ్యత :

ప్రాథమిక విద్యలో భాషా ప్రాముఖ్యత గురించి, పిల్లలకు దానిపై ఉండాల్సిన పట్టు గురించి అందరికీ ఒక అవగాహన ఉంది. అంగీకారము కూడ ఉంది. భావ ప్రసారం కోసం భాష పిల్లలకే కాదు ప్రతి ఒక్కరికీ అవసరమేనన్నది స్పష్టమైన విషయం. కనుక గణితం, పరిసరాల విజ్ఞానం లేదా యితర ఏ విషయావగాహనకైనా భాష అవసరమే. నిజానికి విద్యకు సంబంధించిన అన్ని అంశాలను పిల్లలు భాషతోనే ముడివేస్తారు. పిల్లలు భాష ద్వారానే ఆలోచిస్తారు. ఆలోచనలకు, విశ్లేషణలకు, ప్రతిస్పందనలకు భాష ఆధారం. ఆలోచనలు, నిర్ణయాలు, ఆచరణ అన్నీ భాష ద్వారానే సాధ్యం. సమాజంలో తమ ఉనికిని ఏర్పరచుకోవడం కోసం భాష ఎంతో కీలకం.

పిల్లల మధ్య మరియు అభివృద్ధి లేదా పెరుగుదలలో భాష కీలకం అని మనం గుర్తించాలి అంటే మన దృష్టికోణం పైన చెప్పిన విధానంలో ఉండాలి. మన దృష్టికోణంలో భాషను ఒక సాధనంగా మాత్రమే చూస్తున్నాము. అది గణితాన్ని అర్థం చేసుకొనే సాధనం కావచ్చు లేదా నిర్ణయాలు తీసుకొనే సాధనం కావచ్చు. కానీ భాషను 'సాధనం' వరకే పరిమితం చేస్తే అది కుదరదు. అంతకంటే అది చాలా ఎక్కువ. ఈ చాలా ఎక్కువ అనేది విద్యలో, మానవ జీవితంలో భాష ప్రాముఖ్యతను నిర్ధారిస్తుంది లేదా నిర్ణయిస్తుంది. మనం మనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడడం, అనుభూతులను పొందడమే కాకుండా పొందిన ప్రతి అనుభూతికి అర్థాన్ని కల్పిస్తాము. వర్షాకాలంలో నల్లని మేఘాలను చూసినప్పుడు కేవలం కొన్ని ఆకారాలకు మాత్రమే దాని ప్రభావం పరిమితం కాదు. మేఘాలకు, వర్షానికి, నాట్యం చేసే నెమళ్ళకు, తడిబట్టలకు, వాటితోపడే ఇబ్బందులకు మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలు అన్నీ కలగలిసి ప్రభావాన్ని చూపుతాయి. ఒకవేళ అలా చూపలేకపోతే నల్లని మేఘాలు ఆకారంగానే మిగిలిపోతాయి. ఇలా సంబంధాలు ఏర్పరచడంవల్లనే ప్రపంచంలోని ప్రతి వస్తువుకు ఒక అర్థముంది. ఈ అర్థం వల్లనే వస్తువుల స్థితులు అర్థవంతంగా మారుతాయి. ఈ అర్థాన్ని మనం 'భావనలు' అంటాము. ఈ భావనలను వృద్ధిపరచేందుకు మనం మన మనసులో ఎన్నో గుర్తులను నిర్మించుకుంటాం. గుర్తులకు, భావనలకు మధ్య సంబంధాన్ని పెంచుతాం. ఈ భావనల నిర్మాణానికి భాషే పునాది. భావన ఒక విధాన నిర్మాణం. వృద్ధి అంటే అవగాహన పెంపొందడం. కనుక భాష, అవగాహన పరస్పర ఆధారితాలు. ఒకటి లేకుండ ఇంకొక దాని ఉనికి అసాధ్యం. ప్రాథమిక విద్యకు ఈ నిర్ధారణ అతి ముఖ్యమైనది.

## తరగతి గది అన్వయం :

రోహిత్ ధన్‌కర్, కృష్ణకుమార్‌లు భాషపై రాసిన విషయాలను చదివిన తర్వాత భాష, దాని ప్రాముఖ్యత, అభ్యసనంలో దాని పాత్ర గురించి మనకు ఒక స్పష్టత వచ్చింది కదా! భాష కేవలం భావగ్రహణ, ప్రసారణలకే పరిమితం కాదని దాని పాత్ర అనంతమని తెలుసుకొన్నాం. పిల్లల్లోని ఆసక్తులు, అవగాహన, సామర్థ్యాలు, వైఖరులు, విలువలు తదితరాలపై భాష ఎనలేని ప్రభావాన్ని చూపిస్తుంది. భాషను నేర్చుకోవడం బహుళ ప్రయోజనకరం అని మనకు తెలిసింది. గణితం, పరిసరాల విజ్ఞానం వంటి యితర విద్యావిషయాలను అర్థం చేసుకోవడంలో భాష మనకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. భావనల నిర్మాణంలో



SCERT TELANGANA

భాష కీలకపాత్ర వహిస్తుంది. పిల్లలు శబ్దాల కలయికను భావనతో ముడిపెట్టుకుంటారని రోహిత్ ధన్‌కర్ అభిప్రాయపడ్డాడు. భాషను ఉపయోగించి పిల్లలు ఏమేమి చేయగలరో కృష్ణకుమార్ చాలా వివరంగా రాశాడు. ఇప్పుడు మనముందున్న ప్రశ్న ఒక్కటే! భాష పరిధి చాలా విస్తృతంగా ఉన్నందున, భావనల నిర్మాణంలో భాష పాత్రధారి అయినందున తరగతి గదిలో దానిని ఎలా బోధించాలి? ఎలాంటి అభ్యసన ప్రక్రియలు చేపట్టాలి? అన్నది మనకు చాలా ముఖ్యం. ఒక్కసారి దానిని పరిశీలిద్దాం.

- పిల్లలు పాఠశాలకు రాకముందు భాషను గ్రహిస్తున్న సహజ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగానే తరగతి గది ఉండాలి.
- భాషలో ప్రతి పదము ఒక భావనయే కాబట్టి అర్థవంతమైన, సందర్భోచితమైన సన్నివేశాల ద్వారా భావనల నిర్మాణం జరగాలి.
- ఆలోచనలకు, విశ్లేషణలకు ఉపయోగపడే సహజ అభ్యసన కృత్యాలు కల్పించాలి.
- అర్థంపర్థంలేని శబ్దాల ద్వారా భాషను నేర్పించే ప్రయత్నం జరగకూడదు. విద్యార్థి అపరిచిత శబ్దాలను కూడ పూర్తిపదం ద్వారానే స్వీకరిస్తాడు, అర్థం చేసుకుంటాడు కాబట్టి మన బోధనా పద్ధతి కూడా దానికనుగుణంగానే ఉండాలి.
- తెలుగైనా, హిందీ అయినా, ఆంగ్లమైనా భాషాబోధన విధానం ఒక్కటే! కేవలం భాషను బోధిస్తున్నాని ఉపాధ్యాయుడు భావించకూడదు. భాషానియమాలు, వాక్యనిర్మాణ విధానాలు, వ్యాకరణ సూత్రాలు మొదలే చెప్పేసరికి పిల్లలు అయోమయానికి గురవుతారు. దానికి తరగతి గదిలో తావుండకూడదు.
- అర్థవంతమైన సన్నివేశాల ద్వారా పదాలు, పదాల ద్వారా వాక్యాలు, నూతనంగా నేర్చుకున్న పదాలలోని శబ్దాలనుపయోగించి కొత్త పదాల నిర్మాణం వంటి కృత్యాలు తరగతి గదిలో భావనల నిర్మాణానికి దోహదం చేస్తాయి.

❖ ❖ ❖

# 3. భావనల నిర్మాణం - భాష

"నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి భాష ఒక వనరు" - హాలిడే 1993. పిల్లలు తన చుట్టు ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవడానికి భాషను ఉపయోగిస్తారు. భాషను ఉపయోగించడం తెలిస్తే భావనలు విశదీకరిస్తారు. దృగ్విషయాలను వివరిస్తారు, విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటారు. "పిల్లవాడి వ్యక్తిత్వం, సామర్థ్యం, ప్రవర్తన, ఆసక్తి, విలువలు వంటి సర్వతోముఖాభివృద్ధికి భాష తోడ్పడుతుంది' - ప్రొ॥ కృష్ణకుమార్ - 1986.

భాష అనేది ఒక బోధనా మాధ్యమం. ఇది ప్రతి వారిలో ఉన్న భావన. ఎన్.సి.ఎఫ్.-2005 ప్రకారం అన్ని విషయాలు బోధించడం అంటే భాషాబోధన జరుగుతున్నది అని అర్థం. అందుకే భాష అన్ని రకాల అభ్యసనకు పునాదివంటిది.

పిల్లలు భాష ప్రమేయం లేకుండానే విషయాన్ని అర్థం చేసుకుంటారా? పిల్లల భాషకు స్థానం ఎక్కడ? భాష నేర్చుకోవడం ద్వారా ఏర్పడ్డ భావనలు ఏవి? వాస్తవానికి భాషను మనం ఒక మాధ్యమంగానే చూస్తున్నాం కానీ, పిల్లల భాషకు న్యాయం చేయడంలేదు. భాష నేర్చుకునే క్రమంలో వివిధ భావనల గురించి ఆలోచించడంలేదు. ఈ పరిస్థితుల వల్ల అభ్యసనం అర్థవంతంగా జరుగడం లేదు.

భావనల నిర్మాణానికి భాష, భాష నేర్చుకోవడానికి భావనలు ఎంతో అవసరం. తెలిసిన భాషతోనే భావనలు ఏర్పరచుకొంటారు. భావనలు ఏర్పడితేగాని భాషాభ్యసన జరుగదు. భాష నేర్చుకోవడానికి పరిసరాల విజ్ఞానం, గణితం, తెలుగు అన్న భేదం లేదు. ఏ విషయమందైనా భాష నేర్చుకోవచ్చు. అప్పుడే ఆ విషయం యొక్క భావన అర్థమవుతుంది. దైనందిన జీవితంలో వినియోగించగలుగుతారు. ఇది జీవితంలో నిరంతరం జరిగే ప్రక్రియ.

ఉదాహరణకు ఒక విద్యార్థి గణిత సమస్యనొకదానిని మౌఖికంగా సాధించగలుగుతున్నాడు కాని రాతపూర్వకంగా ఇచ్చినప్పుడు చేయలేకపోతున్నాడు. ఉదాహరణకు...

- *నీటితో నిండి ఉన్న బకెట్‌లో ఒక ఇనుప మేకును, ఒక ఈకను వేస్తే ఏం జరుగుతుంది?*

  *అ) ఇనుప మేకు మునుగుతుంది, ఈక తేలుతుంది.*

  *ఆ) ఇనుప మేకు తేలుతుంది, ఈక మునుగుతుంది.*

  *ఇ) ఇనుప మేకు, ఈక రెండూ తేలుతాయి.*

  *ఈ) ఇనుప మేకు, ఈక రెండూ మునుగుతాయి.*

ఈ సందర్భంలో పిల్లలు మౌఖికంగా ప్రశ్నించినప్పుడు సరైన సమాధానం చెప్పగల్గుతారు, కాని, చదివి సమాధానం చెప్పమన్నప్పుడు చాలా మంది తెలిసి కూడా ఇవ్వలేకపోతున్నారు. కారణం భాష రాకపోవడం, ప్రశ్నలోని 'ఏం జరుగుతుంది?' అన్న దానికి వారికి సరైన భావన తెలియకపోవడం.

- ఉపయోగించడానికి పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్డి ఏది?

  *అ) పొలాల్లో నీటి సౌకర్యమున్న బహిరంగ మరుగుదొడ్డి.*

  *ఆ) నీటి సౌకర్యంలేని పైకప్పు ఉన్న మరుగుదొడ్డి.*

  *ఇ) నీటి సౌకర్యం ఉండి పై కప్పు ఉన్న మరుగుదొడ్డి.*

  *ఈ) నీటి సౌకర్యంలేని అందరు ఉపయోగించె మరుగుదొడ్డి.*

పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన పై విషయాన్ని పరిశీలించినప్పుడు చాలా మంది పిల్లలు సరైన సమాధానాన్ని చెప్పలేక / రాయలేకపోతున్నారు. దీనికి కారణం 'పరిశుభ్రమైన, సురక్షితమైన' వంటి పదాలకు భాషపరంగా ఎలాంటి 'భావన' అభ్యసనలో ఏర్పరచకపోవడం. పై రెండు విషయాలలో కొందరు సరియైన సమాధానాన్ని గుర్తించినప్పటికి వారికి భావనల నిర్మాణం జరిగిందని భావించరాదు. పోలికలు, భేదాలు, వర్గీకరణ కారణాలు చెప్పడం, కార్యాకారణ సంబంధాన్ని గుర్తించగలరో వంటివి చేయగలిగితే ఎక్కువ, తక్కువ, పెద్దవి, చిన్నవి, పొట్టి, పొడవు వంటివి సమర్థవంతంగా చెప్పగలరో అప్పుడే భావనల నిర్మాణం జరిగింది అనవచ్చు. అనగా పిల్లల్లో ఆలోచన, విశ్లేషణ, వివరణ కారణాలు చెప్పడం, నిర్ధారించడం వంటివి చేసినప్పుడే పిల్లల్లో భావన నిర్మాణం జరిగిందని భావించాలి. కాని పిల్లల్లో కొన్ని భావనలు బడికి రాకముందే ఉంటాయి. భావనలు ఏర్పడడానికి చర్చించడం, పాల్గొనడం, ప్రతిచర్యలు వంటివి దోహదపడతాయి. విషయం ఏదైనా భావనల నిర్మాణం చాలాముఖ్యం. తరగతి గదులు ఆ దిశలోనే పనిచేయాలి. భాషేతర ఉపాధ్యాయుడు తన బోధనలో భాషకు తగిన స్థానం ఇవ్వాలి. భావనలు ఏర్పడడానికి తగిన భాషను ఉపయోగించాలి. భావనలు ఏర్పడినప్పుడే నిత్య జీవిత వినియోగం జరుగుతుంది ఇందుకు భాషను వినియోగిస్తారు.

### పాఠ్య ప్రణాళిక - భాష :

పాఠశాలకు రాకముందే పిల్లలకు వారి మాతృ భాషకు చెందిన కొన్ని పదాలు తెలిసి ఉంటాయి. వాటిని వారు దైనందిన జీవితంలో వారి అవసరాలకు ఉపయోగిస్తారు. తమకున్న పదజాలంతోనే పరిమితమైన వాక్యాలను నిర్మించుకుంటారు. వివిధ సందర్భాలలోని సన్నివేశాలలో పాల్గొంటారు. దీనివల్ల వారికి కొత్త పదాలు తెలుసుకునే అవకాశముంటుంది.

పాఠశాలలో చేరినప్పుడు పిల్లల్లో గల పదజాలం విద్యా-విషయక పదజాలంలా ఉండకపోవచ్చు. అయినప్పటికీ పిల్లలకు గణితం, తెలుగు, పరిసరాల విజ్ఞానం వంటి విషయాల భావనలు నేర్పడానికి భాష అవసరం. ప్రతి విషయాన్ని పిల్లలు తమ మాతృభాషలోనే అర్థవంతంగా గ్రహిస్తారు.

*ఉదా॥ 1) నాయన వ్యవసాయం పనులు చేస్తాడు.*

*2) ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తాడు.*

*3) సీతాకోక చిలుక అందంగా ఉంటుంది.*

*4) యాదగిరి గుట్ట ప్రసిద్ధ పుణ్యక్షేత్రము.*

పై వాక్యాలు పరిశీలించినప్పుడు పిల్లల్లో వ్యవసాయం, పనులు, ఉపాధ్యాయుడు, పాఠాలు అన్న పదాలు పరిశీలిస్తే వ్యవసాయం పనులు - అనే పదాలపై ఉన్న భావనలు నిత్యం పరిశీలించడం, వినడం ద్వార పొందినవే! అలాగే ఉపాధ్యాయుడు, పాఠాలు అనే పదాలు వాటి భావన పాఠశాలలో చేరిన తరువాత తెలుసుకుంటారు. కాని 2, 3 వాక్యాలలోని 'అందం', 'ప్రసిద్ధ' అనే పదాలు ఎక్కడ చూపించలేము. ఈ పదాలకు చర్చ, పరిశీలన ద్వార భాషను ఉపయోగించి భావనలు ఏర్పరచగలము. అంటే పిల్లలకు భాష తెలిస్తే భావనలు ఏర్పరచడం సులభం అవుతుంది.

మన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తే ఎన్నో పాఠాలలో పిల్లలకు తెలియని పదాల సూచనలు ఉంటవి. ఇవి అర్థం కావాలి అంటే భాషాబోధనలో ప్రతి పాదాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చూడాలి. ఉదాహరణకు పరిసరాల విజ్ఞానంలో అడవి, ప్రజాస్వామ్యం, మానవ శరీరం వంటి ఎన్నో పదాలున్నాయి. భాషాపరంగా వీటి అర్థం తెలిసినప్పుడే ఈ పదాలపట్ల సరైన భావనలు ఏర్పరచుకోగలుగుతారు. అలాగే గణితంలో కూడ లబ్దం, తేడా, మొత్తం వంటి పదాలు కనిపిస్తాయి వీటి అర్థం తెలిస్తేనే ఆయా గణిత భావనలు అర్థం అవుతాయి. వీటిని సందర్భోచితంగా అర్థవంతమైన సన్నివేశాలలో పాల్గొనడం ద్వారానే గ్రహిస్తారు.

భాషోపాధ్యాయుడే వివిధరకాలైన పదాలను పిల్లలకు అర్థంచేయించాల్సి ఉంటుంది. వీటిని భాషోపాధ్యాయుడే నేర్పించాలనే భావన ఉపాధ్యాయుల్లో ఉండరాదు. ప్రతి విషయం బోధించే ఉపాధ్యాయుడు ఆయా విషయాల్లోగల కీలక పదాలను అర్థంచేయించడంలో భాషోపాధ్యాయుడిగా వ్యవహరించాలి. అప్పుడే ఆ విషయంపట్ల పిల్లలకు ఒక భావన ఏర్పడుతుంది. ఏర్పడిన భావనలు నిజ జీవితంలో తనకు తెలిసిన పదజాలంతో వ్యక్తపరచగలరు, వినియోగించగలరు.

## ప్రాథమిక స్థాయిలో బోధన :

పిల్లలు తమ మాతృభాషను ఎలా పొందుతారో పరిశీలిస్తే పాఠశాలలో భాషను బోధించడానికి అవకాశాలుంటాయి. ఉదా॥ 4 సం॥రాల వయస్సు పిల్లలు ఒక సంచి (Bag) ని చూసినప్పుడు అది సంచి అంటారుకాని అది ప్లాస్టిక్, జనుము, బట్టతో తయారుచేసినవిగా చెప్పరు. దీనిని కొంచెం సున్నితంగా పరిశీలిస్తే, సంచికి ఒక'నాడ' ('U' shaped handle) ఉంటుంది. ఇందులో వస్తువులు ఉంచడానికి స్థలం ఉంటుంది అనే భావన కలిగి ఉంటారు. కొన్ని సందర్భాలలో 'U' ఆకారం నాడ ఉండి వస్తువులు ఉంచడానికి స్థలం ఉన్న స్టీలు పాత్రను కూడ సంచిగానే భావిస్తారు. కానీ అవకాశాలు కల్పించడంవల్ల పై విధంగా ఉండేవన్ని సంచులుకావు అవి గ్రహిస్తారు. ఇది జీవిత కాలం జరిగే ప్రక్రియ. పెద్దలు అవునన్నా, కాదన్నా, 4 సం॥రాల పిల్లలు వస్తువులను వేరుచేయగల్గితే భావనల అవగాహన ప్రదర్శించినట్లే.

పిల్లలు వేరుచేసిన వస్తువులకు భేదాలు చెప్పలేనప్పటికీ వాటి వినియోగం, ఆకారం, పరిమాణం, ఎక్కడలభిస్తాయి, తినగలిగినవేనా! వంటివి అర్థం చేసుకుంటాడు. ఇది పూర్తిమొత్తంగా జరిగిన అవగాహననే కానీ విషయాలవారీగా జరిగింది కాదు. ఆకారాలు తెలిసినవి కాబట్టి గణితం, వాటి అవసరాలు / వినియోగం తెలిసింది కాబట్టి పరిసరాల విజ్ఞానం, సరిగ్గా చెప్పినాడు కాబట్టి భాష తెలిసినట్లుగా భావించరాదు.

పిల్లలు సంచి పరిమాణం, ఆకారం, తయారికి ఉపయోగించిన సామగ్రి, డిజైన్ (ఎంబ్రాయిడరి) అల్లికలు, రంగులు, పాకెట్స్, గుండీలు (Buttons) వంటి సూక్ష్మ విషయాలు చెప్పగలిగితే, సంచిని వర్ణించడానికి భాష, మరియు సున్నితంగా బ్యాగును పరిశీలించడానికి భాష అనే రెండు ప్రక్రియలు పిల్లల్లో జరిగినట్లే అవుతుంది. ఇలాంటి ఉదాహరణలు మన చుట్టు ఇంకెన్నో చెప్పుకోవచ్చు. సాధారణంగా పిల్లలు తన చుట్టు ఉన్న ప్రపంచం ద్వారా భాషను నేర్చుకుంటూనే భావనలు ఏర్పరచుకుంటారు, జ్ఞానం పొందుతారు.

వాక్యంలోని పదాలు సంజ్ఞలు, ఎక్కడ ఏ విధంగా ఉచ్చరించాలో తెలిసిన వారికి భాషపట్ల పట్టు ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఎవరితో, ఏ సందర్భంలో ఏ పదాలు ఎలా మాట్లాడాలి. ఎలా ప్రతిస్పందించాలి అనే విషయాలతోపాటు వాద, ప్రతివాదనలోగల భేదాలు చెప్పగల్గుతారు. పై అంశాలను పరిశీలించినప్పుడు, వ్యక్తిలో భాషాపరిజ్ఞానం, విషయం అర్థం చేసుకోవడం, విశ్లేషించే నైపుణ్యం, జ్ఞాన నిర్మాణం, ప్రశ్నించే తత్వం, వాక్య నిర్మాణ నైపుణ్యం ప్రతిస్పందించే నైపుణ్యం, జ్ఞాన నిర్మాణం, ప్రశ్నించే తత్వం, అలవడుతాయి అని తెలుస్తుంది. చురుగ్గా పాల్గొనడం ద్వార జ్ఞానాత్మక నైపుణ్యాల (Congnetive Skills) లో మార్పు జరగవచ్చు, విషయ పరిజ్ఞానం పొందవచ్చు. "భావనల అవగాహనకు భాష అవసరం, మరియు భాష నేర్చుకోవడానికి భావనల అవగాహన ముఖ్యం. ఇవి రెండు విడదీయలేని విషయాలు.

పాఠశాలల్లో గణితం, రెండు భాషలు మరియు పరిసరాల విజ్ఞానం ముఖ్యమైన విషయాలుగా మరియు పని విద్య, శారీరక వ్యాయామ విద్య, పని అనుభవం, విలువల విద్య వంటి వాటిని సహపాఠ్యాంశాలుగా బోధిస్తున్నాము. పరిసరాల విజ్ఞానాన్ని విశ్లేషించే విధముగా, అర్థవంతంగా ఉండేటట్లు నేర్చుకునే అవకాశం కల్పించేవారు. ఎంత మంది ఉన్నారు? ఉదాహరణకు వివిధ భావనలను అర్థం చేయించడానికిగల కృత్యాలను విద్యార్థులచే చేయించడానికి ఎంతమంది ఉపాధ్యాయులు అవకాశమిస్తున్నారు? ఎంత మంది భాషోపాధ్యాయులు పరిసరాల విజ్ఞానం భావనలు వివరించి, అర్థం చేసుకోడానికి

SCERT TELANGANA

అవకాశం కల్పిస్తున్నారు? అదే విధంగా చరిత్ర, భూగోళశాస్త్ర విషయాలు కూడా భాషా పరంగా వివరణ జరగడంలేదు. పాఠ్య పుస్తకాలన్నీ వేటికి అవే బోధించబడుచున్నవి కానీ, సమ్మిళితంగా, సమగ్రంగా బోధించడం చాలా అరుదుగా కనిపిస్తుంది.

## భాష, భావనల నిర్మాణం – పాఠ్యప్రణాళికలో భాష యొక్క పాత్ర :

అభ్యసనానుభవాలను కలిగించుటలో భాష ప్రధానపాత్ర పోషిస్తున్నది. విద్యార్థులలో భావనలను ఏర్పరచడంలో గుర్తులు / సంకేతాలు అర్థం చేసుకోవడంలో సమస్యను విశ్లేషించి సాధించుటలో, సమాచారాన్ని క్రమబద్ధీకరించుటకు, తన చుట్టూ ఉన్న పరిసరాలలో ప్రతిచర్యలు పొందడంలో భాష తోడ్పడుతుంది. కళ్ళ ముందు లేనటువంటి వస్తువులకు ఒక రూపాన్ని ఏర్పరచుకొని వాటి గురించి వివరించగల సామర్థ్యమును కలిగించును. విద్యార్థి తన కాల్పనిక శక్తితో ఒక వస్తువు యొక్క ఉద్దేశాన్ని, పరిచయాన్ని, ప్రక్రియను ఏర్పరుచుకొనగలుగుతాడు. క్రమముగా విద్యార్థి తాను కాల్పనిక శక్తితో ఏర్పరుచుకున్న ప్రాతినిధ్యములపై (Representations) ఇతరులతో చర్చించును. విద్యార్థి తన భావజాలమును వ్యక్తపరుచునప్పుడు తల్లి, ఇంటిలోని ఇతర పెద్దలు పిల్లవాని భాషను సరిచేస్తూ, మార్పులు చేస్తూ, అభివృద్ధి చేయుదురు. పిల్లల ప్రాతినిధ్యముపై పనిచేయు క్లిష్టతరమైన ప్రక్రియలో భాష ప్రమఖ పాత్ర పోషిస్తున్నది.

విద్యార్థి పాఠశాలకు వచ్చినప్పుడు తాను గణితము, పరిసరాల విజ్ఞానము మరియు ఆంగ్లము వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకొనును. వీటిలో ప్రతి అంశము వేరు వేరు అనుభవాలను కలిగించును. ఆంగ్ల ఉపాధ్యాయుడు ఒక కథ చెపుతూ (Once upon a time in a deep forest there lived a beast) "ఒకానొక సమయములో ఒక దట్టమైన అడవిలో ఒక మృగం ఉండేది". ఈ కథలోని విషయంపై సాధారణ అవగాహన కలిగియున్నట్లైతే పిల్లలు దీనిని అర్థం చేసుకొనగలరు. లేని యెడల పిల్లల అరణ్యము గురించిన అవగాహన లేకపోతే తనకు తెలిసియున్న మరొక విషయములపై ఊహాగానము చేస్తారు. మరొక వైపు ఈ ప్రాతినిధ్యాలు అన్నీ ఒక ప్రత్యేకమైన ఉద్దేశమును కలిగియున్నవి. "ఒక దట్టమైన అడవిలో ఒక మృగము ఉండేది" ఇది ఒక భూతకాలానికి చెందిన అంశం. ఇదే విషయం గురించి గణిత ఉపాధ్యాయుడు మాట్లాడినప్పుడు (Suppose you went to a forest, you saw three Baniyan "trees and two Banana trees. How many trees you have seen?) ఉదాహరణకు నీవు అడవికి వెళ్ళినప్పుడు మూడు మర్రి చెట్లు, రెండు అరటి చెట్లను చూస్తే, మొత్తము ఎన్ని చెట్లను చూసినట్లు? ఈ సందర్భంలో విద్యార్థి మర్రి చెట్టు, అరటి చెట్టును ఊహించుకుంటూ సంఖ్యాపరమైన సమాలోచన చేయాలి. మొదటి ఉదాహరణలో విద్యార్థి భూతకాలములో జరిగిన ఒక అంశములో ప్రేక్షకుడు మాత్రమే, రెండవ ఉదాహరణలో తనను తాను ఆ సందర్భములో పాత్రగా ఊహించుకుంటూ అమూర్తమైన గణిత భావనయైన సంకలనమును చేయాల్సి ఉంటుంది.

భాషా తరగతిలో ప్రాతినిధ్యములను జ్ఞప్తికి తెచ్చుకొంటారు, ఇవి పరిపుష్టము పొందుతవి, మార్పులు చేయబడును. ఈ ప్రాతినిధ్యములకు సృజనాత్మకమైన ఊహలు జోడించును. పరిసరాల విజ్ఞానములో ప్రతి అంశము విద్యార్థి యొక్క సామాజిక మరియు పరిసరాలను వాస్తవిక దృష్టితో సుస్పష్టముగా పరీక్షింపబడును. పరిసరాల విజ్ఞానము తరగతిలో వృక్షము భగవంతునికి సంబంధించిన అంశము కాదు. కానీ, భాషా తరగతిలో అది దేవీ దేవతల యొక్క నివాస స్థలము.

ప్రాథమిక తరగతిలో ఏ విషయ సంబంధమైన ఉపాధ్యాయుడైనా విద్యార్థుల యొక్క మానసిక ప్రాతినిధ్యములను తెలుసుకోవాలి. విద్యార్థి తన చుట్టూ ఉన్న పరిసరాలతో నిరంతర అనుభవాల ద్వారా ఈ ప్రాతినిధ్యములను ఏర్పరుచుకున్నాడని ఉపాధ్యాయులు గ్రహించవలెను. ఉపాధ్యాయుడు విద్యార్థికి ఏదైనా కొత్త విషయమును బోధించేటప్పుడు వారి పూర్వమానసిక ప్రాతినిధ్యములను గుర్తించి ఆ ప్రకారము విషయమును పరిచయం చేయాలి.



SCERT TELANGANA

ప్రతీ సబ్జక్టు (Subject) పాఠ్యాంశాల సమూహము (Set of academic representations). ఈ ప్రాతినిధ్యములు కొత్తవి మాత్రమే కావు, వాటిని విద్యార్థి తరగతి గదిలో ఎలా ఉపయోగించాలో కూడా కొత్త విషయమే! సంఖ్యలతో ఆడుకొనుట మరియు తర్కము చేయుట గణిత శాస్త్రము యొక్క ఉద్దేశం. అయితే పరిసరాల విజ్ఞానములో పరిశీలన మరియు ప్రాతినిధ్యములతో వివరణ ప్రాముఖ్యతను కలిగిఉంటుంది.

**ముగింపు :**

**తరగతి అన్వయం :**

- భాషను వివిధ సబ్జక్టులను నేర్చుకోవడానికి సాధనంగా భావించాలి.
- సబ్జక్టు ఏదైనా "వివిధ భావనలు" అంటే కీలకపదాలు, సాంకేతిక పదాలు, సందేశాత్మక పదాలు, వాక్యాలను అర్థంచేయించడంలో భాష ముఖ్యమైనది.
- ఇందుకోసం పిల్లల గతానుభవాలను, వారి నేపథ్యం, సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాలి.
- అర్థవంతమైన సన్నివేశాలను కల్పించడం ద్వారా, సందర్భోచితంగా వివిధ భావనలను గ్రహించేలా చూడాలి.
- వీటి కోసం చర్చలు, కృత్యాలు, అన్వేషణలు, జట్టుపనులు, పఠన కృత్యాలు, ప్రాజెక్టు పనులు, ప్రయోగాలు వంటివి నిర్వహించాలి.
- 'భావనలు' / కీలక పదం అర్థమైతేనే పిల్లలు వారు వినే అంశం లేదా చదివే అంశంలను అర్థంచేసుకొనే ప్రయత్నంచేస్తారు.
- కాబట్టి ప్రతి పాఠ్యబోధనకు ముందు ఆయా పాఠ్యాంశాలు, అధ్యాయాలలోని వివిధ రకాలైన పదజాలాన్ని గురించి మేథోమథనం, భావన చిత్రాలు (Concept Mapping & Brain Storming) వంటివి నిర్వహించాలి.
- భాషాభివృద్ధి కేవలం భాషోపాధ్యాయులు లేదా భాషకు సంబంధించిన అంశంగా భావించరాదు. అలాగే భాషోపాధ్యాయులకు వాక్య నిర్మాణం, వ్యాకరణం, అక్షర దోషాలను గుర్తించి నివారించుటకు పరిమితం కారాదు. ఇతర సబ్జక్టులు బోధించే ఉపాధ్యాయులు కూడా భాషాపరంగా దృష్టిపెట్టాలి. భాషోపాధ్యాయులు కూడా ఆయా పాఠాల వారీగా వివిధ భావనలను అర్థం చేయించడంపై దృష్టిపెట్టాలి.
- మన బోధనా పద్ధతులన్నీ పిల్లలతో పరస్పరం చర్చించడం, పిల్లల్ని పరిశీలించడం మరియు చిన్న, చిన్న ప్రయోగాల ద్వారా వచ్చినవి. పిల్లలకు వస్తువులతో పొందిన అనుభూతి, వస్తువులను విసరడం, వాయించడం / కొట్టడం, పరిశీలించడం, ప్రశ్నించడం, అభినయించడం ద్వారా నేర్చుకుంటారనేది మనందరం విశ్వసించాల్సిన విషయం. ఇవి చేయడంవల్ల కొత్త విషయాలు నేర్చుకోవడానికి పూర్వ అనుభవాలు సహకరిస్తాయి. ఎక్కడైతే పిల్లలు తమ పూర్వ అనుభవాలను అనుసంధానం చేస్తూ నేర్చుకునే అవకాశాలు కల్పించబడతాయో అక్కడ అభ్యసనలో భావనల నిర్మాణం జరిగినట్లు భావించవచ్చు.

SCERT TELANGANA

# 4. భాషాభ్యసనం - సమగ్ర ఉపగమం - సామాజిక, సాంస్కృతిక విమర్శనాత్మక దృక్పథం

సమాజంలో భిన్న జాతులు, మతాలు, కులాలు, తెగలకు సంబంధించిన ప్రజలు సంఘటితంగా జీవిస్తుంటారు. ఈ ప్రజలంతా ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, ఒకరిని ఒకరు గౌరవించుకుంటు వివిధ సంస్కృతులను అవగాహన చేసుకుంటారు. ఈ రకమైన జీవన విధానం భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం. ఇలాంటి వైవిధ్యభరితమైన సమాజంలోని పిల్లలే మన పాఠశాలకు వస్తారు. వీరంతా అనేక సంస్కృతీ సంప్రదాయాలతో, ఆచారవ్యవహారాలతో, భిన్న నేపథ్యాలతో, ఆర్థిక వ్యత్యాసాలతో, విభిన్న భాషలు, మాండలికాలు మొదలగునవి కలిగి ఉంటారు.

తరగతి గదిలో బహుళనేపథ్యాలు కలిగిన పిల్లలు ఉంటారు. ఇటువంటి పిల్లలందరికీ బోధన ఎలా జరుగుతున్నదో చూద్దాం. ఉదాహరణకు : ఒక ఉపాధ్యాయుడు 4వ తరగతిలో తెలుగు పాఠం 'వినాయకచవితి' బోధిస్తున్నాడు. ఆ తరగతిలో ఇతర మతాలకు చెందిన పిల్లలున్నారు. ఆ ఉపాధ్యాయుడు పాఠంపై దృష్టిపెట్టి తన బోధనను చక్కగా ముగించాడు. బోధన తరువాత ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు పిల్లలు సరియైన సమాధానాలు చెప్పలేదు.

**ఆలోచించండి...**

- *బోధన సరిగ్గా జరిగినదా?*
- *ఉపాధ్యాయుడు తను ఆశించిన ఫలితాలను ఈ బోధన ద్వారా పొందగలడా?*

మరొక ఉదాహరణ : ఒక పాఠశాలలో పూజిత అనే విద్యార్థిని ప్రతిరోజు ఆలస్యంగా వస్తున్నది. ఉపాధ్యాయుడు ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ ఆ అమ్మాయి సమయానికి పాఠశాలకు రాకపోయేది. విసుగుచెందిన ఉపాధ్యాయుడు ఒకరోజు ఆలస్యంగా బడికి వచ్చినందుకు పూజితను గట్టిగా మందలించాడు. ఆ మరుసటి రోజు నుండి ఆ అమ్మాయి పాఠశాలకు రావడం మానేసింది.

- *ఉపాధ్యాయుడు ఆ విధంగా మందలించడం సరియైనదేనా?*
- *సమయపాలన పాటించమని చెప్పడం ఉపాధ్యాయుడు చేసిన తప్పా?*

మొదటి ఉదాహరణలో ఉపాధ్యాయుడు తన లక్ష్యాలకు అనుగుణంగా బోధన చేశాడు. కానీ ఆశించిన అభ్యసన ఫలితాలు పొందలేకపోయాడు. ఎందుకు ఇలా జరిగింది? ఉపాధ్యాయుడు బోధించే సమయంలో పాఠ్యాంశంపైన, బోధన లక్ష్యాలపైననే దృష్టిపెట్టాడు. కాని పిల్లల నేపథ్యాలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాల గురించి ఆలోచించలేదు. వారి సంస్కృతికి సంబంధించిన పండుగల గురించి చర్చించలేదు. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం, ప్రోత్సాహం కల్పించలేదు. తరగతిలోని పిల్లల నేపథ్యాలపై అవగాహన లేకుండా బోధన జరిగింది. దీనికి కారణం ఉపాధ్యాయునికి సాంస్కృతిక దృక్పథారాహిత్యం.

రెండవ ఉదాహరణలో పూజిత పాఠశాలకు ఆలస్యంగా రావడంలో ఉపాధ్యాయుడు గట్టిగా మందలించాడు. అలా చేయడంతో ఆ అమ్మాయి బడిమానేసింది. ఉపాధ్యాయుడు మందలించడం సరియైనదేకావచ్చు. కాని ఆ అమ్మాయి ఆలస్యంగా రావడానికి కారణం తనతల్లి పని నుండి వచ్చేవరకు తమ్ముడిని చూసుకోవలసి ఉంటుంది. ఇది ఆ అమ్మాయికి తప్పనిసరి పరిస్థితి. ఆ పరిస్థితి తెలుసుకోకుండా ఉపాధ్యాయుడు మందలించడంతో మనస్తాపం చెంది బడిమానేసింది. క్రమశిక్షణ నేర్పించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయుడు చేసిన పనివల్ల ఆ అమ్మాయి బడికి దూరం అయింది.

ఉపాధ్యాయుడు పూజిత కుటుంబ నేపథ్యం గురించి, బడికి ఆలస్యంగా రావడానికి కారణాలు తెలుసుకొని ఉండి ఉంటే పూజిత బడిమానేసిదికాదు. సామాజిక అవగాహనా రాహిత్యంవల్ల ఇది జరిగింది. తరగతిలోని పిల్లల సామాజిక సాంస్కృతిక నేపథ్యాలు ఉపాధ్యాయులకు తెలిసి ఉండాలి.

ఒకే ప్రాంతంలో నివసిస్తూ పరస్పర ప్రాథమిక సంబంధాలను కలిగిఉన్న ప్రజలు భిన్న జీవన విధానాలు ఆచరిస్తుంటారు. వారి సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలు వేరువేరుగా ఉంటాయి. సంస్కృతి, సంప్రదాయాలలో ఒకరికి మరొకరికి తేడాలుండడం తప్పుకాదు. ఈ తేడాలను ఎక్కువ, తక్కువ అనే భేదభావాలు చూపించకూడదు. న్యూనతగా, చిన్నతనంగా భావించకూడదు. వారివారి నేపథ్యాల దృష్ట్యా వారు ప్రవర్తిస్తారు.

మన తరగతి గదులు బహుళ నేపథ్యాల నిలయం. ఈ బహుళ నేపథ్యాలను బలహీనతగా ఉపాధ్యాయులు భావించకూడదు. దీనిని బలమైన వనరుగా భావించాలి. అనేక సంస్కృతుల మేళవింపుతో పాఠ్యబోధన చేయగలగాలి. అన్ని సామాజిక, సాంస్కృతిక, ఆచార సంప్రదాయాలను పిల్లలందరు తెలుసుకోగలుగుతారు.

*విద్యార్థులు అనేక భాషలు, విభిన్న ప్రాంతీయ మండలికాలు మాట్లాడుతారు. వారి సామాజిక స్థితిగతులను, భాషను కించపరచకూడదు. తరగతి గదిలో ఉండే ఈ బహుళ నేపథ్యాలు తన బోధనకు ఆటంకంగా భావించకుండా పిల్లలు వాడే పదజాలాన్ని అంగీకరిస్తూ, స్వేచ్ఛగా మాట్లాడనిస్తూ బోధన కొనసాగించాలి. లేకుంటే ఆ బోధన యాంత్రికంగా ఉంటుంది. బోధన యాంత్రికంగా కొనసాగినప్పుడు ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. కాబట్టి పిల్లల భాషను బోధనకు ఆటంకంగా భావించకుండా, ఆ భాషను ఉపయోగిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ బోధన కొనసాగించాలి.*

పాఠశాలలో అనేక రకాల వ్యత్యాసాలు కలిగిన పిల్లలుంటారు. వీరందరు బహుళ నేపథ్యాలతో కూడి ఉంటారు. ఈ పిల్లలందరి మధ్య ఎన్నో వ్యత్యాసాలున్నప్పటికీ అందరు ఐకమత్యంతో ఉంటారు. వీరందరు కలిసి మాట్లాడుకోవడం, ఆడుకోవడం, చదువుకోవడం, విభిన్న కృత్యాల్లో పాలుపంచుకోవడం మొదలగునవి చేస్తారు. ఈ పనులు చేసేటప్పుడు వారి వారి ఆచారవ్యవహారాల గురించి, సంస్కృతీ సంప్రదాయాల గురించి చర్చిస్తారు, తెలుసుకుంటారు, విశ్లేషిస్తారు. ఈ విధమైన సాంస్కృతిక బదలాయింపు జరగడంవల్ల విద్యార్థి సామాజికంగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది. విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసం ఈ విధంగానే జరుగుతుంది. ఇదే మన బోధనా లక్ష్యం కూడా.

- *తరగతి గదిలో భాషాబోధనలో సాంస్కృతిక బదలాయింపు అనే అంశం చోటుచేసుకుంటున్నదా!*

తరగతిలో బహుళ నేపథ్యాలు కలిగిన పిల్లలుంటారు. కాబట్టి పాఠాన్ని యథాతథంగా బోధించకుండా ఆలోచనాత్మక ప్రశ్నలువేస్తూ, జవాబులు చెప్పిస్తూ వారి నేపథ్యానికి పాఠంలోని సన్నివేశాలకు / పాఠ్యాంశానికి సంబంధించిన పోలికలు, భేదాల గురించి చర్చిస్తూ పాఠ్యబోధన చేయాలి. ఇలా చేయడంవల్ల వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి మేధోమథనం జరిగి తమ భావాలను పంచుకుంటారు. ప్రస్తుత పాఠ్యాంశంతో పోల్చుకుంటారు. వాటిలోని భేదాలను గుర్తిస్తారు. కారణాలను అన్వేషిస్తారు. నిర్ధారణ చేయగలుగుతారు. సమర్థిస్తారు, విభేదిస్తారు. దీనివల్ల విద్యార్థికి పాఠంపై ఆసక్తి కలుగుతుంది.

ఉదాహరణకు : 'వినాయక చవితి' పాఠ్యబోధన సమయంలో విద్యార్థుల బహుళనేపథ్యాలను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయుడు సందర్భానుసారంగా ప్రశ్నిస్తూ, చర్చిస్తూ సాంస్కృతిక బదలాయింపుద్వారా విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి.

- మీరు జరుపుకొనే పండుగల పేర్లు చెప్పండి.
- ఏయే పండుగలు ఎన్నెన్ని రోజులు జరుపుకుంటారు?
- మీ పండుగలు ఎట్లా జరుపుతారు?
- పండుగనాడు ఏం చేస్తారు?
- సామూహికంగా జరుపుకొనే పండుగలు ఏమిటి?
- ఊరేగింపుగా జరుపుకునే పండుగలు ఏమిటి? ఏమి ఊరేగిస్తారు?
- నిమజ్జనం చేసే పండుగలు ఏమిటి?
- పండుగనాడు చేసే ప్రత్యేక వంటలు ఏమిటి?

ఈ విధంగా చర్చ ద్వారా అదనపు ప్రశ్నలు వేస్తు, పిల్లలచే మాట్లాడింపచేయటం ద్వారా భావప్రసార నైపుణ్యాలు పెంపొందుతాయి. విశ్లేషణాత్మక దృక్పథం అలవడుతుంది. పోలికలు, భేదాలు గుర్తించడం ద్వారా సంస్కృతుల సారూప్యత తెలుసుకుంటారు. ఒక సహజ అభ్యసన వాతావరణం ఏర్పడుతుంది. తద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

> *"మానవుడు నిరంతర విద్యార్థి. జీవితాంతం తనతోటివారి నుండి ఏదో ఒకటి నేర్చుకుంటాడు. తన స్థితిగతులు ఎలా ఉన్నప్పటికి సమాజంలో కలిసిపనిచేసేవారి ప్రభావం అధికంగా ఉంటుంది. భిన్న సంస్కృతుల్లోని ముఖ్యాంశాలు విభిన్న కోణాల్లో ప్రభావితం చేస్తాయి" - వైగాట్స్కై (Vygotsky)*

భాషా బోధన ఎంత సమగ్రమైనప్పటికి పిల్లల్లో పరస్పర భావప్రసార నైపుణ్యాలను పెంపొందించకుండా విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించలేము, అర్థవంతంగా కూడా ఉండదు. అందుకే ఈ క్రింది అంశాలను గురించి చర్చిద్దాం :

చదువంటే జ్ఞాపకం ఉంచుకోవడం, ఇందుకోసం బట్టిపట్టడం, పరీక్షలకు సిద్ధం కావడం మంచి మార్కులు పొందడం అనే చట్రంలో బిగుసుకుపోయి ఉండేది. వీటి ప్రభావంతో ఉపాధ్యాయులు కూడ వివరించడానికి, చదివించడానికి, జ్ఞాపకం చేయించడానికి పరీక్షల్లో ఫలితాలు పొందడానికి అవసరమైన అభ్యాసాలు చేయించడానికి పరిమితం అయ్యేవారు. చదువు పట్ల మనకు ఉండే భావనలే మనకు చదువుపట్ల ఒక దృక్పథాన్ని కలిగిస్తాయి. ఆమేరకే మన పని తీరు ఉంటుంది.

'భాష' సబ్జక్టును ప్రాథమిక స్థాయిలో ఒక ముఖ్యమైన విషయంగా ఎందుకు బోధిస్తున్నామో విశ్లేషించుకుంటే విషయం బోధపడుతుంది. వాస్తవానికి పిల్లలకు బడికి రాకముందే మాతృ భాష మీద పట్టు ఉంటుంది. అయినప్పటికీ కూడ మళ్ళీ మనం భాషను బడిలో ఎందుకు బోధిస్తున్నామో ఆలోచించాలి. తెలిసిన విషయాన్ని క్రమపద్ధతిలో చెప్పగలగడం, ధారాళంగా చదివి అర్థంచేసుకోవడం, తెలిసిన విషయాలను సొంతమాటల్లో రాయగలగడం, సృజనాత్మకంగా వ్యక్తీకరించే సామర్థ్యం పెంపొందడం, సందర్భోచితంగా సరియైన మంచిపదజాలాన్ని వినియోగించగలగడం వంటి సామర్థ్యాలను భాష ద్వారా పెంపొందించాలి. ఇవన్నీ పాఠాలలోని విషయాలను జ్ఞాపకానికి, బట్టిపట్టడానికి అతీతమైన అంశాలు. మానసిక ప్రక్రియలకు సంబంధించినవి అనగా ఆలోచించడానికి, వ్యక్తీకరించడానికి ఉద్దేశించిన అంశాలని చెప్పవచ్చు. జాతీయ విద్యాప్రణాళిక చట్రం 2005 కూడ వీటినే ప్రస్తావించింది. దీని ప్రకారం పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరగాలి. అందుకే నేడు చదువంటే 'జ్ఞాన నిర్మాణం' అని లేదా 'ఆలోచించడం, వక్తీకరించడం' అని భావిస్తున్నారు.

**భాషలో జ్ఞాన నిర్మాణం :**

విద్యార్థులు విన్న లేదా చదివిన అంశాలనే జ్ఞాపకం పెట్టుకొని మళ్ళీ చెబితే దానిని 'పునరుక్తి' అంటారు. 'జ్ఞానం' అనరు. జ్ఞానం అంటే ఆలోచించి వ్యక్తపరిచేది. ఉదా: ఒక కథను చదివితే మళ్ళీ సొంతమాటల్లో అదే కథను చెప్పడంకాదు. కథకు వేరే ముగింపును సూచించడం లేదా పాత్రలు మారితే కథను ఊహించడం, కథలోని పాత్రల స్వభావం గురించి వ్యక్తీకరించడం, ఒక ప్రక్రియలో ఉన్నదానిని ఇంకొక ప్రక్రియలోకి మార్చి చేయడాన్ని 'జ్ఞానం'గా భావిస్తారు. భాష దైనందిన జీవితంలో వివిధ వ్యవహార రూపాలలో ఉంటుంది. పిల్లలు తమ భావవ్యక్తీకరణాంశాలను ఈ రూపాల్లో చేయగలగాలి. సమీక్షలు రాయడం, నివేదికలు రాయడం, పాఠం ఆధారంగా సమాచార పట్టికలు రాయడం వంటివి భాషలో జ్ఞానంగా భావించాలి.

**ఏం జరుగుతుంది? :**

సాధారణంగా తరగతి గదుల్లో విషయాలను వివరించడానికి పరిమితం అవుతున్నారు. పదాలు పరిచయం అవుతున్నవేగాని భావనల నిర్మాణం జరగడంలేదు. ఒక అంశంపట్ల లోతైన అవగాహన కల్గిఉండడం, బహుకోణాల్లో విశ్లేషించగలగడం, అవసరమైన సందర్భాలలో వినియోగించడం చేయగలగాలి. కారణాలు ఏమైనప్పటికి వీటికి ఆమడ దూరంలో ఉంటున్నాము. గత సంవత్సరం జరిగిన జాతీయ స్థాయి సాధన పరీక్షలలో తెలుగులో పిల్లల ప్రగతి 68% దాటలేదు. 75%పైన మార్కులు పొందిన విద్యార్థులు 3వ తరగతిలో 42%, 5వ తరగతిలో 22.8% మంది ఉన్నారు. దీనిని బట్టి ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. వీటిని నిశితంగా విశ్లేషిస్తే కొన్ని అంశాలు బోధపడుతాయి. సుమారు 95% మంది పిల్లలు బడికి ఇష్టంతో వస్తున్నప్పటికీ ప్రగతి 68% దాటలేదు. అట్లాగే తమ ఇంటి భాష, బడి భాష ఒకేలా ఉంది అని చెప్పిన పిల్లలు కూడా 65% మంది ఉన్నా భాషలో సరైన ప్రగతి అగుపించడంలేదు. పిల్లల భాషకు, పిల్లల ప్రగతికి అవినాభావ సంబంధం ఉందన్న సంగతి మనం గుర్తించాలి.

వీటిని దృష్టిలో పెట్టుకొని ఈ కింది అంశాలను గుర్తించవచ్చు.

- నేర్పడంలో భాషా ప్రాధాన్యాన్ని గుర్తించకపోవడం. పాఠాలు పూర్తిచేయడంపైననే దృష్టిపెట్టడం.
- పిల్లలకు భాషాసామర్థ్యాలపట్ల అభ్యాసం కల్పించకపోవడం.
- ఇంటి భాష నుండి బడి భాష లేదా సాంకేతిక భాషకు వెళ్ళడంలో అంతరం ఏర్పడడం.
- పాఠ్యాంశంలోని వివిధ విషయాలను విమర్శనాత్మక దృష్టితో చర్చ జరుపకపోవడం.
- భాషాబోధన అంటేనే పిల్లలకు భావగ్రహణ, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించడం.

ఇది జరగాలంటే భయరహిత, స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండాలి. పిల్లల భాష, సంస్కృతి, నేపథ్యం ఆధారంగానే బోధించాల్సి ఉంటుంది. ఇందుకోసం తెలుగు వాచకాల్లో ఇచ్చిన పాడుకొందాం, మాట్లాడుదాంలలోని చిత్రాలు, గేయాలు పిల్లలతో చర్చింపచేయడానికి ఉపయోగపడతాయి. అలాగే చదువుదాంలోని చిత్రాలు, పదాలు కూడా. ప్రతి పాఠంలో 'గేయం' దీనికి చెందిన చిత్రాలు ఉన్నవి. వీటిని పరిశీలింపచేసి 'వినడం - మాట్లాడడం'లోని ప్రశ్నలు ఉపయోగపతాయి. అలాగే ప్రధాన తెలుగువాచకాలు కూడా ప్రతి పాఠం చిత్రంతో ప్రారంభమవుతుంది. వీటి గురించి మాట్లాడడం, చర్చింపచేయడం ద్వారా పిల్లల్లో భావప్రసార నైపుణ్యాలు పెంపొందుతాయి.

కింది వ్యూహాలపట్ల దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అవి.

1) BICS - Basic Inter Personal Communicational Skills – పరస్పర భావ ప్రసార నైపుణ్యాలు.

2) CALP - Cognitive Academic Linguistic Proficiency – జ్ఞానాత్మక విద్యా విషయక భాషాత్మక నిపుణత.

3) Social Cultural Critical Perspective – సామాజిక, సాంస్కృతిక విమర్శనాత్మక దృక్పథం.



SCERT TELANGANA

### BICS – పరస్పర భావ ప్రసార నైపుణ్యాలు :

మన తరగతి గదులు సాధారణంగా బహుళ నేపథ్యాలకు, సంస్కృతులకు భాషలకు నిలయం. ఉపాధ్యాయుడి భాషకు, విద్యార్థుల భాషకు మధ్య అంతరం ఉంటుంది. జ్ఞాననిర్మాణంలో అర్థం చేసుకోవడం మొదటిది. ఇది భాష ద్వారానే జరుగుతుంది. పిల్లలు, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా మాట్లాడడం ప్రశ్నించడం, చర్చించడం వంటివి చేయగలగాలి. నిరంతరంగా జరిగే మౌఖిక కార్యకలాపాల ద్వార ఉపాధ్యాయుడి భాషతో పిల్లలు, పిల్లల భాషతో ఉపాధ్యాయుడు మమేకం అవుతారు. ఇది చోటుచేసుకున్న తరువాతనే పిల్లలకు అర్థం కావడం ప్రారంభం అవుతుంది. ఇందుకోసం ఉపాధ్యాయుడు తరగతి గదిలో పిల్లలను అర్థం చేసుకోవాలి. వారితో మాట్లాడించాలి. పిల్లల భాషను ఖండించడం, తప్పుపట్టడం వంటివి చేయకూడదు. పిల్లల అభ్యసనానికి వారి భాష అవరోధం కారాదు. ఇందుకు అవసరమైన భద్రతాపూరితమైన వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించాలి.

### మన పాఠ్య పుస్తకాలు :

మన భాషావాచకాల్లోని పాఠ్యాంశాలలో అనేక చిత్రాలున్నవి, సన్నివేశాలున్నవి, చర్చింపజేసే కృత్యాలున్నవి, వీటిని గురించి పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడించాలి. పిల్లలు వారి భాషలో మాట్లాడడాన్ని ప్రోత్సహించాలి. ఈ రకమైన చర్చల్లో పాల్గొనడం ద్వారా పిల్లలలో పరస్పర భావప్రసార నైపుణ్యాలు పెంపొందుతవి. తద్వారా ఇది అవగాహన పెంచి, జ్ఞాన నిర్మాణానికి దారితీస్తుంది. సాధారణ భాష నుండి సందర్భోచిత భాషను వినియోగించే స్థాయికి పిల్లలు చేరడానికి ఇది దోహదపడుతుంది.

మాతృభాషేతర మాధ్యమాల్లో చదివే విద్యార్థుల్లో పరస్పర భావ ప్రసార నైపుణ్యాలు పెంపొందించకుండా తెలుగులో భాషా సామర్థ్యాలను పెంపొందించలేము.

### CALP – జ్ఞానాత్మక విద్యా విషయక భాషానిపుణత :

పిల్లల్లో పరస్పర భావ ప్రసార నైపుణ్యాలు వృద్ధిచెందిన తరువాతనే సందర్భోచిత సంప్రదాయ భాషావినియోగంలోకి ప్రవేశిస్తారు. పిల్లలు వారి ఇంటి భాష నుండి సందర్భోచిత భాషను వినియోగించే స్థాయికి చేరాలి. ఒక అంశం గురించి ఆలోచించడం, విశ్లేషించడం, కారణాలుచెప్పడం, వివరించడం, పోల్చడం, సమీక్షలు, నివేదికలు, రాయడం వంటివి చేయగలగాలి. భాష మీద పట్టు ఉన్నప్పుడు మాత్రమే వీటిని చేయగల్గుతారు. పరస్పర భావప్రసార నైపుణ్యాలకు చెందిన కృత్యాలతో వీటిని అనుసంధానం చేయవచ్చు. ఉదా॥ ఇల్లు చిత్రం చూపించి పిల్లలతో మాట్లాడించడం. ఎవరెవరున్నారు? ఎంతమంది ఉన్నారు? ఏం చేస్తున్నారు? మీ ఇంట్లో వీరందరు ఉన్నారా? వంటి ప్రశ్నలతో మాట్లాడిస్తే, పరస్పర భావప్రసార నైపుణ్యాలను పెంపొందించవచ్చు. వీరందరిని కలిపి 'కుటుంబం' అంటారని ఒక సాంకేతిక లేదా సందర్భోచిత పదాలను పిల్లలకు పరిచయం చేయవచ్చు. ఒకసారి ఇది అర్థమైతే పిల్లలు ఆలోచించడం, వ్యక్తీకరించడం లాంటి జ్ఞానాత్మక నైపుణ్యాలు పెంపొందుతాయి.

మన పాఠ్యపుస్తకాలలోని పాఠాలు విషయాలు ఇందుకు అనుగుణంగా ఉన్నవి. ఇందుకోసం మనం ఈ క్రింది చర్యలు చేపట్టాలి :

- చిత్రాల గురించి మాట్లాడించడం.
- ఆలోచించండి ప్రశ్నలతో చర్చలు నిర్వహించడం.
- పాఠంలోని కీలక పదాలను గుర్తింపజేసి వాటి గురించి చర్చ నిర్వహింపజేయడం.
- ఆలోచింపజేసే ప్రశ్నల ద్వార జ్ఞానాత్మక నైపుణ్యాలు వృద్ధిపరచడం.

## సామాజిక సాంస్కృతిక విమర్శనాత్మక దృక్పథం :

పిల్లలు తమ పరిసరాలను విమర్శనాత్మక దృక్పథంతో పరిశీలించి ప్రశ్నించగలగాలి. పిల్లలందరి నేపథ్యాలు ప్రతిబింబించేలా మన పాఠ్యాంశాలు ఉండకపోవచ్చు. అలాగే ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన వాచకాన్ని రూపొందించడం కూడ సాధ్యంకాదు. ఒక సాధారణాంశాన్ని ఆధారంచేసుకొని తమకు అన్వయించుకోవడం లేదా విభిన్న అంశాల ఆధారంగా తమను తాము గుర్తింపజేసుకోవడం చేయగలగాలి. ఒక చిత్రం లేదా పాఠంలోని అంశం ఆధారంగా పిల్లలతో చర్చ నిర్వహించాలి. దీని గురించి మీరేమనుకుంటున్నారు? దీనితో మీరు ఏకీభవిస్తారా? ఈ స్థానంలో మీరుంటే ఏమి చేస్తారు? దీనితో పోలిస్తే మీ పరిసరాలు / ఇల్లు / ప్రాంతంకు గల భేదాలు ఏమిటి? ఇలా పిల్లలు ఆలోచించగలగాలి. దీని అంతర్యం ఏమై ఉంటుంది? ఆలోచించగలగాలి, విశ్లేషించుకోగలగాలి. ఈ విధమైన ఆలోచనల నుండి ఉద్భవించేదే విమర్శనాత్మక దృక్పథం.

## మనమేం చేయాలి?

- పాఠ్యాంశం ఏదైనా పిల్లలతో మాట్లాడించడం, చర్చలు నిర్వహించడం ద్వారా పిల్లలలో పరస్పర భావప్రసార నైపుణ్యాలు, జ్ఞానాత్మక నైపుణ్యాలు, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి.
- పిల్లల నేపథ్యాన్ని, సంస్కృతిని, భాషను అవహేళన చేయకూడదు. పిల్లలను వారి భాషలో మాట్లాడేలా ప్రోత్సహించాలి.
- జ్ఞానాత్మక నైపుణ్యాలు వృద్ధిచెందినవి అని భావించిన తరువాత పిల్లలను ఆలోచింపజేసె ప్రశ్నల ద్వార విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి.
- మన పాఠ్యపుస్తకంలో బాక్స్‌లోని ప్రశ్నలు, వినడం – మాట్లాడడం ప్రశ్నలు, స్వీయరచన ప్రశ్నలు, పాఠం ప్రారంభంలోని చిత్రాలు, వాటి కింద ఇచ్చిన ప్రశ్నలు ఉపయోగపడతాయి. వీటిని చర్చింపచేయాలి.
- చిత్రం గురించి మాట్లాడించడం.
- ప్రతి పాఠ్యాంశాన్ని బోధించడానికి ముందు వాటిలోని చిత్రాలు, ప్రశ్నలు, సన్నివేశాలు నిశితంగా గమనించాలి. ఏయే ప్రశ్నలు అడగడం ద్వారా పిల్లలలో విమర్శనాత్మక దృక్పథం పెంపొందించవచ్చో గుర్తించాలి.
- పిల్లలను చర్చలో భాగస్వామ్యం చేయాలి.
- పిల్లల భావాలను, భాషను ఖండించకుండా వాటి వెనక ఉన్న ఆంతర్యాన్ని గ్రహించాలి.
- మనం సరియైన భాషను వినియోగించడం ద్వారా సందర్భోచిత భాషాప్రయోగ సామర్థ్యం పెంపొందించవచ్చు.

## ముగింపు :

భాషాబోధన ద్వారా పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరగడానికి అనుగుణంగా భాషాసామర్థ్యాల వారీగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. విషయాన్ని చదివించడానికి, వివరించడానికి పరిమితం కాకుండా పరస్పర భావప్రసార నైపుణ్యాలు పెంపొందించడానికి, విద్యావిషయక జ్ఞానాత్మక నైపుణ్యాలు సాధించడానికి అనగా ఆలోచింపచేయడం, విశ్లేషించడం, అన్వయించడం, కారణాలు చెప్పడం, పోల్చడం వంటి వాటికి అనుగుణంగా కృత్యాలను, జట్టుపనులను నిర్వహించాలి. అవగాహన జరిగింది అని నిర్ధారించిన తరువాతనే విమర్శనాత్మక దృక్పథం పెంపొందించాలి. పాఠ్యాంశంలోని విషయాలను తమ నేపథ్యం, సంస్కృతి, స్థానిక పరిసరాలతో పోల్చుకునేలా పోలికలు, బేధాలు గుర్తించేలా, ఇందుకుగల కారణాలను అర్థంచేసుకునేలా పిల్లలందరు భాగస్వాములయ్యేల బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

# 5. పాఠ్యపుస్తకాలు - వాటి తాత్వికత - తరగతి గది అన్వయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డతర్వాత మన రాష్ట్రంలో మన సంస్కృతి, చరిత్ర, భాష, సాహిత్యం అంశాలు ప్రతిబింబించేలా తెలుగు వాచకాలను ఆధునీకరించుకున్నాం. జాతీయస్థాయి విద్యాప్రణాళిక-2005, రాష్ట్ర విద్యాప్రణాళిక-2011, నిర్బంధ ఉచిత విద్య హక్కు చట్టం-2009 ఆధారంగా భాషాసామర్థ్యాలు పెంపొందేలా వాచకాలను రూపొందించారు. వీటి ప్రత్యేకతల గురించి అవగాహన చేయదలచుకుంటే మరింత బాగా వాటిని వినియోగించి భాషాసామర్థ్యాలను పెంపొందించగలం. వీటిని గురించి తెలుసుకొందాం!

## తెలుగు వాచకాల ప్రత్యేకతలు :

**చిత్రాలు :**

- నూతనంగా రూపొందించబడిన పాఠ్యపుస్తకాలు గత పాఠ్యపుస్తకాలకంటే ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి.
- ముఖచిత్రాలు ఎంతో ఆకర్షణీయంగా పిల్లల మనస్సులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.
- తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని జీవన విధానాన్ని తెలుసుకునే చిత్రాలెన్నో వీటిలో పొందుపరచబడినవి.
- పాఠాలకు అవసరమైన చిత్రాలేకాకుండా అభ్యాసాల సాధనకు ఉపయోగపడే చిత్రాలు కూడా పొందుపరచి ఉన్నాయి.
- నిత్యజీవితంలో ఉపయోగించే సామగ్రి, వస్తువుల చిత్రాలు, పాఠ్యాంశ భావాన్ని అర్థవంతంగా చూపే చిత్రాలు, పిల్లలు సమాధానాలు ఊహించడానికి చెప్పడానికి, పునశ్చరణ చేయడానికి వీలుగా ఉన్నాయి.
- చిత్రాలను చూసి ఆనందించడమే కాకుండా సొంతంగా వేయడానికి వాటిల్లో రంగులు నింపడానికి అవకాశం కల్పించబడింది.
- చిత్రకథలు విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించి, భావాల వ్యక్తీకరణకు తోడ్పడేలా అందంగా ఆకర్షణీయంగా ఉన్నాయి.
- సామర్థ్యాలకు చెందిన అభ్యాసాలలో వాటిని సూచించే లోగోలను అభ్యాసాలవద్ద ఉంచబడినవి.
- చిత్రాల ఆధారంగా కూడా అభ్యాసాల రూపకల్పన జరిగింది.
- 1, 2, 3 తరగతుల కవర్‌పేజీ లోపలి పేజీలో సాధించాల్సిన సామర్థ్యాలు వాటికి సంబంధించిన లోగోలు, గేయం మరియు చిత్రకథను చేర్చడం జరిగింది.
- 4వ తరగతి లోపలి పేజీలో ఋతువుల గేయం. తిథుల పరిచయం. 5వ తరగతిలో తెలంగాణ ప్రముఖుల జీవిత విశేషాలు వారి చిత్రాలను పొందుపరిచారు.
- సంసిద్ధతా పాఠాల చిత్రాలు విద్యార్థుల నిత్యజీవితానికి దగ్గరగా ఉన్నవి. అందులోని వస్తువుల పేర్ల ద్వారా భాషాభివృద్ధి జరిగే విధంగా స్వేచ్ఛగా మాట్లాడే విధంగా రూపొందించబడినవి.
- గతంలో నేర్చుకున్న భాషా సామర్థ్యాలను పటిష్టం చేసుకునే విధంగా ఉన్నాయి.



SCERT TELANGANA

**భాష :**

- పిల్లలకు సులభంగా అర్థమయ్యే ఇంటి భాషలో సరళంగా పాఠాలు, కృత్యాలు ఉన్నాయి.
- వ్యవహారిక భాషను ఎక్కువగా ఉపయోగించడం జరిగింది.
- నూతన వాచకాలను ఉపాధ్యాయులంతా అవసరమైన, ఆశించిన విధంగా వినియోగించుకోవడం కోసం స్పష్టమైన సూచనలను పుస్తకంలో చేర్చారు.
- ఉపాధ్యాయులకు ఇచ్చిన సూచనలు ఉపాధ్యాయ కరదీపికలా ఉపయోగపడటమే కాకుండా, బోధనా ప్రణాళికలు రూపొందించుకొనుటకు, మూల్యాంకనం గురించి, ఉపాధ్యాయుల బాధ్యతల గురించి తెలియజేస్తాయి.
- ఏఏ మాసంలో ఏఏ పాఠాలు పూర్తిచేయాలో విషయ సూచికలో సూచించారు.
- విషయ సూచికలో పాఠం యొక్క ప్రక్రియారూపం, ఇతివృత్తం వివరాలు ఉన్నాయి.
- విషయ సూచికలో 'చదువు-ఆనందించు' విభాగానికి ఉద్దేశించిన కథలు, గేయాలు, వ్యాసాలు పువ్వు గుర్తులో ప్రత్యేకంగా గుర్తింపబడి ఉన్నాయి. ఇవి అదనపు పఠనానికి, పఠనాభిలాషను పెంపొందించడానికి ఉపయోగపడతాయి.

**పుస్తకంలో నూతనంగా చేర్చినవి :**

- పాఠశాల ప్రారంభ దినాల్లో తప్పనిసరిగా విద్యార్థులకు దాదాపు 30 నుండి 40 రోజులపాటు సంసిద్ధతా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. చదువడం, రాయడం, నేర్పడం వీటి ప్రధాన ఉద్దేశం.
- ఇందుకోసం నూతన తెలంగాణ తెలుగు పాఠ్యపుస్తకాలలో 1 నుండి 5 తరగతుల వరకు సంసిద్ధతా పాఠాలను, పునఃశ్చరణ పాఠాలను చేర్చడం జరిగింది.
- 1వ తరగతిలో పిల్లలను ఆకర్షించడానికి ముందుగా వారు బొమ్మలు చూసి మాట్లాడడం, కథ చెప్పడం వంటి అభ్యాసాలను సంసిద్ధతా పాఠాలుగా చేర్చారు.
- ఈ సన్నివేశ చిత్రాలలో తదుపరి పాఠాలలో వచ్చే కీలకపదాలు బొమ్మలన్నీ చేర్చడం జరిగింది.
- తరువాత, పాఠ్యపుస్తకంలోని 24 పాఠ్యాంశాలకు చెందిన బొమ్మలను కూడా చేర్చారు.
- పాఠం శీర్షిక వద్ద కీలక పదంతోపాటు పాఠం ద్వారా నేర్చుకోవలసిన అక్షరాలు మరియు పాఠం చిత్రం ముద్రించారు.
- 2వ తరగతిలో చిత్రకథలను సంసిద్ధతా పాఠాలుగా చేర్చారు. బొమ్మను చూసి పదాలు రాయమనడం, వర్ణమాల ఆధారంగా సరళపదాలు తయారుచేయడం మొదలగు అభ్యాసాలు చేర్చారు.
- 3, 4, 5వ తరగతులలో 10 సన్నివేశ చిత్రాలను సంసిద్ధతా పాఠాలుగా చేర్చారు. బొమ్మలు చూసి మాట్లాడడం, పదాలు రాయడం, వాక్యాలు రాయడం, చివరకు పేరా రాయడం అనే క్రమంలో సంసిద్ధతా అభ్యాసాలు చేర్చారు.

**కీలక సూత్రాలు :**

విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణానికి ప్రధాన లక్ష్యంగా విద్యా విధానం ఉండడం అవసరం అని ఎన్.సి.ఎఫ్.-2005 మనకు చెప్తున్నది. దీని ఆధారంగానే ఆర్.టి.ఇ.-2009 చట్టం రూపుదిద్దుకొంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఉన్నత ప్రమాణాలు



SCERT TELANGANA

గల విద్యను విద్యార్థులకు అందించి, తద్వారా విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణం చేయడమే రాష్ట్ర దృక్పథం. దీనికొరకై రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ నూతన పాఠ్య పుస్తకాల రూపకల్పన చేపట్టింది. పిల్లల్లో ఉండే సహజశక్తి సామర్థ్యాలు వెలుగులోకి తీసుకొచ్చేలా, వాళ్ళ ఆలోచనలు స్పష్టంగా వ్యక్తమయ్యే విధంగా నూతన తెలుగు వాచకాలను రూపొందించింది.

ఈ పాఠ్యపుస్తకాలు ఎస్.సి.ఎఫ్.-2011 మార్గదర్శకాలననుసరించి రూపొందించడం జరిగింది. సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ ప్రశంస, సామాజిక మార్పుకు దోహదపడే విధంగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తయారవడానికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలు రూపొందించడం జరిగింది. ఇలా రూపొందిన పాఠ్యపుస్తకాల తాత్వికతను అవగాహన చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ తాత్విక అవగాహన ఉన్నప్పుడే వాటి ఆచరణ సాధ్యమౌతుంది. అప్పుడే ఫలితాలు పొందగలుగుతాం.

పూర్వకాలానికి ప్రస్తుత కాలానికి భాషాబోధనలో, బోధనా పద్ధతుల్లో వచ్చిన మార్పును గురించి గత అధ్యాయంలో చర్చించాము కదా!

**తెలుగు వాచకాలు - ఉపగమాలు, భాషను సాధారణంగా రెండు విధానాలలో బోధిస్తారు :**

మొదటి విధానం : కింది నుండి పైకి (Bottom to Top) ఉపగమంలో అనగా వర్ణమాలలోని అక్షరాలను వరుస క్రమంలో నేర్పిన తర్వాత గుణింతాలను, ఆ తర్వాత ఒత్తులను నేర్పేవారు. ఆ తరువాతనే గద్య పాఠాలు, పద్య పాఠాలను బోధించడం.

అక్షరాలు

↓

పదాలు

↓

వాక్యాలు

↓

పేరా / సన్నివేశం

రెండవ విధానం : పై నుండి కిందికి అనగా వర్ణమాల క్రమంలో పాఠాలను గేయాలు / చిన్న కథలుగా తీసుకొని వాటిలో వాక్యాలను గుర్తింపచేయడం, కీలకపదం గుర్తింపచేయడం, దానిలోని అక్షరాలను పరిచయం చేయడం.

పేరా / సన్నివేశం

↓

వాక్యాలు

↓

పదాలు

↓

అక్షరాలు

సమగ్ర ఉపగమం : వాస్తవంగా పైన చర్చించిన రెండు విధానాలు కూడా పూర్తి సమగ్రమైనవికావు. ప్రతీ దానిలోను ప్రయోజనాలున్నవి, పరిమితులున్నవి. కాబట్టి రెండింటిని సమన్వయపరిచి భాషాబోధనలో వినియోగించడాన్ని సమగ్ర ఉపగమం అంటారు.

కింది నుండి పైకి నేర్పే పద్ధతి, పై నుండి కిందికి నేర్పే పద్ధతి - ఈ రెండిటినీ కలిపి సమగ్ర ఉపగమము పద్ధతిగా పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా ప్రస్తుతం మన 1, 2 తరగతుల పాఠ్యపుస్తకాలలో పాఠాల కొరకు సన్నివేశ చిత్రాలు ఉన్నవి. ఇవి విద్యార్థుల సామాజిక స్థితులను, సంస్కృతులను ప్రతిబింబించే విధంగా ఉన్నవి. ఈ చిత్రాలను చూపించి పిల్లలచే మాట్లాడింపచేస్తారు. చిత్రాలలో ఉన్న సన్నివేశాలు, సందర్భాలను తమ నిజజీవితంలోని సన్నివేశాలతో పోల్చుకొని, పిల్లలు మాట్లాడుతున్నారు. తమకు ఎదురయ్యే సన్నివేశాలకు చిత్రంలోని సన్నివేశాలకు ఉన్న తేడాలు గుర్తిస్తారు. వాటి గురించి మాట్లాడుతారు. సమాజంలో అందరి సామాజిక స్థాయిలు ఒకేలా ఉండవని తెలుసుకుంటారు. సంస్కృతులలో, ఆచార వ్యవహారాలలో ఉన్న భిన్నత్వాన్ని గౌరవించడం నేర్చుకొంటారు. కొన్ని పండుగలు / ఆచార వ్యవహారాలు ఆచరణలో ఒకేలా ఉన్నప్పటికీ వివిధ ప్రాంతాలవారు వాటిని వేరు వేరు పేర్లతో పిలుస్తారు! కొన్ని వస్తువుల పేర్లు కూడా వేరువేరుగా ఉంటాయి. ఉపాధ్యాయుడు పిల్లలచే మాట్లాడింపజేస్తూ ఆ పదజాలాన్ని వినియోగించాలి.

కృత్యాలను తరగతి గదిలో నిర్వహించడానికి వీలుగా 1, 2 తరగతుల పాఠ్యపుస్తకాలలో చిత్రాలను చూసి మాట్లాడించడానికి, పిల్లలు తమ నిజజీవిత సన్నివేశాలను, సంఘటనల గురించి చర్చించడానికి "వినండి - ఆలోచించి మాట్లాడండి" అనే సామర్థ్యం కింద ప్రశ్నలు ఉన్నవి. దీనివల్ల పరస్పర భావ ప్రసార నైపుణ్యాలు పెంపొందుతాయి. అప్పుడే పిల్లలు నేర్చుకోగలుగుతారు. వీటి ద్వారా ఉపాధ్యాయులు అభ్యసన ఫలితాలను సాధించగలరు.

**సమగ్ర ఉపగమము :**

1, 2 తరగతులలో భాషా బోధనలో పిల్లలకు మాట్లాడడం, అక్షరాలు, గుణింతాలు మొత్తం పలకడం, గుర్తించడం, చదవడం, రాయడం నేర్పుతాము. తాను చెప్పదలచుకొన్న విషయాన్ని (పదం / వాక్యం) ఎలా రాయాలి? ఎలా చదువాలి? అనేది ఈ రెండు తరగతులలో విద్యార్థి నేర్చుకొంటాడు.

ఇవి నేర్పడానికి కింది నుండి పైకి (Bottom to Top), పై నుండి కిందికి (Top to Bottom) ఈ రెండూ కలిపి సమగ్ర ఉపగమమం అనే పద్ధతులు ఉపయోగిస్తాం అని తెలుసుకొన్నాం కదా!

1, 2 తరగతులలోని ఒక పాఠాన్ని పరిశీలించినట్లయితే ఈ పద్ధతులు ఎలా అన్వయింపబడినవో సామాజిక, సాంస్కృతిక, విమర్శనాత్మక దృక్పథాలు ఎలా తెలుపబడినవో తెలుస్తుంది.

ఉదా : 1వ తరగతిలోని 'ఆట' అనే పాఠం తీసుకొంటే

- ఈ పాఠం చిత్రంలో పిల్లలు రకరకాల ఆటలు ఆడుతున్నారు. ఇవి తెలంగాణ ప్రాంతంలో ఆడే ముఖ్యమైన ఆటలు.
- చిత్రాన్ని చూసి పిల్లలచే మాట్లాడించడానికి కొన్ని ప్రశ్నలున్నాయి.


ఆ ప్రశ్నల ద్వారా వారు వారి ప్రాంతాలలో ఈ ఆటలను ఏమంటారో తెలుస్తుంది. వారు స్థానికంగా ఆడుకునే ఆటల గురించి తెలుస్తుంది. విద్యార్థి తన ప్రాంతపు భాష, పదజాలం ఉపయోగించి మాట్లాడడంవల్ల ఆ తరగతిలోని పిల్లలందరికి పదజాలాభివృద్ధి జరుగుతుంది. తన సొంత భాషను వాడడంవల్ల ఆత్మస్థైర్యం కలుగుతుంది. మిగతా విద్యార్థులు కూడా ఆ ఆటలు, భాష తెలుసుకుంటారు. వారు ఆడుకునే ఆటలతో పోల్చుకుంటారు. ఈ విధంగా బహుళనేపథ్యాలు కలిగిన విద్యార్థుల మధ్య సామాజిక - సాంస్కృతిక బదలాయింపు జరగడం విమర్శనాత్మక దృక్పథంలో ఆలోచించడం జరుగుతుంది.



SCERT TELANGANA

- పాఠాన్ని పరిశీలించినట్లయితే... పాఠాన్ని గేయంగా పరిచయం చేశారు.
- పూర్తి గేయాన్ని పిల్లలచే పాడించడం. అభినయం చేయించడం జరుగుతుంది. గేయాన్ని పరిచయం చేసిన తరువాత.
- అందులోని వాక్యాలను గుర్తింపజేయడం (గ్రాఫికల్ రీడింగ్) చేస్తాము.
- వాటిలో నుండి కీలక పదాన్ని (ఆట) గుర్తింపచేస్తారు.
- పదం ద్వారా అక్షరాలను, ధ్వనులను పరిచయంచేసి వాటిని వర్ణమాల చార్టులో గుర్తింపచేస్తాము.
- తరువాత ఇంతకు మునుపు పాఠాలలో నేర్చుకొన్న అక్షరాలు మరియు ఈ పాఠంలో నేర్చుకొన్న అక్షరాలతో కలిపి కొత్త పదాలు తయారుచేయిస్తాము.
- ఈ పదాలతో వాక్యాలు తయారుచేయిస్తాము.

ఇదే సమగ్ర ఉపగమ పద్ధతి. పై నుండి కిందికి, కింది నుండి పైకి నేర్పే పద్ధతులు కలిపి సమగ్ర ఉపగమ పద్ధతిలో బోధించే విధంగా మన పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు ఉన్నాయి.




**3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకాలు - సామాజిక - సాంస్కృతిక - విమర్శనాత్మక దృక్పథం - వివరణ :**

1, 2 తరగతులలో ఎలా (లిపి) రాయాలో నేర్చుకొంటారు. 3, 4, 5 తరగతులలో ఏం రాయాలి? ఎందుకు రాయాలి? ఎట్లా రాయాలి? ఏం మాట్లాడాలి? ఎలా మట్లాడాలి? ఎందుకు మాట్లాడాలి? అనేవి నేర్చుకుంటారు. ఇందుకొరకు

1) వినడం - ఆలోచించి మాట్లాడడం 2) ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని చెప్పడం 3) ఆలోచించి సొంతంగా రాయడం 4) సృజనాత్మకత 5) పదజాలాభివృద్ధి 6) భాషను గురించి తెలుసుకొందాం! (వ్యాకరణాంశాలు)

అనే సామర్థ్యాలను నిర్ధారించుకోవడం జరిగింది. ఈ సామర్థ్యాలలోని అభ్యసన ఫలితాలను సాధించడం కోసం పాఠాలను రకరకాల ఇతివృత్తాల నుండి వివిధ ప్రక్రియా రూపాలలో, ఎంపికచేయడం జరిగింది. తద్వారా నిత్య జీవితంలో భాషను సమగ్రంగా, సమర్థవంతంగా ఉపయోగించగలిగేలా చేయడం జరుగుతుంది. అంతే కాకుండా ఈ పాఠాల బోధన ద్వారా విద్యార్థులలో సామాజిక - సాంస్కృతిక, సామాజిక - విమర్శనాత్మక ధోరణిని కూడా పెంపొందింపజేస్తాము. ఈ పాఠాల కొరకు ఎంపికచేసిన ఇతివృత్తాలు రకరకాల సంస్కృతులను, సామాజిక స్పృహను ప్రతిబింబించేలా ఉన్నవి. ఆ పాఠాల ఉన్ముఖీకరణ చిత్రాలు, పాఠం చిత్రాలు కూడా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, సామాజిక స్థితి గతులు, వేషధారణలు తెలిపేవిధంగా ఉన్నవి.

తరగతిలో ఉండే వివిధ నేపథ్యాలకు చెందిన పిల్లలు తమ సామాజిక స్థితిగతులను, సంస్కృతి సంప్రదాయాలను, వేషధారణను పాఠ్యపుస్తకంలోని చిత్రాలతో పోల్చుకుంటారు. భిన్న సంస్కృతుల మేళవింపుతో సాంస్కృతిక బదలాయింపు

SCERT TELANGANA

జరుగుతుంది. తనకు తెలిసిన తాను ఆచరించే ఆచార వ్యవహారాలకు సంస్కృతి సంప్రదాయాలకు, తరగతిలో (పాఠం ద్వారా) తెలుసుకొన్న నూతన విషయాలకుగల భేదాలు తెలుసుకొంటారు. అలా భేదంగా ఉండడానికి గల కారణాలు ఆలోచిస్తాడు. విశ్లేషణాత్మకంగా ఆలోచించి ఒక నిర్ధారణకు వస్తారు.

ఉదాహరణకు : 5వ తరగతి తెలుగు వాచకంలోని 'యాదగిరి గుట్ట' పాఠం పరిశీలిద్దాం!

### ఉన్ముఖీకరణ చిత్రం :

ఈ చిత్రం చూపించి ప్రశ్నించినప్పుడు గుడికి వెళ్ళే వాళ్ళు మాత్రం సమాధానం చెప్తారు. మరి గుడులకు వెళ్ళని పిల్లలు కూడా తరగతిలో ఉంటారు. వీరు చెప్పే సమాధానాలు వేరుగా ఉంటాయి. ఈ సమాధానాలలో గుడి, మసీదు, చర్చి, గురుద్వార... మొదలైనవి ఉంటాయి. ఇప్పుడు వీటి గురించి పిల్లలచేత మాట్లాడించాలి. అప్పుడు పిల్లలు తమకు తెలిసిన ప్రార్థనా స్థలాల గురించి అక్కడి విశేషాల గురించి చెప్తారు. ఇలా చెప్పించడంవల్ల భిన్న నేపథ్యాలు కలిగిన సంస్కృతుల గురించి తరగతిలోని అందరు పిల్లలు తెలుసుకొంటారు. పదజాలాన్ని అర్థం చేసుకొంటారు. పిల్లలు తమ సొంత భాషలో స్వేచ్ఛగా మాట్లాడడంవల్ల బోధన సమర్థవంతంగా జరిగి అభ్యసన ఫలితాలు సాధిస్తాము. పిల్లలలో భావ ప్రసార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

- పాఠ్యాంశంలోకి వెళ్ళినప్పుడు కూడా పాఠం బోధించేటప్పుడు స్థలపురాణం ప్రస్తావనలో తరగతిలోని అందరు పిల్లలచే వారు చూసిన పుణ్యక్షేత్రాల గురించి తెలిసినంతవరకు చర్చిస్తూ మాట్లాడింపజేయాలి.

### తరగతి గది అన్వయం : ఉపాధ్యాయుని పాత్ర

తరగతి గదిలో సామాజిక – సాంస్కృతిక, సామాజిక – విమర్శనాత్మక దృక్పథంతో పాఠ్యబోధన జరగాలంటే ఉపాధ్యాయుడు బోధన జరిపే ప్రాంతం గురించి, ఆ బడికి వచ్చే పిల్లల నేపథ్యం గురించి, అక్కడి భాష గురించి, వారి సామాజిక పరిస్థితుల గురించి, అక్కడి సంస్కృతీ సాంప్రదాయాల గురించి తెలుసుకోవాలి. విద్యార్థులతో స్నేహంగా ఉండి వారితో స్వేచ్ఛగా మాట్లాడాలి. మాట్లాడింపచేయాలి. వారి భాషను స్వీకరిస్తూ దాని ద్వారా భాషను నేర్పగలగాలి. పిల్లలతో చర్చిస్తూ వారిలో ఆలోచన రేకెత్తించే ప్రశ్నల ద్వారా వారి ఆచారవ్యవహారాల మధ్య పోలికలు, బేధాలు తెలుసుకొనేలా చేయాలి. ఉపాధ్యాయుడు వాటి గురించి అధ్యయనం చేసి అదనపు సమాచారాన్ని సేకరించాలి. పూర్తి సంసిద్ధతతో పాఠ్యబోధనకు ఉపక్రమించాలి.

పాఠ్యపుస్తకాల నేపథ్యాన్ని, తాత్త్వికతను అర్థంచేసుకోవాలి. ప్రారంభంలో ఇచ్చిన 'ఉపాధ్యాయులకు సూచనలు' చదువాలి. వీటి ఆధారంగా అధ్యాయంలో చర్చించిన అంశాలు, అనుభవాలతో అర్థవంతమైన బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. పరస్పర భావప్రసార నైపుణ్యాలను పెంపొందించాలి. సామాజిక, సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకొని పాఠ్యాంశాలతో అన్వయించి బోధించాలి. ఇందుకోసం చర్చలు, కృత్యాలను నిర్వహించి భాషాభ్యసనను అర్థవంతంచేయాలి.

# 6. పఠనం - పఠన వ్యూహాలు - తరగతి గది అన్వయం

## ఉపోద్ఘాతం :-

చదువటం ఒక సాధారణ నైపుణ్యం కాదు. చిన్నపిల్లలకు బోధించే ఉపాధ్యాయులు ఎదుర్కొనే సవాళ్ళలో చదువడమనేది అన్నింటికంటే క్లిష్టమైనది, కష్టమైనది. అనేక నైపుణ్యాలు, అవగాహన సామర్థ్యాలు దీనికి అవసరమవుతాయి. చదువటం నేర్పడానికి ఏకైక నిర్దిష్టమైన పద్ధతి అంటూ లేదు. ప్రతీ పద్ధతికీ ఏవో పరిమితులు ఉన్నాయి. నిర్దిష్ట పద్ధతుల్లో ఖచ్చితంగా ఏం చేయాలన్నది ఉపాధ్యాయునికి చెప్పగల వారెవరూ లేరూ. అది ఉపాధ్యాయుని ఉత్సాహం మీదే ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే పిల్లవాడి భవిష్య జీవితం చదువటం మీద ఎంతగానో ఆధారపడి ఉంటుంది. ఒకసారి మనం పఠనాన్ని, పుస్తకాన్ని పిల్లవాడికి విజయవంతంగా పరిచయం చేసిన తర్వాత, పిల్లవాడు సాధించే విజయాలకు అంతం అనేది ఉండదు. ఈ విషయంలో మన చుట్టూ ఉన్న అసంఖ్యాక వైఫల్యాల గురించి మనం ఒక్కసారి మననం చేసుకోవాలి. లక్షలాది మంది పిల్లలు ప్రతీ సంవత్సరం చదువటం నేర్చుకుంటున్నారు. అయితే వీరిలో చాలా మంది ఈ చదివే నైపుణ్యాన్ని శాశ్వతంగా సాధించటం లేదు. చాలా మంది పిల్లలు పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు సరిపడేంత మాత్రమే నేర్చుకోగల్గుతున్నారు. కానీ పుస్తకం చదువటంలో ఆసక్తిని పెంపొందించుకోవటంలేదు. చాలా మంది బాగా చదువుతున్నాకానీ, వారు అర్థం చేసుకునేది అత్యల్పం. పిల్లవాడికి చదువడం నేర్పడంలోని లోపాలే ఈ వైఫల్యాలకు ప్రధాన కారణం. పిల్లవాడి సర్వతోముఖాభివృద్ధికి మంచి పఠన నైపుణ్యం అవసరమని ఉపాధ్యాయులు గ్రహించాలి. మరి 'మంచి పఠన నైపుణ్యాలు ఏమిటి? వాటిని ఎలా అభివృద్ధి చేయాలి? అనే విషయానికి వస్తే... మంచి పఠన నైపుణ్యాలు అంటే పిల్లవాడు

లిఖిత, ముద్రిత భాషకు అర్థాన్ని అన్వయించగలిగినట్లయితే అప్పుడు చదవటం అనే ప్రక్రియ సఫలీకృతం అయినట్లుగా భావించాలి. పిల్లవాడు చదివిందాన్ని అర్థం చేసుకోలేకపోయిన, తనకంతకుముందు తెలిసిన విషయంతో అన్వయం చేసుకోలేకపోయినా అతని పఠం ఉత్తమమని చెప్పడానికి వీల్లేదు.

## పిల్లలు చదువటంలో ఎందుకు వైఫల్యం చెందుతారు?

ఒకప్పుడు ప్రాథమిక పాఠశాలల్లోని క్రింది తరగతుల్లో యాంత్రికంగా జరుగుతున్న అనేక విషయాలు మనకు సంతృప్తి కలిగించవు. ఎందుకంటే ఇదివరకు మనం మొదట వర్ణమాలను నేర్పించిన తర్వాత సరళపదాలు, మహాప్రాణాక్షర పదాలు, గుణింతపదాలు, ద్విత్వ పదాలు, సంయుక్త అక్షర పదాలు, సంశ్లేష అక్షరపదాలు నేర్పించేవారు. తర్వాత పదాలతో కూర్చిన వాక్యాలు నేర్పించి, చిన్న చిన్న పుస్తకాలు తర్వాత పెద్ద పుస్తకాల పరిచయం చేస్తాం. ఎందుకంటే చివరకు ఏ పుస్తకమయినా చదివే సామర్థ్యాన్ని పిల్లవాడు పొందుతాడు అనే భావన! ఇదొక పద్ధతి. మరొక పద్ధతిలో వర్ణమాలను వల్లెవేయటం, కథను ఉన్నది ఉన్నట్లుగా అప్పజెప్పటం, పదాలను వల్లెవేయటం చేస్తున్నాము. కానీ ఇవి తృప్తికరమయిన పఠన బోధనా పద్ధతులు కావు. ఇలా చేయటంవల్ల పిల్లలు లిఖిత భాషకు అర్థాన్ని గ్రహించలేరు. భాషలోని భావాన్ని తెలుసుకోలేరు. వారిలో సహజంగా ఏర్పడే 'భావన'లు ఏర్పడవు.



SCERT TELANGANA

మరి ఈ సమస్యను ఎదుర్కోవడం ఎలా...? తొలిదశలో చదువటం అర్థవంతం చేయటం ఎలా...? అయితే కార్డులు, చార్టులు, కొయ్య అక్షరాలతో కాక పుస్తకాలతోనే మన పనిని ప్రారంభించటం మంచిది. పిల్లలు పుస్తకాలు చదువగలిగేటట్లు చేయడమే మన అంతిమ లక్ష్యం కదా. చార్టులు, కార్డులు మొదలగునవి ఆయా సందర్భాలలో కొంత ఉపయోగపడవచ్చు. ఒక పుస్తకం చదువగలగడం ఇచ్చిన ఆత్మసంతృప్తి వీటిపై (చార్టు) ఎంత అధికారం సంపాదించినప్పటికీ పిల్లలు పొందలేరు.

- పిల్లలు చదువటంలో వైఫల్యం చెందడానికి ప్రధాన కారణాలు తెలుసుకుందాం.

**1) వర్ణాల ఆకారాలు - వాటితో జతపడి ఉన్న ధ్వనులు :**

పిల్లలు అక్షరాలకు - వాటి ధ్వనులకు మధ్య సంబంధాన్ని గుర్తించలేకపోవటంవల్ల చదువలేకపోతున్నారు.

ఉదా॥ 'క' అనే అక్షరం పలికినప్పుడు ఆ 'అక్షర ఆకారాన్ని' దాని ధ్వనితో సంబంధాన్ని ఏర్పరుచుకోలేకపోవటంవల్ల పిల్లలు చదువటంలో వెనకబడిపోతున్నారు.

| 'క' శబ్దం - 'క' అక్షరం ఊహించాలి. |
|---|

**2) వాక్య నిర్మాణానికి సంబంధించిన ఆధారాలు / వాక్యంలో పదక్రమం :**

ఒక వాక్యాన్ని విద్యార్థి చదువుతున్నప్పుడు ఆ వాక్యంలోని పదాల అర్థాలు, వాటికి సంబంధించిన భావనలు పూర్తిగా తెలిసినప్పుడు మాత్రమే పఠనం అర్థవంతమవుతుంది. చదివే క్రమంలో వాక్యంలో వచ్చే తర్వాత పదాన్ని ఊహించగల్గుతారు. చదువటంలో నైపుణ్యాలు సాధిస్తారు. అందువల్ల పిల్లల్లో భావనలు ఏర్పడటం అనేది చదువటంలో అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

| నేను ____________________ వెళ్ళాను. |
|---|

పై వాక్యంలో నేను, వెళ్ళాను అనే భావనలు పిల్లల్లో కల్గినప్పుడు మాత్రమే వాళ్ళు పై వాక్యాన్ని పూరించగలుగుతారు. పూరించడం వాళ్ళు తమ తమ అనుభవాల ద్వారా ఏర్పడిన భావనలతో ముడిపడి ఉంటుంది. అందరు పిల్లలు ఒకే రకంగా పూరించాలని ఏమీలేదు. ఆయా సందర్భాలలో వారు వారు పొందిన అనుభవాలనుబట్టి, వారు ఏర్పరచుకున్న భావనలనుబట్టి వాక్యాలను పూరిస్తారు. వాక్యాలు ఊహించటంలో పిల్లలకు ఎటువంటి నిబంధనలు లేవు.

నేను ఊరికి వెళ్ళాను.
నేను గుడికి వెళ్ళాను.
నేను సినిమాకు వెళ్ళాను.

ఈ క్రమంలోనె పిల్లలు చదివేటప్పుడు తర్వాత పదాన్ని ఊహించటం జరుగుతుంది. ఊహించటం ఎంత ఖచ్చితంగా చేయగల్గితే వారు అంత ధారాళంగా చదువుతారు.

SCERT TELANGANA

**3) పదజాలం :**

పిల్లలకు వాక్యంలోని పదాల అర్థాలు తెలిసినప్పుడే అర్థవంతంగా చదువగల్గుతారు.

| |
|---|
| రాముడు అడవికి ________________ |

పై వాక్యాలో పిల్లలకు రాముడు, అడవి అనే పదాలకు అర్థం తెలిసినట్లయితే తర్వాత పదాన్ని తనకు తానుగా ఊహించి చెప్పగల్గుతాడు.

| |
|---|
| **– రాముడు అడవికి వెళ్ళాడు.** |

## చదువటం ఎలా ప్రారంభించాలి?

ఉపాధ్యాయుడు పిల్లలకు వ్యక్తిగతంగాగానీ, ఉమ్మడిగాకానీ చదువటం నేర్పించటం మంచిది. సుమారు కొంచెం అటూఇటుగా అయిదేళ్ళ వయసులో పఠనాభ్యసనం ప్రారంభించవచ్చు. ఒక తరగతిలోని పిల్లలంతా ఒకే సమయంలో పఠనం ప్రారంభించడంకానీ, ఒకే వేగంలో పురోగతి సాధించడంగాని జరగదన్న విషయాన్ని మనం బాగా గుర్తుంచుకోవాలి. కొంత మంది పిల్లలు అయిదేళ్ళ వయసులోనే మంచి ఆసక్తిని, సామర్థ్యాన్ని చూపించి ఏడేళ్ళ వయసువచ్చేప్పటికి పఠన నైపుణ్యాల మీద అధికారం సంపాదించవచ్చు. కొంత మంది పిల్లలకు ఎనిమిదేళ్ళ వరకూ కూడా అది కష్టంగా ఉండవచ్చు. ఈ తేడాను ఉపాధ్యాయుడు పట్టించుకోకూడదు. అతను ఆలోచించవలసిందల్లా ఒక్కొక్క పిల్లవాడు ఎట్లా పురోగతిని సాధిస్తున్నాడనే. పిల్లలు చదువటంలో ఏ సందర్భంలో పొరపాట్లు చేస్తున్నారో తెలుసుకొని వాటిని సరిదిద్దాలి.

ముందుగా ఉపాధ్యాయుడు పిల్లలను పుస్తక ప్రపంచంలోకి తీసుకుని వెళ్ళాలి. పిల్లలందరికి పుస్తకం నా సొంతం అనే భావన కల్పించాలి. ఆ విశాలమైన భావనలో మెల్లగా చిన్న చిన్న భావాలు పరిచయం అవుతాయి. పుస్తకాల్లో కథలు దాక్కుని ఉంటాయని, వాటిలో మళ్ళీ పదాలు ఉంటాయనీ, ఆ పదాలను నేర్చుకుంటే కథల్లోని రహస్యం తెలిసిపోతుందని, ఈ కథలను ఇతరులకు చెప్పవచ్చుని... ఇలా ఎన్నో విషయాలకు సంబంధించిన ప్రాథమిక భావనలు పిల్లల మనసుల్లో ఏర్పడతాయి.

పిల్లలకు చదువటం నేర్పించుటకు మనం అభినయ గేయాలుగానీ, చిన్న కథలనుగానీ ఎంపికచేసుకోవచ్చు. వాటిని చార్టుమీదగానీ, నల్లబల్లమీదగానీ వ్రాయవలెను. రాసిన దానిని పిల్లలకు అర్థమగునట్లు స్పష్టంగా, అభినయంచేస్తూ, హావభావాలతో పాడి వినిపించాలి. తర్వాత మనం పాడుతూ పిల్లలతో అభినయం చేయించాలి. పిల్లలు అభినయంచేసే సందర్భంలో అందులోని భావాన్ని గ్రహించగల్గుతారు. గేయం చెప్పడం పూర్తి అయిన తర్వాత గేయంలోని కీలకమైన పదాలను, విద్యార్థులను గుర్తించి, చదువమనాలి. అలా ఉపాధ్యాయుడు పదాన్ని గుర్తించమన్నప్పుడు గేయానికి, అందులోని పదానికి మధ్య సంబంధాన్ని ఊహించి పదాలను గుర్తిస్తారు. పదాలలోని అక్షరాలకు, ధ్వనులకు మధ్య సంబంధాన్ని ఏర్పరచుకుంటారు. ఇక్కడ పిల్లలు పదాలు చదువడానికి వారికి అక్షరాల పరిచయం లేకున్న గుర్తించగల్గుతారు, చదువగలుగుతారు.

ఉదా॥ **తబల**

తకధినతోం... తకధినతోం

చప్పుడు చేసే తబల

తరికిట తోం తరికిట తోం

తాళం వేసే తబల

ధం ధం ధం ధం

ధం ధం అంటూ

దరువులు వేసే తబల

ఆటకు తబల

పాటకు తబల

దేవుడి గుడిలో

భజనకు తబల

తకధినతోం తకధినతోం

చప్పుడు చేసే తబల

- పిల్లలు అభినయం ద్వారా గేయాలలోని పదాలు తెలుసుకుంటారు. 'తబల' పదాన్ని పదం పూర్వం పరిచయం లేకపోయినా గేయంలో 'తబల' పదాన్ని గుర్తించగల్గుతారు.
- 'తబల' పదంలోని **ధ్వనులకు - లిపికి** మధ్య సంబంధాన్ని ఏర్పరుచుకొని చదువగల్గుతారు.
- 'తబల' పదానికి, అర్థం తెలుసుకొని గేయంలోని వాక్యాల ఖాళీలను పూరిస్తూ చదువగల్గుతారు.

  ఉదా॥ తకధినితోం - తకధినతోం

  చప్పుడు చేసే ____________ అనగానే

  పిల్లలు 'తబల' అని ఊహించి చెప్పగల్గుతారు.
- ఈ విధంగా పిల్లలకు ప్రారంభదశలో చదువటం నేర్పించవచ్చు.

## పఠనావగాహన వ్యూహాలు

పఠనావగాహన సామర్థ్యాన్ని పిల్లల్లో పెంపొందించడానికి ఉపాధ్యాయుడు అనేక వ్యూహాలు ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. దానిలో భాగంగా ఉపాధ్యాయుడు పిల్లల స్థాయిని దృష్టియందు ఉంచుకొని, అంచెలంచెలుగా భావనలు పెంపొందించాలి. పఠన నైపుణ్యాల అభ్యసనాన్ని ఆసక్తికరమయిన, ఆనందదాయకమైన ప్రక్రియగా తీర్చిదిద్దడానికి కొన్ని వ్యూహాలను ఉపాధ్యాయుడు ముందే రూపొందించుకోవాలి. వాటిలో కొన్నింటిని క్రింద పొందుపరచడమైనది. ఇక్కడ వర్ణించినట్లుగా ఇవి విభిన్న అభివృద్ధి దశలకు చెందినవి కానీ కొద్ది ప్రయత్నంలో మార్పులతో ఏ వయసువారైనా, ఏ స్థాయి వారైనా వీటిని ఉపయోగించవచ్చు.

పిల్లల్లో పఠనావగాహన పెంపొందిచడంలో ఇమిడి ఉన్న ముఖ్య వ్యూహాలు.

### అ) (ఉచ్ఛారణ దోషాలు లేకుండా) అక్షరాలను, పదాలను స్పష్టంగా పలుకుట :

(ధ్వని) అక్షరానికి - దాని లిపికి సంబంధాన్ని ఏర్పరచుకున్నప్పుడే పిల్లలు ఆ అక్షరాలను దోషాలు లేకుండా చదువుతారు. అందువల్ల ఉపాధ్యాయుడు 'అక్షరానికి - లిపికి' జతచేస్తూ వారిలో సరైన అవగాహన కల్పించాలి. అలా కల్పించకపోయినట్లయితే చదువడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు.

అక్షరాలను, పదాలను పరిచయం చేస్తున్న క్రమంలో ఈ వ్యూహాన్ని ఉపాధ్యాయుడు తప్పకుండా పాటించవలసి ఉంటుంది. విద్యార్థుల స్థాయిని దృష్టియందు ఉంచుకొని అక్షరాలు, పదాలపట్ల ఒక క్రమపద్ధతిలో నేర్పించాలి.

### ఆ) వ్యూహం - పదజాలాభివృద్ధి :

పదానికి, అర్థానికి మధ్యగల సంబంధం తెలిసినప్పుడే పిల్లవాడు ఒక భావన ఏర్పాటుచేసుకుంటాడు.

SCERT TELANGANA

ఉదా॥ టీచర్ పాఠం చెప్తున్నప్పుడు 'అడవి' అనే పదం వచ్చిందనుకోండి, భాషోపాధ్యాయుడిగా ఆ పదం (అడవి) గురించి పూర్తి అవగాహన కల్పించాలి. అడవి గురించి అవగాహన కల్గినప్పుడే 'అడవి' భావన విద్యార్థులలో ఏర్పడుతుంది. 'భావన' అభివృద్ధి చెందినప్పుడే పదజాలాభివృద్ధి జరుగుతుంది. తద్వారా పఠనాభివృద్ధి - పిల్లల్లో పెంపొందించవచ్చు.

**ఇ) చదివిన దాన్ని అర్థంచేసుకోవటం :**

ఎ) పఠనం యొక్క అంతిమ లక్ష్యం, 'చదివిన దాన్ని అర్థం చేసుకోవటం'.

బి) అభినయ గేయాన్ని గానీ, చిన్న కథను గానీ, వ్యాసాన్ని గానీ, పద్యాన్ని గానీ... పిల్లవాడు ఏది చదివినప్పటికిని దానిలోని భావాన్ని గ్రహించినప్పుడే చదువటం అనే ప్రక్రియ విజయవంతమౌతుంది. అందుకోసం ఉపాధ్యాయుడు పిల్లల్లో సరైన 'భావన'ను ఏర్పరచాలి.

**ఈ) పఠనావగాహన వ్యూహాలు :**

- పిల్లలను పఠనం వైపుకు మళ్ళించడానికి / పఠనం పట్ల ఆసక్తి పెంపొందించడానికి ఉపాధ్యాయుడు పాటించే పద్ధతులనే పఠనావగాహన వ్యూహాలు అంటారు.
- ఇవి పిల్లలను చదువటంలో నిమగ్నం చేయడానికి, చదివింది అర్థం చేసుకోవడానికి, ఆసక్తికరంగా చదువడానికి ఈ వ్యూహాలు ఎంతో ఉపయోగపడతాయి. ఇవి మూడు రకాలుగా ఉంటాయి. పఠన పూర్వక వ్యూహాలు, పఠనావగాహన వ్యూహాలు, పఠనానంతర వ్యూహాలు అని మూడు రకాలుగా ఉంటాయి. అందులో పఠనావగాహన వ్యూహాల గురించి మనం నేర్చుకుందాం.

**1) చదవిన దాని నుండి అర్థాన్ని గ్రహించుట :**

ఎ) పాఠంలోని విషయాన్ని - పరిసరాలతో పోల్చడం.

(Text - Content)

బి) పాఠంలోని విషయాన్ని - తరువాత విషయంతో పోల్చుట.

(Text - Text)

సి) పాఠంలోని విషయాన్ని - పరిసరాలకు అన్వయించుట.

(Text - World)

**2) ప్రశంసాపూర్వక పని :**

ఎ) పాఠంలోని అంశాన్ని సమర్థించటం.

బి) సమర్థిస్తే ఎందుకు సమర్థిస్తున్నారు కారణాలు - ఉదాహరణలు.

సి) విభేదిస్తే - ఎందుకు విభేదిస్తున్నారు.

**3) సృష్టించటం / ప్రక్రియలు మార్చి చెప్పటం :**

ఎ) పాఠంలోని కథ విని, అలాంటి ఇంకో కథ చెప్పమనటం.

బి) పాఠంలోని కథను - వేరే రూపంలోకి మార్చి చెప్పటం.

సి) కథను - పొడిగించి చెప్పటం.

డి) గేయాన్ని – కథ రూపంలోకి మార్చటం.

ఇ) కథను – గేయ రూపంలోకి

ఎఫ్) కథను – నాటకీకరణ

జి) కథను – ఏకపాత్రాభినయం

**4) అర్థాన్ని రాబట్టుట / Drawing Meaning :**

ఎ) పాఠంలోని విషయాన్ని ప్రశ్నించుట.

బి) విషయానికి సారాంశం రాయుట.

సి) పాఠంలోని ప్రధాన ఇతివృత్తం చెప్పించడం.

డి) పాఠాన్ని విభిన్న కోణాల్లో ఆలోచింపజేయడం.

ఇ) పాఠాన్ని – బొమ్మల రూపంలో చెప్పడం

ఎఫ్) Mind Maping / Concept Maping / భావన చిత్రం / మనో చిత్రం

జి) Brain Stroming / మేథోమథనం

**ఉ) తరగతి గదికి వ్యూహాలను అన్వయించడం :**

**1) చదివిన దాని నుండి అర్థాన్ని గ్రహించటం :**

ఎ) పాఠాన్ని పరిసరాలకు అన్వయించటం – 4వ తరగతిలోని వినాయకచవితి పాఠాన్ని చెప్పినప్పుడు ఆ పండుగను మీ ఊరిలో ఎలా జరుపుకుంటావు అని ప్రశ్నించడం.

బి) పాఠంలోని తరువాత అంశానికి అన్వయించడం – ఇదే వినాయకచవితి పాఠాన్ని చెప్పిన తర్వాత పిల్లవాన్ని 'దసరా పండగ' ఎలా జరుపుకుంటావు అని అడగడం.

సి) పాఠాన్ని ప్రపంచానికి అన్వయించడం – అసలు పండుగలు ఎందుకు జరుపుకోవాలి?

**2) ప్రశంసాపూర్వక పనులు చేయించడం :**

ఎ) పాఠంలోని అంశాన్ని ప్రశంసించడం – '4వ తరగతి' పాఠంలోని 'చిన్నారికల' పాఠాన్ని తీసుకుంటె ప్లాస్టిక్ సంచులు వాడకూడదు" అనే అంశాన్ని నువ్వు సమర్థిస్తున్నావా అని అడగడం.

బి) సమర్థిస్తే ఎందుకు సమర్థిస్తున్నావో వివరించమనాలి.

సి) ఒకవేళ 'ప్లాస్టిక్ సంచులు వాడకూడదు' అంశాన్ని విభేదిస్తూ నువ్వు ఎందుకు విభేదిస్తున్నావ్ అని పిల్లలను అడగడం / చెప్పించడం.

**3) సృష్టించటం / ప్రక్రియలు మార్చి చెప్పడం :**

ఎ) పాఠంలోని కథవిని – అలాంటి ఇంకో కథ చెప్పమనడం.

మూడవ తరగతిలోని 'చెట్టుకోరిక' పాఠం చెప్పిన తర్వాత ఇట్లాంటి ఇంకో కథ చెప్పమని పిల్లలను అడగడం.

బి) కథను పొడిగించి చెప్పమనడం.

చెట్టు కోరిక కథను పొడిగించి చెప్పమనాలి.

సి) చెట్టు కోరిక కథను గేయరూపంలో చెప్పమనడం.

డి) చెట్టు కోరిక కథను ఏకపాత్రాభినయం చేస్తూ చెప్పమనడం.

ఇ) చెట్టు కోరిక కథను నాటకీకరణగా చేసి చెప్పమనడం.

**4) అర్థాన్ని రాబట్టుట :**

ఎ) పాఠంలోని విషయాన్ని ప్రశ్నించుట.

'చెట్టు కోరిక' పాఠం విన్న తర్వాత పిల్లలను పాఠానికి సంబంధించిన ప్రశ్నలను తయారుచేయమనాలి.

బి) విషయంలోని సారాంశాన్ని గ్రహిస్తాడు.

'నేను గోదావరి' పాఠంలో సారాంశాన్ని తెలుసుకుంటాడు. గోదావరి ఒక నది అని, దాని పరివాహక ప్రాంతాలను, వాటి ఆనకట్టల గురించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని, దానిలోని సారాంశాన్ని గ్రహిస్తాడు.

సి) విభిన్న కోణాల్లో ఆలోచిస్తాడు.

'నేను గోదావరి' పాఠాన్ని గురించి వివిధ కోణాల్లో ఆలోచిస్తాడు.


'గోదావరి' ఒక నది కదా - ఇంకా ఏమైనా నదులు ఉన్నాయా? మరి ఉంటె అవి ఎక్కడ పుడతాయి, ఎలా ప్రవహిస్తాయి, ... మొదలయిన అంశాలను వివిధ కోణాల్లో ఆలోచిస్తాడు.

డి) Text - బొమ్మలు గీయటం.

'4వ తరగతి' 'ఎలుక విందు' పాఠంలోని సన్నివేశాలకు తగిన బొమ్మలు గీస్తారు.

ఇ) Mind Maping

'నేను గోదావరి' పాఠానికి తగిన Mind Maping చేయటం.



ఎఫ్) మేథోమథనం / Brain Stroming / ప్రాథమిక భావనలు చెప్పించడం.

'నేను గోదావరి' పాఠం చెప్పడాని కంటె ముందు పిల్లలను 'గోదవరి' అంటె ఏమిటి మీకు తెలిసిన అంశాలు చెప్పమని, వాటిని నల్లబల్లపై రాయాలి.

## మరి కొన్ని పఠన కృత్యాలు

సుమారు కొంచెం అటు ఇటుగా అయిదేళ్ళ వయసులో పిల్లవాడు 'పఠనం' ప్రారంభించవచ్చు. తరగతిలోని పిల్లలంతా ఒకేసారి పఠనం ప్రారంభిస్తారని అనుకోకూడదు. పిల్లలలో వైయక్తిక బేధాలు సర్వసాధారణం. ముఖ్యంగా కొంతమంది పిల్లలు, అయిదేళ్ళ వయస్సులో మంచి ఆసక్తిని, సామర్థ్యాన్ని చూపించి ఏడేళ్ళ వయస్సు వచ్చేసరికి పఠన నైపుణ్యాల మీద అధికారం సంపాదించవచ్చు. కొంత మంది పిల్లలకు ఎనిమిదేళ్ళ వరకూ కూడా ఇది కష్టంగా ఉండవచ్చు. ఆ తేడాను ఉపాధ్యాయుడు పట్టించుకోకూడదు. ఉపాధ్యాయుడు చేయవలసిందల్లా ఒక్కొక్క పిల్లవాడు ఎట్లా పురోగతిని సాధిస్తున్నాడన్నదే. దానికి అనుగుణంగానే పఠన అభ్యసన కృత్యాలను ఉపాధ్యాయుడు ఏర్పరచుకోవాలి.

### 1) నేలయే చిత్ర పటం :

నేలయే చిత్రపటం ద్వారా పిల్లలకు ఒక సంకేతానికి - దాని పదానికి మధ్య సరైన భావనను ఏర్పరచి, పిల్లల్లో పఠనాసక్తి పెంపొందించవచ్చు.

ఉదా॥ ఖాళీగా ఉన్న తరగతిలో గానీ, ఆటస్థలంలోకి గానీ పిల్లలను తీసుకొని వెళ్ళాలి. కొన్ని సంకేతాలను తెలియజేసే కార్డులు, వాటి పేర్లు విడివిడిగా తయారుచేసుకోవాలి.

ఈ కార్డులు తయారుచేయడంలో ఉపాధ్యాయుడు కొంత జాగ్రత్త వహించాలి. పిల్లల స్థాయిని, తరగతిని దృష్టిలో ఉంచుకోవాలి. సంకేతాలు తేలికగా, పిల్లలు గుర్తు పట్టేవిధంగా ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు పిల్లలందరినీ తరగతి గదిలో (ఆటస్థలంలోకి తీసుకొని వెళ్ళాలి). తరగతి నాల్గు మూలల్లో నాలుగు రకాల సంకేతాలను, వాటిని పదాల రూపంలో రాసిన కార్డులను పక్కపక్కనే ఉంచాలి. పిల్లలందరినీ ఒక వరుసక్రమంలో నిలబెట్టి ఒకరి తర్వాత ఒకరిని సంకేతాలవైపుకు పంపిస్తూ, సంకేతంలో ఉన్న విధంగా చేయమనాలి.

కొన్ని సార్లు పిల్లవాళ్ళ సంకేతాలనుసారం చేసిన తర్వాత సంకేతం తీసివేసి దాని స్థానంలో 'పదం' చేర్చాలి. పిల్లవాడు కొన్నిసార్లు 'సంకేతాలను' పాటించిన తర్వాత దాని స్థానంలోని పదాన్ని చూసి అదే విధంగా ప్రవర్తిస్తాడు.

- ఇక్కడ సంకేతానికి - పదానికి మధ్య సరైన 'భావన'ను ఏర్పరుచుకొని సంకేతానికి సంబంధించిన పదాన్ని చదువుతాడు.
- కృత్యం1వ, 2వ తరగతి పిల్లలకు ఎంతో ఉపయుక్తకరంగా ఉంటుంది.

1) చిత్రాన్ని చూసి, ప్రతిస్పందిస్తారు.

2) సరళపదాలలోని అక్షరాలను చూసి గుర్తుంచుకోగల్గుతారు. చిత్రాలు ఉన్న చోట, పదాన్ని ఉంచినట్లయితే ఆ పదాన్ని గుర్తించి చదువుతారు.

3) అరిచింది, ఎగిరింది, ఆటాడింది మొదలయిన పదాల భావనలు పిల్లలలో ఏర్పరచవచ్చు.

4) పాఠ్య పుస్తకాలలోని 'చదువు - ఆనందించు' కృత్యాన్ని ఉపయోగించవచ్చు.

### 2) వర్ణమాలను విభజించుట :

ఈ కృత్యం ద్వారా పిల్లలకు సరళపదాలను చదివించి వాటి రూపాన్ని వర్ణమాలలో గుర్తింపజేయవచ్చు. పిల్లలు అక్షర ధ్వనికీ - అక్షర ఆకారానికీ సంబంధం ఏర్పరచుకోవడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది.



SCERT TELANGANA

వర్ణమాలను మూడు భాగాలుగా విభజించి ఒక్కొక్క భాగాన్ని పెద్ద అక్షరాలలో పొడవైన కాగితం మీద రాయండి. ఒక దానికొకటి కొంచెం దూరంగా తరగతి గది గోడలమీద మూడు చోట్ల పిల్లలు తేలిగ్గా చూడగలిగే స్థానాలలో అతికించండి. (తెలుగు వంటి భాషకు) గుణింతాన్ని నాలుగో కాగితం మీద రాయండి. నల్లబల్ల మీద ఒక మాట రాయండి. పిల్లల్ని బల్లమీద రాసిన పదాన్ని, కాగితాల మీద రాసిన సంకేతాల్ని (అక్షరాలను) జాగ్రత్తగా చూసి కాగితాల మీద అక్షరాలను గుర్తించమనండి.

1) ఈ కృత్యం ద్వారా 1వ, 2వ తరగతి పిల్లలకు సరళపదాలను పరిచయం చేయవచ్చు, మూల్యాంకనంలోను ఈ కృత్యం ద్వారా పదాలను వర్ణమాల పట్టికలో గుర్తించమనవచ్చు.

2) గుణింత పదాలను పరిచయం చేయవచ్చు.

3) కాకర - అనే పదంలో ఉన్న గుణింతం ఏమిటి?

- ఆ గుణింతాన్ని గుణింతాకార పట్టికలో గుర్తించమని అడగవచ్చు.

### 3) మాటలతో తొక్కుడు బిళ్ళ :

- పిల్లలు బొమ్మల ద్వారా చదువుటకు ఈ కృత్యం ఉపయోగపడుతుంది.

అడ్డు, నిలువు గీతలతో నేలమీద గీతలు గీయండి. ఒక్కొక్క గడిలో పరిచిత వస్తువుల ఒక్కొక్క పేరును చిన్న రేఖాచిత్రంతోపాటు రాయండి.

ఉదా॥ గ్లాసు, పలక, చెంచా, చెట్టు

ఐదేసి మంది చొప్పున పిల్లల్ని జట్టుగా విభజించాలి. ఒక్కొక్క జట్టులో ఒక పిల్లవాడు రెఫరీగా ఉంటాడు. రెఫరీగా ఉన్న పిల్లవాడు చేయవలసిన పని ఈ గళ్ళలోకి చిన్నపెంకును విసరడం. పిల్లలు ఈ గడి వదిలి తక్కిన గడులలోకి దూకేటప్పుడు ఆ గడులలోని మాటలను బిగ్గరగా చదువడం. ఈ ఆట ఆడిన ప్రతీసారి రిఫరీని మార్చాలి.

ఎ) తరగతి గదిలో తొక్కుడు బిళ్ళ ఆడించలేని సందర్భంలో నల్లబల్లను & కాగితాలతో చేసిన బంతిని ఉపయోగించి కూడా ఈ ఆట ఆడించవచ్చు.

1) 1, 2 తరగతుల పిల్లలకైతే ఈ ఆటను సరళపదాలను చదివించడానికి ఉపయోగించవచ్చు. మొదట ఉపాధ్యాయుడు సరళ పదాలను నల్లబల్లపై వ్రాసి పిల్లలను ఒక్కొక్కరిని నల్లబల్లపైకి బంతిని విసరమనాలి. ఆ బంతి ఏ పదానికి తగిలితే ఆ పదాన్ని పిల్లలతో చదివించాలి. అదే కృత్యం 3, 4, 5 తరగతుల పిల్లలకైతే బంతిని రెండు పదాలపై విసరమని ఆ రెండు పదాలు వచ్చేలా వాక్యాన్ని చెప్పమనాలి. ఇలా స్థాయికి తగిన విధంగా ఈ కృత్యాన్ని అన్ని తరగతులకు అన్వయించవచ్చు.

బి) 1) సరళపదాలు, గుణింతపదాలు, ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరపదాలను, ఈ కృత్యం ద్వారా నేర్పించవచ్చు.

2) పాఠంలోని కీలక పదాలను, ఈ గళ్ళలో రాసి పిల్లలందరిచే ఈ ఆట ఆడించవచ్చు.

### 4) చదవిన దాన్ని ఆచరణలో పెట్టడం :

- మనం ఇదివరకు చెప్పుకున్నట్లుగా పఠనం యొక్క అంతిమ లక్ష్యం చదివిన దానిని అర్థం చేసుకోవడం. ఈ కృత్యములు అందుకు ఉపయోగపడును.

చదువడం వచ్చిన పిల్లలు చదువడానికి పని చెయ్యడానికి సంబంధం ముందు తెలుసుకోవాలి. ఈ కృత్యంలో ఉపాధ్యాయుడు నల్లబల్ల వద్ద నిశ్శబ్దంగా నిలబడుతాడు. మాట్లాడకుండా పిల్లవాడు చేయవలసిన పనికి చిన్న సూచన నల్లబల్లమీద రాస్తాడు.



SCERT TELANGANA

పిల్లలందరికీ ఒక్కొక్క నెంబరును ఇవ్వండి. బల్లమీద సూచనను రాసినప్పుడు దాని పక్కన ఆ పని చేయవలసిన పిల్లవాడి నెంబరు వేయండి.

ఉదా॥ 1) : ఒక రాయిని తీసుకునిరా (9) - 9వ నెంబరు పిల్లవాడు వెళ్ళి రాయిని తీసుకురావలెను.

ఉదా॥ 2) : 9వ నెంబరు తెచ్చిన రాయిని నీ నెత్తిమీద పెట్టుకో - (3)

క్రమక్రమంగా ఈ కృత్యంలో సంక్లిష్టమైన ఆజ్ఞలను చేర్చవచ్చు. తరగతి గదిలోని చిత్ర పటాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఒక సూక్ష్మ వివరాన్ని గుర్తించమనో, దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తోవను వర్ణించమని, పాఠశాల లోపల ఉన్న చెట్లను లెక్కపెట్టమనో అడుగవచ్చు.

- చదివిన దాన్ని ఆచరించడం :-

    1) 3, 4, 5 తరగతుల పిల్లలకు ఈ కృత్యం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

    2) ఉపాధ్యాయుడు కేవలం మార్గదర్శకత్వం మాత్రమే వహించాలి.

    3) నల్లబల్లపైన రాసిన అంశాలను విద్యార్థులు చదివి అర్థం చేసుకొని, దానిని ఆచరిస్తారు.

    ఉదా॥ 1) 'గీత' వెళ్ళి నీళ్ళ సీసాలో నీళ్ళు నింపుకొని రా...

    2) 'రాణి' వెళ్ళి ఫ్యాన్ ఆఫ్ చేయి...

    4) 4, 5 తరగతుల పిల్లలకు ఇంకా కొంత క్లిష్టమైన సన్నివేశాన్ని ఇచ్చి సొంతమాటల్లో వివరించమనవచ్చు.

**5) చివరి మాట, తరువాత మాట :**

- పిల్లలు ధారాళంగా చదువుటకు తరువాత వచ్చు పదాన్ని ఊహించడం ముఖ్యం. ఈ కృత్యము దానికి ఉపయోగపడును.

ఈ కృత్యమునకు బాల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చాలా అవసరం.

ప్రతీ పిల్లవాడు తేలికగా చదువగలిగిన పుస్తకాలను పిల్లలందరికీ పంచండి. ప్రతీ పిల్లవాణ్ణీ పుస్తకంలో తనకు ఇష్టం వచ్చినచోట తెరువమనండి. కుడిచేతి వైపు పేజీ చూడమనండి. పేజీ చివర ఫుల్‌స్టాప్ ఉందా? ఉంటే... మరో పేజీ తీయమనండి.

ఇప్పుడు పిల్లలంతా కుడివైపు పేజీని నిశ్శబ్దంగా చదువుతారు. పేజీ చివర ఆగమనండి. పేజీ తిప్పవద్దని చెప్పండి.

ప్రతి పిల్లవాడినీ తరువాత పేజీలో మొదటి పదం ఏమై ఉంటుందో ఊహించమనండి. ఊహించి చెప్పిన తరువాత అది సరైనదో కాదో సరిచూడమనండి. సరైన ఊహ చేసినప్పుడు పిల్లలంతా చప్పట్లు కొట్టవచ్చు.

అందరి వంతూ అయిపోయిన తరువాత ఇప్పుడు ఎడమవైపు పేజీ మొదలుపెట్టండి. వెనుకపేజీలో చివరి పదం ఏమై ఉంటుందో ఊహించమనండి.

1) ఈ కృత్యాన్ని 4వ తరగతి "నేను గోదావరి" పాఠం ద్వారా వివరిద్దాం.

2) పిల్లలందరూ ఇద్దరిద్దరిని గ్రూపులుగా విభజించి, కుడివైపున 93వ పేజీని తీసి చదువమనాలి. తర్వాత పేజీలో వచ్చే పదాన్ని ఊహించమని అడగాలి.

3) ఇంకోరకంగా చెప్పాలంటె ఎడమవైపున్న పేజీ చదివితే ముందున్న పదాన్ని ఊహించి చెప్పమనాలి.

4) పిల్లలు పాఠంలోని భావాన్ని ఊహించి చివరిమాట - తరువాత మాటలు ఊహించి చెప్తారు.



SCERT TELANGANA

### 6) మూడు ప్రశ్నలు :

- జిజ్ఞాస అనునది పిల్లల నైజం. దానికి మూలం ప్రశ్నించుట. ప్రశ్నించే నైపుణ్యం పెంపొందించుట ఈ కృత్యం ఉద్దేశం.

పిల్లలు ఎదురు ఎదురుగా ఉండేట్లు రెండు వరుసల్లో కూర్చోబెట్టండి. ప్రతీ పిల్లవాడికీ ఒక్కొక్క పుస్తకం ఇచ్చి వాళ్ళ ఇష్టం వచ్చినచోట తెరిచి కుడిచేతి వైపు పేజీ చదివి ఎదుటఉన్న పిల్లవాడికి ఇవ్వమనండి.

ఎదుట కూర్చున్న పిల్లవాడు అదే పేజీ చదువుతాడు. చదివిన తరువాత మొదట చదివిన పిల్లవాణ్ణి ఆ పేజీలో ఉన్న విషయం గురించి మూడు ప్రశ్నలు అడుగుతారు.

మొదట్లో ఏ ప్రశ్నలు అడుగాలో పిల్లలు నిర్ణయించుకోలేకపోవచ్చు. ఉదాహరణకు మీరు కొన్ని ప్రశ్నలను సూచించవచ్చు. తాము చదివినదాన్ని గురించి ప్రశ్నలు తయారుచేసుకోవడంలో వారికి శిక్షణ ఇవ్వవచ్చు.

- ఈ కృత్యం కోసం 4వ తరగతిలోని 'చిన్నారికల' పాఠంలోని 67వ పేజీలోని రెండో పేరాను పిల్లలు చదివారు అనుకుందాం ఇద్దరిద్దరుగా ఒక గ్రూపు చేయాలి. గ్రూపులోని ఇద్దరినీ ఒకే పేరా చదువమనాలి, వేరు వేరు ప్రశ్నలను ఒకరికొకరు అడగమని చెప్పాలి.
- ప్రారంభంలో పిల్లలు ఎందుకు, ఏమిటి, ఎవరు అలాంటి ప్రశ్నలు మాత్రమే అడుగుతారు.
- ఉపాధ్యాయుడు కొంత సమయాన్ని అందించినట్లయితే ఎలా, వివరించండి, ఆ స్థానంలో నువ్వయితే ఏం చేస్తావు, లాంటి ప్రశ్నలను అడుగుతారు.

  – **ఏమిటి, ఎందుకు, ఎవరు ...**

  1) పాఠంలోని పాప పేరు ఏమిటి? **ప్రజ్ఞ**

  2) ప్రజ్ఞ ఎవరితో మాట్లాడింది? **సంచులతో**

  3) దేనితో లాభాలు ఎక్కువ? **ప్లాస్టిక్‌తో**

  – **ఎలా, వివరించండి ...**

  1) ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగాలు వివరించండి.

  2) స్టీలు వస్తువులు ఖరీదు ఎక్కువ' వివరించండి.

### 7) కవితా ప్రహేళిక :

ఇది క్లిష్టమైన కార్యక్రమము. దీన్ని చాలా జాగ్రత్తగా ముందుగా సిద్ధం చేసుకోవాలి. ఒకసారి సిద్ధం చేసుకున్న తరువాత దీన్ని ఎన్నిసార్లైనా ఉపయోగించవచ్చు. ఫలితాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి.

అంత్య ప్రాసతో కూడుకున్న నాలుగేసి పాదాల కవితలను ఎంపిక చేసుకోండి. ఎంత మంది పిల్లలుంటే అన్ని కవితలు కావాలి. 20 మంది పిల్లలతో ఈ కృత్యం నిర్వహించదలచుకుంటే 20 కవితలను సేకరించాలి. ఇరవై కవితల మొదటి పాదాలను ఒక్కొక్క కాగితం మీద రాయాలి. తరువాత వేరే కవితలోని రెండవ పాదాన్ని రాయాలి. ఇలాగే మూడు, నాలుగు పాదాలు కూడా.

ఈ విధముగా ప్రతి కాగితం మీద నాలుగు వేరు వేరు కవితలకు సంబంధించిన నాలుగు పాదాల కవితలేర్పడుతాయి.

ఉదా : (కవితలు, పద్యాలు, గేయాలు ఏవైనా)

1) చిట్టి చిలుకమ్మ

2) చెట్టు కింద పోసి

3) మా ఇంటికొచ్చింది

4) గోగుపూలు తేవే

పిల్లలు వలయాకారంలో కూర్చుంటారు. కవితలు గందరగోళంగా రాసి ఉన్నాయని తమ దగ్గర ఉన్న కాగితంలో మొదటి పాదం మాత్రమే సరైనదనీ, దానికి తక్కిన మూడు పాదాలనూ గుర్తించవలసి ఉంటుందని పిల్లలకు ముందుగానే వివరించండి.

ఒక పిల్లవాడిని తన కాగితంలోని రెండవ పాదాన్ని చదువమనండి. తక్కిన పిల్లలంతా దీన్ని జాగ్రత్తగా విని తమ కవిత విని భావమేమో పరిశీలించాలి. తనదని అనుకున్న పిల్లవాడు చెయ్యెత్తి మళ్ళీ చదువమని అడుగాలి. అతని ఎంపిక సరైనదయితే (ఉపాధ్యాయుని ప్రకారం) అతనా పాదం రాసుకుంటాడు (తన పుస్తకంలో). ఈ పాదం అందించిన పిల్లవాడు దానిని తొలగిస్తాడు. తరువాతి పిల్లవాడు తన కాగితంలోలేని రెండవ పాదం చదువుతాడు. ఈ విధంగా పిల్లలందరూ తమ కవితల రెండవ పాదాన్ని సంపాదించే వరకు కొనసాగుతుంది. తరువాత మూడోపాదం, ఆ తరువాత నాలుగోపాదం.

- పాఠ్యపుస్తకంలోని గేయాలు, పద్యాలు నేర్పించటానికి, పిల్లల అవగాహన సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, పద్యాలు రాయించడానికి ఈ కృత్యం ఎంతో ఉపయుక్తకరంగా ఉంటుంది.

    1) 3, 4, 5 తరగతుల వారికైతే గేయాలను, పద్యాలను నేర్పించవచ్చు.

    2) పిల్లలు ఇదివరకే నేర్చుకుని ఉన్న పద్యాలయితే ఈ కృత్యం ఉపయుక్తకరంగా ఉంటుంది.

    3) ఉదాహరణకు తరగతిలో '8' మంది పిల్లలు ఉన్నారు అనుకోండి 8 పద్యాలు అవసరమవుతాయి.

    4) '4వ తరగతి'లోని 'సుమతీ శతకం' తీసుకుందాం.

    5) '8' శతకాలలోని ఒక్కో పద్యం మొదటిపాదం. ఒక్కో కార్డు మీద రాయాలి. పద్యాలలోని రెండో పాదాలకు సంబంధిత పద్యానికి కాకుండా వేరే పద్యపాదం క్రింద రాయాలి. అలాగే మూడు, నాలుగు పాదాలు కూడా వేరే వేరే పద్యాలకు వరసల క్రింద రాయాలి. ఇలా '4' వేరు వేరు పాదాలుగల పద్యాల కార్డులను పిల్లలందరికి పంచిపెట్టాలి.

    6) ఉపాధ్యాయుడు ఆ 8 పద్యాలలోని, 8లో ఏదో ఒక పద్యం మొదటి పాదం చదువాలి. ఆ మొదటి పాదం ఉన్న పిల్లవాడు అదే తన పద్యంగా భావించి నోటు బుక్కులో ఆ మొదటి పాదం రాసుకుంటాడు.

    7) ఉపాధ్యాయుడు పిల్లలందరిలో ఎవరో ఒక పిల్లవాన్ని తన దగ్గర ఉన్న రెండో పాదాన్ని చదువమనాలి. ఆ రెండో పాదం ఉన్న విద్యార్థి చేయి పైకెత్తి తన నోటు పుస్తకంలో రెండో పాదాన్ని రాసుకొని తన కార్డులోని రెండో పాదాన్ని చెప్పమనాలి. ఈ రెండో పాదం ఉన్న విద్యార్థి తన నోటు పుస్తకంలో రెండో పాదాన్ని రాసుకుంటాడు. ఇలా మూడు నాలుగు పాదాలకు కూడా ఇలాగే పూర్తి చేయాలి.

**8) విజ్ఞానశాస్త్ర పఠనం :**

మనకు బాగా పరిచితమై ఉన్న వస్తువులలో సమాన లక్షణాలను ఎంపిక చేయండి.

ఉదా॥ " ా " పదాలు చెప్పండి.

" ి " పదాలు చెప్పండి.

" ు " పదాలు చెప్పండి.

ఒక సమాన లక్షణాన్ని నల్లబల్లపై రాసి బిగ్గరగా చదువండి. ఈ లక్షణం ఉన్న రెండు మూడు వస్తువుల పేర్లు చెప్పమని పిల్లల్ని అడగండి.

ఈ పట్టికను కాపీ చేయమని చెప్పవచ్చు.

| | ా | ి | ు |
|---|---|---|---|
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |
| 5. | | | |

- పిల్లలు తమకున్న జ్ఞానంతో పోలికలు, తేడాలు గుర్తించడం ఈ కృత్యంలో జరుగుతుంది.
- 'విజ్ఞానశాస్త్ర పఠనం' కృత్యం 3, 4, 5 తరగతుల వారికి ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షర పదాలను వేరుచేయించవచ్చు.

  1) గుణింత పదాలను వేరుచేయవచ్చు.

  2) ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాల పదాలను వేరుచేయవచ్చు.

**9) ప్రతిస్పందన :**

ఒక బొమ్మకు వివిధ ప్రతిస్పందన స్థాయిలు, ఆ స్థాయికి సంబంధించిన ప్రశ్నలు, కథలు, కవితలు వంటి సాహిత్య విషయాల ప్రతిస్పందనలకు కూడా వర్తిస్తాయి.

ఒక బొమ్మ గురించి పిల్లలతో మాట్లాడడం, ఆ మాట్లాడడం ఏదో కబుర్లు చెప్పుకున్నట్లుగా అప్పటికప్పుడు జరిగినప్పటికీ అది ఉపయోగకరమే. ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలు పిల్లవాని ప్రతిస్పందనను ఒక మార్గంలో నిర్దేశిస్తుంది. క్రింద సూచించిన ప్రతిస్పందనల స్థాయికి ప్రశ్నల ద్వారా మనం పిల్లవాణ్ణి నడిపించవచ్చును.

**1) కనుక్కోవడం (Finding) :** ఈ స్థాయిలో బొమ్మలోని వస్తువులను కనుక్కోమని నిర్దేశిస్తాం.

బొమ్మలో ఏం జరుగుతుంది?

ఇందులో ఎలుక పిల్ల ఉందా?

సైకిలు మీద ఎవరు కూర్చున్నారు?

వంటి ప్రశ్నలు అడుగవచ్చు.

2) **హేత్వీకరణ (Reasoning) :** ఈ స్పందన స్థాయి కారణాలను, హేతువులను ఆపాదించే శక్తికి సంబంధించింది. బొమ్మలో చూపించిన దానికి పిల్లవాడు ఆపాదించే హేతువును ఉపాధ్యాయుడు అంగీకరించి తీరాలి. ఉపాధ్యాయుడు తన కారణాన్ని కూడా ఇవ్వవచ్చును. అది మరో ప్రత్యామ్నాయంగా మాత్రమే.

చిన్న పిల్ల ఎందుకు ఏడుస్తుంది?

ఎలుక పిల్ల ఎందుకు దాక్కుంది?

3) **బొమ్మలో తనను ఊహించుకోవడం (Projecting) :** పిల్లల్ని తమను బొమ్మలో ఊహించుకొమ్మని అడుగాలి. ఒక కల్పిత పరిస్థితిలో తమను ఊహించుకోవడానికి ప్రోత్సహించడమే ఈ స్థాయిలో ప్రశ్నలకు ప్రయోజనం.

నువ్వు ఈ చెట్టు మీద కూర్చుని ఉంటే ఏమి చేస్తావు?

ఎలుక పిల్ల స్థానంలో నువ్వు ఉంటే ఏమి ఆలోచిస్తావు?

4) **ఊహించడం (Preaticting) :** ఒక సంఘటన భవిష్యత్తులో ఎలా పరిణమిస్తుందో ఊహించే శక్తికి సంబంధించినది ఈ స్థాయి. తరువాత ఏం జరుగుతుందో ఊహించడానికి పిల్లల్ని ప్రోత్సహించాలి.

అతను ఇక్కడి నుండి ఎక్కడికి పోతాడు?

ఆమె ఇంటికి ఎలా వెళ్తుంది?

5) **అన్వయం (Relating) :** బొమ్మలో చూపించిన సన్నివేశానికి తుల్యంగా తమ జీవితంలో జరిగిన సన్నివేశాన్ని గురించి పిల్లలు ఆలోచించడానికి ఈ స్థాయిలో మనం ప్రశ్నలడుగుతాం.

ఎప్పుడైనా మోటరు సైకిలు ఎక్కావా? ఎట్లా ఉంటుంది?

అపరిచితులతో ఎప్పుడైనా కలిసి ఉన్నావా? ఏం జరిగింది?

1) 1, 2 తరగతుల 'సంసిద్ధతా పాఠాలు' ఈ కృత్యం ద్వారా బోధించవచ్చు.

2) 3, 4, 5 తరగతుల పాఠ్యాంశాలలో బొమ్మను చూడండి – ఆలోచించి మాట్లాడండి.

- ఈ కృత్యాన్ని 1, 2, 3, 4, 5 తరగతులలోని సంసిద్ధతా పాఠాలు బోధించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- '5వ తరగతి' లోని 'సాయం చేద్దాం' ఆ పాఠాన్ని ఈ కృత్యం ద్వారా నిర్వహిద్దాం.

1) ముందుగా పిల్లవానికి చిత్రాన్ని చూపించి పరిశీలించమనాలి. తర్వాత బొమ్మ గురించి పిల్లలను మాట్లాడించాలి.

- **కనుక్కోవడం ప్రశ్నలు :**

1) చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?

2) ఏఏ వాహనాలు ఉన్నాయి?

3) పిల్లల భుజానికి ఏమున్నాయి?

- **హేత్వీకరణం :**

1) ముసలివాళ్ళు రోడ్డు ప్రక్కన ఎందుకు కూర్చున్నారు?

2) పిల్లలు వాళ్ళకు టిఫిన్‌బాక్స్, నీళ్ళు ఎందుకు ఇస్తున్నారు?

3) రోడ్డు మీద వెళ్ళేవాళ్ళు ఎందుకు ముసలివాళ్ళను పట్టించుకోవటం లేదు?



SCERT TELANGANA

- **బొమ్మలో తనను ఊహించుకోవటం :**

1) ఆ పిల్లల స్థానంలో నువ్వు ఉంటే ఏం చేస్తావు?

2) బండి మీద వెళ్తున్న వ్యక్తి స్థానంలో నువ్వుంటే ఏం చేస్తావు?

- **ఊహించటం :**

1) పిల్లలు టిఫిన్ బాక్స్ ముసలివాళ్ళకు ఇచ్చి ఎక్కడికి పోయి ఉంటారు?

2) ముసలివాళ్ళు పిల్లలతో ఏమి మాట్లాడి ఉంటారు?

- **అన్వయం :**

1) నువ్వు ఎప్పుడైనా అలా రోడ్డుపక్కన ఉన్న ముసలివాళ్ళను చూసావా?

2) నువ్వు ఎప్పుడైనా ఎవరికైన సహాయం చేసావా?

## vi) పాఠ్య పుస్తకాలలో అభ్యాసాలు

నూతన పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలు అన్నీ కూడా వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకొని, వివిధ ప్రక్రియల్లో పాఠాలు పొందుపర్చారు. కథలు, కథనాలు, పద్యాలు, సంభాషణలు, వ్యాసాలు, గేయకథలు పాఠాలుగా ఉన్నాయి. ప్రతీ పాఠం కూడా పిల్లల్లో ఆసక్తిని రేకెత్తించే విధంగా చిత్రాలతో ప్రారంభం అవుతుంది. సొంతంగా చదువుకొని అర్థం చేసుకొనేలా సరళమైన భాష ఉన్నది. వివిధ స్థాయిలలో సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా అభ్యాసాలను పొందుపర్చారు. ఈ అభ్యాసాలు పూర్తి తరగతి, జట్టు, వ్యక్తిగత కృత్యాల రూపంలో ఉన్నాయి. పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా అభ్యాసాలు ఉన్నాయి. ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలందరు తప్పనిసరిగా చదువటం, రాయటం చేయగల్గాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వాచక ప్రారంభంలో చదువడం, రాయడం నేర్పడానికి సంసిద్ధతా పాఠాలు చెప్పారు.


ఉపాధ్యాయుడు పిల్లలందరూ స్వేచ్ఛగా మాట్లాడేలా, ప్రశ్నించేలా చక్కటి వాతావరణాన్ని కల్పించాలి. పిల్లలందరూ పాల్గొనేలా బోధనా అభ్యసన ప్రక్రియలను రూపొందించుకోవాలి.

- పాఠ్య పుస్తకాలలోని కొన్ని అభ్యాసాలు

- **1, 2 తరగతులకు సంబంధించినవి :**

1) బొమ్మలను చూపించి, వాటి పదాలు పిల్లలతో పలికించడం.



2) ఒక పదాన్ని ఇచ్చి పదంలోని అక్షరాలతో వీలైనన్ని కొత్త పదాలను చెప్పమనడం.

| | | | | |
|---|---|---|---|---|
| త | బ | ల | తల | తల తల |
| 1 | 2 | 3 | బల | లబ లబ |
| | | | తబల | బల బల |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| కా | క | ర | కా | య | కాకర | కర |
| | | | | | కాయ | కాక |
| | | | | | కార | కాకరకాయ |

SCERT TELANGANA

3) అక్షరాలను కలిపి చదువమనడం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | తం | గతం | | లం | బలం |
| గ | రం | గరం | బ | కం | బకం |
| | జం | గజం | | లగం | బలగం |

4) గళ్ళలోని అక్షరాలను పదాలుగా చదువమనడం.

| | | |
|---|---|---|
| త | బ | ల |
| వ | జ | త |
| జ | న | గ |

| | |
|---|---|
| తబల | నల |
| లత | వల |
| బజన | తల |

5) ఏదైన ఒక అక్షరం ఇచ్చి, ఆ అక్షరంతో మొదలయ్యే కొన్ని పదాలు చెప్పమనడం.

| శ | త | ల |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

6) కొన్ని అక్షరాలను ఇచ్చి ఆ అక్షరాలతో ఏర్పడే రెండు అక్షర పదాలు, మూడు అక్షర పదాలు, నాలుగు అక్షర పదాలు చెప్పమనడం.

అ ఆ ఉ క గ జ ట త ప బ ర ం

| రెండు అక్షరాల పదాలు | మూడు అక్షరాల పదాలు | నాలుగు అక్షరాల పదాలు |
|---|---|---|
| ఆట<br>అర | నటన | కటకట |

7) సన్నివేశ చిత్రాలను పిల్లల ముందు ఉంచి, ఆ సన్నివేశాన్ని పిల్లల మాటల్లో చెప్పించడం.

కాకి తలపై కిరీటం ఉంది. కిరీటం పక్కన పెట్టి కాకి నీళ్ళు తాగింది కాకి కిరీటం చిలక పెట్టుకుంది.

8) గుణింత పదాలు చెప్పే సందర్భంలో అక్షరాలలోని తేడాను గుర్తిస్తూ పదాలను చదివించడం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| కుండ | – | కూజా | బురద | – | బూడిద |
| గుడి | – | గూడు | మునగ | – | మూడు |
| చురక | – | చూరు | సుడి | – | సూది |



SCERT TELANGANA

9) అక్షరాలు కలుపుతూ పదాలు చెప్పించడం.

క, గు, బ, త, అ → రువు

కరువు

గురువు

బరువు

తరువు

అరువు

10) కొన్ని అక్షరాలను ఇచ్చి, ఆ అక్షరాలకు ఏదైన ఒక గుణింతాన్ని చేర్చి పదాలు చెప్పమనడం.

- క్రింది అక్షరాలకు ' ు ' ను జోడిస్తూ పదాలు చదివించడం.

గ ర వ = గురువు　　　క న క = కునుకు

ప ల స = పులుసు　　　క ర ప = కురుపు

క ద ర = కుదురు　　　మ ర క = మురుకు

11) గళ్ళలో కొన్ని పదాలనుఇచ్చి, ఆ పదాలతో వాక్యాలను చదివించడం.

| | | |
|---|---|---|
| **రాము** | **గుడికి** | **వెళ్ళాడు** |
| | **బడికి** | |
| | **సినిమా** | |
| | **ఊరికి** | |

1) రాము గుడికి వెళ్ళాడు.

2) రాము బడికి వెళ్ళాడు.

3) రాము సినిమాకు వెళ్ళాడు.

4) రాము ఊరికి వెళ్ళాడు.

12) పదాలు జతపరచి వాక్యాలు చెప్పడం.

| | | |
|---|---|---|
| అమ్మ | అన్నం | కొన్నాడు |
| అక్క | నన్ను | పెట్టింది |
| నాన్న | సైకిల్ | కొట్టింది |

1) అమ్మ అన్నం పెట్టింది

2) అక్క నన్ను కొట్టింది

3) నాన్న సైకిల్ కొన్నాడు

13) వాక్యాలలో బొమ్మలకు బదులు పదం ఉంచి వాక్యం చదువమనడం.

తాత  విరిగింది = తాత **కర్ర** విరిగింది.

కట్టె  గట్టిగా ఉంటుంది = కట్టె **నిచ్చెన** గట్టిగా ఉంటుంది.

14) కింది ఒత్తు పదాలలో, ఒత్తు లోపించిన చోట ఒత్తును చేర్చుతూ చదువండి.

1) అమ - అమ్మ

2) బియం - బియ్యం


3) కొయ - కొయ్య

4) తముడు - తమ్ముడు



SCERT TELANGANA

15) కొన్ని బొమ్మలతో కూడిన చిత్రాలను చూపించి, ఆ చిత్రం గురించి ఏదైన ఒక వాక్యం చెప్పమనాలి.



1) అమ్మ ముగ్గు వేసింది




2) నాకు పలక ఉంది



3) సుత్తితో మేకులు గోడకు కొడతారు

16) ఒక పట్టికలో కొన్ని జంతువుల పేర్లు, పక్షుల పేర్లు కలిపి ఇచ్చి వాటిని వేరుచేస్తూ చెప్పమనడం.

| | | |
|---|---|---|
| **ఆవు** | **కాకి** | **బాతు** |
| **పావురం** | **గాడిద** | **పులి** |
| **సింహం** | **కోకిల** | **జిరాఫి** |

ఆవు — బాతు

గాడిద — పావురం

జిరాఫి — కోకిల

- ఇలా వేరుచేసి జంతువుల పేర్లు, పక్షుల పేర్లు చెప్తారు.

17) ఏదైనా ఒక సన్నివేశంతో కూడిన చిత్రాన్ని చూపించి, ఆ కథను ఊహించి చెప్పమనడం.

పిల్లలు సన్నివేశం చూసి ఆ కథ ఏమై ఉంటుందో అని ఊహించి చెప్తారు.

- **3, 4, 5 తరగతులకు ఇవ్వదగిన పాఠ్యాంశ కృత్యాలు :**

1) 'అభినయ గేయాలు' చెప్పిన తర్వాత గేయంలోని ప్రాస పదాల కింద గీతగీసి, వాటిని మాత్రమే పిల్లలందరిచే చదివించడం.

2) గేయంలోని 'పదజాలాన్ని' రెండు భాగాలుగా విభజించి, వాటిని గేయం ఆధారంగా పదాలను సరైన క్రమంలో అమర్చుతూ చదువమనాలి.

నల్లని — నీరుచేరి

చుక్కచుక్క — మేఘాలు

1) నల్లని మేఘాలు

2) చుక్కచుక్క నీరుచేరి

3) పదాలను ఉపయోగించి వాక్యాలను తయారుచేయమనడం.

ఉదా॥ 3వ తరగతి వానదేవుడా పాఠంలోని 'ఊరు' అంశానికి సంబంధించిన పదాలను ఇచ్చినట్లయితే పిల్లలు వాటితో వాక్యాలు ఏర్పరచి చదువుతారు.

4) ఏకవచన పదాలు - ఇచ్చి బహువచన పదాలుగా చదువమనడం.

పలక - **పలకలు**

గద - **గదలు**




SCERT TELANGANA

5) గళ్ళ డబ్బాలలో కొన్ని అక్షరాలను ఇచ్చి, వాటితో పదాలు తయారుచేయమనాలి.

- గమనిక : ఇచ్చిన అక్షరాలు / పదాలు ఏదైన ఒక అంశానికి సంబంధించినవి అయితే పిల్లలు తొందరగా అక్షరాలతో పదాలు తయారుచేసారు. వేరు వేరు అంశానికి సంబంధించిన పదాలు అయితే పిల్లలు గందరగోళంలో పడి పఠనం / చదువటంలో అంతగా ఆసక్తి చూపలేకపోవచ్చు.

ఉదా॥




6) అచ్చులు లోపించిన పదాలు నల్లబల్లపై రాసి చదువమనడం.

1) _____ గ  2) _____ వు  3) _____ డుత

7) హల్లులు లోపించిన పదాలు నల్లబల్లపై రాసి చదివించడం.

1) ప _____ క  2) ఇటు _____  3) _____ లపం

8) గేయం ఆధారంగా సంబంధం ఉన్న పదాలను జతచేసి రాయండి.

9) (అల్ప ప్రాణ అక్షర పదాలు – మహాప్రాణ అక్షర పదాలు) రెండింటిని పక్కపక్కనే నల్లబల్లమీద రాసి, రెండింటికి మధ్య భేదాన్ని తెలిసేవిధంగా (ఉచ్చారణ దోషాలు) లేకుండా చదివించాలి.

కలం – శంఖం

గంట – ఘటం


10) పాఠంలోని మహాప్రాణ అక్షర పదాల కింద గీతగీసి, వాటిని మాత్రమే పిల్లలందరితో చదివించండి.

11) ఏదైనా ఒక పేరాను ఇచ్చి, పిల్లలందరిచే చదివించాలి. పేరాకు సంబంధించిన ప్రశ్నలను పిల్లలను అడిగి సమాధానాలు రాబట్టాలి.

12) 'పండుగలకు' సంబంధించిన పాఠాలు చెప్పినప్పుడు...

తెలుగువాళ్ళు జరుపుకునే పండుగలు ఏవి? అవి ఏ మాసంలో వస్తాయి. అవి జరుపుకునే విధానాన్ని పిల్లలను సొంతమాటల్లో చెప్పమని అడగవచ్చు.

13) సరళ అక్షరాలను, గుణింత అక్షరాలను రెండు వేరువేరు వృత్తాలలో ఇచ్చి రెండింటిని కలుపుతూ కొన్ని పదాలను తయారుచేయమని, వాటిని పిల్లలందరితో చదివించాలి.






SCERT TELANGANA

14) పాఠం చదివి, పాఠానికి సంబంధించిన వాక్యాలు సరైనవా, కావా చెప్పమనడం.

15) పాఠానికి సంబంధించిన ఒక వాక్యం నల్లబల్లపై రాసి, పాఠం ఆధారంగా తర్వాత వాక్యాన్ని ఊహించి రాయమనడం.

16) గేయానికి సంబంధించిన కొన్ని పదాలు ఇచ్చి అవి గేయంలో ఎక్కడ ఉన్నాయో ‘ ’ చుట్టమనడం.

17) గేయంలోని కొన్ని వాక్యాలను ఎంపిక చేసి, అసంపూర్తి వాక్యాన్ని పిల్లలకు చెప్పి, సంపూర్ణ వాక్యాన్ని పిల్లలతో చెప్పించడం.

18) సారూప్యం / సామ్యం ఉన్న నాలుగు పదాలను, ఒక వేరే పదం మొత్తం 5 పదాలను పిల్లలకు ఇచ్చినట్లయితే వరుసలో సామ్యంలేని పదాన్ని గుర్తించి చదువుతారు.

- పలక బలపం పుస్తకం పెన్ను తరగతిగది

19) అర్థవంతంకాని పదాల వరుసను సరైన క్రమంలో పొందుపరిచి అర్థవంతమయిన వాక్యాన్ని పిల్లలతో చెప్పించడం.

నిండింది వానలు చెరువు పడి

వానలు పడి చెరువు నిండింది.

20) హ్రస్వ అక్షర పదాలు - దీర్ఘ అక్షర పదాల జంటలను నల్లబల్లపై రాసి పిల్లలను ఉచ్చారణ దోషాలు లేకుండా చదువమనాలి.

21) తప్పుగా రాసిన వాక్యాలను, గేయం ఆధారంగా సరిచేసి చెప్పమనడం.

22) గుణింతాలు లోపించిన పదాలు, నల్లబల్లపై రాసి వాటికి సరైన గుణింతం చేర్చి చెప్పమనడం.

మట ____________ చమంతి ____________ టొపి ____________

మెక ____________ కుజ ____________ పతకం ____________

23) పద్యంలో తారుమారైన పద్యపాదాలను సరైన క్రమంలో చెప్పమనడం.

24) పద్య భావంలోని ఒక వాక్యం చెప్పి, ఆ వాక్యానికి సరిపడే పద్యపాదంలోని వాక్యాన్ని చెప్పమనడం.

1) మనసు విరిగితే అతుకలేము

- మనసు విరిగెనేని మరి అతకలేమయా

25) కొన్ని పదాలను ఇచ్చి వాటికి సంబంధించిన మరికొన్ని పదాలను చెప్పమనడం.

- కొట్టకు, తిట్టకు, ____________, ____________, ____________, ____________

26) పట్టిక చదివి, పట్టిక ఆధారంగా వీలైనన్ని వాక్యాలు పిల్లలందరితో చెప్పించడం.

27) గీత గీసిన పదాలకు అర్థాన్ని అడిగి, అదే పదంతో సొంతవాక్యాన్ని చెప్పించాలి.

28) గీత గీసిన పదాలకు - వ్యతిరేకపదాలను చెప్పించడం.

29) పదాన్ని చదివి, గేయంలోని అర్థవంతమైన పదంగా చెప్పమనడం.

డాలిరాఆ = ఆడాలిరా, మ్మటపి = పిమ్మట

30) పాఠం చదివించి, అందులోని ద్విత్వాక్షర పదాలను, సంయుక్తాక్షర పదాలను, సంశ్లేషాక్షర పదాలను వేరువేరు పట్టికలో రాయాలి.

SCERT TELANGANA

# 7. లేఖనం

ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి అందరు విద్యార్థులు వినడం, మాట్లాడడం, చదువడం, రాయడం వంటి కనీస భాషా నైపుణ్యాలను కలిగి ఉండాలన్న సంగతి మనందరికి తెలిసిందే. వినడం, మాట్లాడడం, చదువడంలో కొంత పురోగతి సాధించడం అభినందనీయం. రాయడం వరకు వచ్చేసరికి ఫలితాలు మనను కొంత ఆందోళనకు గురిచేస్తున్నాయనేది మనందరి అనుభవంలో ఉన్న అంశమే. మొదటి మూడు నైపుణ్యాలలో ఆశించిన ప్రగతి చూపుతున్న విద్యార్థులు 'లేఖనం' వరకు వచ్చేసరికి వెనుకబడిపోవడాన్ని మనం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు భాషను ఎంత సహజంగా నేర్చుకుంటారో అంతే సహజంగా లేఖనం లేదా రాయడాన్ని నేర్చుకోగలరా? అని ఆలోచించాల్సిన తరుణమిది. యాంత్రికంగా తరగతి గదిలో జరుగుతున్న లేఖన ప్రక్రియ అర్థవంతంగా మారడానికి ఉపాధ్యాయునిగా మనం చేయాల్సిన కృషిని గుర్తెరుగాలి, లేఖనం అనగానే ఉపాధ్యాయుల సహకారాన్ని ఆశిస్తున్న ప్రస్తుత స్థితి నుండి వారంతకువారే సొంతంగా రాసే స్థితికి మన ప్రయాణం కొనసాగాల్సిన అవసరం చాలా ఉంది.

అసలు లేఖనం అంటే ఏమిటి? అక్షరాలు ఎందుకు అమూర్త సంకేతాలయ్యాయి? బడికి రాకముందు పిల్లలు రాయగలరా? లేఖన ప్రారంభ కృత్యాలు ఏమిటి? ఏయే తరగతుల్లో లేఖనంలో ఏయే దశలున్నాయి? లేఖన సామర్థ్య పెంపుకు తరగతి వాచకాలలో ఎటువంటి కృత్యాలు ఉన్నాయి? లేఖనంలో చేస్తున్న దోషాలను ఎలా నివారించాలి? తదితర ప్రశ్నలను మనం సరిగ్గా అర్థంచేసుకొంటే తరగతిలోని విద్యార్థులలో లేఖన సామర్థ్యాన్ని వృద్ధిపరుచుటకు తగిన చర్యలు చేపట్టగలుగుతాము. తగిన అభ్యసన ఫలితాలను పొందగలుగుతాము. ఈ అధ్యాయంలో లేఖనంతో ముడిపడి ఉన్న అనేక అంశాలను చర్చిద్దాం. అవగాహన చేసుకుందాం. పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో ఉపయోగించి సత్ఫలితాలను రాబట్టుదాం.

### లేఖనం అంటే ఏమిటి?

*ప్రొఫెసర్ కృష్ణకుమార్ 'లేఖనం' గురించి ఏమంటున్నారో చూద్దాం! లేఖనం అంటే పిల్లలు సొంతంగా తమ ఆలోచనలను, భావాలను రాయగలగడం. 'రాయడం' అనేది లేఖనానికి సమానార్థకమైన పదం.*

*"లేఖనంలో మన ఎదుటలేని వ్యక్తితో మనం సంభాషిస్తున్నామన్నమాట". అదే సమయంలో మనం రాసే దానిలో అధికభాగం ఒక సమాచారాన్నో, ఆలోచననో, ఒక జ్ఞాపకాన్నో, భద్రపరచడంకోడమన్నది కూడ వాస్తవం.*

*ఉపాధ్యాయులు పిల్లలకు లేఖనాన్ని ఒక సంభాషణా రూపంగానే పరిచయం చేయాలి. పిల్లలు బడిలో అడుగు పెట్టేనాటికి వివిధ విషయాల గురించి, వివిధ వ్యక్తులతో ధైర్యంగా సంపాదించగలిగిన సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. అయితే సాధారణంగా ఎదుటలేని వ్యక్తులతో ఈ సంభాషణకు అలవాటుపడాలి. ఎదుట ఉపాధ్యాయుడో, తక్కిన తరగతి పిల్లనో, తానో ఎవరో ఒకరు శ్రోతలుగా ఉండవచ్చు. లేఖనాన్ని ఎవరో ఒకరితో ప్రసంగంగా పిల్లలు భావించేటట్లు చేయాలి.*

*లక్షలాది మంది పిల్లలు లేఖనాన్ని ఒక యాంత్రిక నైపుణ్యంగా నేర్చుకుంటున్నారు. వర్ణమాలలో అక్షరాల ఆకారాలను నేర్పడంతో ఇది ఆరంభమవుతుంది. ఒక్కొక్క అక్షరాన్ని డజనుసార్లు కాపీచేయమని పిల్లవాడికి చెప్తారు. వాళ్ళు రాసిన ఆకారాన్ని ఉపాధ్యాయులు పరిశీలిస్తాడు. ఈ విధంగా వర్ణమాల పూర్తికావడానికి చాలా పాఠశాలల్లో అనేక వారాలు పడుతుంది. ఈ సుదీర్ఘ సమయంలో పిల్లవాడికి రాయడం నేర్చుకోవడంలో అర్థంలేదని భావిస్తాడు. తరువాత కాలంలో పదాలను రాయమన్నప్పుడు ఆపైన వాక్యాలు రాయమన్నప్పుడు ఏమి రాయాలో ఉపాధ్యాయుడు చెప్తాడని వాళ్ళు ఆశిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక విషయాన్ని చెప్పడానికి సాధనంగా వాళ్లు లేఖనాన్ని భావించరు. అంటే ఉపాధ్యాయుడు*

చేయించే ఒక అభ్యాసంగా మాత్రమే దాన్ని వాళ్ళు భావిస్తారు. అందుకే ఈ పరిస్థితి మారాలంటే మనం లేఖనాన్ని సంభాషణకు కొనసాగింపుగా పరిచయం చేయాలి అని నా భావన.

పిల్లలకు లేఖనాన్ని పరిచయం చేయడానికి ముందు వారికి తమ జీవితాన్ని గురించి తమ చుట్టూ జరుగుతున్న విషయాల గురించి ఆత్మవిశ్వాసంతో మాట్లాడే సామర్థ్యం ఉందా అన్న విషయం చూడాలి. ఈ విధంగా వ్యక్తంచేసే వారి ఆలోచనలను, అభిప్రాయాలను లిఖితరూపంలో వ్యక్తంచేయడానికి 'అమూర్త సంకేతా'లను వినియోగించే సామర్థ్యం కావాలి. వర్ణమాలలోని అక్షరాలు అమూర్త సంకేతాలు. అవి అమూర్తాలు ఎందుకంటే అవి ప్రాతినిధ్యంవహించే ధ్వనులకూ వాటి ఆకారాలకు రూపంలో సామ్యంలేకపోవడమే. ఉదాహరణకు 'అ' అన్న ధ్వనికి, 'అ' అన్న వర్ణానికి ఎటువంటి ప్రత్యేక సంబంధంలేదు. 'అ' ను 'అ' గా అంగీకరించాలి. అంతే, ఇటువంటి అనేక సంప్రదాయ సంకేతాలకు పిల్లవాడు అలవాటుపడవలసిందే.

లేఖన సామర్థ్యం ఒక్కరోజులో అభివృద్ధిచెందేది కాదు. దీనిని అభివృద్ధిచేయడానికి ఉత్తమోత్తమ మార్గం పిల్లలకు బొమ్మలుగీసే, చిత్రించే అవకాశాన్ని తరచుగా కల్పించడం. చిత్రలేఖనంలో పిల్లలకు స్వేచ్ఛ ఉండాలి. ఆ సమయంలో ఉపాధ్యాయుడు తాను అధికారస్థానంలో ఉన్నాననే భావన ఉండకూడదు. ఇలా ఎందుకుచెప్తున్నానంటే చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయుడి ఆజ్ఞ ప్రకారం తామరపువ్వునో, అరటిపండునో చిత్రించడానికి ప్రయత్నించడం, ఉపాధ్యాయుడికి తృప్తికలిగేటట్లు చిత్రంచలేక నిస్పృహకు లోనవుతూ ఉండడం. ఒక సాధారణ దృశ్యంగా మనకు కనిపిస్తుంది. ఇంకొక విషయం చెప్పాలి. పిల్లలు తాము గీస్తున్న దృశ్యంలో సమగ్రత సాధించడానికి సాధనాలుగా రబ్బర్ల (ఎరేజర్)ను వినియోగిస్తుంటారు. ఒక బొమ్మ వేస్తారు. బాగాలేదని తుడిపేస్తారు. మళ్ళీ వేస్తారు. మళ్ళీ తుడుపుతారు. ఇటువంటి కార్యక్రమంలో వాళ్ళకు వేళ్ళు కదిలించడానికి మంచి అభ్యాసం కలుగుతుంది. కాని వారికి భావ వినిమయతృప్తి ఏ మాత్రం కలగదు. తద్వార ఈ మొత్తం కార్యక్రమం నిరర్థకంగా, వినాశకరంగానూ తయారవుతుంది. పిల్లలను వారి సొంతంగా ఆలోచించి వారికి నచ్చిన బొమ్మను గీసేవైపు నడిపించే బాధ్యత ఉపాధ్యాయునిపై ఉంది.

పిల్లవాడి చేతి కదలికలను అభివృద్ధి చేయడానికి రంగులతో బొమ్మలు వేయడం ఒక్కటే మార్గం కాదు. ఒక కుండలో నుండి మరో కుండలోకి నీళ్ళు పోయడం, కలిసిపోయి ఉన్న గింజలను వేరుచేయడం, వస్తువులను పైకి ఎత్తి మళ్ళీ కిందపెట్టడం, స్పర్శ ద్వారా వస్తువుల ఆకారాలను గ్రహించడం వంటివి దీనికి తోడ్పడే కార్యక్రమాలు. ఇంట్లో ఉన్న కొన్ని నియమ నిబంధనల వల్ల పిల్లలు తమ చేతులతో పొందవలసిన ప్రాథమిక అనుభవాన్ని కోల్పోతున్నారు. లేఖనం మీద దీని ప్రభావం పరోక్షమైనదే అయినా తీవ్రమైనది. ఈ సమస్య నుండి పిల్లలను తప్పించడానికి చిత్రలేఖనం, రంగులువేయడం అద్భుతమైన సాధనాలు."

**- కృష్ణకుమార్**

పై అంశాలను విశ్లేషిస్తే, లేఖనం.... అంటే కింది అంశాలను గ్రహించవచ్చు.:

1) లేఖనం కూడ ఒకరకమైన సంభాషణ అనగా శ్రోతను దృష్టిలో పెట్టుకొని ఎలాగైతే మాట్లాడుతామో, పాఠకున్ని దృష్టిలో పెట్టుకొని చేసే వ్యక్తీకరణ.

2) మాట్లాడడంలో పిల్లలకున్న శ్రోతల స్పృహ రాయడంలో కూడ పిల్లలకు అలవరచాలి. సాధారణంగా ఎదుటలేని వ్యక్తులతో మాట్లాడడాన్ని లేదా వారితో చేసే ప్రసంగంలా పిల్లలకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు చూడాలి.

3) లేఖనాన్ని ఉపాధ్యాయుడు చేయించే ఒక అభ్యాసంగా పిల్లలు భావిస్తున్నారు. ఈ భావన నుండి పిల్లలు బయటపడి తమ ఆలోచనలను క్రమబద్ధీకరించుకునే సాధనంగా, వ్యక్తీకరణకు దోహదపడే అంశంగా అర్థమయ్యేలా చేయాలి.

### లేఖన సామర్థ్యం :

ప్రధానంగా పిల్లలు తమ భావాలను, ఆలోచనలను వ్యక్తపరచడానికి రాయాలి. ఈ సామర్థ్యం బడికి రాకముందే పిల్లలలో ఉంటుంది. రెండు మూడు సంవత్సరాల పిల్లలను మనం నిశితంగా పరిశీలించినట్లైతే వారి చేతిలో పెన్ను, నోటుబుక్కు ఉంటే తమకు నచ్చినట్లుగా గీతలు గీయడం, బొమ్మలు గీయడం చూస్తుంటాం. తమలో తాము వీటి గురించి మాట్లాడుకోవడం కూడ గమనించవచ్చు. వీటి గురించి మనం పిల్లలనడిగితే గీసిన వాటి గురించి కూడ చెప్తారు. దీనినిబట్టి పిల్లలు వారిదైన శైలిలో చిత్రరూపంలోనో, సంకేత రూపంలోనే వ్యక్తంచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటారని భావించవచ్చు. అయితే ఇది సార్వత్రికం కాదు. వారిదైన లిపినుంచి సార్వత్రిక లిపిలో వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పాఠశాలలు పెంపొందించాలి. లేఖన సామర్థ్యమంటే ఏమిటో పరిశీలిద్దాం.

- *తమ భావాలను, ఆలోచనలను, అనుభూతులను, అనుభవాలను లిపిరూపంలో వ్యక్తంచేయడం.*
- *స్థాయి పెరిగిన కొద్ది క్రమపద్ధతిలో వ్యక్తీకరించడం, విశ్లేషణాత్మకంగా రాయడం, వివరంగా రాయడం, కారణాలు రాయడం, అభిప్రాయాలు, ప్రతిస్పందనలు రాయడం, అన్వయించి రాయడం వంటివి చేయగలగాలి.*

ఇది ఒకరోజులోనో, నెలలోనో, సంవత్సరంలోనో సాధించబడేది కాదు. నిరంతర ప్రక్రియ. మాట్లాడుతుంటేనే మాట్లాడే సామర్థ్యం వృద్ధిచెందినట్లు రాస్తూ ఉంటేనే రాసే సామర్థ్యం వృద్ధి చెందుతుంది. పిల్లలకు లేఖనాన్ని పరిచయం చేయడానికి ముందు వారు తమగురించి, తమ పరిసరాల గురించి, చుట్టూ జరుగుతున్న విషయాల గురించి ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలుగుతున్నారా చూడాలి. అనగా పిల్లలు తమ అనుభవాలను, అవగాహనలను వినిమయం చేసుకోవాలన్న కోరిక, వాటిని గురించి తమకున్న దృక్పథాన్ని చెప్పే సామర్థ్యం ఉందా? అన్నది పరిశీలించాలి. ఈ సామర్థ్యం ఉన్న పిల్లలే లిపిరూపంలో వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారు.

ఇందుకు తమ భావాలకు అమూర్తసంకేతాలను వినియోగించే సామర్థ్యాన్ని పొందాలి. అనగా అమూర్తమైన అక్షరాలను / సంకేతాలను వినియోగించగలగాలి. ఈ అక్షరాలలోని స్వల్ప భేదాలను (ధ్వని భేదాలు, లిపి భేదాలు) గుర్తుపెట్టుకోగలగాలి. ఇది ప్రాథమిక నైపుణ్యాలు అనగా శబ్దాలకు తగిన సంకేత గుర్తులను రాసే శక్తి పిల్లలకు అలవడాలి. ఎలా రాయాలో పిల్లలకు తెలియాలి.

లేఖనానికి సంబంధించిన ప్రాథమిక నైపుణ్యాలు అనగా తప్పులేకుండా రాయడం, అందంగా రాయడం చేయగలిగిన తర్వాతనే లేఖన సామర్థ్యాన్ని పెంపొందించాల్సి ఉంటుంది. ఇది సవాలుతో కూడిన పని. ఎందుకంటే చదివేవారిని అనగా "శ్రోతల స్పృహ" కలిగి ఉండడం, "అభివ్యక్తీకరణ వాంఛ" పిల్లల్లో కలిగించడం అతిముఖ్యమైనది. ఇది ఒక రకంగా సంభాషణతో సంబంధం కలిగి ఉన్న అంశం. శ్రోతల స్పృహ అంటే రాసేటప్పుడు ఎవరిని ఉద్దేశించి రాస్తున్నామో స్పష్టత కలిగి ఉండడం. అభివ్యక్తీకరణ వాంఛ అంటే రాయడానికి ఒక ఖచ్చితమైన లక్ష్యాన్ని కలిగిఉండడం. వీటిని దృష్టిలో పెట్టుకొని రాయడం చేయగలిగితే అర్థవంతంగా ఉంటుంది. సాధారణంగా తరగతి గదుల్లో పిల్లలు రాసేటప్పుడు ఉపాధ్యాయులను దృష్టిలోపెట్టుకొని రాస్తారు. ఎందుకు రాస్తున్నారో తెలియదు. ఇది భవిష్యత్తులో అర్థవంతమైన వ్యక్తీకరణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. మనం గమనించవచ్చు. ఒక వ్యాసాన్నిగాని, అర్థవంతమైన లేఖలను గాని లేదా సృజనాత్మక రచనలు చేయడంలో ఇబ్బందిపడడం, వైఫల్యాలను చెందడం చూస్తుంటాం. మనం ఎవరికోసం రాస్తున్నామో, ఎందుకోసం రాస్తున్నామో స్పృహ కలిగి ఉన్నప్పుడు మనం ఉపయోగించే భాష, వాక్యనిర్మాణం, వ్యక్తీరణలోని విభిన్న కోణాలు అర్థవంతంగా మారుతాయి. ఇది పిల్లల వ్యక్తిత్వాన్ని కూడ ప్రభావితం చేస్తుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని లేఖన సామర్థ్యాన్ని వివిధ దశలలో ఎలా పెంపొందించాలో చూద్దాం.



SCERT TELANGANA

**1వ తరగతి** : తాము చెప్పాలనుకున్న విషయాలను బొమ్మలరూపంలో వ్యక్తపరచమని చెప్పవచ్చు. క్రమేణా చిత్రాల నుండి లిపిరూపంలో వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంపొందించాలి. అనగా బొమ్మలకు పేర్లు రాయడం, తమకు తెలిసిన సరళ పదాలను, గుణింత పదాలను రాయగలగడం.

**2వ తరగతి** : సరళమైన వాక్యాలరూపంలో వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంపొందించడం. తమ చుట్టూ ఉన్న పరిసరాలలోని, వాటి పేర్లు, ఒకటి రెండు సరళమైన వాక్యాలను రాయగలగాలి.

**3వ తరగతి** : తమ ఇష్టాయిష్టాలను, తమకు తెలిసిన వాటి గురించి చిన్న చిన్న పేరాలు రాయగలగాలి. ఎదుటివారితో మాట్లాడాలనుకున్న విషయాలను వాక్యాలు రాసి వ్యక్తం చేయగలగాలి.

**4, 5 తరగతులు** : విన్న, చదివిన అంశాల ఆధారంగా సారాంశాన్ని రాయగలగాలి. తాము చెప్పదలచుకున్న విషయాన్ని చిన్న చిన్న లేఖల రూపంలో రాయగలగాలి. రాసే విషయాన్ని క్రమపద్ధతిలో, సందర్భోచిత, చక్కని పదజాలాలను (జాతీయాలు, సామెతలు మొ॥) ఉపయోగించగలగాలి. కారణాలను వివరించగలగాలి.

## లేఖనం ఎప్పుడు మొదలుపెట్టాలి? సామర్థ్యాన్ని ఎలా వృద్ధిపరచాలి?

- పాఠశాలలో చేరిన రోజునుంచే ప్రారంభించవచ్చు. అయితే అర్థంలేని అమూర్త సంకేతాలను దిద్దించడం, రాయించడం అర్థరహితం.
- రాయడం కూడ అర్థవంతంగానే ప్రారంభంకావాలి. రాత నేర్పాలని మనం నిర్ణయించుకున్న తర్వాత ఏమి రాయాలి? అని పిల్లలనే చెప్పమనవచ్చు. ఏమి రాయాలో పిల్లలతో చర్చించాలి. వారు చెప్పే అంశాలను / పదాలను నల్లబల్లమీద రాయాలి.
- వాటిని బొమ్మలు గీయమనవచ్చు లేదా రంగులు వేయమనవచ్చు. దీనివల్ల పిల్లల చేతి కదలికలకు తగిన అభ్యాసం లభిస్తుంది. పదాలను / బొమ్మలను ట్రేస్ కాగితం ఉపయోగించి రాయడం, గీయడం చేయించవచ్చు. చూసి కూడ రాయమనవచ్చు.
- వర్ణమాలను నేర్పడానికి వరుసగా అక్షరాలను పరిచయంచేసి రాయమనడం ఒక్కటే మార్గం కాదు. ఇది చాలా యాంత్రికమైనది. అర్థవంతంగా వర్ణమాలను ప్రవేశపెట్టడానికి వారికి తెలిసిన పదాలను, పేర్లను ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణ : ప, ల, క అక్షరాలను విడివిడిగా నేర్పాల్సిన అవసరం లేదు. 'పలక'ను చూపించి లేదా పాడించి పదాన్ని పరిచయం చేసి దానిలోని అక్షరాలను విడివిడిగా రాయమని చెప్పవచ్చు. దీనిలోని ఒక్కొక్క అక్షరంతో వచ్చే పదాలను పిల్లలనే అడిగి చార్ట్‌పై రాసి ప్రదర్శించవచ్చు. అనగా 'ప' తో, 'ల' తో, 'క' తో వచ్చే పదాలను పిల్లలను అడిగి రాబట్టవచ్చును. ఈ పదాలపై మాట్లాడించడం వల్ల తదుపరి దశల్లో వాటి గురించి వ్యక్తీకరించే సామర్థ్యం పొందడానికి దోహదపడుతుంది.
- రాయడం అంటే తప్పులు లేకుండా రాయడం మాత్రమేకాదు. అభివ్యక్తీకరణ సామర్థ్యం కాబట్టి అభివ్యక్తీకరణను పదాలతో ప్రారంభింపచేసి వాక్యాలు, పేరాలుగా రాసేటట్లు అభ్యాసం కల్పించాలి.
- ఒక విషయం గురించి వ్యాసరూపంలో లేదా కథనం రూపంలో క్రమపద్ధతిలో వ్యక్తీకరించే సామర్థ్యం పెంపొందించడానికి పిల్లలతో మొదట మాట్లాడించాలి. దీనివల్ల పిల్లలకు శ్రోతల స్పృహ, ఉద్దేశం బోధపడుతుంది. వ్యక్తీకరించే విషయం గురించి విషయ స్పష్టత ఏర్పడుతుంది. ఇతరులు మాట్లాడే అంశాలను వినడం ద్వారా విషయావగాహన ఏర్పడుతుంది. దీనివల్ల లేఖన సామర్థ్యం వృద్ధి చెందుతుంది.

- లేఖన సామర్థ్యంలో అతిముఖ్యమైనది సందర్భోచితంగా పదజాలాన్ని వినియోగించడం. ఇది వినడం, చదువడంతో ముడిపడి ఉంటుంది. మంచి ప్రసంగాలను, సంభాషణలను వినడంవల్ల మరియు వివిధ విషయాలకు చెందిన బాలసాహిత్యాన్ని, పత్రికలను, మ్యాగజైన్లు మొ॥ వాటిని చదివే అలవాటును పెంపొందించడంవల్ల పదజాలం మీద పట్టు లభిస్తుంది. ఉదా:– రాసేటప్పుడు సందర్భోచితంగా సాహితీపదాలను, జాతీయాలను, సామెతలను, ప్రముఖుల వ్యాఖ్యలను వినియోగించడం ఎలాగో తెలుస్తుంది. దీనివల్ల రాసిన విషయానికి పరిపుష్టి కలుగుతుంది. పాఠకునికి ఆసక్తి కలిగించేలా రాయడం అలవడుతుంది.
- వ్యక్తీకరించే అంశాన్ని విభిన్న వ్యవహార రూపాలలో రాయగలగడం అనేది అత్యున్నత లేఖన సామర్థ్యంగా భావిస్తారు. దీనినే సృజనాత్మక వ్యక్తీకరణ అనవచ్చు. కథలు, గేయాలు, సంభాషణలు, ఆత్మకథలు, లేఖలు, అభినందన పత్రాలు, వ్యాసాలు మొ॥నవి వ్యవహార రూపాలకు ఉదాహరణలు.

**ఇందుకోసం కొన్ని కృత్యాలను పరిశీలిద్దాం :**

1) గృహోపకరణాల చిత్రాలను / నమూనాలను సేకరించాలి. వాటిపేర్లను నల్లబల్లపై రాయాలి. పిల్లలను రెండు జట్లుగా చేయాలి. ఒక జట్టులోనివారు ఏదైనా ఒక వస్తువును తీసి 'కావాలి' అని చెప్పాలి. రెండవ జట్టులోనివారు దాని పేరును రాసి ఆ జట్టుకు ఇవ్వాలి.

2) సంకేతాలు : తమ గ్రామంలో / వాడలో లేదా బడికి వచ్చే మార్గంలో గోడలపై ఉన్న నినాదాలు, ప్రకటనలు, పోస్టర్‌లను చూసి రాయమని చెప్పాలి. వాటిని తరగతిలో నల్లబల్లపై రాసి వివరించమని చెప్పాలి.

3) పదపూరణం : ఒకరు ఒక పదం చెప్తే మరొకరు మరొక పదాన్ని జోడించి పూర్తిచేయాలి. వాటిని రాయమనాలి. ఉదాహరణకు మొదటి విద్యార్థి 'అన్నం' అంటే రెండవ విద్యార్థి 'అన్నం తింటాను' లేదా తింటాను అని పదాన్ని జోడించాలి. ఈ పదాలను నల్లబల్లపై ఇంకొకరు రాయాలి.

4) గొలుసుకట్టు వాక్యం : తరగతిలోని విద్యార్థులలో ఒకరు ఒక పదాన్ని రాసి పక్కనున్న విద్యార్థికి ఇవ్వాలి. అతను దానికి మరొక పదం జోడించాలి. వాక్యం పూర్తయ్యేవరకు ఇది కొనసాగాలి. మధ్యలో వాక్యం చెడిపోయినదో, సరిగా రాలేదనో భావిస్తే తిరిగి మొదలుపెట్టాలి. ఇదేవిధంగా వాక్యాలతో కూడ నిర్వహించవచ్చు. అనగా వాక్యంతో ప్రారంభించి ఒక సన్నివేశం పూర్తి అయ్యేవరకు కొనసాగించాలి.

5) ధ్వనుల పట్టిక : తమ చుట్టూ ఉన్న వస్తువులను, పనులను నిశితంగా పరిశీలించమనాలి. వాటి ధ్వనులను రాయమని చెప్పాలి. ఉదాహరణ 'కిర్రుమన్న తలుపు చప్పుడు'.

6) చిత్రాల ఆధారంగా పదాలు, వాక్యాలు, సన్నివేశాలను రాయమనడం.

7) చిత్రాల ఆధారంగా పాత్రల మధ్య సంభాషణలను రాయమనడం.

8) మైండ్ మ్యాపింగ్ : ఏదైనా ఒక అంశం గురించి వ్యాసం రాయించాలనుకుంటే ఆ పదాన్ని నల్లబల్లపై రాయాలి. దానికి సంబంధించిన పదాలను పిల్లలతో చెప్పించి నల్లబల్లపై రాయాలి. తాము చెప్పిన పదాల గురించి వివరించమనాలి. పిల్లలతో చర్చిస్తూ ఆ పదాలను వర్గీకరించమనాలి. ఒకరకమైన పదాలన్ని ఒక విషయాన్ని వివరించడానికి దోహదపడుతాయి.

ఉదా: 'చెట్టు' పదం నల్లబల్లపై రాయాలి. దానికి సంబంధించిన పదాలను చెప్పించాలి. వాటిని నల్లబల్లపై రాయాలి. తాము చెప్పిన పదాల గురించి మాట్లాడించాలి. 'కాయలు' అని ఒక విద్యార్థి చెప్తే చెట్టుకు, కాయకు మధ్యగల సంబంధాన్ని చెప్పమనాలి. ఇలా పిల్లలందరితో చెప్పించాలి. నల్లబల్లపై రాసిన పదాలతో చెట్టువల్ల కలిగే ప్రయోజనాలను

తెలిపే పదాలు ఏమున్నాయని అడగాలి. వీటి ఆధారంగా చెట్టు ప్రయోజనాలను చెప్పమనాలి. ఇలా రాసిన పదాలను వర్గీకరించి మాట్లాడించిన తర్వాత చెట్టు గురించి పిల్లలను రాయమని చెప్పాలి. ఇది వ్యాసరచనకు తోడ్పడుతుంది.

9) లేఖన స్వీయ మూల్యాంకనం, సామర్థ్యాన్ని వృద్ధి పరచుకోవడం :

- ఏదైనా ఒక అంశం గురించి పిల్లలను వ్యక్తిగతంగా రాయమనాలి.
- ముగ్గురు లేదా నలుగురిని జట్లుగా కూర్చోమనాలి.
- వారు వ్యక్తిగతంగా రాసిన అంశాన్ని చదివి వినిపించమనాలి.
- జట్టులో మిగతా పిల్లలు రాసిన దానితో పోల్చుకోమనాలి.
- తిరిగి మళ్ళీ ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా రాయమనాలి.
- మొదటిసారి రాసినదానికి, రెండవసారి రాసినదానికి తేడాను చెప్పమనాలి.

10) సంప్రదించి రాయడం : ఏదైనా ఒక అంశం గురించి వ్యక్తిగతంగా రాయమనాలి. దానిని పెద్దవారికి / ఉపాధ్యాయునికి చూపి అభిప్రాయం చెప్పమనాలి. దాని ఆధారంగా తిరిగి మళ్ళీ రాయమనాలి. లేదా రాసిన విషయానికి సంబంధించిన రెఫరెన్స్ పుస్తకం లేదా ఇతర పుస్తకాన్ని చదివి తాము రాసిన దానిని పోల్చుకోమనాలి. ఆ తదుపరి మళ్ళీ రాయమనాలి.

**లేఖన దోషాలను సవరించడం :**

- 1, 2, తరగతుల్లో సాధారణంగా పిల్లలు అక్షర దోషాలు రాస్తుంటారు. వీటిని సవరించడానికి పిల్లల నోటు బుక్కులను పరిశీలించి '✓' లేదా '×' ఉంచడంవల్ల ప్రయోజనం కలుగదు. అట్లాగే తప్పుగా రాసిన పదాన్ని పలుమార్లు చూసి రాయమనడం కూడా పిల్లలకు అర్థరహితంగా అనిపిస్తుంది. ఇది లేఖన సామర్థ్యాన్ని పెంపొందించదు. పిల్లలను పదాలు రాయమన్న తర్వాత ఆ పదాలను నల్లబల్లపై రాయాలి. వారు రాసిన పదాలను వీటితో పోల్చుకోమనాలి. పిల్లలతో చర్చిస్తూ అవగాహన కల్పించాలి. అవసరమైతే అక్షరరూపాన్ని పూర్తిగా పరిచయం చేయాలి.

  ఉదా॥ 'రాముడు' రాయమన్నాం. కొంత మంది పిల్లలు 'రముడు', 'రమడ' రాయవచ్చు. 'రాముడు' పదాన్ని నల్లబల్లమీద రాయాలి. ఈ పదంలోని ఒక్కొక్క అక్షరాన్ని వారు రాసిన దానితో పోల్చుకోమనాలి. తేడాను గుర్తింపచేయాలి. ఆ తర్వాత 'రాత' అనే పదాన్ని రాయమంటే 'రా' అక్షరాన్ని మళ్ళీ తప్పుగా రాస్తే దీర్ఘమున్న అక్షరాలను అనగా ప్రతి హల్లుకు దీర్ఘాన్ని చేర్చి నల్లబల్లపై రాస్తూ పిల్లలతో గుర్తింపచేయాలి. వాటితో పదాలను అభ్యాసం చేయించాలి.

- 3, 4, 5 తరగతుల్లో పిల్లలతో ఏదైనా ఒక అంశం గురించి పేరా / ప్రశ్నలకు జవాబులు రాయిస్తే వాటిని పరిశీలించాలి. వీటిలో రెండు రకాలైన దోషాలు కనిపిస్తాయి. (1) విషయపరమైన దోషాలు (2) భాషాపరమైన దోషాలు. విషయపరమైనవి అనగా సరైన విషయాన్ని రాశారా? క్రమపద్ధతిలో రాశారా? రాసిన విషయాన్ని చదివితే అర్థమయ్యేలా ఉందా? అనేవి. భాషాపరమైనవి అనగా వాక్యనిర్మాణం, సరైన పదజాలం, అక్షరదోషాలు, విభక్తులు మొ॥నవి. వీటిని నివారించి పిల్లల్లో లేఖన సామర్థ్యాన్ని పెంపొందించాలంటే చర్చ ద్వారా సరిదిద్దాలి.

  - పిల్లలు రాసిన సమాధానాలను సరిచేయాలి. ఇందుకోసం పిల్లల్లో ఎవరైనా రాసిన సమాధానాన్ని లేదా ఏదైనా జట్టు రాసిన సమాధానాన్ని నల్లబల్లపై లేదా చార్టుపై ఉన్నదున్నట్లుగా అంటే దోషాలతో కూడినది రాయాలి. ఇలా రాసినదాన్ని పూర్తి తరగతిలో చదివించాలి. దోషాలపై కింది ప్రశ్నల ద్వారా చర్చ నిర్వహించాలి.

అ) భావం సరిగా రాశారా?

ఆ) సరైన క్రమంలో రాశారా?

ఇ) సరైన వాక్యాలు రాశారా? వాక్యాలు పూర్తిగా రాశారా? అవి సరిగా ఉన్నాయా?

ఈ) వాక్యాలలో పదాలు సరిగా ఉన్నాయా? ఉన్న పదాల స్థానంలో ఇంకా మంచి పదాలను రాయవచ్చా?

ఉ) అక్షర దోషాలు ఏవైనా ఉన్నాయా? ఏఏ అక్షరాలను సరిగా రాయాలి?

ఇలా చర్చిస్తూ పిల్లలే సవరించేలా పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. ఆ తర్వాత జవాబును రాయమనాలి.

## పాఠ్యపుస్తకాలు - లేఖన సామర్థ్యం :

మన రాష్ట్రంలో పాఠ్యపుస్తకాలను రూపొందించడానికి భాషాసామర్థ్యాలు, భాషాభ్యసనం, భాషా విధానాల గురించి రాష్ట్ర విద్యా ప్రణాళిక-2011లో చర్చించి పొందుపరిచారు. ప్రత్యేకంగా "భాషాభ్యసనం" గురించి ఆధారపత్రం రూపొందించారు. దీనిలో భాషాపరంగా పెంపొందాల్సిన సామర్థ్యాలను వాటికి సంబంధించిన అభ్యసన ఫలితాలను కూడ పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని పాఠ్యపుస్తకాలను రూపొందించారు (అభ్యసనాఫలితాల గురించి తదుపరి అధ్యాయంలో విపులంగా తెలుసుకుంటారు). ప్రతి తరగతిలోని తెలుగు వాచకాలలో ప్రారంభంలోనే అభ్యసనా ఫలితాల జాబితా ఉంది. వీటిలో లేఖనా సామర్థ్యానికి చెందిన అభ్యసనా ఫలితాలు కూడ ఉన్నవి. 1, 2 తరగతుల్లో రాయడం పేరుతో లేఖన సామర్థ్యానికి చెందిన అభ్యాసాలున్నాయి. 3, 4, 5 తరగతులలో ఆలోచించి సొంతంగా రాయడం / స్వీయరచన పేరుతో ప్రశ్నలిచ్చారు.

## 1, 2 తరగతులలోని అభ్యాసాల స్వభావం :

- ఇవి ప్రధానంగా రాయడానికి చెందిన ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేవిగా ఉన్నాయి. అనగా తప్పులు లేకుండా రాయడం, అందంగా రాయడం, రాయడమెలాగో తెలిపే అభ్యాసాలు ఉన్నాయి.
- సొంతంగా పదాలు రాసేలా, తెలిసిన అక్షరాలతో, పద నిర్మాణం జరిగేలా కూడ అభ్యాసాలున్నవి.
- 3, 4, 5 తరగతుల్లో పిల్లలు తమకు తెలిసిన వాటిని సొంతంగా రాసేలా ఆలోచించి రాసేలా, బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నలున్నవి.
- ఇవి ఆలోచన, అభివ్యక్తి సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడుతాయి.
- సారాంశాలు రాయడం, పాత్రల స్వభావాలు రాయడం, కథలను సొంతమాటల్లో రాయడం, ఇష్టాయిష్టాలు, అభిప్రాయాలు, కారణాలు రాయడం వంటి వాటికి సంబంధించిన ప్రశ్నలున్నవి.

- *1, 2 తరగతుల పాఠ్యపుస్తకాలు పరిశీలించండి. వాటిలో రాయడానికి సంబంధించిన కొన్ని అభ్యాసాలను రాయండి.*
- *3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకాలలో ఏదైనా మూడు పాఠాల స్వీయరచన ప్రశ్నలు రాయండి. వాటి స్వభావాన్ని విశ్లేషించండి.*

## ఉపాధ్యాయుల బాధ్యతలు :

- పిల్లల లేఖన సామర్థ్యం ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు, సూచనలమీద ఆధారపడి ఉంటుందని గ్రహించాలి.
- లేఖనాన్ని కూడ అర్థవంతమైన సన్నివేశాల ద్వారా ప్రారంభించాలి.



SCERT TELANGANA

- పిల్లలతో సహనంగా వ్యవహరించాలి. పిల్లలు రాసిన అంశాలలోని తప్పులను ఆధారంగా చేసుకొని వారికి రాయడంరాదని వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకూడదు.
- పిల్లలు మాటలు నేర్చుకొనే ప్రారంభంలో తప్పులు మాట్లాడుతుంటారు. అయినప్పటికి సరైన భాషావాతావరణంలో పాల్గొనడం ద్వారా తమ తప్పులను తామే సవరించుకొని 20 నుండి 24 నెలల మాసాలలో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారు. అలాగే రాయడం కూడ. రాయడం ప్రారంభించిన కొత్తలో తప్పులు రాయడం సహజం. వాటిని ఎత్తిచూపకుండా సరైన రూపాన్ని నల్లబల్లపై రాసి చర్చద్వారా సరిదిద్దాలి.
- లేఖనంలో పిల్లలు చేసే దోషాలను నిశితంగా గమనించి అందుకుగల కారణాన్ని శోధించాలి. వీటిని నివారించడానికి అవసరమైన అభ్యాసాలను పిల్లలకు కల్పించాలి.
- పిల్లలతో క్రమం తప్పకుండా మాట్లాడించడం, పుస్తకాలను చదివించడం ద్వారా లేఖన సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు. మాట్లాడించడం, చదివించడంవల్ల విషయావగాహన పెరిగి తప్పులు లేకుండా రాయగలుగుతారు. లేఖనంలో మంచి పదజాలాన్ని వినియోగించే సామర్థ్యం కూడ అలవడుతుంది.
- పిల్లలను సొంతంగా రాసేలా ప్రోత్సహించాలి. వారు రాసిన అంశాలను పోర్ట్‌ఫోలియోలుగా భద్రపరచడం ద్వారా పిల్లల ప్రగతిని విశ్లేషించడానికి, సూచనలు ఇవ్వవచ్చు.
- పిల్లలు రాసిన అంశాలను తరగతి గదిలో ప్రదర్శింపజేయాలి. దీనివల్ల పిల్లల్లో స్వీయమూల్యాంకన శక్తి పెంపొందుతుంది.
- బడిలో తరుచుగా లేఖన పోటీలు నిర్వహించవచ్చు. అనగా కథలు రాయడం, వ్యాసాలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి నిర్వహించడంవల్ల పిల్లల్లో సృజనాత్మక రచనాసామర్థ్యం పెంపొందుతుంది.

**ముగింపు :**

లేఖనం భావవ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు. తమ ఆలోచనలను క్రమబద్ధీకరించే సాధనం కూడ. ఆలోచన, వ్యక్తీకరణ అనేది లేఖన సామర్థ్యం ద్వారా పరిపుష్టి చెందుతుంది. లేఖనాన్ని అర్థరహితంగా, యాంత్రికంగా ప్రారంభించకూడదు. పాఠ్యపుస్తకాలలో ఇచ్చిన అభ్యాసాలను పిల్లలతో అభ్యాసం చేయించి. మంచి భాషావాతావరణం కల్పించడం ద్వారా లేఖన సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు. లేఖనం అనేది వినడం, మాట్లాడడం, చదువడంతో ముడిపడి ఉన్న సామర్థ్యమని గ్రహించాలి. వాటిని పెంపొందించకుండ లేఖన సామర్థ్యాన్ని పెంపొందించలేము. ఇవన్నీ ఒకదానితో మరొకటి ప్రభావితమయ్యేవే. కాబట్టి ఈ అధ్యాయంలో చర్చించిన విధంగా లేఖనం యొక్క తాత్వికతను అర్థంచేసుకొని నూతన దృక్పథంతో సామర్థ్యాభివృద్ధికి కృషిచేయాలి.

# 8. భాషాభివృద్ధి - గ్రంథాలయం

పిల్లలలో పఠనాభిరుచిని, ఆసక్తిని, విస్తార పఠనానికి, సృజనాత్మకతకు, పిల్లలలో నైతిక విలువలు పెంపొందించుకోవడానికి. సాహిత్యాభిలాషకు, ఊహాశక్తిని పెంచుకోవడానికి, చురుకుదనంగా ఉండడానికి, ఇతర పిల్లలతో ఆనందంగా గడపడానికి. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుంది. అందుకోసమని ప్రతి పాఠశాలలో గ్రంథాలయం అవసరం.

**పుస్తకాలను ఎంపిక చేయడం :**

- పిల్లల స్థాయిని అనుసరించి పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి.
- చిత్రాలతో కూడిన కథల పుస్తకాలు.
- నీతి కథలకు సంబంధించిన పుస్తకాలు.
- పిల్లలలో ధైర్య సాహసాలు, నిజాయితీ, మిత్రుత్వం, త్యాగబుద్ధి, కార్యదీక్ష, భూతదయను, కృతజ్ఞతా భావాన్ని పెంపొందించే విధంగా ఉండే కథల పుస్తకాలను ఎంచుకోవాలి.
- వాస్తవికతను ప్రతిబింబించే కథల పుస్తకాలు.
- పశుపక్ష్యాదులు పాత్రలుగా గల నీతి కథలు, దేవతలు, రాక్షసులు మాంత్రికులు, అతీత శక్తులు మొదలైన వాటితో కూడిన జానపద కథల పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి.
- పిల్లల్లో భయాన్ని తగ్గించే కథల పుస్తకాలు.
- ప్రకృతి వర్ణనకు సంబంధించిన కథల పుస్తకాలు.
- పిల్లలు కథలు చదువుతున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందో ఊహించగలిగేలా ఉండే కథల పుస్తకాలు.
- పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కథల పుస్తకాలు.
- మానవత్వం, సహాయం, అద్భుతం, సామాన్యులలోని అసాధారణ శక్తి, ధైర్యం మొదలగు ఇతివృత్తాలు గల పుస్తకాలు.
- కళలకు సంబంధించిన పుస్తకాలు.
- చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు, దేవాలయాలకు సంబంధించిన కథల పుస్తకాలు.
- అంకెలగారడీ, సుడోకు, గడినుడి వంటి పుస్తకాలు.
- కామిక్స్, కార్టున్, జోక్స్ ఉన్న పుస్తకాలు.
- వార పత్రికలు, మాసపత్రికలు.
- హాస్య కథలకు సంబంధించిన పుస్తకాలు.
- బాలగేయాలు, చిన్న చిన్న కథలు.

సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించడం ప్రమాదం తెచ్చిపెట్టడమూ జరుగుతుంది. భూతదయ చాలా మంచిది నిస్సహాయులపట్ల దయ చూపడం వరకు ఇబ్బందిలేదు. కాని దుర్మార్గులపట్ల దయ చూపుతే ప్రమాదాలకు దారితీస్తుంది అనే యుక్తిగల కథల పుస్తకాలను ఎంపికచేసుకోవాలి.

SCERT TELANGANA

**కథల పుస్తకాలలో పిల్లలను నిమగ్నం చేయడం :**

పిల్లవాడు ఓ పుస్తకాన్ని చేతులోకి తీసుకోవాలంటే ముందుగా దాని రూపురేఖలు అందంగా, ఆకర్షణీయంగా, రంగు రంగుల బొమ్మలతో కూడినదై ఉండాలి. కవర్‌పేజీ కథ చదువాలి అనే ఆసక్తి కలిగించేదిగా ఉండాలి. సరళమైన భాషలో కథరాసి ఉండాలి. పిల్లల స్థాయికి తగిన విధంగా ఉండాలి. అప్పుడే పుస్తకాలను చదువడానికి పిల్లలు ఆసక్తిచూపుతారు.

- అందమైన చిత్రాలతో కూడిన కథల పుస్తకాలను పిల్లలకు ఇవ్వాలి వాటిని పరిశీలించమనాలి. వారితో మాట్లాడించాలి.

  ఉదా॥ 1) కవర్ పేజీని చూపిస్తూ చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?

  2) ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?

  3) ఈ కథల పుస్తకం పేరేమిటి?

- చిత్రాలను చూపిస్తూ కథను గురించిన కొంత సమాచారం ముందుగానే చెప్పాలి.
- కథను చెప్తుతూ మంచి మలుపు తిరిగే సమయంలో అకస్మాత్తుగా ఆపి తరువాత ఏం జరుగుతుందో ఊహించమనాలి.

  ఉదా॥ సింహం కుందేలు కథను చెప్పుతూ.

  ఎందుకు ఆలస్యంగా వచ్చినావు అని సింహం అడిగితే కుందేలు ఏమి సమాధానం చెప్పుతుందో ఊహించి చెప్పమనాలి.

- కథమొత్తం చదివిన తరువాత కథను వారి సొంతమాటల్లో చెప్పమనాలి.
- కథ ప్రారంభంలో ఏమి ఉన్నది? కథ మధ్యలో ఏమి ఉన్నది? కథ చివరికి ఏమైందో చెప్పమనాలి.
- కథ ఆధారంగా పిల్లలను అట్టముక్కలతో మాస్కులు తయారుచేసుకొని కథలోని పాత్రలతో ఏకపాత్రాభినయం చేయించడం, నాటకం వేయించడం, జోక్స్ చెప్పించడం చేయాలి.
- చిత్రంలోని సన్నివేశాల ఆధారంగా కథను చెప్పమనాలి. కృత్యం : విద్యార్థులందరిని అర్థ చంద్రాకారంలో నిలబెట్టాలి. పిల్లలందరికి చిత్రానికి సంబంధించిన ఒక్కొక్క కార్డును ఇవ్వాలి. కార్డ్‌లోని సన్నివేశానికి ముందు సన్నివేశాన్ని, వెనుక సన్నివేశాన్ని తెలుసుకోమనాలి. పిల్లవాడు ప్రతి పిల్లవాని దగ్గరికి వెళ్ళి తన కార్డ్‌లోని సన్నివేశాన్ని చెప్పమనాలి. తరువాత చూపమనాలి. తన దగ్గర ఉన్న కార్డులోని సన్నివేశం ముందుగాని, వెనుకగాని, సరిపోయేదిగా ఉంటే వారిని జతకట్టాలి. ఇలా అందరిని జతకట్టి కార్డులన్నీ ఒక వరుసక్రమంలో పేర్చమనాలి. ఆ కార్డులలోని సన్నివేశాలను చూస్తూ ప్రతి విద్యార్థిచేత కథ చెప్పించాలి.
- చిన్న సైజు ఫింగర్ పప్పెట్స్ సహాయంతో కూడా కథను చెప్పించవచ్చు.
- కథ ఆధారంగా పదాలను కలుపుతూ బొమ్మ గీయమనాలి. బొమ్మ గురించి మాట్లాడమనాలి.
- కథ పుస్తకంలోని ఒక పేజీ తీయమని చెప్పాలి. ఆ పేజీలోని చివరి పేరా చదువమనాలి. తరువాత వచ్చే పదాన్ని ఊహించి చెప్పమనాలి. విద్యార్థులు చెప్పిన పదాలను బోర్డ్‌పై రాయాలి. తరువాత పేజీ తిప్పి సరైన పదం ఏమి ఉన్నదో చూడాలి. సరిగా ఊహించి చెప్పిన విద్యార్థులకు చప్పట్లు కొట్టించాలి.
- కథకు సంబంధించిన 2, 3, వాక్యాలను చెప్పి తరువాత వచ్చే వాక్యాన్ని చెప్పమనాలి.
- కథలోని పాత్రలకు తగినట్లుగా హావభావాలను ప్రదర్శిస్తూ సంభాషణ చెప్పమనాలి.
- కథలోని పాత్రల స్వభావాలను చెప్పమనాలి.



SCERT TELANGANA

**కథాపఠనం - వ్యూహాలు :**

**బాహ్య పఠనం :**

i) పిల్లలందరిని అర్ధచంద్రాకారంలో కూర్చోపెట్టుకోవాలి. ఉపాధ్యాయుడు చిత్రాలు చూపిస్తూ మాట్లాడుతూ కథను చెప్పాలి. పిల్లలు వింటారు.

ii) ఉపాధ్యాయుడు కథ మొత్తం చదువుతాడు. విద్యార్థులు వింటారు. తరువాత చర్చ చేపట్టాలి.

1) కథలోని పాత్రలు ఏమిటి?

2) కథలోని కొన్ని పదాలను చెప్పమనాలి. వాటిని బోర్డ్‌పై రాయాలి. అవి కథలో ఎక్కడ ఉన్నాయో వెతకమనాలి.

3) చిత్రాలను చూస్తూ కథ చెప్పమనాలి.

4) కథకు సంబంధించిన నాలుగు వాక్యాలు చెప్పి అవి కథలో ఎక్కడ ఉన్నాయో వెతకమనాలి.

5) వాక్యానికి ముందున్న వాక్యాన్ని, వెనుక ఉన్న వాక్యాన్ని చదువమనాలి.

6) కథలోని ఒక సన్నివేశాన్ని చెప్పి ఆ సన్నివేశం ఉన్న పేరాలను చదువమనాలి.

7) కథను పిల్లలందరిచేత చదివించాలి.

8) చదివిన కథను మౌఖికంగా చెప్పమనాలి.

9) కథను సమరిస్థూ / విభేదిస్తూ తమ అభిప్రాయాలను చెప్పమనాలి.

- కథ విన్న తరువాత పిల్లలను కొన్ని ఆలోచింపజేసే ప్రశ్నలు అడిగించి.

ఉదా॥ సింహం, కుందేలు కథ చెప్పిన తరువాత.

1) ఈ కథ ద్వారా నువ్వు ఏం తెలుసుకున్నావు?

2) కథలో ధైర్యాన్ని - ఆత్మవిశ్వాసాన్ని పెంచే పాత్రలు ఏమైన ఉన్నాయా?

3) కథ విన్న తరువాత నీకు బాగా నచ్చిన పాత్ర ఏమిటి? ఎందుకు నచ్చింది?

4) కథలోని ముగింపును మరోలా చెప్పండి.

5) కథ మొత్తం విన్నావు కదా! ఈ కథకు మరోపేరు చెప్పండి.

**కలిసి చదువడం :**

i) పిల్లలందరిని గ్రూపులుగా చేయాలి.

మొదటి గ్రూపులోని వారిని కథను మౌనంగా చదువుకొని కథ మొత్తాన్ని వరుసక్రమంలో చెప్పమనాలి.

రెండవ గ్రూపులోని వారిని సంభాషణ రూపంలో చెప్పమనాలి.

మూడవ గ్రూపులోని వారిని కథలోని ఒక్కొక్క పాత్రను ఒక్కొక్క విద్యార్థిని చెప్పమనాలి.

నాలుగవ గ్రూపులోని వారిని కథలోని పాత్రల స్వభావాన్ని చెప్పమనాలి.

ii) పిల్లందరిని 4 గ్రూపులుగా చేయాలి.

మొదటి గ్రూపులోని వారిని కథలోని పాత్రల హావభావాలను వ్యక్తపరుస్తూ కథను చెప్పమనాలి.

రెండవ గ్రూపులోని వారిని కథ పొడిగిస్తూ చెప్పమనాలి.

మూడవ గ్రూపులోని వారిని కథ ద్వారా వారు తెలుసుకొన్న విషయాలు ఏమిటో చెప్పమనాలి.

నాలుగవ గ్రూపులోని వారిని కథకు సంబంధించిన చిత్రాలు గీయమనాలి.

iii) పిల్లందరిని 4 గ్రూపులుగా చేసి.

మొదటి గ్రూపులోని వారిని కథకు మరోపేరు పెట్టమనాలి.

రెండవ గ్రూపులోని వారిని కథ ఎక్కడ మలుపుతిరిగిందో చెప్పమనాలి.

మూడవ గ్రూపులోని వారిని కథకు ముగింపు మరోలా చెప్పమనాలి.

నాలుగవ గ్రూపులోని వారిని కథలోని అంశాలను నిజ జీవితానికి అన్వయించి చెప్పమనాలి.

**సూచనల ప్రకారం చదువడం :**

1) విద్యార్థులందరిని కథ చదువమనాలి.

2) కథలోని కీలక పదాలను బోర్డ్‌పై రాసి అవి కథలో ఎక్కడ ఉన్నాయో వెతకమనాలి.

3) కథకు సంబంధించిన కొన్ని వాక్యాలను చెప్పి అవి కథలో ఎక్కడ ఉన్నాయో వెతకమనాలి.

4) కథల పుస్తకంలో ఒక పేజీని చదువమని తరువాత పేజీలో వచ్చే మొదటి పదాన్ని, వాక్యాన్ని ఊహించి చెప్పమనాలి.

5) కథకు సంబంధించిన 4 వాక్యాలను 4 అట్టముక్కలపై రాసి వాటిని కథ ఆధారంగా వరుసక్రమంలో అమర్చమనాలి.

6) కథల పుస్తకంలోని ఒక పేజీని చదువమని అందులో నుంచి కొన్ని ప్రశ్నలు తయారుచేయమనాలి.

7) కొన్ని చిత్రాలను ఇచ్చి వరుస క్రమంలోకి మార్చి కథ చెప్పమనాలి.

8) కథలోని క్రియాపదాలను చెప్పమనాలి

9) కథలోని కొన్ని పదాలను బోర్డ్‌పై రాసి వాటితో సొంతవాక్యాలను చెప్పమనాలి.

10) వాటికి వ్యతిరేక పదాలు చెప్పమనాలి.

11) చిత్రాలను, వాక్యాలను జతపరచమనాలి.

12) కథలో అచ్చులతో మొదలయ్యే పదాలను చెప్పమనాలి.

13) ఒత్తుల పదాలు, గుణింత పదాలు చెప్పమనాలి.

14) కథ ఆధారంగా పదాలను కలుపుతూ బొమ్మ గీయమనాలి. బొమ్మను గురించి మాట్లాడమనాలి.

15) కొన్ని పదాలు ఇచ్చి వాటితో కొత్త కథను రాయమనాలి.

# 9. భాషా సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

భాషాబోధన లక్ష్యం భాషా సామర్థ్యాలను వృద్ధిపరచటం. వీటిని సాధిస్తేనే పిల్లలకు నాణ్యమైన విద్య లభించినట్లు. నాణ్యమైన విద్యను పొందడం నిర్బంధ విద్యాహక్కు చట్ట ప్రకారం హక్కుగా మారింది. ఈ చట్టంలోని సెక్షన్-29 ప్రకారం పిల్లలందరు జ్ఞానాన్ని, సామర్థ్యాలను, నైపుణ్యాలను, వైఖరులను పెంపొందించాలి. వీటిని దృష్టిలో పెట్టుకొని 2015 జూన్ మాసంలో ఆర్.టి.ఇ.-2009 చట్టంలో సెక్షన్-29కు సవరణ చేశారు. దీనిప్రకారం ప్రతీ విద్యార్థి 1 నుండి 8 తరగతి వరకు తరగతి వారీగా, సబ్జెక్టు వారీగా నిర్ధారించిన సామర్థ్యాలను, అభ్యసన ఫలితాలను సాధించాల్సి ఉంటుంది.

తెలుగుకు సంబంధించి భాషలో వినడం - ఆలోచించి మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థంచేసుకోవడం, స్వీయరచన, సృజనాత్మకత, పదజాలం, వ్యాకరణాంశాలు అనే సామర్థ్యాలున్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి తరగతి వారీగా పిల్లల స్థాయిని దృష్టిలో పెట్టుకొని అభ్యసన ఫలితాలను నిర్ధారించారు. ఉదా॥ ధారాళంగా చదువడం సామర్థ్యం 1వ తరగతిలో సరళ, గుణింత పదాలు చదువగలగడం, 2వ తరగతిలో ద్విత్వ, సంయుక్త పదాలు చదువగలగడం, 3వ తరగతిలో చిన్న చిన్న కథలు, గేయాలు చదివి అర్థం చేసుకోవడం, 4, 5 తరగతులలో చదివినదానిని అర్థం చేసుకొని ప్రతిస్పందించడం, ఉన్నత స్థాయిలలో అర్థంచేసుకొని విశ్లేషించడం. ఇలా ప్రతి సామర్థ్యానికి అభ్యసన ఫలితాలు నిర్దేశించారు. భాషాబోధనలో ఏ పాఠాన్ని బోధించినా అభ్యసనా ఫలితాలను దృష్టిలో పెట్టుకోవాలి. వీటికి అనుగుణంగా అభ్యాసం కల్పించాలి.

ఈ విషయంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే కొంత ముందంజలో ఉన్నాం. 2017లోని చట్ట సవరణ ద్వారా ఎన్.సి.ఇ.ఆర్.టి. రూపొందించి అభ్యాసఫలితాలను దేశవ్యాప్తంగా పంపిణీ చేశారు. 2010లో రాష్ట్ర విద్యా ప్రమాణాలు రూపొందించినప్పుడే వీటి గురించి చర్చించాము. 1 నుండి 10 వరకు తెలుగు వాచకాలలో పాఠాల కంటే ముందు విద్యా సంవత్సరం పూర్తి అయ్యేటప్పటికి విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు / అభ్యసన ఫలితాలను పొందుపరిచాము. వీటికి అనుగుణంగా ప్రతి పాఠంలో ధారాళంగా చదువడం అనే శీర్షిక కింద అభ్యాసాలున్నాయి. అట్లాగే పాఠం చివర స్వీయ మూల్యాంకన పట్టికను కూడా పొందుపరిచారు. వీటిని దృష్టిలో పెట్టుకొని పిల్లల్లో భాషాసామర్థ్యాలను పెంపొందించాలి. ఇది నైతిక బాధ్యత మాత్రమేకాదు. చట్టపరమైన విధి నిర్వహణ కూడా!

తరగతి వారీగా ప్రాథమిక స్థాయిలోని సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలను పరిశీలిద్దాం.

SCERT TELANGANA

## 1వ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు :

### I. విని అర్థం చేసుకోవడం, స్వేచ్ఛగా మాట్లాడడం

- పరిచితమైన కథలు, పాటలు, సంభాషణలు విని అర్థంచేసుకోగలగాలి.
- విన్న అంశం గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ? వంటి ప్రశ్నలకు జవాబులు ఇవ్వగలగాలి.
- సూచనలు విని అర్థంచేసుకొని ఆ ప్రకారం చేయగలగాలి.
- వింటున్నప్పుడు అక్షరాలమధ్య ధ్వని భేదాలు గుర్తించగలగాలి.
- తెలిసిన, చూసిన వాటి గురించి స్వేచ్ఛగా మాట్లాడగలగాలి.
- బొమ్మల ఆధారంగా మాట్లాడగలగాలి అనగా ఎవరున్నారు? ఏం జరుగుతున్నది? ఏం చేస్తున్నారు? వంటి అంశాలు చెప్పగలగాలి.
- గేయాలు, పాటలు రాగంతో భావంతో పాడగలగాలి.
- తెలిసిన కథలు సొంతమాటల్లో చెప్పగలగాలి.
- వర్ణమాల, గుణింతాల పదాలు, అక్షరాలను స్పష్టోచ్ఛారణతో పలుకగలగాలి.

### II. ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని చెప్పడం

- గేయాలు, పాటలు వంటి వాటిలో వాక్యాలు గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంలో కీలకపదాలు, వాటిలోని అక్షరాలు గుర్తించగలగాలి.
- పదాలలోని అక్షరాలను వర్ణమాల, గుణింతాల చార్టులలో గుర్తించగలగాలి.
- సరళపదాలు, గుణింత పదాలు, సరళమైన వాక్యాలు ధారాళంగా, తప్పులేకుండా చదువగలగాలి.
- చదువుతున్న పదాలలో లోపించిన అక్షరాలను గుర్తించి రాయగలగాలి. బొమ్మలతో పదాలు జతచేయగలగాలి.

### III. రాయడం.

- నేర్చుకున్న అక్షరాలు ఉపయోగించి సొంతంగా పదాలు రాయగలగాలి.
- వర్ణమాల ఆధారంగా సరళపదాలు రాయగలగాలి.
- గుణింత పదాలు రాయగలగాలి.
- బొమ్మల ఆధారంగా సరళ, గుణింత పదాలు, వాక్యాలు రాయగలగాలి.
- తప్పులేకుండా, అందంగా రాయగలగాలి.
- ఉక్తలేఖనం రాయగలగాలి.

### IV. సృజనాత్మకత.

- గేయాలు అభినయంతో పాడగలగాలి.
- బొమ్మలుగీసి, రంగులువేసి పదాలు రాయగలగాలి.
- అభినయగేయాలు పాడిగించగలగాలి.
- మట్టితో బొమ్మలు చేసి వాటి గురించి మాట్లాడగలగాలి.
- బొమ్మ ఆధారంగా కథను ఊహించి చెప్పగలగాలి.

SCERT TELANGANA

## 2వ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు :

### I. విని అర్థం చేసుకోవడం, స్వేచ్ఛగా మాట్లాడడం

- పరిచితమైన కథలు, గేయాలు, పాటలు, సంభాషణలు విని అర్థంచేసుకోవాలి.
- విన్న అంశం గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ? వంటి ప్రశ్నలకు జవాబులు చెప్పగలగాలి..
- సూచనలు విని అర్థంచేసుకొని ఆ ప్రకారం చేయగలగాలి.
- వింటున్నప్పుడు అక్షరాల మధ్య ధ్వని భేదాలు గుర్తించగలగాలి.
- తెలిసిన, చూసిన వాటి గురించి స్వేచ్ఛగా మాట్లాడగలగాలి.
- చిత్రాల ఆధారంగా మాట్లాడగలగాలి. అనగా ఎవరున్నారు? ఏం జరుగుతున్నది? ఏం చేస్తున్నారు? వంటి అంశాలు చెప్పగలగాలి.
- తెలిసిన కథలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- గేయాలు, పాటలు, పద్యాలు రాగంతో, భావంతో పాడగలగాలి.
- వర్ణమాల, గుణింతాక్షర, ద్విత్వ, సంయుక్త పదాలు స్పష్టమైన ఉచ్చారణతో పలుకగలగాలి.

### II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం

- గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు, పొడుపుకథలు వంటి వాటిలో వాక్యాలు గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంలోని కీలకపదాలు, ఒత్తుపదాలు, వాటిలోని అక్షరాలు, ఒత్తులు గుర్తించగలగాలి.
- పదాలలోని అక్షరాలను వర్ణమాల, గుణింతాల చార్టులో గుర్తించగలగాలి.
- సరళపదాలు, గుణింత పదాలు, ద్విత్వపదాలు, సంయుక్తపదాలు, వాక్యాలు సరిచేసి చదువడం వంటివి చేయగలగాలి.
- లోపించిన ఒత్తులను సరైనచోట ఉంచి రాయగలగాలి.

### III. రాయడం

- నేర్చుకున్న అక్షరాలు ఉపయోగించి సొంతంగా పదాలు రాయగలగాలి.
- సరళపదాలు, గుణింత పదాలు, ద్విత్వ, సంయుక్తాక్షర పదాలు రాయగలగాలి.
- బొమ్మల ఆధారంగా పదాలు, వాక్యాలు రాయగలగాలి.
- పదాలు, వాక్యాలు తప్పులేకుండా, అందంగా రాయగలగాలి.
- ఉక్తలేఖనం రాయగలగాలి.
- పట్టిక ఆధారంగా పదాలు రాయగలగాలి. తెలిసిన పదాలు రాయగలగాలి.
  ఉదా॥ పక్షులు, జంతువులు, కుటుంబ సభ్యుల పేర్లు, కూరగాయలు, పండ్లు, పూలు... మొదలైనవి.
- చిన్న చిన్న వాక్యాలు సొంతంగా రాయగలగాలి.

### IV. సృజనాత్మకత

- గేయాలను అభినయంతో పాడగలగాలి.
- గేయాన్ని పొడిగించగలగాలి.
- చిత్రం గీసి దాని గురించి రాయగలగాలి.
- సంభాషణను రాయగలగాలి.
- చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పగలగాలి, రాయగలగాలి.



SCERT TELANGANA

## 3వ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు :

### I. వినడం - ఆలోచించి మాట్లాడడం

- గేయాలను రాగంతో పాడాలి, అభినయం చేయాలి.
- గేయాలు, కథలు, సంభాషణలు, పద్యాలు మొదలయినవి విని అర్థంచేసుకోవాలి.. సొంతమాటల్లో చెప్పగలగాలి.
- తెలిసిన, విన్న, చూసిన అంశాల గురించి సొంతమాటల్లో క్రమపద్ధతిలో చెప్పగలగాలి.
- ఊహించి మాట్లాడగలగాలి.
- విన్నవాటి గురించి స్పందించాలి, ప్రశ్నించాలి.

### II. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని చెప్పడం

- గేయాలు, కథలు, సంభాషణలు, పద్యాలు మొదలైనవాటిని ధారాళంగా చదువాలి. అర్థంచేసుకోవాలి, చదివిన అంశాల గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ... వంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలగాలి, రాయగలగాలి.
- చదివిన అంశాలలోని ప్రాసపదాలు, జంటపదాలు మొదలైన వాటిని గుర్తించాలి.
- చదివిన అంశాలలోని పదాల అర్థాలను సందర్భాన్ని బట్టి గ్రహించాలి.
- చదివిన అంశం గురించి అర్థంచేసుకోవాలి. సొంతమాటల్లో చెప్పాలి.
- వివిధ రూపాల్లో ఉన్న బాలసాహిత్యాన్ని ధారాళంగా చదువగలగాలి. అర్థంచేసుకొని చెప్పాలి.
- పాఠ్యపుస్తకం చివరలో ఉన్న పదపట్టికను ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి.

### III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం

- తెలిసిన, విన్న, చూసిన విషయాలు, కథలు, ఇష్టాయిష్టాలు మొదలైన వాటిని గురించి సొంతమాటల్లో ఐదు, ఆరు వాక్యాలు లేదా పేరా రాయాలి.
- తప్పుల్లేకుండ, విరామచిహ్నాలు ఉపయోగించి క్రమపద్ధతిలో రాయాలి. రాసేటప్పుడు సంపూర్ణ వాక్యాలతో సరైన పదాలు ఉపయోగించి అర్థవంతంగా రాయాలి.
- ప్రశ్నలకు జవాబులను రాయగలగాలి. లేఖన దోషాలను సరిచేసుకోగలగాలి.

### IV. పదజాలం

- పదాలకు అర్థాలు రాయగలగాలి. వాటిని ఉపయోగించగలగాలి.
- ఇచ్చిన పదాలకు సంబంధించిన పదాలు రాయగలగాలి.
- బహువచన రూపాలు ఎట్లా ఏర్పడుతాయో చెప్పగలగాలి. వచనాలకు అనుగుణంగా వాక్యాలు రాయాలి.
- పదాలవరుసలో సంబంధంలేని పదాన్ని గుర్తించగలగాలి.
- జంట పదాలను గుర్తించి, మరికొన్ని రాయగలగాలి.

### V. సృజనాత్మకత / ప్రశంస

- సూచనల ఆధారంగా బొమ్మలు గీసి రంగులు వేయాలి, దాని గురించి రాయాలి.
- కథలు, గేయాలను పొడిగించాలి. చిత్రం ఆధారంగా సంభాషణలు, కథలు రాయడం, ఊహించి రాయడం వంటివి చేయగలగాలి.
- పట్టికలు తయారుచేయడం, సూక్తులు వంటివి రాయగలగాలి.
- 'కథ'ను నాటకీకరణ చేయగలగాలి.

### VI. భాషను గురించి తెలుసుకుందాం

- భాషాంశాలలోని వివిధ అంశాలను గుర్తించాలి.
- పదాలలోని అచ్చులు, హల్లులు, హ్రస్వ, దీర్ఘాక్షరాలు, అల్పప్రాణ, మహాప్రాణ, ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలను ఉంచాలి.
- వాటిని స్పష్టంగా పలకడంలో తేడాను గుర్తించాలి. ఉదాహరణలు చెప్పాలి.

## 4వ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు :

### ❖ వినడం - ఆలోచించి మాట్లాడడం

- గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు మొదలయిన వాటిని విని అర్థం చేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంత మాటల్లో చెప్పగలగాలి.
- చర్చల్లో పాల్గొనగలగాలి. అభిప్రాయాలు చెప్పగలగాలి.
- చిన్న చిన్న ప్రసంగాలు ఇవ్వాలి, తెలిసిన వాటి గురించి చెప్పగలగాలి.
- కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.

### ❖ ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని చెప్పడం, రాయడం.

- పద్యాలు, పాటలు, గేయాలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథల వంటి ప్రక్రియా రూపాలు చదువగలగాలి, అర్థంచేసుకొని చెప్పగలగాలి.
- బాల సాహిత్యం, వార్తా పత్రికలు, మేగజైన్‌లు, అపరిచిత అంశాలు చదువగలగాలి. అర్థం చేసుకోవాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, ప్రాసపదాలు గుర్తించడం, పట్టికలు తయారుచేయడం, తప్పొప్పులు గుర్తించడం, అర్థాలు గ్రహించడం, శీర్షికలు నిర్ణయించడం, ప్రశ్నలు తయారుచేయడం వంటివి చేయగలగాలి.

### ❖ ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయ రచన)

- పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలయిన వాటిని సొంత మాటల్లో రాయగలగాలి.
- ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ సొంత మాటల్లో కనీసం 8 వాక్యాలు రాయగలగాలి. అట్లే ఒకటి రెండు పేరాలు రాయగలగాలి.
- ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏం చేస్తారో రాయగలగాలి. తమ అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాయగలగాలి.

### ❖ పదజాలం

- ఇచ్చిన పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి.
- సందర్భాన్ని బట్టి అర్థాలు గ్రహించగలగాలి. తిరిగి ఉపయోగించగలగాలి.
- పద పట్టికలు, గళ్ళ నుడికట్లు వంటి భాషా క్రీడలద్వారా సందర్భోచితంగా పదాలు రాయగలగాలి.

### ❖ సృజనాత్మకత / ప్రశంస

- గేయాలు పొడిగించగలగాలి. ఆత్మకథలు, నినాదాలు, లేఖలు, సంభాషణలు మొదలగువాటిని రాయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.

### ❖ భాషను గురించి తెలుసుకుందాం

- భాషా భాగాలు, విరామ చిహ్నాలు ఉపయోగించగలగాలి.



SCERT TELANGANA

## 5వ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు :

### ❖ వినడం - ఆలోచించి మాట్లాడడం

- గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు మొదలయిన వాటిని విని అర్థం చేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంత మాటల్లో చెప్పగలగాలి.
- చర్చల్లో పాల్గొనగలగాలి. తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.
- చిన్న చిన్న ప్రసంగాలను ఇవ్వాలి, తెలిసిన వాటి గురించి చెప్పగలగాలి.
- కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.

### ❖ ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని చెప్పడం, రాయడం.

- పద్యాలు, పాటలు, గేయాలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథల వంటి ప్రక్రియా రూపాలను చదువగలగాలి, అర్థం చేసుకొని చెప్పగలగాలి.
- బాల సాహిత్యం, వార్తా పత్రికలు, మేగజైన్‌లు, అపరిచిత అంశాలను చదువగలగాలి, అర్థం చేసుకోవాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, ప్రశ్నలు తయారుచేయడం, తప్పొప్పులు గుర్తించడం, అర్థాలు గ్రహించడం, శీర్షికలు నిర్ణయించడం, విషయాన్ని క్రమపద్ధతిలో ఉంచడం వంటివి చేయగలగాలి.

### ❖ ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయ రచన)

- పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలయిన వాటిని సొంత మాటల్లో రాయగలగాలి.
- ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ సొంత మాటల్లో కనీసం 8 వాక్యాలు రాయగలగాలి. అట్లే ఒకటి రెండు పేరాలు రాయగలగాలి.
- ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏం చేస్తారో రాయగలగాలి. తమ అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాయగలగాలి.

### ❖ పదజాలం

- ఇచ్చిన పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి.
- సందర్భాన్ని బట్టి అర్థాలను గ్రహించగలగాలి. తిరిగి ఉపయోగించగలగాలి.
- పద పట్టికలు, గళ్ళ నుడికట్టు వంటి భాషా క్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాయగలగాలి.

### ❖ సృజనాత్మకత / ప్రశంస

- కథలు, కవితలు, గేయాలను పొడిగించగలగాలి, సొంతంగా రాయగలగాలి. ఆత్మకథలు, నినాదాలు, సూక్తులు, లేఖలు, సంభాషణలు మొదలగువాటిని రాయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.
- సూచనలకు అనుగుణంగా చిత్రాలను గీయడం, రంగులు వేయడం, వాటి గురించి రాయడం చేయగలగాలి.

### ❖ భాషను గురించి తెలుసుకుందాం

- భాషా భాగాలను, కాలాలు, విరామ చిహ్నాలను ఉపయోగించగలగాలి, కాలాలకు అనుగుణంగా క్రియలను ఉపయోగించగలగాలి. సమాపక, అసమాపక క్రియలను గుర్తించి ఉపయోగించగలగాలి.



SCERT TELANGANA

# 10. జాతీయ సాధన స్థాయి పరీక్ష - ఫలితాల విశ్లేషణ

**ఉపోద్ఘాతం :**

దేశ వ్యాప్తంగా పిల్లల అభ్యసనా స్థాయిలను అధ్యయనం చేయడానికి 2017 నవంబర్ 13వ తేదీన 3వ, 5వ, 8వ తరగతులకు ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. 3, 5 తరగతులకు ఇచ్చిన ప్రశ్నపత్రంలో 45 ప్రశ్నలున్నవి. వీటిలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానానికి 15 మార్కుల చొప్పున కేటాయించారు. ఈ ప్రశ్నలన్ని బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో ఉన్నవి. ఈ సబ్జెక్టులలోని సామర్థ్యాల వారిగా ఉన్న అభ్యసన ఫలితాలను దృష్టియందుంచుకొని ప్రశ్నలను రూపొందించారు. పరీక్ష అనంతరం ఫలితాలను జిల్లాల వారిగా, రాష్ట్రాల వారిగా, రూపొందించారు. వాటిని పరిశీలిద్దాం.

**ప్రశ్నల స్వభావం :**

భాషలో ధారాళంగా చదువడం, అర్థంచేసుకోవడం సామర్థ్యానికి చెందిన అభ్యసన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ప్రశ్నలు పొందుపరచారు.

**3వ తరగతి :**

- చిన్న పేరాగ్రాఫ్‌లను చదివి అర్థంచేసుకోవడం అందులోని ముఖ్యాంశాలను గుర్తించడం.
- చదివిన అంశంలోని వివరాలను గ్రహించడం.
- చదివిన అంశాలను అర్థంచేసుకొని వరుసక్రమంలో ఉంచడం.

**5వ తరగతి :**

- ఇచ్చిన పేరాను చదివి అర్థంచేసుకోవడం.
- పద్యాలను / గేయాలను చదివి అర్థంచేసుకోవడం.
- పోస్టర్‌లను చదివి విషయాన్ని గ్రహించడం.
- వివిధ చార్టులను (సమాచార పట్టికలు) చదివి విషయాన్ని గ్రహించడం.

**అధ్యయనం వివరాలు :**

మన రాష్ట్రంలో 3వ తరగతికి బోధిస్తున్న 4,294 మంది ఉపాధ్యాయుల నుండి వివరాలు సేకరించారు.

- 1840 పాఠశాలల్లో అధ్యయనం జరిగింది. అట్లాగె 3వ తరగతికి చెందిన 25,910 మంది విద్యార్థుల్ని మన రాష్ట్రంలో పరీక్షించారు.
- 5వ తరగతి బోధిస్తున్న 7,270 ఉపాధ్యాయుల నుండి అభిప్రాయాలు సేకరించారు.
- 1,579 పాఠశాలల్లోని 37,659 మంది 5వ తరగతికి విద్యార్థుల్ని పరీక్షించారు.
- తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యాజమాన్యాల వారీగా ఎంపికచేసిన పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు.

**ఫలితాలు :**

- 3వ తరగతిలో తెలుగులో సరైన జవాబులు గుర్తించినవారు 68% ఉన్నారు, 5వ తరగతిలో 57% ఉన్నారు. 8వ తరగతిలో 53% ఉన్నారు.



SCERT TELANGANA

- రాష్ట్ర ఫలితాలను జాతీయ స్థాయితో పోల్చగా...

| 3వ తరగతి | | 5వ తరగతి | | వ్యత్యాసం | |
|---|---|---|---|---|---|
| రాష్ట్ర స్థాయి | జాతీయ స్థాయి | రాష్ట్ర స్థాయి | జాతీయ స్థాయి | 3వ తరగతి | 5వ తరగతి |
| 68% | 68% | 57% | 58% | - | 1% జాతీయ స్థాయి ఎక్కువ |

- 3వ తరగతిలో జాతీయస్థాయి ఫలితాలతో రాష్ట్ర స్థాయి సమానంగా ఉన్నది, 5వ తరగతిలో జాతీయస్థాయి 1% ఎక్కువ ఉన్నది కావున దీనిని దాదాపు సమానమని చెప్పవచ్చు.
- 8వ తరగతిలో రాష్ట్ర స్థాయిలో 53% ఉంటె జాతీయ స్థాయిలో 57% ఉంది అనగా జాతీయ స్థాయి కంటె రాష్ట్ర స్థాయి 3% తక్కువగా ఉన్నది.

**విశ్లేషణ :**

- 3, 5, 8 తరగతుల ఫలితాలను పోల్చినప్పుడు క్రమేణా తగ్గుముఖం పట్టడం గమనార్హం.
- 3వ తరగతిలో చదివిన అంశాన్ని అర్థంచేసుకోవడానికి పరిమితం అయితే 5, 8 తరగతుల్లో చదివిన అంశం ఆధారంగా ఆలోచించడం, విశ్లేషించడంలో పిల్లలు వైఫల్యాలు ఎదుర్కొంటున్నారని గమనించవచ్చు.
- చదువడం అర్థంచేసుకోవడం అనే సామర్థ్యం యొక్క ప్రభావం మిగతా సబ్జెక్టులను అర్థంచేసుకోవడాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఉదా॥ 3వ తరగతి పరిసరాల విజ్ఞానం 67%, 5వ తరగతి పరిసరాల విజ్ఞానంలో 54% ఫలితాలను విశ్లేషిస్తే అర్థం అవుతుంది.
- అలాగే గణితంలోని ఫలితాలు కూడ భాష ఫలితాలతో సమానంగానే ఉన్నవి. భాషలో ధారాళంగా చదువడం అర్థంచేసుకోవడం సామర్థ్యాన్ని అవగాహన కల్పిస్తేనే పరిసరాల విజ్ఞానం, గణితం విషయాలలో అభివృద్ధి కనిపిస్తుంది.

| | 30% తక్కువ చేయగలిగినవారు | 30% - 50% మధ్య చేయగలిగినవారు | 50% - 75% మధ్య చేయగలిగినవారు | 75% పైన చేయగలిగినవారు |
|---|---|---|---|---|
| 3వ తరగతి | 7.2% | 16.7% | 34.1% | 42% |
| 5వ తరగతి | 13.8% | 26.2% | 37.1% | 22.8% |
| 8వ తరగతి | 17% | 28.7% | 39% | 15.4% |

**విశ్లేషణ :**

- వాస్తవానికి 75% ప్రశ్నలను సాధించగలిగినవారు మాత్రమే ఆ తరగతికి చెందిన పఠన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు కలిగి ఉన్నారని అర్థం. దీనిని బట్టి 3వ తరగతి 42% మంది, 5వ తరగతి 22.8%, 8వ తరగతిలో 15.4% మంది ఆ తరగతి స్థాయి కలిగి ఉన్నారని అర్థం అవుతున్నది.
- 3వ తరగతిలో 58% మంది, 5వ తరగతిలో 77.2% మంది, 8వ తరగతి 84.6% మంది ఆ తరగతికి సంబంధించిన పఠన సామర్థ్యానికి ఉద్దేశించిన అభ్యసన ఫలితాలు సాధించాల్సి ఉంది.

SCERT TELANGANA

- వీరిలో 30% వరకు 3వ తరగతిలో 7.2%, 5వ తరగతిలో 13.8%, 8వ తరగతిలో 17% మంది ఉన్నారు. వీరు ధారాళంగా చదువడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- 30% - 50% వరకు 3వ తరగతిలో 16.7%, 5వ తరగతిలో 26.2%, 8వ తరగతిలో 28.7% మంది ఉన్నారు. వీరు ధారాళంగా పూర్తిస్థాయిలో చదువలేనివారు, గుణించుకుంటు చదువగల్గినవారై ఉంటారు.
- 50% - 75% వరకు 3వ తరగతిలో 34.1%, 5వ తరగతిలో 37.1%, 8వ తరగతిలో 39% మంది ఉన్నారు. వీరు ధారాళంగా చదువగలిగినప్పటికి అర్థంచేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- పఠన సామర్థ్యం అనగా ధారాళంగా చదువగల్గడం, చదివిన దానిని అర్థంచేసుకోవడం అర్థంచేసుకొన్నదానిని వ్యక్తీకరించడం, ఇది చేయగల్గిన వారు మాత్రమే స్వీయరచన, సృజనాత్మకత, పదజాల సామర్థ్యంపై పట్టు సాధించగలుగుతారు. అందుకే పఠనాన్ని మౌళిక లేదా మూలాధార సామర్థ్యంగా భావిస్తారు. ఇందుకు అనుగుణంగా పఠన సామర్థ్యానికి చెందిన అభ్యసన ఫలితాలు సాధించేలా పాఠ్యపుస్తకాలలో అభ్యాసాలున్నాయి. వీటిని తప్పనిసరిగా తరగతి గదిలో అభ్యాసంచేయిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది.

**పరిణామాలు :**

- పఠన సామర్థ్యంలో అభ్యసన ఫలితాలు పొందగలిగినవారు తక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశం.
- దీని ప్రభావంవల్ల పిల్లలు ఇతర సబ్జెక్టులు నేర్చుకోవడంలో కూడ ఇబ్బందులు ఎదుర్కొంటారు.
- 2017 నవంబర్‌లో జరిగిన సాధనస్థాయి పరీక్షలో కేవలం పఠన సామర్థ్యాన్ని మాత్రమే పరీక్షించారు. ఇవి కూడ బహుళైచ్ఛిక ప్రశ్నలే. ఒక వేళ స్వీయరచన లేదా సృజనాత్మకత సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలు ప్రాతిపదికగా తీసుకొని జాతీయస్థాయి సాధన పరీక్షను నిర్వహిస్తే ఫలితాలు మరింత ఆందోళనకు గురిచేసేవిగా ఉంటాయని చెప్పక తప్పదు.

**చేపట్టాల్సిన చర్యలు :**

- భాషాపరంగా పాఠ్యాంశాల ఆధారంగా భాషా సామర్థ్యాలను, వాటికి చెందిన అభ్యసన ఫలితాలను సాధించే విధంగా దృష్టిఉంచాలి.
- ఇందుకోసం ప్రతి పాఠ్యపుస్తకంలో ఇచ్చిన సాధించాల్సిన సామర్థ్యాలను, అభ్యసన ఫలితాలు చదివి అర్థంచేసుకోవాలి.
- వీటికి సంబంధించిన అభ్యాసాలు ప్రతి పాఠంలో ఉన్నవి. వీటిని విధిగా ప్రతి విద్యార్థిచే చేయించాలి.
- అనగా పిల్లలను చదివి జవాబులు రాయమనాలి. ఆ తర్వాత చర్చ ద్వార సరిదిద్దాలి. గైడ్‌లలో చూసి, రాయడాన్ని నిరోధించాలి. మనం కూడ జవాబులను నల్లబల్లపై రాయడం చేయకూడదు.
- పఠన సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రధానంగా రెండు వ్యూహాలను అమలుపరచవచ్చు.

  **మొదటిది** : పిల్లలను పాఠ్యాంశం చదివేలా చేయడం, అర్థంచేసుకొనేలా వ్యూహాలను అమలుపరచడం.

  **రెండవది** : పఠనావగాహనను పెంపొందించడానికి లేదా పిల్లల స్థాయిని పరీక్షించడానికి కృత్యాలు నిర్వహించడం, వ్యూహాలు అమలుపరచడం.

**ధారాళంగా చదివించే సామర్థ్యం పెంపొందించే వ్యూహాలు :**

1) పాఠం చిత్రం ఆధారంగా మాట్లాడించడం, విషయాన్ని ఊహింపచేయడం.

2) పాఠంలోని పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలను ఊహింపచేసి పాఠం చదివి పోల్చుకోమనడం.

3) పాఠంలోని ముఖ్యమైన సంఘటనలు, పాత్రల గురించి సంబంధిత అంశాలు, సన్నివేశాల గురించి మైండ్ మ్యాపింగ్ చేయించడం, తర్వాత పాఠం చదివించడం.

4) చదివే విషయం గురించి ముందుగానే చర్చ నిర్వహించడం, ఆ తర్వాత చదివించడం.

5) సూచనలు ఇచ్చి చదువమనడం... ఉదా॥ "పరమానందయ్య శిష్యుల కథ" పాఠం 4లో వారి స్వభావం తెలిపే పదాలు వెతకమనడం.

'వినాయక చవితి' పాఠంలో పండుగను ఎందుకు జరుపుకొంటారో, దీనికి చెందిన వాటిని గుర్తించమనడం.

ఉదా॥ గేయంలో ప్రాస పదాలు వెదకమనడం, ఏ ప్రాసపదాలు ఎక్కడ ఉన్నవో అడగడం.

6) 'కథ' పాఠ్యాంశాలను బోధించడానికి ముందు కొంత కథ చెప్పి తర్వాత ఏమి జరిగిందో చదివి తెలుసుకొని చెప్పమనడం.

7) గేయ ప్రక్రియ పాఠాలను ముందుగా పాడించి, అభినయంచేసి ఆ తర్వాత పాఠాన్ని చదువమనడం. లేదా గేయాన్ని చదివి దాన్ని పాడే విధానాన్ని అభ్యాసం చేయమనడం.

8) వ్యాస రూప పాఠ్యాంశాలను బోధిస్తున్నప్పుడు, ఏదైనా ముఖ్యమైన సంఘటన వివరించి, దాని గురించి మరిన్ని వివరాలను పాఠం చదివి చెప్పమనడం.

9) 'పాఠం'లో ఏ పదాలు ఎక్కువగా ఉన్నవి? వంటి సవాళ్ళతో కూడిన ప్రశ్నలు అడగడం.

10) 'తంబోలా' ఆట ఆడించడం. ఉదా॥ ఏదైనా ఒక పాఠం, చదివి పాఠంలోని 10 ఐదక్షరాల పదాలను వారి నోట్‌బుక్కులో రాసుకోమనాలి. అందరు రాసుకొన్న తర్వాత ఉపాధ్యాయుడు తనకు ఇష్టమైన పదాలను పాఠంలోనివి చెప్పాలి. ఉపాధ్యాయుడు చెప్పిన పదాలు వారి నోటుబుక్కులో ఉంటే, దానికి '◯' చుట్టమనాలి. ఇలా చెప్పుకొంటూ వెళ్ళినప్పుడు, ఎవరివద్ద ఉన్న 10 పదాలు ముందుగా '◯' చుట్టడం పూర్తయితే వారు గెలిచినట్లు. ఈ ఆటవల్ల పిల్లలు పాఠం చదువడం, ఆసక్తిగా వినడం చేస్తారు.

11) సంబంధించిన పదాలు ఊహించి రాయమనడం. పాఠం చదివి పోల్చుకోమనడం. ఉదా॥ 'గోదావరి నది' గురించి బోధించడానికి ముందు దీనికి సంబంధించిన పదాలను చెప్పమనాలి. వాటిని నల్లబల్లమీద రాయమనాలి. అవి పాఠంలో ఉన్నవా? అనేది పాఠం చదివి తెలుసుకోవాలి.

12) **సారూప్యత :** ఏదైనా ఒక పాఠం పూర్తి అయితే లేదా చెప్పాలనుకుంటే అలాంటివి మరొకటి చెప్పమని చెప్పాలి. ఉదా॥ సింహం - కుందేలు కథచెబితే సింహానికి సంబంధించిన మరొక కథ చెప్పమనాలి. లేదా పాండవులలో ఒకరి గురించి చెప్పి భీముని గురించి పాఠం చదివి చెప్పమనాలి. పాఠంలోని చిత్రాన్ని చూసి పాఠంలోని విషయంలో పోలికలు, భేదాలు చెప్పమనాలి. చిత్రంలోని విషయం పాఠంలో ఉందా, చిత్రంలో లేని విషయం పాఠంలో ఏం ఉందో అడగడం ద్వారా పాఠం చదివించవచ్చు.

SCERT TELANGANA

13) **పదజాలం :** ఏదైనా ఒక పదం చెప్పి అదే అర్థం వచ్చే పదం పాఠంలో వెతకమనాలి. ఏదైనా ఒక పదానికి చెందిన పదాలను పిల్లలను అడిగి నల్లబల్లపై రాసి వాటిలో ఏఏ పదాలు పాఠంలో ఉన్నవో వెదకమనాలి. పదాలకు చెందిన నానార్థాలు, పర్యాయపదాలు పిల్లలతో చర్చింపచేసి పాఠంలో అన్వేషింపచేయాలి. వర్ణనాత్మక పదాలు, పాత్రల స్వభావాన్ని తెలిపే పదాలు, ముఖ్య క్రియాపదాలు, సందేశాత్మక పదాలు, విలువలకు సంబంధించిన పదాలు పాఠంలో వెదకమని చర్చ నిర్వహించాలి. తద్వారా పాఠం చదువడానికి పిల్లలు అలవాటుపడతారు.

14) ఒక సంఘటనకు చెందిన పదాలను ఇచ్చి ఇవి క్రమపద్ధతిలో ఉన్నవా, లేవా పాఠం చదివి తెలుసుకోమనాలి.

15) తరువాతి పదాన్ని ఊహించి చెప్పమనాలి. ఒక పేజీలోని చివరి పదం చెప్పి తరువాత పదం ఊహించి చెప్పమనాలి. సరియైనదో, లేదో తెలుసుకోమనాలి.

16) **CLOZE TEST :** ఏదైనా ఒక పేరా తీసుకొని ప్రతి 5వ పదాన్ని తొలగించి ఆ పేరాను నల్లబల్లపై రాయాలి. ఆ ఖాళీలలో ఏ పదం, ఉంటుందో ఊహించి చెప్పమనాలి. పాఠం చదివి సరిచూసుకోమనాలి.

**అర్థం చేసుకోవడం పెంపొందించడానికి, పరీక్షించడానికి కృత్యాలు :**

1) **మూకాభినయం :** పాఠంలోని ఏదైనా ఒక సన్నివేశాన్ని అభినయంచేసి చూపించాలి. దీనికి సంబంధించిన పేరాను పాఠంలో గుర్తించమనాలి.

2) **నాటకీకరణ :** పాఠం చదివి సంభాషణలు రాసి నాటకీకరణ చేసి చూడమనాలి. కథా పాఠాలు / సంభాషణ పాఠాలు.

3) **ప్రక్రియలు మార్చి రాయడం :** ఉదా॥ కథా పాఠాలు గేయరూపంలో రాయడం, పద్యాలకు కథలు రాయడం, సంభాషణ పాఠాలను వ్యాస / కథల రూపంలో రాయడం పాఠాలకు సంభాషణ రాయడం.

4) **నాటి నుంచి నేటివరకు :** ఏదైనా ఒక పాఠం అంశాన్ని లేదా స్థలం లేదా వస్తువు లేదా జీవన విధానం మొదలగు పదాలు గుర్తింపచేయాలి. అవి నాటి నుండి నేటి వరకు ఎలా మార్పుచెందినవో తెలుసుకోమనాలి.

5) **వరుసక్రమంలో రాయించడం :** ఒక పాఠం చదివి పాఠంలోని విషయాలను / సంఘటనలను వరుసక్రమంలో రాయమనాలి.

6) పాఠం చదివి సన్నివేశాలు / సారాంశం ప్రతిబింబించే విధంగా బొమ్మలు గీయమనడం.

7) పాఠం చదివి కీలకపదాలను లేదా ముఖ్య పదాలను రాయమనడం.

8) పాఠంలోని నూతన పదాలకు నిఘంటువు ద్వారా అర్థాలు వెదకమనడం.

9) పాఠంలోని పదాల ఆధారంగా బాలనిఘంటువును పిల్లలచే తయారుచేయించడం.

10) కథా పాఠాలకైతే ప్రారంభం, మధ్య సంఘటన, ముగింపులు తెలిపే పేరాలను గుర్తించమనడం.

11) పాఠంలోని సన్నివేశాలు / సంఘటనల ఆధారంగా పట్టికలు తయారుచేయించడం.

12) పాఠంలోని పేరాల వారీగా శీర్షికలు పెట్టమనడం.

13) శీర్షికలకు అనుగుణంగా పాఠంలోని పేరాలను గుర్తించమనడం.

14) భావానికి అనుగుణంగా పద్య / గేయ పాదాన్ని గుర్తించమనడం.

SCERT TELANGANA

15) పాఠం చదివి ప్రశ్నలు రాయమనడం. అట్లాగే ప్రశ్నలకు జవాబులు రాయమనడం.

16) పాఠం ఆధారంగా సందర్భోచితంగా పదాలకు అర్థాలు రాయమనడం.

17) చదివిన అంశం ఆధారంగా తప్పొప్పులు గుర్తించమనడం.

18) చదివిన అంశం ఆధారంగా బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు గుర్తించమనడం.

19) చదివిన అంశం ఆధారంగా కారణం, ఫలితాలను రాయమనడం.

20) చదివిన అంశంలోని సామెతలు, జాతీయాలు గుర్తించమనడం.

వాటిని ఏ సందర్భంలో వాడారో వివరించమనడం, అలాగే ఎవరు, ఎవరన్నారు, ఎందుకన్నారు, ఎవరితో అన్నారు వంటి సందర్భ సహిత వాక్యాలు ప్రశ్నించడం మొదలగునవి.

**కార్యాచరణ ప్రణాళిక :**

పాఠశాలలో పఠనసామర్థ్యాన్ని వృద్ధిపరచుటకు విద్యార్థుల స్థాయి ఆధారంగా వివిధ వ్యూహాలను అమలుపరచాల్సి ఉంటుంది. ఇందుకు పూర్తి తరగతి గది కృత్యంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించుటకు విద్యార్థుల స్థాయినిబట్టి జట్లుగా విభజించాలి. అందుకు అనుగుణమైన వ్యూహాలను అమలుపరచాలి.

- ఇందు కోసం పిల్లల స్థాయిని గుర్తించడానికి నిర్ధారణ పరీక్ష (Diagnostic Test) నిర్వహించాలి. దీనిద్వారా చదువడం రానివారు ఎవరు? చదివితే అవగాహన చేసుకోనివారు ఎవరు? ఆలోచించి విశ్లేషణ చేయనివారు ఎవరో గుర్తించాలి.
- చదువడం రానివారికి చదువడం నేర్పాలి. ఇందుకోసం సరళపదాలు, గుణింతపదాలు, ఒత్తుల పదాలు నేర్పడానికి వ్యూహాలను ఏర్పరుచుకోవాలి. లేదా పాఠ్యపుస్తకాలల్లోని సంసిద్ధత పాఠాలను వినియోగించాలి. వీరికి ఉపాధ్యాయుడి సహకారం చాలా అవసరం. ఉపాధ్యాయుడి సమక్షంలో కృత్యాలు ఉండాలి. మిగతా జట్టులకు వారి స్థాయికి అనుగుణమైన కృత్యాలు ఇవ్వాలి.
- వీటితోపాటు పాఠశాలలోని బాలసాహిత్యాన్ని పిల్లలతో చదివించాలి. అసలే చదువడం రానివారికి వానచినుకులు, కథా వాచకాలు బాగా ఉపయోగపడుతాయి. మిగతా గ్రూపులు అనగా ధారాళంగా చదువడంలో ఇబ్బందులు పడేవారికి ఒకరు చదివితే మిగతావారు వినేలా ఒక్కొక్కరు చదివేలా చూడాలి.
- చదువడం వచ్చి అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారికి మనం ఇంతకు ముందు చెప్పిన అభ్యాసాల ద్వారా చేయమనాలి.
- చదువడం, అవగాహన చేసుకొనే వారిచేత బాలసాహిత్యం, వార్తాపత్రికలు చదివించాలి.
- పాఠశాలల్లో నిర్వహించే లఘు పరీక్షలలో ధారాళంగా చదివే అంశాలను విధిగా ఇవ్వాలి. పరీక్షించాలి.

**ముగింపు :**

చదువడం అనేది మౌళికమైన ప్రాతిపదిక సామర్థ్యం. దీనిని ప్రాథమిక స్థాయిలోనే మనం వృద్ధిపరచాలి. ఎన్.సి.ఎఫ్.-2005లో పేర్కొన్నట్లు ప్రాథమిక స్థాయి అంటేనే భాషాసామర్థ్యాలు వృద్ధిపరచడం. తద్వారా పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం వృద్ధిచెందుతుంది. ఇతర సబ్జెక్టులను కూడా అభ్యసించగలుగుతారు. కాబట్టి జాతీయస్థాయి పరీక్ష ఫలితాలను అర్థం చేసుకొని పఠన సామర్థ్యం పెంపొందించేలా కృషిచేయాలి.

# ఆ) అనుబంధాలు

## 1. రకరకాలైన ఆటలు

భాషలు, ఆటలు, పండుగలు ఇలా ప్రతీ విషయంలో తెలంగాణ రాష్ట్రానికి వైవిధ్యమైన గుభాలింపు కనిపిస్తుంది. మన సంస్కృతీ సంప్రదాయాల పరంగా మన తెలంగాణ గొప్పగా ఉండటానికి ప్రాచీన ఆటలు ఎంతగానో దోహదం చేస్తాయి.

కాలం అనేక మార్పులను తీసుకు వస్తుంది. ఆ మార్పులకు అనుగుణంగా మన జీవన విధానాల్లో కూడా మార్పులు వస్తుంటాయి. ఆధునిక ధోరణులకు అలవాటుపడుతున్న నేటి సమాజం అనాదిగా వస్తున్న ప్రాచీన ఆటలను మరచిపోతున్నారు. మన తెలంగాణలోని ఆటలు పిల్లల్లో శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయి. ఆనాటి జీవన పరిస్థితులకు అద్దంపడుతూ. ఒకరికొకరు సహకరించుకొని ఐక్యతను పెంచేవిగా ఉంటాయి.

స్నేహాలను పెంచి, మరచిపోలేని బాల్యపు జ్ఞాపకాలను మన సంప్రదాయక ఆటలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిది. మన తెలంగాణ యాసను, హక్కును చేర్చుకున్నట్లు మన ఆటలను పిల్లలకు పరిచయం చేద్దాం. పల్లెల్లో, పట్టణాల్లో ఈ ఆటలకు జీవం పోద్దాం.

**దస్తీ ఆట :**

పిల్లలు గుండ్రంగా కూర్చొని వారి రెండు అరచేతులను వెనుకకు పెట్టి కళ్ళు మూసుకొని కూర్చొని ఉంటారు. ఒక పిల్లవాడు ఒక చిన్న చేతి దస్తీ పట్టుకొని కూర్చున్న వారి వెనుక ప్రతి ఒక్కరి వద్ద వంగుతూ అందులో ఒకరి వెనుక గుడ్డను పెట్టేసి పరుగెత్తుతాడు. అప్పుడు అందరూ కళ్ళు తెరిచి తమ వెనుక వైపు చూసుకుంటారు. ఎవరు వెనుక దస్తీ ఉంటే వారు దాన్ని తీసుకొని దస్తీ వేసిన పిల్లాడి వెంట పరుగెత్తుతూ దస్తీతో కొడుతుంటాడు. పరుగెత్తే పిల్లవాడు తన వెనుక వస్తున్న పిల్లవాడు లేచిన స్థలంలోకి వెళ్ళి కూర్చోవాలి. మళ్ళీ నిలబడిన పిల్లవాడు కూర్చున్న వారి చుట్టు తిరుగుతూ ఈ దస్తీ వేయాలి. ఇలా సాగుతుంది ఆట.

**వామనగుంతలు :**

ఇది ఎక్కువగా ఆడపిల్లలు ఆడే ఆట. వరుసగా ఆరు చిన్న గుంతలు, వాటికి సమాంతరంగా ఆరు గుంతలుంటాయి. నాలుగు చింత గింజలను చేతిలోకి తీసుకొని వాటిని పైకి ఎగురవేసి అవి కింద పడే లోపున అరచేతిని తిరిగేసి వాటిని పట్టుకోవాలి. ఎన్ని పట్టుకోగలిగితే అన్నింటిని ఆ గుంతలో పెట్టాలి. అలా కొన్నిసార్లు ఆడిన తర్వాత ఏ గుంతలో నాలుగు పిక్కలు చేరుతాయో వాటిని గెలుచుకున్నట్లు.

**వెన్నె కుప్పలు (పిల్ల కుప్పలు) :**

ఇది చిన్న ఆట. ఈ ఆటలను ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి ఆడుతారు. ఒక పిల్లవాడు ఒకచోట కళ్ళు మూసుకొని 1 నుండి 100 అంకెల వరకు లెక్క పెడుతుంటాడు. ఇంత లోపల మిగతా పిల్లలు తలో దిక్కు వెళ్ళి మట్టితో వెన్నెల నీడలో చిన్న కుప్పలు పెట్టాలి. తరవాత కళ్ళు మూసుకున్న పిల్లవాడు కళ్ళు తెరచి మిగతా పిల్లలు పెట్టిన కుప్పలను చెరిపివేయాలి. అలా చెరపలేకపోయిన కుప్పలను లెక్కపెట్టుకొని వాటిని తాము గెలిచిన పాయింట్లుగా లెక్కించుకుంటారు.



SCERT TELANGANA

**బొంగరాలాట :**

ఈ ఆటను పెద్ద పిల్లలే ఎక్కువగా ఆడుతుంటారు. బొంగరానికి మొనదేలిన మొల (మేకు) ఉంటుంది. శంఖాకారంలో ఉండే ఈ కర్ర బొంగరం కింది భాగాన ఉండే చిన్న మొల దగ్గర నుండి ఒక సన్నని తాడు చుట్టాలి. దాన్ని చేతిలో గట్టిగా పట్టుకొని బలంగా విసిరి నేలపైకి వేస్తే అది మొల ఆధారంగా వేగంగా నేలపై తిరుగుతూ ఉంటుంది.

**నేల బండ :**

ఈ ఆటను బాలబాలికలు ఆడుతారు. ఒకరిని దొంగగా నిర్ణయిస్తారు. ఈ ఆట ఆడే ప్రదేశంలో నేల, బండ ఉండాలి. ముందుగా దొంగను నేల కావాలో, బండ కావాలో కోరుకొమ్మంటారు. దొంగ బండ కావాలి అని అంటే మిగతా వారంతా నేలపైన నిలబడాలి. ఒకవేళ మనం బండపైన నిలబడితే దొంగ వచ్చి పట్టుకుంటే వారు ఔట్ అయినట్టే. తర్వాత ఔట్ అయిన పిల్లవాడు ఈ ఆటను ఆడాల్సి ఉంటుంది.

**చిర్రగోనె (బిల్లంగోడి, గోటిబిళ్ళ, గిల్లిదండా) :**

గ్రామీణ ప్రాంతాల్లో బాగా ఆదరణ ఉన్న ఆట ఇది. కానీ ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. క్రికెట్ ఆటకు ఇదే మూలం అని చెపుతారు. కర్రతో తయారుచేసిన జానెడు కర్రముక్కను 'సిర్ర' అని, ఒకటిన్నర రెండు మూరల పొడవున్న కర్రను 'గోనె' అని అంటారు. దీన్ని గుంచి (బొంద) తవ్వి ఆడుతారు. అదే మాదిరిగా సిర్రను గోనెతో కొట్టి అది పైకి లేచినంక గోనెతో మళ్ళీ కొడతారు. అది గాలిలో ఎగిరి కొంత దూరంలో పడుతుంది. అది పడ్డ దూరం నుండి ఒంటి కాలుతో కుంటుకుంటూ వృత్తం లేదా గుంచి దగ్గరకు చేరుకోవాలి.

**కచ్చకాయలు (గచ్చకాయలాట) :**

ఇది పూర్తిగా ఆడపిల్లలు ఆడే ఆట. దీని కోసం గచ్చకాయల చెట్టు ఉంటుంది. దాని కాయలు ఎండిన తర్వాత వాటిని సేకరించి ఆడుతారు లేదా నునుపుగా గుండ్రంగా ఉండే 5 చిన్నరాళ్ళను తీసుకొని వాటితో ఈ ఆట ఆడతారు. ఈ రాళ్ళనే కచ్చకాయలు అంటారు.

**కోతికొమ్మచ్చి :**

చెట్టు కింద గుండ్రంగా గీత గీసి మధ్యలో ఒకరు నిలబడాలి. మరొకరు కట్టెను విసిరేసి చెట్టుపైకి ఎక్కాలి. అతను ఎక్కే లోపు విసిరేసిన కట్టెను మొదటి పిల్లవాడు తీసుకువచ్చి వృత్తంలో ఉంచాలి. ఆ కర్రకు కర్రకు కాపలాగా ఉంటూ అటూఇటూ తిరగాలి. చెట్టుపైన ఉన్నవారు దూకి కర్రను పట్టుకోవాలి. కర్రను పట్టుకోకముందే దొరికితే వారు ఔటు అయినట్లు. ఇప్పుడు ఔటు అయిన వారు కర్రను కాపలా ఉండాలి.

**రాజు, రాణి, మంత్రి, దొంగ :**

దీన్ని చిట్టీలాట అని కూడా అంటారు. ఆడే వారి సంఖ్యను బట్టి చిట్టీల మీద పేర్లు రాసి చుడతారు. ఆ తర్వాత వాటిని గుప్పిట్లో పట్టుకొని నేలపైన వేస్తారు. అందులోంచి రాజు అన్న పేరు ఉన్న చిట్టి ఎవరికి వస్తుందో వారు దొంగను గుర్తించాలి.

**కుంటుడాట :**

గుండ్రంగా వృత్తాన్ని గీసి ఈ ఆట ఆడతారు. ఒక కాలి మీద కుంటుతూ మిగిలిన వారిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వారిలో ఎవరినైనా ముట్టుకుంటే (పట్టుకుంటే) వారు కుంటుకుంటూ ఎవరినైనా పట్టుకోవాలి.

**గోలీలాట :**

ఈ ఆటను కొంచెం పెద్ద పిల్లలు ఎక్కువగా ఆడుతారు. గోలీలను కుప్పలుగా పోసి దేన్ని కొట్టాలో ఒక పిల్లవాడు చెబుతారు. కొట్టే పిల్లవాడు ఒక నిర్ణీత దూరం నుండి గోలితో కొట్టాలి. మొదటి పిల్లవాడు చూపిన గోలిని కొడితే అతను గెలిచినట్లు. ఇలా ఈ గోలీలాటను 'గుంచి' తవ్వుకొని, బొంద గీసుకొని రకరకాలుగా ఆడుతారు.

**పచ్చీసు :**

ఇది పూర్వం నుండి వస్తున్న ఆట. దీన్ని నేలపై గీసి గాని, ప్రత్యేకంగా దారంతో అల్లి గాని, గడుల రూపంలో తయారు చేస్తారు. ఇందులో ఏడు గవ్వలు, నాలుగు రకాల కాయలు ఉంటాయి. దీన్ని నలుగురు ఆడవచ్చు. గవ్వలను ఊపి నేలపై వేస్తారు. అలా వేసినపుడు పడే విధానాన్ని బట్టి పచ్చీస్, తీస్, ఎక్కీస్ ఇలా అంకెలు నిర్ణయించి గడుల్లో కాయలు జరుపుతుంటారు. గడుల మధ్యలో ఇల్లు ఉంటుంది. ముందుగా ఎవరి కాయలు ఇంట్లోకి చేరుతాయో వారే విజేతలు.

**చెడుగుడు (కబడ్డీ) :**

ఇది అప్పటి, ఇప్పటి తరంలో గుర్తింపు పొందిన ఆట. ఈ ఆట కోసం ప్రత్యేకంగా కోర్టు గీసి రెండు జట్లు ఆడతాయి. ప్రతి జట్టులో ఏడుగురు సభ్యులు ఉంటారు.

**కాసెపుల్ల ఆట :**

దీనిని ఇద్దరు కలిసి ఆడుతారు. ఇసుక ఉన్న చోట ఎక్కువగా ఆడటానికి వీలుగా ఉంటుంది. ఇసుకను నిలువుగా చిన్న కట్టలాగా పోసుకుంటారు. ఇద్దరిలో ఒకరు చిన్న కట్టెపుల్లను తీసుకొని ఇసుకలో దాస్తారు. రెండోవారు పుల్ల ఎక్కడుందో గుర్తించి రెండు చేతుల్లో కప్పుతారు. అలా పుల్ల ఎవరికైతే దొరకదో వారు దొంగ. అప్పుడు వారి చేతిలో ఇసుకపోసి అందులో పుల్ల ఉంచి, వారు కళ్ళు మూసి కొంత దూరం తీసుకెళ్ళి ఇసుక కుప్ప పోస్తారు. తిరిగి మొదటి ప్రాంతానికి వచ్చి వారిని వదిలేస్తారు. ఎక్కడ ఇసుక కుప్ప పోశారో గుర్తించాలి. ఇలా ఎంతసేపైనా ఆడుకోవచ్చు.

**తొక్కుడు బిళ్ళ :**

ఈ ఆటను ఒంటరిగా లేదా జట్టుగా ఆడవచ్చు. పక్కపక్కనే నాలుగు నిలువు గళ్ళు, రెండు అడ్డ గళ్ళు గల దీర్ఘచతురస్రాకార గడులను గీయాలి. ఆడేవారు గడుల బయట నిలుచోవాలి. ముందుగా ఒకరు చేతిలో బిళ్ళను ముందు గడిలో వేసి కుంటికాలుతో బిళ్ళను చిమ్ముతూ (జరుపుతూ) మిగతా గడులను దాటించి బయటకు తీసుకురావాలి. ఆడుతున్నప్పుడు కాలు గాని, బిళ్ళ గాని గడుల గీతలు తాకరాదు. గడులన్నీ అయిపోయాక కాలివేళ్ళ మధ్య బిళ్ళను బిగించి పట్టుకొని దాన్ని కుంటికాలుతో ఎనిమిది గడులను గెంతి రావాలి. తరవాత కాలి మీద, తల మీద, అరచేతిలో, మోచేతి పైన, భుజం పైన పెట్టుకొని అన్ని గడులను దాటాలి. ఇవ్వన్నీ దాటిన వారే గెలిచినట్టు.

**నాలుగు స్తంభాలాట (గుడ్లాట) :**

ఈ ఆటలో ఐదుగురు పిల్లలుంటారు. నలుగురు నాలుగు వైపుల చతురస్రాకారంలో నిలబడాలి. వీరిలో ఒకరు దొంగగా ఉంటారు. దొంగ మధ్యలో నిలబడతారు. నాలుగు వైపుల ఉన్న మిగతావారు ఒకరి స్థానాన్ని ఒకరు మారుస్తూ ఉండాలి. ఇలా మారే క్రమంలో ఎవరైతే దొంగకు దొరుకుతారో వారు తదుపరి దొంగవుతారు. తిరిగి వారు ఇలాగే ఆడాల్సి ఉంటుంది.

**చిత్తు బొత్తు :**

ఇది ఇద్దరు కలిసి ఆడే ఆట. చేతిలో నాణెం తీసుకొని (బొమ్మ బొరుసు) ఊపాలి. ఎదుటివారిని నీకు చిత్తు కావాలా, బొత్తు కావాలా అడగాలి. అడిగి నేలపై వేసి చేతితో మూసి ఉంచాలి. ఒకవేళ వారు కోరుకున్నదే వెళితే వారు గెలిచినట్టు.

**లగోరి (బుర్ర, వరంపీట్) :**

ఈ ఆటలో రెండు జట్లు ఉంటాయి. ఎంతమందైనా ఆడవచ్చు. మధ్యలో గుండ్రంగా వృత్తం గీసి అందులో నాలుగు లేదా ఐదు రాళ్ళు ఉంచుతారు. ఒక జట్టువారు రబ్బర్ బంతి తీసుకొని రాళ్ళను గురి చూసి కొట్టాలి. రాళ్ళు కిందపడి ఎదుటి జట్టువారు బంతిని పట్టుకుంటే ఇతర జట్టువారు అవుటైనట్టు. అలా కాకుండా బంతి దూరంగా వెళితే, ఆ బంతిని తెచ్చేలోపు పడిపోయిన రాళ్ళను పేర్చాలి. రాళ్ళు పేర్చే క్రమంలో ప్రత్యర్థి జట్టు బంతిని తీసుకొని రాళ్ళు పేర్చే జట్టులోని వ్యక్తులను గురి చూసి కొడతారు. ఇవతలి జట్టువారు ఆ బంతిని తప్పించుకుంటూ రాళ్ళను పేర్చి లగోరి అని అరవాలి.

**పులి జూదం ఆట (మదురంగం) :**

ఇది ఇద్దరు ఆడే ఆట. చదరంగం, పచ్చీసులాగా గళ్ళను గీసుకొని చింతగింజలతో లేదా రాళ్ళతో ఆడే ఆట. ఇందులో పులి గొర్లను మింగకుండా జాగ్రత్తగా గడులతో ఆడతారు.

**దాడుగుమూతలు (డీబ్‌డయి) :**

మొదటి పిల్లలంతా చప్పట్లు వేసి మిగిలిన ఒకరితో 'డయి' ఆడిస్తారు. ఆ పిల్లవాడు బయటకు వెళ్ళి అంకెలు లెక్కించేసరికి మిగతా పిల్లలంతా దాక్కోవాలి. బయటి నుండి వచ్చిన పిల్లవాడు అందరిని వెతుకుతూ 'డీబ్' అంటూ అవుట్ చేయాలి. అందరూ అవుట్ అయ్యాక మొదట ఎవరైతే అవుట్ అయ్యారో వారు 'డయి' ఆడాల్సి ఉంటుంది.

**ఖో... ఖో... :**

ఈ ఆటను రెండు జట్లలో ఆడతారు. ప్రతి జట్టులో 12 మంది ఉంటారు. అందులో తొమ్మిది మంది మాత్రమే రంగంలో ఉంటారు. ఈ రెండు జట్లలో ఒక జట్టువారు కూర్చుంటారు. మరోజట్టువారు పరుగెత్తుతారు. కూర్చున్నవారు పరుగెత్తే వారిని అవుట్ చేయాలి. దీనికో నిర్ణీత సమయం ఉంటుంది. ఆ సమయంలోపు ఏ జట్టు వారిని తొందరగా అవుట్ చేస్తారో వారు గెలిచినట్టు.

**మరిగళ్ళాట :**

ఈ ఆటను వర్షాకాలంలో బాలురు ఆడే ఆట. పొడువాటి రెండు కర్రలకు (బొంగు) ఒక మూర ఎత్తులో ఒక చిన్న కర్రను అడ్డంగా కడతారు. వాటిపై నిలబడి కర్రలను పట్టుకొని బురదలో తిరుగుతారు. వారి కాళ్ళకు బురద అంటకుండా వారు అటూ ఇటూ తిరగడం ఈ ఆట ప్రత్యేకత.

**జడకొప్పులాట :**

ఊరి మధ్యలో ఒక మండపం వేస్తారు. మండపంలో పైన జడబల్ల చెక్కతో తయారుచేసి, దానికి 12 రంధ్రాలు చేసి ఒక్కో రంధ్రంలో ఒక్కో పట్టుతాడు కడతారు. 12 మంది కోలలు పట్టుకొని, పట్టుతాడును నడుముకు కట్టుకొని లయబద్ధంగా పాటలు పాడుతూ జడను అల్లుతారు. ఐదు రోజుల పాటు ఒక్కొక్క రోజు ఒక్కో రకమైన జడను అల్లుతారు.

**గుయ్యేపుంజా :**

ఇది రెండు జట్లలో ఆడతారు. మొదటి జట్టువారు కనబడకుండా దాక్కొని, అందులోంచి ఒకరిపైన ముసుగు వేసుకువచ్చి రెండో జట్టు ముందుకు తీసుకువస్తారు. వారి ముందు 'గుయ్యేపుంజా' అంటూ సూచిస్తారు. ఆ శబ్దం ఆధారంగా రెండవ జట్టువారు ఆ ముసుగు మనిషిని గుర్తిస్తే ఆ వ్యక్తి ఆ జట్టులో కలుస్తారు. గుర్తించకపోతే తన జట్టులోకే వెళ్ళిపోతారు. ఇలా రెండు జట్లవారు ఆడతారు. చివరకు ఏ జట్టులోనైతే ఎవరు మిగలరో వారు ఓడినట్లు.

**పిట్టగూళ్ళాట :**

ఈ ఆటను అమ్మాయిలు, అబ్బాయిలు ఆడుతారు. పచ్చి ఇసుకలో కాళ్ళు / చెయ్యి దానిపైన ఇసుకపోసి మెత్తుకుంటూ గూడులాగా తయారు చేసుకొని మెల్లగా కాలు/ చెయ్యి తియ్యాలి. అప్పుడు చక్కని గూడులాగా తయారైతుంది.

**రాయిది రంగం :**

వర్షాలు పడి భూమి మెత్తగా మారినపుడు, కర్రతో గాని, గజంతో గాని ఈ ఆటను ఆడుతారు. ఈ ఆటను ఇద్దరు గాని, రెండు జట్లలో గాని ఆడుతారు. ఒకరు గజం / కర్ర భూమిలో దింపుతూ వెళతారు. ఎంత దూరం వరకైతే దింపుతూ వెళతారో అంత దూరం నుండి ఎదుటివారు / మరో జట్టువారు కుంటుకుంటూ ఆట మొదలుపెట్టిన ప్రదేశానికి రావాలి.

ఈ విధంగా ఎన్నో రకాలైన ఆటలు మనకున్నాయి. వీటిల్లో కొన్ని ఆటలు గ్రామాల్లో ఇంకా కనిపిస్తూ ఉండడం నిజంగా గొప్ప విషయం. ఆధునిక కాలంలో కూడా వాటిని ప్రజలు మర్చిపోలేదు. అంటే ఆ ఆటలు మన జీవనంలో భాగమైపోవడమే. అవి మన సంస్కృతికి ప్రతీకలు.

# 2. తప్పనిసరి బోధనాంశంగా తెలుగు అమలు

తెలంగాణ సుందరమైన ప్రదేశం. భౌగోళికంగా సుసంపన్నమైన ప్రాంతం. నదులు, కొండలు, అడవులు, చెరువులు, వాగులు, నల్ల, ఎర్ర రేగడి భూములు, గనులు, ఖనిజాలతో విలసిల్లుతున్న ప్రాంతం. ఉత్తరాన గోదావరీ నది, దక్షిణాన కృష్ణానది, సహజ సరిహద్దులుగా నెలకొని ఉన్న ప్రాంతం. గోదావరినానుకొని దండకారణ్యం, కృష్ణనానుకొని నల్లమల్ల అడవులు సహజ సంపద నిలయాలుగా ఉన్నవి. భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, వనరులు ఉన్న ప్రదేశం కావటంవల్ల ఇక్కడ ఎన్నో జాతుల వాళ్ళు వేల సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వీరిలో గోండులు ఒకరు. తాము మూలపురుషులుగా భావించి పూజించే వారిలోని 'తెలింగం'ను తెలుగు జాతి మూలపురుషుడని ఆరుద్ర భావించాడు. స్థానికంగా ప్రాచీనకాలం నుంచి 'తలైంగ్' జాతివారు నివసించారని, 'తలైంగ్'లు నివసించినందువల్లనే 'తిలింగ, తెలుంగు' పదాలు వచ్చాయని, వారు మాట్లాడే భాష 'తెలుగు' అని, ఆ జాతి 'తెలుగు' అని ఖండవల్లి సోదరులు భావించారు. మార్కండేయ, వాయు పురాణాల్లో 'తిలింగ' ప్రస్తావన ఉన్నది. గ్రీకు శాస్త్రజ్ఞుడు 'టాలెమి' తన యాత్రా చరిత్రలో 'టిలింగాన్' పదాన్ని పేర్కొన్నాడు. ఈ 'తిలింగ' శబ్దమే 'తెలుగు' శబ్దానికి మూలం. 'తెలుంగు', 'గణం' కలిసి తెలంగాణగా మారినట్లు భావించవచ్చు. మెదక్ జిల్లాలోని తెల్లాపూర్‌లో బయటపడిన క్రీ॥శ॥1417 నాటి శాసనంలో 'తెలంగాణ' పదం ప్రయోగించబడింది. అనంతర కాలంలో, వ్యవహారాల్లో 'తెలంగాణ' పదం విస్తృత ప్రచారంలోకి వచ్చింది. ఇక్కడి ప్రజల భాష తెలుగు. తెలుగు మాట్లాడే వారుండే ప్రాంతం కాబట్టే ఇది 'తెలంగాణ' అని అంటున్నారు.

భాష కేవలం భావ వినిమయ సాధనం అనేది ప్రాథమిక భావన. భాష పరిధి చాలా విస్తృతమైంది. మన భౌతిక వాతావరణం, చరిత్ర, ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రత్యేకతలు, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, ఉజ్జ్వల స్మృతులు భాషలో నిక్షిప్తమై ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక జాతి ఆత్మ ఆ జాతి భాషలో ప్రతిబింబిస్తుంది.

తెలంగాణ ప్రజలు వ్యవహరించే తెలుగు విశేషమైంది. ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నది. లయబద్ధంగా ఉండడంవల్ల, దృతాత్మకంగా ఉచ్చరించడంవల్ల వినసొంపుగా ఉంటుంది. జీవితానుభవాలలో వికసించిన సామెతలు, జాతీయాలు, పలుకుబడులు సహజంగానే ఇమిడి ఉండడంవల్ల అర్థవంతమై అలరిస్తున్నది. సహజత్వం, సరళత్వంతోపాటు సృజనాత్మకంగా సాగిపోతున్నది. భావాలను ప్రసన్నంగా వ్యక్తంచేసే పద్ధతివల్ల 'జాను తెనుగు' గా ప్రశంసలందుకున్నది. కమ్మని ధ్వనులకు, కమనీయ అలంకారాలకు నెలవైన భాష. జానపద గీతాలకైనా, పద్యకావ్యాలకైనా, అలవోకగా ఒదిగిపోయే అందమైన భాష. సంస్కృత, ఉర్దూ, పారశీ, అరబ్బీ, ఆంగ్ల, హిందీ పదాలను కలుపుకొని పదవిస్తృతి సాధించి విశాలతత్వంతో కొత్త సొబగులను అద్దుకొని పురోగమిస్తున్న భాష.

ఎన్నో సాహితీ ప్రక్రియలకు పురుడుపోసుకున్న ప్రాంతం తెలంగాణ. తొలికందం, ద్విపద, సీసం, శతకం, దేశీపురాణం, అచ్చతెనుగు కావ్యం, యక్షగానం, పాట-గేయం వంటి సాహితీ ప్రక్రియలు తెలంగాణ కవుల కలాల నుండి జాలువారినవే! వేల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది కాబట్టే 'తెలుగు'కు ప్రాచీన హోదా గూడా లభించింది. భారతదేశంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో తెలుగు 4వ స్థానంలో ఉన్నది.

తెలుగు ఇక్కడి వారికి మాతృభాష. ఇతరులకు తమ అవసరాలను తీర్చే ప్రాంతీయ భాష. తెలుగును అభ్యసించడం వ్యక్తిగత, సామాజిక అవసరం. ఎవరైనా తమ మాతృభాషలోనే ఆలోచిస్తారు. అతి సున్నిత భావాలనైన మాతృభాషలో వ్యక్తంచేసినంత ప్రభావవంతంగా ఇంకే భాషలోనూ చేయలేరు. ఏ మాధ్యమంలో చదువుతున్నప్పటికీ మాతృభాషలో అర్థం చేసుకొని, అవసరమైన సందర్భాలలో ఇతర భాషలోకి అనువదించుకొని వ్యక్తం చేస్తారు. తెలుగు మాతృభాషకానివారు తెలంగాణ రాష్ట్రంలో తెలుగు నేర్చుకోవడంవల్ల తమ దైనందిన వ్యవహారాలను సమర్థంగా నిర్వహించుకోగలుగుతారు. ఇక్కడి ప్రజలతో మమేకం కావడంలో, మానవ సంబంధాలు ఏర్పరచుకోవడంలో, తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకోవడం తెలుగేతరులకు ఒక సామాజిక అవసరం. అందుకే తమ మాతృభాషతో పాటు తెలుగును నేర్చుకోవడం వారికి అత్యవసరంగా మారింది. అట్లాగే ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకొనే సత్తా కూడా పిల్లలకుందని, ఎన్ని ఎక్కువ భాషలు నేర్చుకొంటే, అది వారి విజ్ఞాన పరిధిని అంత విస్తృతపరుస్తుందని, ఆయా భాషలపట్ల సున్నితత్త్వము, గౌరవభావం, సహనం, విశ్లేషణ, సృజనాత్మకత వంటివి వ్యక్తుల్లో వృద్ధిచెందుతాయని భాషావేత్తలు పేర్కొన్నారు.

దురదృష్టవశాత్తు ఈ మధ్యకాలంలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య తగ్గుతున్నందని UNESCO, ప్రసారమాధ్యమాలు పేర్కొనడం గమనార్హం. ఆంగ్ల మాధ్యమాల మోజులో తెలుగు అభ్యసనం నిర్లక్ష్యానికి, న్యూనతకు లోనౌతున్నది. దీనివల్ల మన భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి. సంప్రదాయాలకు దూరమయ్యే ప్రమాదం వాటిల్లుతున్నది. ఈ పరిస్థితిని అధిగమించి 'తెలుగు'ను ప్రతి ఒక్కరూ అభ్యసించేలా చేయడం తక్షణావసరంగా మారింది.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరూ తప్పనిసరిగా తెలుగును ఒక సబ్జక్టుగా చదువాలని, దీనికి చట్టాన్ని రూపొందిస్తామని 2017 డిసెంబర్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ, ముగింపు సమావేశాల్లో ప్రకటించి తన భాషాభిమానాన్ని చాటారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 213, తేది : 31-10-17 ద్వారా ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు పంజాబ్, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలతోపాటు, సి.బి.యస్..ఇ., ఐ.సి.ఎస్.ఇ., కేంద్రీయ విద్యాలయాలు వంటి సంస్థలను సందర్శించి భాషా వినియోగం, వివిధ భాషల అభ్యసనం, అమలుతీరు తెన్నులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ నివేదికను పరిశీలించి, చర్చించి ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు, అన్ని మాధ్యమాలకు చెందిన పాఠశాలల్లో 'తెలుగు'ను తప్పనిసరి బోధనాంశంగా 2018-19 విద్యా సంవత్సరం నుండి అమలు చేయడానికి చట్టాన్ని రూపొందించాలని నిర్ణయం తీసుకొన్నారు. ఇందుకనుగుణంగా 2018 మార్చ్ మాసంలో జరిగిన శాసన సభ, శాసన మండలి సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టారు. తేది : 30-03-2018 రోజునాడు "Act No.10 of 2018" గా తెలంగాణ రాష్ట్రంలో తెలుగును బోధించడం, నేర్చుకోవడం తప్పనిసరి (Teaching and Learning Telugu Language At Compulsory in the State of Telangana) అనే పేరుతో చట్టం రూపొందింది.

చట్టంలోని అంశాలను అమలుపర్చుటకు అవసరమైన వివరణలు, విధివిధానాలు, వివిధ అంశాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఉత్తర్వు 15ను తేది : 01-06-2018 రోజునాడు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు, అన్ని మాధ్యమాలకు చెందిన పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును విధిగా నేర్పాలని, విద్యార్థులు నేర్చుకోవాలని తెలుపుతూ పాఠశాల విద్యాశాఖ, తేది : 29-06-2018 రోజున ఉత్తర్వులను జారీ చేసింది.



SCERT TELANGANA

పాఠశాలలో తప్పనిసరి బోధనాంశంగా తెలుగును బోధించడం, నేర్చుకోవడం గురించి రూపొందించిన చట్టం 10, తేది : 30-03-2018, ప్రభుత్వ ఉత్తర్వు 15, తేది : 01-06-2018లోని ముఖ్యాంశాలు.

- తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు అనగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుపొందిన ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, సి.బి.యస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి. సంస్థలకు అనుబంధంగా నడిచే అన్ని రకాల పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును తప్పనిసరి బోధనాంశంగా అమలుపరుస్తారు.

- మన రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో తెలుగు ఇప్పటికే అమలులో ఉన్నది. ఐతే ఇతర మాధ్యమ పాఠశాలల్లో అనగా ఉర్దూ, హిందీ, కన్నడ, తమిళం, బెంగాలి, మరాఠీ మాధ్యమ పాఠశాలల్లో, సి.బి.యస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి.పాఠశాలల్లో కూడా తెలుగును నేర్పడాన్ని దశల వారీగా అమలుపరుస్తారు. అనగా ఇప్పటివరకు తెలుగును అమలుచేయని పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతితో ప్రాథమిక స్థాయిలో ప్రారంభించి సంవత్సరానికి ఒక తరగతి చొప్పున విస్తరిస్తారు. అట్లాగే ఉన్నత పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరంలో 6వ తరగతితో ప్రారంభించి ఒక్కో సంవత్సరానికి ఒక తరగతి చొప్పున విస్తరిస్తారు.

| అమలు సం॥ | ప్రాథమిక స్థాయి | ఉన్నత స్థాయి |
|---|---|---|
| 2018-19 | 1వ తరగతి | 6వ తరగతి |
| 2019-20 | 1, 2వ తరగతి | 6, 7వ తరగతి |
| 2020-21 | 1, 2, 3వ తరగతి | 6, 7, 8వ తరగతి |
| 2021-22 | 1, 2, 3, 4వ తరగతి | 6, 7, 8, 9వ తరగతి |
| 2022-23 | 1, 2, 3, 4, 5వ తరగతి | 6, 7, 8, 9, 10వ తరగతి |

- ఇతర మాధ్యమ పాఠశాలల్లో తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులను లేదా విద్యావాలంటీర్లను ప్రభుత్వం నియమిస్తుంది.

- ఏ పాఠశాలలోనైనా రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ రూపొందించిన తెలుగు వాచకాలనే వినియోగించాలి. ఇందుకోసం 2018-19 విద్యా సంవత్సరంలో ఇతర మాధ్యమ పాఠశాలల విద్యార్థులు తెలుగు నేర్చుకోవడానికి 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాలు రూపొందించారు.

- ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 17, తేది : 14-05-2014 ప్రకారం నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని తెలుగు భాష కోసం నిర్వహించాలి. 10వ తరగతిలో ప్రభుత్వం నిర్దేశించిన కనీస ఉత్తీర్ణత మార్కులను పొందాల్సి ఉంటుంది.

- తెలుగు, ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగుతోపాటు ఆంగ్లాన్ని అభ్యసిస్తారు నేర్చుకొంటారు. ఇది గతంలోవలె కొనసాగుతుంది. ఐతే ఇతర మాధ్యమాలు అనగా ఉర్దూ, హిందీ, బెంగాలి, తమిళం కన్నడ, మరాఠి మాధ్యమ పాఠశాలల్లో ఇప్పటి వరకు వారి మాతృభాష, ఆంగ్లాన్ని మాత్రమే నేర్చుకొంటున్నారు. 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును కూడా తప్పనిసరిగా బోధించాలి. విద్యార్థులు నేర్చుకోవాలి.

- అట్లాగే ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో తెలుగును నేర్చుకొంటున్నారు. ఇది ఇలాగే కొనసాగుతుంది. ఐతే ఇతర మాధ్యమ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగు, ఆంగ్లం భాషలతోపాటు తృతీయ భాషగా హిందీ / ఉర్దూ / సంస్కృతం / వారి మాతృభాషలలో ఏదైనా ఒక దానిని కూడా నేర్చుకోవచ్చు.



SCERT TELANGANA

- సి.బి.ఎస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి. పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో రెండు భాషలనే నేర్చుకొంటారు. దీంట్లో ఆంగ్లం తప్పనిసరి. ఐతే ద్వితీయ భాషగా తెలుగు నేర్చుకొనే అవకాశమున్నది. కాని తప్పని సరికాదు. కాబట్టి చట్టం వల్ల తప్పనిసరిగా తెలుగును నేర్చుకోవాల్సి ఉంటుంది. వారి మాతృభాషను తృతీయ భాషగా నేర్చుకోవచ్చు.
- ఐదవ తరగతి వరకు తెలుగు చదువకుండా 6వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థుల కోసం సరళమైన తెలుగు వాచకాలను చదువడం, రాయడం, చేయగలిగేలా రూపొందించారు. 5వ తరగతి వరకు తెలుగు చదివిన వారికి 6వ తరగతిలో సాధారణ తెలుగు వాచకం 'నవ వసంతం'ను వినియోగించాలి. 1వ తరగతిలో కూడా తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో సాధారణ తెలుగువాచకం జాబిలి-1 ని, ఇతర మాధ్యమాలలో 'తేనెపలుకులు'-1 సరళమైన తెలుగు వాచకాన్ని వినియోగించాలి.
- ఎవరైనా పిల్లలు 7వ తరగతి వరకు తెలుగు చదువకుండా '8' వ తరగతిలో లేదా ఆపై తరగతుల్లో మన రాష్ట్రంలో విద్యను అభ్యసించడానికి పాఠశాలల్లో ప్రవేశం పొందితే వారు 'తెలుగు' నేర్చుకోవడాన్ని మినహాయింపునిస్తారు. అయితే దీనికి సంబంధిత జిల్లా విద్యాధికారి ద్వారా సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ గారికి దరఖాస్తు సమర్పించి మినహాయింపు పొందాల్సి ఉంటుంది.

## చట్ట ఉల్లంఘన - చేపట్టే చర్యలు

- "తెలుగు తప్పనిసరి చట్టాన్ని" ఉల్లంఘించడం అంటే...
  - ఎ) తెలుగును తప్పనిసరి సబ్జక్టుగా బోధించకపోవడం.
  - బి) తెలుగు భాషోపాధ్యాయుడిని / బోధకుడిని తెలుగును బోధించడానికి కేటాయించకపోవడం.
  - సి) రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రభుత్వ తెలుగు పాఠ్యపుస్తకాలను వినియోగించకపోవడం.
  - డి) చట్టంలో పేర్కొన్న ఇతర నియమాలన ు పాటించకపోవడం. (Act No.10 off 2018 జి.వో.నెం.15, తేది : 01-06-2018)
- పైన తెల్పిన విధంగా ఏదైనా ప్రైవేటు యాజమాన్యానికి చెందిన పాఠశాలలు తెలుగును తప్పనిసరి బోధనాంశంగా అమలుచేయడంలో విఫలమైతే చట్టాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తారు. ఈ సందర్భంలో కింది చర్యలు చేపడతారు. అవి :
  - ఏదైనా పాఠశాలలో తెలుగు అమలుతీరు చట్టాన్ని ఉల్లంఘించినట్లు దృష్టికివస్తే జిల్లా విద్యాధికారి నోటీసు జారీ చేస్తాడు. దీనికి సంబంధిత యాజమాన్యం 15 రోజులలోగా జవాబివ్వాలి.
  - జవాబిచ్చిన తర్వాత మళ్ళీ పరిశీలిస్తారు. అయినప్పటికీ చట్ట ఉల్లంఘన కొనసాగితే జిల్లా విద్యాధికారి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళతాడు. జిల్లా కలెక్టరు మొదటి తప్పుగా భావించి 50,000/- (యాభైవేల రూపాయలను) అపరాధ రుసుంను విధిస్తాడు. సదరు పాఠశాల యాజమాన్యం దీని గురించి పాఠశాల విద్యా సంచాలకులకు అప్పీలు చేసుకోవచ్చు.
  - అయినప్పటికీ ఇదే విధంగా రెండవసారి కూడా ఉల్లంఘించినట్లైతే జిల్లా కలెక్టరు గారు సదరు పాఠశాలలకు ఒక లక్ష రూపాయల అపరాధ రుసుమును విధించవచ్చు.
  - అట్లాగే మూడవ సారి కూడా జరిగితే, ఆ పాఠశాల గుర్తింపును రద్దుచేస్తారు. ఇలా గుర్తింపు రద్దైన పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 10వ తరగతి పరీక్షను రాష్ట్రంలోని ఎస్.ఎస్.సి. బోర్డు లేదా సి.బి.ఎస్.ఇ. లేదా ఐ.సి.ఎస్.ఇ. వంటి ఏ బోర్డు కూడా పరీక్షలు నిర్వహించడానికి అవకాశముండదు.

**రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలు :**

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించడాన్ని పరిశీలించి చర్యలు చేపట్టడానికి రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని, అట్లాగే జిల్లా కలెక్టరు నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. ఈ కమిటీలు మొదటి సంవత్సరంలో ప్రతి మూడు మాసాలకు ఒకసారి, రెండవ సంవత్సరం నుండి ఆరు మాసాలకొకసారి సమావేశమై సమీక్షించి తగు చర్యలు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది.

**వృత్యంతర శిక్షణలు :**

- రాష్ట్రంలోని అధికారులు మానిటరింగ్ సభ్యులు, ఉపాధ్యాయులు మొదలగువారందరికీ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ ప్రతి సంవత్సరం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ విద్యా కళాశాలల ప్రిన్సిపాళ్ళు, ఉపవిద్యాధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- అట్లాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు మొదలగు వారికి జిల్లా విద్యాధికారి నేతృత్వంలో జిల్లాస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**వనరులను సమకూర్చడం**

- అన్ని పాఠశాలల్లో తెలుగును సమర్థవంతంగా బోధించడానికి, విద్యార్థులు నేర్చుకోడానికి వీలుగా పాఠశాలల్లో, గ్రంథాలయాలను ఏర్పాటుచేయాలి.
- బోధనాభ్యసన సామగ్రిని సమకూర్చాలి.
- సాంకేతికతను వినియోగించాలి. డిజిటల్ పాఠాల బోధనను చేపట్టాలి.
- పాఠశాలల్లో బాలసాహిత్యం పిల్లలకు అందుబాటులో ఉంచడం ద్వారా తెలుగును నేర్చుకొనే వాతావరణాన్ని కల్పించాలి.

**ముగింపు**

తెలంగాణ రాష్ట్రంలో తెలుగును తప్పనిసరి సబ్జక్టుగా అన్ని పాఠశాలల్లో బోధించి పిల్లలు నేర్చుకొనేలా చేయాలి. తద్వారా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు వంటివి పిల్లలు అర్థం చేసుకొని, వాటి గొప్పదనాన్ని గుర్తించి గౌరవించాలి. తెలుగేతరులు తెలుగును నేర్చుకోవడం ద్వారా తెలంగాణ సమాజంతో మమేకమై, ఉన్నతమైన మానవ సంబంధాలను నెలకొల్పాలి. వారి దైనందిన అవసరాలను తీర్చుకోగలగాలి. ఈ సదుద్దేశంతో రూపొందించిన చట్టాన్ని అమలుపరచడంలో మనం అందరం భాగస్వాములం కావాలి.

SCERT TELANGANA

# 3. బాలలపై లైంగిక వేధింపులు - బాలల సంరక్షణ - పాఠశాల పాత్ర

**1.1.** పాఠశాలల్లో బాలల సంరక్షణ ప్రణాళిక ఎందుకు ఉండాలి?

బాలల హక్కులు, బాలల పరిరక్షణ అంశాలు అభ్యుదయ రీతిలో, సమగ్రంగా, బాలలే కేంద్రంగా రూపు దిద్దుకుంటున్నాయి. అందువల్ల పిల్లలతో ప్రమేయం కలిగి ఉండే ప్రతి ఒక్కరూ పిల్లల రక్షణ చర్యలకు సంబంధించి అవగాహన కలిగి ఉండాలి.

***ఇల్లు తరువాత పాఠశాలలే బాలలకు సురక్షితమైనవి సంతోషాన్ని అందించేవి. కాబట్టి పాఠశాలల్లో శిశు సంరక్షణా పథకం అవసరం.***

**1.2.** రాజ్యాంగంలోని అధికరణ 21 గౌరవంతో జీవించే హక్కును తెలుపుతుంది. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విద్యా హక్కును కూడా ఈ అధికరణమే వివరిస్తుంది.

**విద్యాహక్కు చట్టం ప్రకారం :** పిల్లలను శారీరకంగా శిక్షించడం (ఉపాధ్యాయులు కొట్టడం వంటివి) వారిపై దాడిగానే పరిగణిస్తారు. ఇది వారి స్వేచ్ఛ, గౌరవాలకు భంగకరం. శారీరక శిక్షలకు భయపడి పిల్లలు బడికి వెళ్లటానికి నిరాకరిస్తారు లేదా శాశ్వతంగా బడికి వెళ్లటం మానేస్తారు. ఈ విధంగా శారీరక శిక్షలు పిల్లల విద్యా హక్కుకు భంగం కలిగిస్తున్నాయి.

**1.3. బాలల హక్కులు, సంరక్షణ, సంస్థాపరమైన బాధ్యతలు:**

UNCRC (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద రైట్స్ ఆఫ్ ద చైల్డ్) నిబంధన 19 ప్రకారం ఈ ఒప్పందంలోని భాగస్వామ్య దేశాలన్నీ పిల్లల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు లేదా బాగోగులు చూసుకునే మరెవరి సంరక్షణలోనైనా ఉన్నప్పుడు లైంగిక వేదింపు, శారీరక లేదా మానసిక హింస, గాయం లేదా వేదింపు, నిర్లక్ష్యం, నిరక్ష్య వైఖరి, తిండిపెట్టక పోవడం లేదా దోపిడీలకు గురి కాకుండా చట్ట, పాలనాపర, సామాజిక, విద్యాపరమైన చర్యలను తీసుకోవాలి. అన్ని రకాల వేదింపులు, నిర్లక్ష్యాల నుంచి రక్షణ పొందే హక్కు బాలలకు ఉందని UNCRC స్పష్టం చేస్తోంది.

*బాలల విద్యార్థి దశలో వారందరికీ రక్షణ కలిగించడమనేది విద్యార్థి దశలో క్లిష్టమైనది. బాలలు 12 సంవత్సరాల పాటు పాఠశాలలలో గడుపుతారు కాబట్టి పాఠశాల యాజమాన్యం, పిల్లల కుటుంబాలు వారి సంరక్షణకై ప్రధాన భూమికను నిర్వహించాలి.*

### 1.4. విద్యాహక్కు చట్టం 2009 - బాలల హక్కులపై అధ్యయనబాధ్యతలు :

విద్యా హక్కు చట్టం సెక్షన్ 29 ఏమి చెబుతుందంటే చట్టంలోని సబ్ సెక్షన్ (ఉప నిబంధన) (1) కింద పాఠ్య ప్రణాళిక రూపొందించేటప్పుడు పాఠశాల లేదా విద్యాధికారులు కింది అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి:

- పాఠ్యాంశాలు రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలి.
- బాలుడు/బాలిక బహుముఖాభివృద్ధి లక్ష్యం కావాలి.
- బాలల జ్ఞానం, సమర్థత, ప్రజ్ఞలను అభివృద్ధి చేయాలి.
- పిల్లల శారీరక, మానసిక సామర్థ్యాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.
- పిల్లలే కేంద్రంగా స్నేహ పూరిత వాతావరణంలో స్వయంగా వారే కనుగొనడం, వెలికి తీయడం వంటి వివిధ కార్యక్రమాల ద్వారా నేర్చుకునేటట్లు చేయాలి.
- బోధన సాధ్యమైనంత వరకు వారి మాతృభాషలోనే సాగాలి.
- పిల్లలు ఎటువంటి భయం, బాధ, ఆందోళన లేకుండా స్వేచ్ఛగా వారి భావాలను వ్యక్తం చేసే వాతావరణం సృష్టించాలి.
- బాలుడు/బాలిక యొక్క జ్ఞాన అవగాహన స్థాయిని, దానిని వారు అనువర్తించే సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు, సమగ్రంగా మూల్యాంకనం చేయాలి.

*ఈ నిబంధనలన్నీ శిశువుకు భయరహిత వాతావరణాన్ని కల్పించడం, పాఠశాలలో ఎలాంటి దాడికి అవకాశం లేకుండా వారి సంరక్షణా యోగక్షేమాలకు ఆస్కారం కల్పించడం ముఖ్యం.*

### 2. POCSO చట్టం, 2012 ప్రకారం బాలలపై లైంగిక దుశ్చర్య అంటే ఏమిటి?

కింది సందర్భాల్లో బాలుడు/బాలిక ఏదైనా లైంగిక కార్యక్రమంలో పాల్గొనడం లేదా ప్రమేయం కలిగి ఉండడాన్ని బాలుడు/బాలిక పై లైంగిక దుశ్చర్యగా చెప్పవచ్చు.

**ఆ సందర్భాలు ఏమిటంటే-**

- బాలుడు/బాలికకు జరుగుతున్నది అర్థం కాకపోవడం.
- బాలుడు/బాలిక తన అసమ్మతిని తెలియచేయలేని అశక్తత.
- బాలుడు/బాలికకు తమ సమ్మతిని తెలియజేసే పరిపక్వత లేనప్పుడు.
- చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు లేదా సామాజిక కట్టుబాట్లను అతిక్రమించినపుడు.

ఒక బాలుడు లేదా బాలికను లైంగికానందం కోసం వయోజనుడు లేదా పెద్ద వాడు లేదా జ్ఞానం ఉన్న బాలుడు/బాలిక ఉపయోగించుకుంటే, ఆ చర్య లైంగిక దుశ్చర్య అవుతుంది. ఈ దాడి శారీరకమైనది, మాటలు లేదా ఉద్వేగాలతో కూడుకున్నది కావచ్చు.

**అవి ఏమిటంటే-**

- వస్త్రాన్ని తొలగించి కాని లేదా వస్త్రం పై నుంచి కాని శరీరంలోని ఏ భాగాన్నయినా లైంగికంగా తాకడం.
- చొప్పించే లైంగిక దాడి (నోటి ద్వారా చొప్పించడం కూడా వస్తుంది).
- లైంగిక చర్యకు బాలుడు/బాలికను ప్రేరేపించడం (హస్త ప్రయోగం కూడా ఇందులోకి వస్తుంది).
- బాలుడు/బాలిక ముందు ఉద్దేశపూర్వకంగా లైంగిక చర్యకు పాల్పడడం.
- పిల్లలకు అశ్లీల సాహిత్యాన్ని, చిత్రాలను చూపడం లేదా అశ్లీల చిత్రాల తయారీకి పిల్లను ఉపయోగించుకోవడం.
- ఒక వయోజన వ్యక్తి అతని/ ఆమె రహస్యాంగాలు లేదా మర్మాంగాలను పిల్లలకు చూపడం (ఎగ్జిబిషనిజం).
- పిల్లలను వ్యభిచారం లేదా పడుపు వృత్తిలోకి ప్రోత్సహించడం.
- పిల్లలతో అశ్లీల సంభాషణలు చేయడం.

**3. ఉపాధ్యాయుడు ఇలా ఆలోచించాలి...**

**ఎ) బాలలపై లైంగిక దాడి మా పాఠశాలలో ఒక సమస్య కాదు.**

**బీ) నా బాధ్యత విద్యా బోధన, పిల్లల రక్షణ కాదు.**

**జ) బాలలపై లైంగిక వేధింపుల నిరోధం పట్ల చట్టాలు, నియమాలు నేనెందుకు తెలుసుకోవాలి?**

**విద్యావేత్తలు / ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతగా అనుమానాస్పద లైంగిక దాడి లేక అవమానకరమైన పరిస్థితులను తరగతి గదుల్లో భయరహిత వాతావరణం నెలకొల్పడంలో వారి ఫిర్యాదు ముఖ్యం.**

ఆకలి లేదా అనారోగ్యాలవలే ఇతరులు కీడు చేస్తారోమేనన్న భయం, వాటికి సంబంధించిన అనుభవాలు కూడా పిల్లల అభ్యసనను దెబ్బతీస్తాయి. అందువల్ల ఇటువంటి ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, తగిన నివారణ చర్యలను తీసుకోవడం పాఠశాల సిబ్బందికే సాధ్యమవుతుంది. అందువల్ల వారి నిరంతర పర్యవేక్షణ ఎంతో కీలకం.

పిల్లల రక్షణ, సంక్షేమాలను పెంపొందించడానికి, వారిని అపాయకర పరిస్థితుల నుంచి తప్పించడానికి పాఠశాలలు, వాటి సిబ్బంది సామాజిక కార్యక్రమాలు; పోలీస్, చట్టం, ఆరోగ్య సేవల్లో పాల్గొని తమ వంతు పాత్రను పోషించాలి.

పాఠశాల సిబ్బంది తమ పిల్లలు (విద్యార్థులు) లైంగిక దాడికి లేదా నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలిసినా లేదా లైంగికదాడికి, నిర్లక్ష్యానికి గురైనా లేదా ప్రస్తుతం అటువంటి పరిస్థితుల్లో ఉన్నా వెంటనే వారు ఎటువంటి అలస్యం చేయకుండా సమాచారాన్ని నిర్దేశిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

*POCSO చట్టం – 2012లోని సెక్షన్ 21(1)* ననుసరించి బాలలపై లైంగిక దాడుల గురించి ఫిర్యాదుచేయడంలో న్యాయశాఖ తగు చర్యలు గైకొనడం, తల్లిదండ్రులు, వైద్యులు, పాఠశాల సిబ్బందికి బాధ్యత కల్పించారు. ఇందులో విఫలమైతే ఫిర్యాదుపై అనుమానం వస్తే అది నేరంగా పరిగణించబడుతుంది. ఈ చట్టం ఫిర్యాదు చేయడంలో సమాచారం అందించడంలో ఆటంకాలు ఉంటే అవి వృత్తిపరమైన విధుల్లో లోపంగాను, విషయ గుప్తతను పాటించడంలో బాధ్యతను గుర్తు చేస్తుంది.

**4. సమస్యను ఫిర్యాదు చేస్తే ఇక నేను ఆ క్లిష్టమైన విధానాలు, ఇబ్బందుల్లో ఇరుక్కుంటానని చింతపడుతున్నాను. నిజమేనా?**

ఫిర్యాదు చేసినంత మాత్రాన మొత్తం అన్నీ మీరు ఒక్కరే చూసుకోవాల్సిన పని లేదు. పాఠశాల ఉపాధ్యాయుడు/

ఉపాధ్యాయురాలిగా ఒక బాలుడు / బాలిక పై లైంగిక దాడి జరిగిందని తెలిసినా లేదా జరిగే ప్రమాదం ఉందని అనుమానం ఏర్పడినా కేవలం ఆ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో మీ బాధ్యత ముగుస్తుంది.

అయితే, మీరు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు నిబంధలను పాటించాలి. అవి:

- బాలుడు/బాలిక చెప్పింది వినాలి. జరిగిన విషయాన్ని వెల్లడించి మంచి పని చేశారని వారికి మద్దతు ఇచ్చి ధైర్యం చెప్పాలి. ఇక భద్రంగా ఉంటామన్న భావన పిల్లల్లో కలిగించాలి.
- విషయాలను గోప్యంగా ఉంచుతామన్న హామీ ఇవ్వొద్దు. భద్రత కోసమే వివరాలను అవసరమైన వారికి వెల్లడించడం జరుగుతుందని వారికి అర్థమయ్యేలా వివరించాలి.
- నిర్దేశిత అధికారికి లేదా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి లేదా హెల్ప్‌లైన్‌కు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- అన్ని సంభాషణలు, తీసుకున్న చర్యల వివరాలను భద్రపరచాలి. ఆలస్యం చేయవద్దు.
- విచారణ మీ బాధ్యత కాదు. పిల్లల రక్షణ కోసం విధుల నిర్వహించే నిపుణులకు ఫిర్యాదు ఇవ్వడంతో మీ పాత్ర ముగుస్తుంది.

**5. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నా పాఠశాలలో భద్రతా వాతావరణాన్ని ఎలా సృష్టించగలను?**

**5.1. కనీస అవసరాలు:**

- స్పష్టమైన ఫిర్యాదు మరియు స్పందన వ్యవస్థ కలిగిన ఒక బాలల రక్షణ ప్రణాళిక లేదా విధానాన్ని రూపొందించుకోవాలి.
- స్కూలు సిబ్బందిలో ఒకరిని ఈ బాలల రక్షణ ప్రణాళికకు ఇన్‌చార్జ్‌గా నియమించాలి. అవసరం అయినపుడు సహకారం అందించడానికి డిప్యూటీ ఇన్‌చార్జ్‌ని కూడా ఏర్పాటు చేయాలి.
- బాలల సంరక్షణ చట్టాలు వాటికి సంబంధించిన మార్గదర్శకాలు, రిఫరల్ ఏజెన్సీల గురించి అవగాహన కలిగి ఉండాలి.
- భద్రతా నియమాలు, పాఠశాల విధానాల గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పాఠశాల యాజమాన్య సంఘ సభ్యులకు కూడా వీటి పట్ల అవగాహన ఉండాలి.
- పిల్లలు తాము భద్రమైన, మర్యాదకరమైన, తమను పట్టించుకునే వాతావరణంలో ఉన్నామన్న భావన కలిగించేలా పాఠశాల సంస్కృతి ఉండాలి. అటువంటి వాతావరణాన్ని అభివృద్ధి చేయాలి. వ్యక్తిగత, ఉద్వేగ అభ్యసన, ప్రవర్తనపై కార్యక్రమాలు, వేధింపు నివారణ పట్ల అవగాహన, కార్యక్రమాలలో పాల్గొనడం, విద్యార్థి వేదికలు వంటివి బాలల్లో ఆత్మ విశ్వాసం, తట్టుకునే శక్తి, నమ్మకం వంటి రక్షణాత్మక లక్షణాలు వారి వ్యక్తిత్వంలో రూపుదిద్దుకునేలా చేస్తాయి.
- విద్యార్థులందరికీ వ్యక్తిగత భద్రత గురించి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. లైంగిక దాడి జరిగాక ఫిర్యాదు చేయడం కంటే అటువంటి పరిస్థితులను పసిగట్టి ముందుగానే ఫిర్యాదు చేసి నివారించడం మంచిది.
- భద్రమైన మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన ప్రాంతాలు, తరగతి గదులు, టాయ్‌లెట్లు (మరుగుదొడ్లు), ఆట స్థలాలు శుభ్రంగా, ఆరోగ్య కరంగా ఉండడం కూడా పాఠశాల భద్రతలో భాగమేనని గుర్తించాలి.

**5.2. బాలలపై లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదుచేయడం ఎలా?**

ఫిర్యాదుచేసే విధానంలో బాలల యొక్క స్టేట్‌మెంటును POCSO చట్టం ప్రకారం రికార్డు చేయాలి.

రికార్డు చేసేది ఎవరు?

లైంగిక నేరానికి సంబంధించిన బాధ్యతలుగాని, సామాజిక మాధ్యమాల వ్యక్తులు, హాస్టళ్ళు, నివాస గృహాలు, వైద్యశాలలు, క్లబ్బులు, స్టూడియోలు లేదా ఫోటోగ్రఫీ సౌకర్యాలు ఉన్నవారు ఇలాంటి సందర్భం తమ దృష్టికి వచ్చినప్పుడు లైంగిక వేధింపులకు గురైన బాలల గురించి ఫిర్యాదు చేయవచ్చు.

అలాంటి ఫిర్యాదు చేయడంలో వైఫల్యాలున్నట్లైతే వారు శిక్షార్హులే కాకుండా ఆరు మాసాల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూనూ, ఈ జరిమానా శిశువులకు వర్తించదు.

**5.3. ఈ కేసును ఎవరికి రిపోర్టు చేయాలి?**

కేసు గురించి స్పెషల్ జువనైల్ పోలీస్ యూనిట్ (SJPU) లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు రాగానే పోలీసులు లేదా SJP యూనిట్ ఫిర్యాదును రాత పూర్వకంగా తీసుకుని దానికి ఒక నమోదు సంఖ్యను కేటాయిస్తారు. తర్వాత సదరు ఫిర్యాదును ధ్రువీకరణ కోసం ఫిర్యాదుదారుకు చదివి వినిపిస్తారు. తర్వాత దానిని ఒక పుస్తకంలోకి ఎక్కిస్తారు. నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక(FIR) ప్రతిని ఒక దానిని ఫిర్యాదుదారు లేదా సమాచారం ఇచ్చిన వ్యక్తికి ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ఇస్తారు.



SCERT TELANGANA

**5.4. ఫిర్యాదు భాష :**

ఒక వేళ కేసును బాలుడు/బాలిక ఫిర్యాదు చేస్తే మాట్లాడినది మాట్లాడినట్టుగా సరళమైన భాషలో నమోదు చేయాలి. ఇలా చేయడం వల్ల బాలుడు/బాలిక ఫిర్యాదులో ఏమి నమోదు చేశారో అర్థం చేసుకోగలుగుతారు. ఒక వేళ వారికి అర్థం కాని భాషలో ఫిర్యాదును నమోదు చేస్తే ఒక అర్హత కలిగిన అనువాదకుడి ద్వారా తర్జుమా చేసి వినిపించాలి.

**6. *POCSO చట్టం – నిబంధనలు 2018లో తీసుకొనిరాబడిన మార్పులు – చేర్పులు ఏవి?***

***POCSO చట్టం – నిబంధనలు 2018లో తీసుకొనిరాబడిన మార్పులు – చేర్పులు :***

- ఇండియన్ పీనల్ కోడ్ – సెక్షన్ 376 ప్రకారం బాలికలపై అత్యాచారం జరిపిన వారికి 7 నుండి 10 సంవత్సరాలు కనీస శిక్షగా నిర్ధారించడం.
- పై సెక్షన్ 376(3) ప్రకారం 16 సంవత్సరాలలోపు బాలికలపై జరిగే అత్యాచారాలకు కనీస జైలు శిక్ష 20 సంవత్సరాలు / ఆజీవాంతం వరకు పొడిగించబడింది.
- పై సెక్షన్ 376 – A, B ప్రకారం 12 సంవత్సరాలలోపు బాలికలపై అత్యాచారాలకు కఠిన జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించడం.
- పై ఆర్డినెన్సు ప్రకారం 16 సంవత్సరాలలోపు బాలికలపై సామూహిక అత్యాచారాలకు జీవిత ఖైదు మరియు జరిమానా కూడా విధించడం.
- ఈ ఆర్డినెన్సు ప్రకారం 12 సంవత్సరాలలోపు బాలికలపై సామూహిక అత్యాచారాలకు కూడా కఠిన జీవిత ఖైదు మరియు జరిమానా విధించడం.

*ప్రతి క్షణం విలువైనదే! ప్రతి శిశువు కూడా! ఆ విషయానికొస్తే బాల్య దశ ఎంతో విలువైనది.*

*– కైలాష్ సత్యార్థి*

**7. శరీరం, వ్యక్తిగత భద్రత**

**7.1. ఉపాధ్యాయుల పాత్ర**

- తల్లిదండ్రులు పిల్లలకు శరీర భద్రత గురించి 3 నుంచి 5 సంవత్సరాల వయసు మధ్య కాలం నుంచి బోధించడం ప్రారంభించాలి. ఈ విషయం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.
- పిల్లలకు శరీరాంగాలైన జననేంద్రియాలు, శిశ్నం (లింగం), యోని వంటి రహస్యాంగాలతో పాటు శరీరంలోని అన్ని అంగాలను వివరించి వాటి సరైన పేర్లు చెప్పాలి.
- నిపుణుడు లేదా తల్లిదండ్రులు భాష లేదా పదాల పట్ల ఇబ్బందిగా భావిస్తే చిన్న పిల్లలకు అర్థమయ్యే విధంగా వాడుక పదాలను ఉపయోగించాలి. పిల్లలు కొంచం పెద్దయ్యాక వారికి సరైన పదాలను తెలియ చెప్పాలి. జననాంగాల గురించి చెప్పేటపుడు వాడుక (వ్యవహారిక) పదాలు స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి. అసహ్యం, అవమాన భావనలు కలిగేలా వాటిని పువ్వు, చిలక, సిగ్గు-సిగ్గు, ఛీ-ఛీ వంటి పదాలతో వివరించరాదు. ఈ విషయాన్ని విద్యా బోధకులు, తల్లిదండ్రులు గుర్తు పెట్టుకోవాలి.
- చిన్న వయసు నుంచే పిల్లలను సొంతంగా మల విసర్జన, స్నానం, దుస్తులు ధరించడం నేర్పాలి.
- పిల్లలకు గోప్యత, నమ్రత, వ్యక్తిగత ప్రవర్తనలు, హద్దులు చాల ముఖ్యమని నేర్పాలి.
- పిల్లలకు తమ ఏకాంతాన్ని లేదా గోప్యతను భగ్న పరచేవారిని లేదా హద్దులు దాటి ప్రవర్తించేవారిని అనుమతించకూడదని, అది తప్పు అని తెలియచెప్పాలి. అలాగే ఇతరులు వారి రహస్యాంగాల వైపు చూడడం లేదా తాకడం వంటివి కూడా భావ్యం కాదని చెప్పాలి. ఎందుకంటే పూర్తిగా అవి వారి వ్యక్తిగత అవయవాలని వాటిని గోప్యంగా ఉంచుకోవాలని వివరించాలి.

- ఇతరులు చేసే ఇటువంటి పనులకు 'వద్దు' అని చెప్పడం సరైన పద్ధతి అని పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలి.
- పిల్లలకు ఇష్టంలేని వ్యక్తులను ముద్దులు పెట్టుకోమని, కౌగిలించుకోమని తల్లిదండ్రులు బలవంతం చేయరాదు. ముద్దు లేదా కౌగిలింత తనకు ఇష్టం లేదని ఎవరికైనా చెప్పడానికి పిల్లలకు హక్కు ఉంది. వారికి ఉన్న ఆ హక్కును పెద్దలు గౌరవించాలి.
- ఎవరైనా రహస్యాంగాల వంక చూడడం, వాటిని తాకడానికి ప్రయత్నించడం జరిగితే ఆ విషయాన్ని వెంటనే తల్లిదండ్రులకు తెలియచేయాలన్న విషయాన్ని పిల్లలకు తెలియ చెప్పాలి. పిల్లలు చెప్పేది విని సరిగా అర్థం చేసుకుంటారని, నమ్ముతారని, తగిన భద్రత కల్పిస్తారన్న విశ్వాసాన్ని పిల్లలకు తల్లిదండ్రులు కలిగించాలి.
- సహజంగా తాకడం, తగలడం తప్పు లేదని, అయితే ముట్టుకోవడంలో తేడా అనిపించినా లేదా తాకే విధానం భయం కలిగించినా వెంటనే 'నో' చెప్పాలని ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేయాలని పిల్లలకు చెప్పాలి.

**7.2. పిల్లలకు మూడు శరీర భద్రత నియమాలు బోధించండి:**

**నేను వ్యక్తిగత శరీర భద్రత నియమాలను పాటిస్తాను**

**నియమం 1** : వస్త్రానికి సంబంధించిన నియమాలు: ఇతరుల ముందు నా రహస్యాంగాలను కప్పి ఉంచుకుంటాను.

**నియమం 2** : తాకడానికి సంబంధించిన **నియమాలు:** ఇతరుల ముందు నా రహస్యాంగాలను తాకను.

**నియమం 3** : సంభాషణ నియమాలు: నేను రహస్యాంగాల గురించి నమ్మదగిన పెద్దవారితోనే మాట్లడతాను. ఈ భాగాల గురించి నా సందేహాలు, భయాలను వారితో చర్చించి నివృత్తి చేసుకుంటాను.

వ్యక్తిగత శరీర భద్రత నియమాలను తాను పాటిస్తూ ఇతరుల పట్ల కూడా అలానే ప్రవర్తించే వారిని నమ్మదగిన వ్యక్తి (సేఫ్ పర్సన్) అంటారు.

**ఎవరైనా నా పట్ల వ్యక్తిగత శరీర నియమాలను ఉల్లంఘిస్తే నేను...**

- **'వద్దు' (నో)** అని స్పష్టంగా ఆ వ్యక్తికి చెబుతాను.
- **'వెళ్ళు' (గో)** ఆ వ్యక్తి నుంచి **దూరంగా వెళ్లి పోతాను.**

**'చెబుతాను' (టెల్)** ఆ వ్యక్తి గురించి నేను **విశ్వసించే వ్యక్తి (సేఫ్ పర్సన్)తో చెబుతాను.**

*నా భద్రతకు సంబంధించి నష్టం గాని, సమస్య గాని ఎదురైతే నేను సహాయం కోసం '1098' కి కాల్ చేస్తాను.*




**7.3. లైంగిక దాడికి గురైన బాలల ప్రవర్తన సంకేతాలు:**

లైంగిక దాడికి గురైన బాలుడు/బాలికను అనేక ఇతర లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. ముఖ్యంగా ప్రవర్తనా పరంగా వారు–

- దుడుకుగా, తిరస్కార భావంతో ఉంటారు.
- పిరికిగా ఉంటారు లేదా పెద్ద వాళ్లను చూసి భయపడిపోతారు.

- దౌర్జన్యం లేదా విధ్వంసక ప్రవర్తన కలిగి ఉంటారు.
- ఇతరులకు లేదా స్వయం వినాశకారులుగా ఉంటారు.
- స్కూలుకు చాలా త్వరగా వస్తారు లేదా స్కూలు విడిచి వెళ్లడానికి ఇష్టపడరు. అలాగే ఇంటిని విడిచి వెళ్లడానికి ఇష్టపడరు.
- నిర్భయత్వాన్ని లేదా తీవ్రమైన తెగింపును ప్రదర్శిస్తారు.
- సాధన శక్తి తక్కువై పోతుంది (సామన్యంగా పిల్లలు తమలోని దూకుడు శక్తిని అభ్యసనగా మార్చుకుంటారు. సంఘర్షణలో చిక్కుకున్న పిల్లలు ఈ పని చేయలేరు).
- సహచరుల (సహ విద్యార్థులు)తో స్నేహ సంబంధాలు ఏర్పరుచుకోలేరు.
- వాతావరణం వేడిగా ఉన్న కాలంలో కూడా ఒంటి నిండా దళసరి దుస్తులు కప్పుకుని వస్తారు (అయితే ఇది సంస్కృతికి సంబంధించిన అంశమని కూడా గుర్తించాలి).
- ప్రతి దానికి వెనుకాడతారు లేదా తక్కువ అపరిపక్వత ప్రదర్శిస్తారు.
- భౌతికంగా కలవడానికి ఇష్టపడరు లేదా ముడుచుకుపోతారు.
- ఎక్కువగా ఏడుస్తారు.

  ఎక్కువగా చిరాకు పడతారు లేదా పెంకితనం ప్రదర్శిస్తారు
- ప్రత్యేకించి ఒక వ్యక్తి లేదా ఒక వస్తువు అంటే భయపడతారు.
- అమర్యాదకర ప్రవర్తన కలిగి ఉంటారు
- ఇతరుల పట్ల దౌర్జన్యపూరితంగా ప్రవర్తిస్తారు.
- బడి కార్యక్రమాల్లో వెనుకబడి ఉంటారు
- పక్క తడపడం (నిద్రలో మూత్ర విసర్జన) లేదా బట్టల్లోనే మల విసర్జన చేస్తారు.
- ప్రవర్తనలో అనూహ్య మార్పు కనబరుస్తారు. (అంటే అన్నిటా ఉత్సాహం ప్రదర్శించే పిల్లలు నిరాసక్తత వ్యక్తం చేస్తారు)
- ఆ వయసు కంటే ఎక్కువగా లైంగిక ప్రవర్తన గురించి తెలుసుకుని ఉంటారు.
- బాలుడు/బాలిక తన జననాంగాలను ద్వేషిస్తారు లేదా తీవ్రమైన రీతిలో అత్యంత గోప్యతను పాటిస్తారు.
- పిల్లలు వారి సొంత జెండర్‌ను ఇష్ట పడరు. అంటే బాలిక స్త్రీత్వాన్ని, బాలుడు పురుషత్వాన్ని ఇష్టపడరు.
- బాలలు తమ సొంత పదజాలాన్ని తగని భాషలో నిరంతరం ఉపయోగిస్తారు లేదా సమాజం ఆమోదించని యాసలో మాట్లాడతారు.

**శారీరక సంకేతాలు**

- నోరు, జననాంగం లేదా గుద ప్రాంతంలో వివరించలేని నొప్పి, వాపు, రక్త స్రావం లేదా ప్రకోపం
- లైంగిక సాంక్రమిక వ్యాధులు (పుండు, స్రావం, జననాంగాల్లో నిరంతరం దురద)
- నడకలో చెప్పశక్యంగాని కష్టం
- తల నొప్పి లేదా కడుపు నొప్పులు పెరగడం

**8. జాగో! బదలో!! బోలో!!!**

పోలీసు, పాఠశాల విద్య, వైద్య – ఆరోగ్య, మహిళా శిశు సంరక్షణ శాఖలు వారి స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ సంవత్సరం కోసం ఓ నినాదాన్ని **జాగో! బదలో!! బోలో!!!** రూపొందించి అక్టోబర్, 2017లో ప్రారంభించారు.

శిశు భద్రతా రక్షణ అనేది మా బాధ్యత.

పాఠశాలలన్నీ అభ్యసనా కేంద్రాలుగా రూపుదిద్దుకొని బాలలకు సంతోషకరమైన, సురక్షితమైన బాల్య దశను అందించాలి.

*ఈ ప్రపంచం బాలలతో నిండి ఉంది. దీనికి మించిన పవిత్ర విశ్వాసం మరొకటి లేదు. బాలల హక్కులను గౌరవించడానికి మించిన మరొక ప్రధాన బాధ్యత అంటూ లేదు. వారి భద్రతను సంరక్షించాల్సి ఉంది. భయ రహిత ప్రశాంత వాతావరణంలో వారు పురోగమించాలి.*

*– కోఫీ అన్నాన్*



SCERT TELANGANA

# Abbreviations

| | |
|---|---|
| CCIs | Child Care Institutions |
| CEDAW | The Convention on the Elimination of all forms of Discrimination Against Women |
| CPCR | Commission for Protection of Child Rights |
| Cr. PC | Criminal Procedure Code |
| CRIN | Child Rights Information Network |
| CWC | Child Welfare Committee |
| DCPU | District Child Protection Unit |
| DHR | Department of Health Research |
| FIR | First Information Report |
| ICDS | Integrated Child Development Services Scheme |
| ICPS | Integrated Child Protection Scheme |
| IO | Investigation Officer |
| IPC | Indian Penal Code |
| JJ Act | Juvenile Justice (Care and Protection of Children) Act |
| MLC | Medical Legal Care |
| NCPCR | National Commission for Protection of Child Rights |
| NFHS | National Family Health Survey |
| NGO | Non Government Organisation |
| OP3CRC | Third Optional Protocol to the Convention on the Rights of the Child on a communications procedure |
| OPs | Optional Protocols |
| POCSO | Protection of Children from Sexual Offences Act |
| PTSD | Post Traumatic Stress Disorder |
| SCPCR | State Commission for Protection of Child Rights |
| SJPU | Special Juvenile Police Unit |
| UNCRC | United Nations Convention on the Rights of the Child |
| UNICEF | United Nations International Children's Fund |




**1992లో UNCRC బాలల హక్కులను ప్రకటించింది. అవి :**

**జీవించే హక్కు:** పిల్లలకు ఉండే ఈ జీవించే హక్కు కిందకు కనీస అవసరాలైన పోషణ, తలదాచుకోవడానికి గూడు, కనీస జీవన స్థాయి, వైద్య సేవల అందుబాటు వంటి అంశాలు వస్తాయి.

**అభివృద్ధి హక్కు:** ఈ హక్కు కింద పిల్లలు విద్య, ఆటలు, విరామం, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాచారం తెలుసుకునే హక్కులు, స్వేచ్ఛగా ఆలోచించే హక్కు, అభీష్టానికి అనుగుణంగా నడుచుకునే హక్కు, మత స్వేచ్ఛ కలిగి ఉంటారు.

**రక్షణ హక్కు:** ఈ హక్కు పిల్లలను అన్ని రకాల రకాల దుర్వినియోగాలు, నిర్లక్ష్యం, దోపిడిల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఈ హక్కు కిందకు శరణార్థులగా వచ్చిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ, నేర విచారణ వ్యవస్థలో పిల్లలకు రక్షణ, ఉద్యోగాల్లో పిల్లలకు భద్రత, దోపిడి, వేధింపులకు గురైన బాలలకు రక్షణ, పునరావాస కల్పన వస్తాయి.

**పాల్గొనే హక్కు:** పిల్లలు తమ సొంత జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై భావాలను, ఉద్దేశాలను వ్యక్తీకరించే స్వేచ్ఛను ఈ హక్కు ఇస్తుంది. సంఘాలలో చేరడానికి, శాంతియుతంగా సమావేశం కావడానికి ఈ హక్కు వీలు కల్పిస్తుంది. వారి సామర్థ్యాలు పెరిగే కొద్దీ సమాజంలో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. దీని ద్వారా వారు బాల్య దశ నుంచి వయోజన దశకు మారతారు.



SCERT TELANGANA

# 4. పిల్లలూ-భాష

- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం

మానవ నాగరికతను మలుపు తిప్పింది భాష అని మనకు తెలుసు. భాష మానవుడి ప్రమేయాన్ని బయటి ప్రపంచంలో విప్లవీకరించడమే కాదు మానవుణ్ణి అంతర్గతంగా కూడా విప్లవీకరించింది. వానరుడి నుండి నరావతారం జరిగాక నరుడిలోని అనేక మార్పులకు భాష ఒక కారణమని ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయం. అప్పటి దాకా బయటి శక్తులు పరిణామక్రమాన్ని నిర్ణయిస్తే భాష పుట్టాక అంతర్గత శక్తి (భాష) పరిణామాన్ని నిర్దేశించిందన్నమాట.

ఇప్పుడు భాష సార్వత్రికం, సార్వజనీనం. లిపిలేని భాషలున్నాయి గానీ ధ్వనుల్లేని, మాటల్లేని భాషలు లేవు. అత్యంత ప్రాథమిక స్థాయి (Primitive) భాష సైతం అద్భుతంగా ఆయా జాతుల అవసరాల్ని తీర్చగల స్థాయిలో ఉంది. అట్లాగే అవసరాలు పెరిగేకొద్దీ భాష తనకు తాను అద్భుతంగా మార్పులకు లోనవుతుంది. ఎప్పటికప్పుడు జవసత్వాలు సమకూర్చు కొంటోంది. భాషా, మానవుడూ చెట్టాపట్టాలేసుకొని పాతాళపుపొరల్నీ, గగనాంతరాళాల్నీ పిడికిట్లో బిగించుకొంటున్న యుగం మనది.

**భాషా నిర్మాణం :**

మనమందరం మాట్లాడుతున్నాం. అలవోకగా మాట్లాడుతున్నాం. మాట్లాడ్డమంత సులభం మరేముంది గనుక? కానీ కొంచెం లోతుగా చూస్తే భాషకు ఎంత సంక్లిష్టం!!!

అట్లాగే భాషకున్న ఈ ప్రాథమిక నిబంధనలన్నీ సార్వత్రికాలు, అన్ని భాషలకు సమానంగా వర్తించేవి.

ప్రతి భాషలోనూ హల్లు - అచ్చు - హల్లు - అచ్చు పద్ధతే ఉంటుంది. హల్లుల్ని అచ్చులేకుండా పలకలేము. ఒకవేళ పలికినా రెండు మూడు హల్లులకు మించి ఒకటిగా పలకలేము. మూడు హల్లుల సంయుక్తాక్షరాలు గల పదాలు ఏ భాషలోనైనా పట్టుమని పది చెప్పండి. చూద్దాం. స్త్రీ, శాస్త్రం, స్ట్రీట్, స్ట్రక్చర్ ఇలా చెప్పొచ్చు. ఎంత చెప్పినా ఎస్,టి,ఆర్ ధ్వనులతో తప్ప ఇతర ధ్వనులతో (హల్లులు) గల సంయుక్తాక్షరాలు ఎక్కడా చిక్కవు. ఇక నాల్గు హల్లులు గల సంయుక్తాక్షరం అసాధ్యం.

మన వాగ్యంత్రం ఎక్కువ హల్లుల కలయికను అంగీకరించదు. అందుకే మనం 'ఇస్కూలు' అంటాం. సూర్యుణ్ణి సూరీడు అని సరిపెట్టుకొంటాం.

ప్రతి భాషలోనూ మాటలకూ వాటి అర్థాలకూ సంబంధం లేదు. 'గాడిద' అని గుడ్డలు మోసేదాన్నే ఎందుకనాలి? ఇంటిక్కావలి ఉండే జంతువుని పంది అని ఎందుకనగూడదు? దీనికి జవాబెక్కడా చిక్కదు. అంటే మాటలన్నీ కేవలం కొండ గుర్తులు (సింబల్స్), అమూర్తాలు.

ఒక రకంగా చూస్తే భాష అత్యంత సంక్లిష్టమైంది. అంతా సంకేతాలతోనే నిండిఉంటుంది. చిన్న మార్పు చేసినా కొంప మునిగిపోతుంది.

సీత వంట చేస్తుంది.

SCERT TELANGANA

సీత వంట చూస్తూంది.

ఒక్క దీర్ఘమే తేడా, అర్థంలో బోలెడు మార్పు.

రాముడు బడికి పోతున్నాడు సీత బడికి పోతూ ఉంది.

ఇక్కడ కర్త లింగాన్ని బట్టి క్రియ మారిపోతుంది. అదే సీత గానీ రాముడు గానీ తమను గురించి చెప్పుకొంటే 'నేను బడికి పోతున్నాను' అని ఒకే రకంగా చెప్పవచ్చు. ఇట్లా ప్రతి భాషలోనూ చిన్న మార్పులు పెద్ద తేడాల్ని తెస్తుంటాయి.

వాక్యాల్లోనూ ఇంతే. ఒక క్రమం ఉంటుంది. మనం ఆ క్రమంలోనే మాట్లాడతాం.

'పోతున్నాడు బడికి రాముడు' అనొచ్చు. అయినా ఇది కృతకం.

పదాలు కొన్నే వాక్యాలు లక్షలు. ఎన్ని వాక్యాలైనా మనం తయారు చేసుకోగలం. నిజానికి ఒకసారి చేసిన వాక్యం మరోసారి చెయ్యం.

***అంతా సందర్భం మీద (contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే! మూడేళ్ల బిడ్డ భాషా పరంగా పెద్దవాడి కిందే (linguistic adult) లెక్క.***

ఎప్పటికప్పుడు కొత్త వాక్యాల్ని సృష్టించుకోగలం. ప్రతి భాషకూ అంత వివిధత, సృజనాత్మకత అత్యంత సాధారణం.

భాష నిరంతరం పరిణామశీలి. ఒక లెక్క ప్రకారం మాట్లాడేవాడు చెప్పేదీ. వినేవాడు స్వీకరించేది నూటికి నూరుపాళ్లు ఒక్కటిగానే ఉండదు. తాత భాషా, తండ్రి భాషా, తన భాషా ఒకటి కానేగాదు. అసలు మనం మాట్లాడేప్పుడు కూడా ఒకసారి ఒక చోట పలికేది, మరోసారి మరోచోట పలికేది ఒకటిగాదు.

భాషా పండితులు ఎంత గీపెట్టినాసరే అది తనకు తాను మారుతూనే ఉంటుంది. ఈ వాక్యాల కంటే పదాలు, పదాల కంటే ధ్వనులు ఎక్కువగా మార్పుకు లోనవుతాయి.

ఈ మార్పులు సందర్భాన్ని బట్టి ఉంటాయి. అంతా సందర్భం మీద (Contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే!

భాషకూ భావాలకూ మధ్య అంతు చిక్కని సంబంధం ఉంటుంది. 'తోడేలు' అనగానే 'భయం' కమ్ముకొంటుంది. 'ఐస్‌క్రీం' అనగానే నోరు ఊరుతుంది.

ఒకే మాట పలు సందర్భాల్లో పలు అర్థాలివ్వవచ్చు. 'నా మాట ఏం చేశావ్' అన్నప్పుడూ 'మాటా మాటా పెరిగింది' అన్నప్పుడూ 'మాట' వినడానికి ఒకటే. అర్థం మాత్రం ఒకటి గాదు.

ఇలా చూస్తే భాష అత్యంత క్లిష్టమైంది, అత్యంత గహనమైంది. ఎవరైనా పరాయిభాషను వయసొచ్చాక నేర్చుకొంటూంటే ఈ సంక్లిష్టత అర్థమవుతుంది. ఇంత 'న్యూసెన్సు' ఏమిటా అని తల తిరిగి పోతుంది.

## పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు?

మరి ఇంత క్లిష్టమైన భాషని పిల్లలు అలవోకగా ఎట్లా నేర్చుకొంటున్నారు? ఒకటి గాదు రెండు, మూడు భాషలు కూడా ఏకకాలంలో ఎలా నేర్చుకొంటున్నారు? అంటే మూడేళ్ల బిడ్డ భాషాపరంగా పెద్దవాడి కిందే లెక్క.



SCERT TELANGANA

ప్రతి బిడ్డా మూడేళ్ల వయసులో భాష నేర్చుకొంటోంది. ఇదొక సార్వజనీన సూత్రం. కొంచెం క్రమంలో తేడా ఉండవచ్చు, వేగంలో అటూ ఇటూ ఉండొచ్చు. కానీ మాతృభాష మాత్రం అందరికీ మూడేళ్లలో అనర్గళంగా వచ్చి తీరుతుంది. ఇదెట్లా సాధ్యం?

విచిత్రమేమంటే పిల్లలు నేర్చుకొనే క్రమం కూడా ప్రపంచమంతా ఒకటే. ముందు చిన్న చిన్న సరళ వాక్యాలు మాట్లాడతారు.

'నాన్న' అంటే అదీ వాక్యమే, 'నాన్న వచ్చాడు' 'నాన్న పోతున్నాడు', 'నాన్న కన్పించడం లేదు' ఇలా ఏదైనా కావచ్చు! ఆ తర్వాత రెండు పదాలతో వాక్యాలుంటాయి.

సరళ వాక్యాల తర్వాత వ్యతిరేక వాక్యాలు పిల్లలకు వస్తాయి. ఆ తర్వాత ప్రశ్నార్థకాలు నేర్చుకొంటారు.

ప్రతి బిడ్డకూ హల్లు-అచ్చు, హల్లు-అచ్చు (CVCV) సూత్రం తెలుసు. వీటిని కలగాపులగం చేసి గందరగోళపడినట్టు ఎక్కడా కన్పించదు.

ఒక వాక్యాన్ని సందర్భానుసారంగా అర్థం చేసుకోవడం పిల్లలకీ వచ్చు. నవ్వుతూ 'నేను రాను' అంటే 'వస్తానులే' అన్న ధ్వని అందులో ఉందని బిడ్డకు తెలుసు. చివర మనం చేసే చిన్న మార్పు వల్ల ప్రశ్నలుగా వాక్యాలు మారుతుంటాయి. వీటిని పిల్లలు అట్టే పట్టేస్తారు.

'సీత పుస్తకం చదువుతున్నాడు' అని మనం అంటే ఏ మూడేళ్ల పాపైనా 'ఇందులో ఏదో తప్పుందన్న'ట్టు మనల్ని వెక్కిరిస్తుంది. కాకుంటే తప్పేమిటో ఆ పిల్ల స్పష్టంగా చెప్పలేకపోవచ్చు.

భిన్నార్థాల మాటలని సందర్భాన్ని బట్టి పిల్లలు అర్థం చేసుకొంటున్నారు. వాక్యంలోని పదాల క్రమాల్ని కర్త ఆధారంగా క్రియలో వచ్చే మార్పుల్ని, కర్తా కర్మల విభక్తుల్ని తెలుసుకోడమేగాదు అవసరాన్ని బట్టి వాక్యాల్ని వివిధ విన్యాసం చేయగల నేర్పునీ పిల్లలు అత్యంత సహజంగా పొందుతున్నారు.

అంతకంటే అద్భుతం తమకు తెలిసిన పరిమిత పదాలతోనే వారు వేలాది వాక్యాలు కొత్త కొత్తవి స్వంతంగా తయారుచేసుకోవడం. ఇదంతా పెద్దల్లాగానే వాళ్లూ చెయ్యగల్గుతున్నారు.

మరీ విచిత్రం - పిల్లలు రెండు మూడు భాషల నియమాల్ని కూడా పట్టేస్తున్నారు. ఇంత సంక్లిష్ట నిర్మాణం గల నైరూప్య విషయాన్ని ఇంత సులభంగా పిల్లలెలా గ్రహిస్తున్నారు? ఇంత గొప్పగా ఎలా ఉపయోగించుకోగల్గుతున్నారు?

**దీన్ని భాషా శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలూ ఇలా విశ్లేషిస్తున్నారు.**

- ఆసక్తికర వాతావరణంలోనే పిల్లలు భాష నేర్చుకొంటున్నారు. అవసరమైన వాతావరణమే ఆసక్తికరమైంది. సహజమైందీ.
- ఈ భాషాభ్యసన క్రమంలో తప్పని సరిగా మనం అందజేసేది (ఇన్‌పుట్) ఉంటుంది. కానీ ఫలితం (అవుట్ పుట్) ఉండదు. అంటే ఇన్‌పుట్‌కు సమానంగా - అవుట్‌పుట్ ఉండదు. దీనర్థం పిల్లలకి ఎన్నో మాటలు వినిపిస్తుంటాయి. వాటిని వాళ్లు కొన్నింటిని గ్రహిస్తుంటారు. గ్రహించినవి తిరిగి ఒప్పజెప్పాల్సిన అవసరం ఈ నేర్చుకొనే క్రమంలో లేదు.

- ఒక్క సంవత్సరం పాటు పిల్లలు వింటూనే ఉంటారు. జవాబు చెప్పాల్సిన, ఉపయోగించుకోవాల్సిన పని ఉండదు. ఎవ్వరూ అలా ఒత్తిడి చెయ్యరు. ప్రతి చర్య అవసరంలేని స్వీకరణ ఇది. ఇదొక మౌన మహాయుగం.
- ప్రతీది సందర్భం నుంచే పిల్లలు నేర్చుకొంటారు. తాము పాల్గొనని తమకు సంబంధం లేని, అమూర్త నిర్వికారాంశాలకు ఇక్కడ తావులేదు.
- ఇట్లా నేర్చుకొనేప్పుడు వాళ్లకేమో ఒక క్రమం లేదు. ముందు అక్షరాలు, తర్వాత పదాలు, ఆ తర్వాత వాక్యాలు ఇలాంటి వరుస లేదు. ముందు 'అ' చివర 'క్ష' అనే క్రమం అసలే లేదు.
- ముందు సులభం, తర్వాత క్లిష్టం అనే వరస కూడా లేదు. దీర్ఘాలు ముందురావచ్చు. హ్రస్వాలు వెనక రావచ్చు. పిల్లలకందుతున్న భాష ఒక నిర్ధారిత క్రమంలో ఉండదు. దానికో ప్రణాళికా పద్ధతీ ఏమీ ఉండవు.
- ఈ అభ్యసన క్రమంలో ఏమి మాట్లాడారన్నది ప్రధానం కాదు. ఏదైనా మాట్లాడవచ్చు. మాట్లాడకుండానూ ఉండొచ్చు. ఎట్లాంటి ఒత్తిడీ లేదు.
- తమ స్వంత పద్ధతిలో పిల్లలు నేర్చుకొంటారు. దాన్ని ఎవ్వరూ రూపకల్పన చెయ్యరు. 'టీ' అనే ఒక మాటను ఒక పాప ఎట్లాగైనా వాడుకొంటుంది. తాను పాలు తాగుతున్నా, అమ్మమ్మ కాఫీ తాగుతున్నా, నాన్నా టీ తాగుతున్నా, అన్నిటినీ 'టీ' అనే అంటుంది. ముందు తాను పట్టుకొన్న ఒక పేరు అన్న పానీయాలకూ పెట్టి, తర్వాత వేర్వేరు పేర్లు పెట్టుకొనే ఒక స్వంత క్రమం ఆ పాప ఏర్పరచుకొన్నదన్నమాట.
- ప్రతి రూలునూ తనకు తానే బిడ్డ తెలుసుకొంటుంది. వ్యాకరణం ఎవ్వరూ చెప్పరు.
- విచిత్రంగా అన్ని భాషల పిల్లలూ మొదట ప, బ, మ ధ్వనుల్ని ఇష్టపడతారు. 'అమ్మ, బాబా, పాపా' వంటివి వారికిష్టం.

భాష ఇంత సంక్లిష్టంగా ఉండే అంశం కావడమేమిటీ? నేర్చుకోవడం ఇంత సులభతరంగావడమేమిటి? భాషకున్న నిబంధనలు ఇంత సార్వత్రికం కావడమేమిటి? నేర్చుకొనే క్రమం ఇంత సార్వజనీనం కావడమేమిటి? అంతా విచిత్రంగా ఉంది గదూ! అవును పెద్దలకు, మనకు విచిత్రమే! పిల్లలకేమో ఇది అత్యంత సహజం.

ఇప్పుడు పెద్దలం, మనం పట్టుకోవల్సిందల్లా ఈ అభ్యసన క్రమాన్నీ, రహస్యాన్నీ.

**పిల్లలూ - అబద్ధాలూ**

**మీ పిల్లలు అబద్ధాలు చెపుతున్నారంటే మీరంటే వాళ్ళు భయపడుతున్నారన్నమాట. లేకుంటే మిమ్మల్ని అనుసరిస్తున్నారన్నమాట. అబద్ధాలు చెప్పే తల్లిదండ్రులకు అబద్ధాలు చెప్పే పిల్లలుంటారు. తమను తాము రక్షించుకోవడానికి పిల్లలు అబద్ధాలు చెపుతారు. మీ ఇంట్లో భయాన్ని రద్దుచెయ్యండి. పిల్లల్లో అబద్ధాలు అవే తగ్గిపోతాయి.**

**- ఎ.ఎస్.నీల్**

# 5. పిల్లలు భాష నేర్చుకొన్నట్టే రాయడమూ నేర్చుకోగలరా?

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

భాషా, లిపీ ఈ రెండింటి స్వభావం ఒకటేనా? పరిణామ వికాస క్రమాలూ ఒకటేనా? అట్లా అయితే భాష నేర్చుకొన్నట్టే అక్షరాల్నీ పిల్లలు సహజంగా నేర్చుకొనే వీలుందా? రెండిటి అభ్యసన క్రమం, ఒకటేనా? ఈ ప్రశ్నలు కొంచెం లోతైనవి. పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు. అన్న ప్రశ్నకు సందర్భం, స్వప్రమేయం, స్వీయావసరం, స్వేచ్ఛల ఆధారంగా నేర్చుకొంటారనీ దీన్నే సహజ అభ్యసనమనీ ఇప్పుడు చాలా మంది అంగీకరిస్తున్నారు. మరి లిపికీ (అక్షరాలకూ) ఇది వర్తిస్తుందా? అంటే అంతే అని చెప్పడానికి మాత్రం వీళ్ళల్లో చాలా మంది తటపటాయిస్తారు.

అసలు మనం మాట్లాడడం నేర్పడం లేదు. పిల్లలే తమకు తాము నేర్చుకొంటున్నారు. కానీ ఏమీ నేర్పకుండా రాయడం నేర్చుకొనే వాళ్లెవరున్నారు? కాబట్టి మాట్లాడడం, రాయడం రెండూ ఒకేగాటన కట్టెయ్యదగినవి కావని ఎవరైనా తేలిగ్గా జవాబు చెప్పొచ్చు. మరి కొంచెం లోతుగా చెప్పదల్చుకొంటే అసలు మాట్లాడడం ఒక తప్పనిసరి అవసరం. బిడ్డకి ఆకలి వేసినప్పుడు దాన్ని ఏడుపు రూపంలో వ్యక్తం చేసినట్టే, ఆకలి తీరినప్పుడు దాన్ని కేరింత రూపంలో వ్యక్తం చేస్తుంది. దీన్ని భాషకు ప్రాథమిక రూపంగా మనం అనుకొంటే ఇది మనుగడకు సంబంధించిన సమస్య. ఇలా చూస్తే భాష ఓ విధంగా ఒక సహజాతం లాంటిది. అందుకు దీన్ని వ్యక్తీకరించేందుకు సహజమైన ఏర్పాటు ఉంది. మన వాగ్యంత్రం ఇందులో భాగం. మరి లిపికీ స్వభావం ఎక్కడుంది? లిపి మనం అవసరం కొద్దీ కల్పించుకున్నది. రాసేందుకు వాడే సాధనాలు నోరులాగా, నాలుకలాగా సహజమైనవి గావు. అవి మనం సృష్టించుకొన్నవి. అవి మనిషి బాహిరమైనవి. అట్లాంటప్పుడు భాష నేర్చుకొన్నట్టే పిల్లలు లిపి ఎట్లా నేర్చుకోగలరు? దీనికి నేర్పడం తప్పనిసరి. ఒక క్రమంలో నేర్పడం మరింత తప్పనిసరి. ఈ రకమైన చర్చ ముందుకొస్తుంది.

**అక్షరాల స్వభావం :**

దీన్ని తేల్చుకోవాలంటే లిపి స్వభావంలోకి మనం వెళ్ళాలి. దాని లక్షణాల్ని కొంచెం పరిశీలించాలి.

మొదటిది - మనం పెట్టుకొన్న పేరుకీ ఆ వస్తువుకీ ఎలా సంబంధం లేదో మనం రాస్తున్న అక్షరానికీ పలుకుతున్న ధ్వనికీ సైతం సంబంధం లేదు. గాడిదను గాడిద అనే ఎందుకనాలో చెప్పలేనట్టే ఒకానొక కంఠధ్వనిని 'క' అనే ఎందుకు రాయాలో కూడా మనం చెప్పలేం. గాడిదలాగే 'క' కూడా మనం పెట్టుకొన్న ఓ సంకేతం. అమూర్త సంకేతం.

అందువల్లనే ఒక లిపిలో ఏ భాషనైనా రాయగలం, అన్ని భాషల్నీ అన్ని లిపుల్లోనూ రాయగలం. ఉదా : KUKKA (తెలుగు), DOG (ఆంగ్లం), KUTHE (హిందీ)

ఇలా లిపి కేవలం సంకేతం మాత్రమేగాబట్టి ఏ లిపీ సమగ్రం, సంపూర్ణం కాదు. ఒక ధ్వనిని అనేక రూపాల్లో రాయడం సాధ్యం. ఒక అక్షరాన్ని అనేక విధాలుగా పలకడమూ జరుగుతున్నదే. ఋషిని రుషి అని రాస్తే 'ఆవు'ను 'ఆఉ' అని రాస్తే 'ఒకటి'ని 'వొకటి' అని రాస్తే చదవడానికేమీ ఇబ్బంది ఉండదు. రెండు వస్తువులకు ఒకే పేరున్నట్టే రెండు ధ్వనులకు ఒకే అక్షరమూ మనం రాస్తున్నాం. ఒక ధ్వనిని ఒకచోట ఒకలాగా మరోకచోట మరోలాగా పలుకుతున్నట్టే ఒక అక్షరాన్ని ఒకచోట ఒక ధ్వనికీ, మరో చోట మరో ధ్వనికీ మనం ఉపయోగించుకొంటున్నాం. మనం చెప్పదల్చుకొన్న ప్రతి దానికి సరిపోయే మాటలు లేనట్టే మనం రాయదల్చుకొన్న ప్రతిధ్వనికీ సరిపోయే అక్షరాలూ లేవు. చేప, చాప, చాట ఈ మూడింటా పలుకుతున్న ధ్వనియేది? రాస్తున్నదేది? లేదా రాస్తున్నదేది? పలుకుతున్నదేది?



SCERT TELANGANA

**లిపీ మారుతోంది :**

మరో అంశం పరిశీలిద్దాం. భాష రోజు రోజుకీ మారుతోంది. దాని పరిణామ క్రమాన్ని మనం రికార్డు చెయ్యొచ్చుకూడా. గుఱ్రబు, గుఱ్ఱంబు, గుఱ్ఱమ్ము, గుఱ్రము, గుర్రం. గుర్రం ఇట్లా రూపాంతరం చెందడం మన కళ్ల ముందే చూస్తున్నాం. సందర్భాన్ని బట్టి, వ్యక్తిని బట్టి వేగాన్ని బట్టి కూడా భాషలో మార్పులు కొల్లలుగా మనం చూడొచ్చు. ఇందులో ఏది సరైంది? (లాక్షణికమైంది) ఏది సరైంది గాదు? అని ప్రశ్నిస్తే ఎవరికివారి భాషే సరైంది అనడం కంటే వేరేజవాబు ఉండదు. పిల్లవాడికి గుల్లం సరైంది. పండితుడికి గుఱ్ఱము సరైంది. మనకు గుర్రం సరైంది. స్కూలు మొహం ఎప్పుడూ చూడని వారికి ఇస్కూలు అంతే సరైంది. కాకుంటే మనం (అంటే సమాజం మీద ఒక పట్టుగల) ఒకానొక భాషని లాక్షణికం అంటున్నాం. అక్కడితో ఆగక ఈ లక్షణాలు తెలీని వారి భాషని గ్రామ్యం అనీ అచ్చ తెలుగులో అలగాజనం భాష అనీ కూడా ఎద్దేవా చేస్తున్నాం.

మరి లిపి కూడా ఇలానే మారుతోందా? మారుతోంది గానీ భాష మారినంత వేగంగా మారడం లేదు. దానిక్కారణం భాషకున్నంత అవసరం, ప్రాచుర్యం. సందర్భ వైవిధ్యం రాయడానికి లేకపోవడం గావచ్చు. కానీ మారుతుండటం మాత్రం అక్షరసత్యం. ఇప్పుడు కాఫీలోని ఫీకి కొత్త అక్షరం వచ్చింది. అమెరికన్లు డౌట్‌లో బి ఎందుకని ఎదురు తిరుగుతున్నారు. మన పిల్లలు చే, జే లకు ఎగనామం పెట్టేశారు. బండి 'ఱ' తిరిగి రాని లోకాలకి వెళ్ళిపోయింది. పాపం 'ౠ' అంతరించి 'ఋ' తోడులేక మినుకుమినుకుమంటోంది శ, ష, సలలో ఏదో ఒకదానికి తొందర్లోనే మూడేటట్టుంది. అసలు స(శ) స(ష) అని రాస్తే పోతుంది గదా అనే సవాలూ వస్తోంది. అక్కడితో ఆగక 'అ' ఒక్కటే మిగిలించి దానికి దీర్ఘం (తా) గుడీ (తి) ఇత్యాదులిచ్చి ఆ, ఇ, ఈ అని పలికితే అక్షరాలు కలసి రావూ అనే పొదుపు ఉద్యమమూ తలెత్తుతోంది. ఎలక్ట్రానిక్ యుగం ఇంకొంచెం ముదిరితే ఏ అక్షరాలు (పాపం వాటి పేరేమో అక్షరాలు - నశించనివి) ఏమవుతాయో ఎవరు చెప్పగలరు? ప్రపంచీకరణ ప్రభావం వల్ల అన్ని భాషలకీ ఒకే లిపి అనే చట్టం రాదని హామీ ఎవరివ్వగలరు?

భాషకీ లిపికీ మధ్య ఓ అనిర్వచనీయమైన లయ ఉందిగదా అనొచ్చు. లిపి ఏర్పడ్డాక ఆ లిపిలో మన భాషని ఏళ్ల తరబడి చూసుకోవడం అలవాటయ్యాక మనకలా కన్పిస్తోంది. ఇది కేవలం స్వీయ మానసిక విషయం. అంతేగానీ ఈ అనుబంధమేదీ భాషకీ లిపికీ మధ్య లేదని ఆధునిక లిపి శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

**లిపి - సహజాభ్యసనం :**

భాషకీ లిపికీ మధ్య ఈ సాన్నిహిత్యం చూసాక ఇక లిపిని నేర్చుకోవడం దగ్గరికి వద్దాం. భాషలా లిపి ఒక సహజాతం లాంటిది కాదుగదా మరి సహజ అభ్యసనం ఎట్లా సాధ్యమనేది చాలా విలువైన ప్రశ్న. పిల్లలు అవసరం ఉన్నా లేకున్నా ఏదో ఒకటి గొణుక్కుంటుంటారు. ఏదో ఒక శబ్దం చేస్తూనే ఉంటారు. ఇది చాలా చిన్న వయస్సు నుంచీ మనం చూస్తున్నాం. అట్లాగే పిల్లలు ఏదో ఒకటి నేల మీద, గోడల మీద గీయడమూ మనం గమనించొచ్చు. తాను భావిస్తున్న దానికి (ఆ మూర్త భావనకి) ఓ సంకేతం (మూర్త రూపం) కల్పించుకోవడంలో ఇది భాగమా? లిపికిదే ప్రాథమిక రూపమా? అసలు ఆదిమ మానవుడు మాటలు రాక సైగలు చేసుకొనే కాలంలోనే తన భావాల్ని బొమ్మల ద్వారా సంకేతాల ద్వారా తెలియజేసేవాడని చాలా ఆధారాలు కూడా మనకు దొరుకుతున్నైకదా! కాబట్టి భాష లానే రాత కూడా ఓ సమాజావసరం. సహజాతం లాంటిదనే వాదన కూడా ముందుకొస్తోంది.

అదెలా ఉన్నా భాష నేర్చుకొనే క్రమానికీ, రాత నేర్చుకొనే క్రమానికీ మధ్య సామ్యం మాత్రం మనం గమనించి తీరాలి. అంగీకరించి తీరాలి. అసలు పిల్లలు భాషనీ అక్షరాల్నే గాదు నడక నేర్చుకోవడంలో కూడా ఓ క్రమం ఉంది. ఓ వ్యాకరణం ఉంది. ప్రతి అమూర్తాంశాన్ని మనిషి తెలుసుకోడానికీ ఒక క్రమం ఉంది. ఈ క్రమాల మూల స్వభావం, లక్షణం ఒకటిగానే ఉంటై. దీన్ని అర్థం చేసుకొంటే పిల్లలు రాయడం నేర్చుకోవడంలోనూ, భాషను నేర్చుకోవడంలో ఒక క్రమమే చాలా వరకు ఉందని మనం అనుభవం నుంచి తెలుసుకోవచ్చు.

భాషని పిల్లలు ఒక సందర్భంలో నేర్చుకొంటారని మనం అంగీకరిస్తే లిపినీ ఒంటరిగా గాక ఒక సందర్భం (కాన్‌టెక్స్ట్)లోనే పిల్లలు నేర్చుకొంటారు. మనం అట్లా నేర్పడమే సహజాభ్యసనం. అ, ఆ, ఇ అని దిద్దేప్పుడు ఏ సందర్భం ఉంది?

పిల్లలు స్వప్రమేయంతోనే భాషను నేర్చుకొన్నట్లే రాయడంలో కూడా జరగాలి. రాయడం సహజాభ్యసనం ద్వారా జరగాలి. (బొమ్మలు, గీసినట్టు అక్షరాలు స్వంతంగా గీయడానికి ఉద్యుక్తులు కావాలి).

పిల్లలు భాషని ముక్కలు ముక్కలుగాగాక సమగ్ర రూపంలోనే నేర్చుకొన్నట్లు లిపినీ అ, ఆ, ఇ, ఈ అని ముక్కలు చెయ్యడం గాకుండా పదాలు, వాక్యాలుగా నేర్చుకోవడం (అదీ ఒక సందర్భంలో) సహజాభ్యసనం.

మనం పట్టుబట్టి ప్రతిమాటా నేర్పితే, వ్యాకరణం చెపితే పిల్లలకు భాష రాలేదు. అట్లాగే ఎంతసేపు దిద్దిస్తే అంతగా అక్షరాలు వస్తాయనేది మన భ్రమ. మాట్లాడుతున్న క్రమంలో భాష వచ్చినట్టే చదువుతున్న క్రమంలోనే రాయడం వస్తుంది.

తప్పులు మాట్లాడుతూనే బాగా మాట్లాడడం నేర్చుకొన్నట్లు తప్పులు రాస్తూనే పిల్లలు సరిగా రాయడం నేర్చుకొంటారు. పిల్లలు మాట్లాడేటప్పుడు గుర్రాన్ని 'గుల్లం' అనగానే మనం ఎట్లా బెంబేలు పడమో అట్లాగే 'అమ్మను' 'అమం' అని రాయగానే మనం అన్యాయం జరిగిపోయిందనుకోకూడదు.

ఇన్‌పుట్ - ఔట్‌పుట్ అనే సూత్రం భాషకు మల్లే రాతకీ వర్తిస్తుంది. ఒక పదాన్ని చదవగల్గిన మరునాడే డిక్టేషన్ చెప్పడం అర్థరహితం. ఏడో పాఠంలో ఉన్నవాడు మూడో పాఠం పదాలు బాగా రాయగల్గితే చాలు. పరిసరాలు అనుకూలంగా ఉంటే పిల్లలు రెండు భాషలూ మాట్లాడగల్గినట్టే రెండు లిపులూ నేర్చుకోగలరు. కానీ ఏ భాషా వాతావరణం ఎక్కువగా ఉంటే ఆ భాషలో పట్టు చిక్కినట్టే, ఏ లిపి వాతావరణం ఎక్కువుంటే అందులో బాగా రాయగలరు.

ఇలా ఎంతైనా చెప్పుకోవచ్చు గానీ అసలు సూత్రం మాత్రం ఒక్కటే. అదేమంటే పిల్లలు దేన్నైనా నేర్చుకోవడానికి ఓ క్రమం, ఓ పద్ధతి ఉంటుంది. ఆ క్రమం, పద్ధతీ అన్నింటా దాదాపు ఒక్కటే. కావల్సిందల్లా దీన్ని మనం అర్థం చేసుకోవడం, అంగీకరించడం.

## స్వేచ్ఛా - చర్చా

**వాస్తవమైన స్వేచ్ఛను సాధించేదే విద్య, విమర్శనాత్మక చైతన్యాన్ని కొందరు అరాచకమని భావిస్తారు. స్వేచ్ఛ అంటే భయపడతారు. ఈ భయం ఉపాధ్యాయుల్లోనే కాదు, పిల్లల్లోనూ పాతుకొనిపోతుంది. చర్చ స్వేచ్ఛ కోసం పోరాడే చర్య, చర్చలో ప్రేమ ఉంది, నిబద్ధత ఉంది. ఒక చర్చ మరొక చర్చకు దారితీస్తుంది. బోధనాపద్ధతులు మారితే ఈ స్వేచ్ఛా, చర్చల ప్రక్రియ ముందుకు సాగుతుంది. ప్రపంచాన్ని పిల్లల్ని ప్రేమించేవాళ్ళే చర్చలోకి ప్రవేశిస్తారు.**

# 6. భాషా బోధనలో భిన్న ధోరణులు

*- "చదువు విజ్ఞానం", జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం*

భాషను అభివృద్ధి చెందిన మానవుడి మెదడుకు ఫలితంగానేగాక మానవుడి మెదడు అభివృద్ధికి ఒకానొక హేతువుగా కూడా నేడు పరిగణిస్తున్నారు. సైగల రూపంలో, చిన్న చిన్న ధ్వనుల రూపంలో మొదలైన భాష నేడు అత్యంత విస్తృతంగా, సంక్లిష్టంగా కూడా పరిణతి చెంది మన అవసరాల్ని అద్భుతంగా నెరవేరుస్తోంది.

భాషా నిర్మాణం వాస్తవానికి అంత సరళమైంది ఏమీ కాదు. ప్రతి భాషకూ తనదైన నిర్మాణ పద్ధతి ఉంది. అదే సందర్భంలో అన్ని భాషలకూ సమానమైన కొన్ని నియమాలు ఉన్నాయి. ఏ చిన్న నియమాన్ని ఉల్లంఘించినా, చిన్న పొరపాటు చేసినా మొత్తం చెప్పదల్చుకొన్నదే తారుమారయ్యే ప్రమాదం ఉంది. 'వేసవిలో సంపన్నులు తాళలేక ఊటీ, సిమ్లా వంటి శీతల ప్రదేశాలకు వెళుతుంటారు' అనే వాక్యంలో 'తాళలేక' అనే పదాన్ని 'తాళంలేక' అని చదివితే ఏమవుతుంది? ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నైనా మనం నిత్యజీవితంలో చూడవచ్చు.

వచనం మారినప్పుడు, లింగం వేరైనప్పుడు, కాలాల్లో భేదం వచ్చినప్పుడు క్రియల్లో వచ్చే మార్పులకు మనం అలవాటు పడ్డాం గాబట్టి మాతృభాషలో సవాళ్లుగా కన్పించవుగానీ ఇతర భాషల్లోనైతే తలనొప్పిగా ఉంటాయి. సంస్కృత భాషలో 'దారా:' (భార్యలు) అనేది పుంలింగం. అది బహువచనంలో మాత్రమే ఉంటుంది. హిందీలో నపుంసక లింగం లేదు. ఉన్నదల్లా స్త్రీ పురుషాలే. హిందీలో 'నే' ప్రత్యయం వచ్చినప్పుడు క్రియ కర్తనుబట్టిగాక కర్మను బట్టి మారుతుంది. ఆంగ్లంలో కర్మణి (passive voice) ప్రాధాన్యత ఎక్కువ.

ఇట్లా చెప్పుకొంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. మరి ఇంత సంక్లిష్టమైన, దేనికది ప్రత్యేకమైన భాషల్ని మనం ఇంత అలవోకగా ఎట్లా నేర్చుకొంటున్నాం? మనలో ధారాళంగా మాట్లాడడం గానీ, అభిప్రాయాలు వ్యక్త చెయ్యడం గానీ చేతగాని వాళ్లు ఎవ్వరూ లేరు. అందరం కొంచెం అటూ ఇటూగా అత్యంత సమర్థంతంగా విని అర్థం చేసుకొంటున్నాం. మాట్లాడుతున్నాం. ఈ నైపుణ్య సంపాదనా క్రమంలో కూడా మన మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. అందరం ఒకే వయస్సులో ఒకే 'పాండిత్యం' సంపాదిస్తున్నాం. మన పిల్లలకు గల పదజాల సంపద కూడా దాదాపు ఒకే మోతాదులో ఉంటోంది. ఇదెలా సాధ్యమవుతోంది?

మనమెవ్వరమూ ముందు వ్యాకరణం నేర్చుకొని తర్వాత మాట్లాడడం మొదలు పెట్టలేదు. ప్రతిదీ ఎవరో ఒకరు పట్టుపట్టి, చెవిమెలిపెట్టి నేర్పితేనే మనకిది వొంటపట్టలేదు. అన్నిటికంటే మించి ఒక పద్ధతి, ఒక క్రమం ఎవరో నిర్దేశిస్తే దాని ప్రకారం మనం నేర్చుకోలేదు.

మరి చదువడం, రాయడం దగ్గరికొచ్చేటప్పటికి ఇట్లా జరగడం లేదు. ఎక్కువ మంది ఇందులో వెనకబడిపోతున్నారు. కొందరు సాధ్యంగాదని పారిపోతున్నారు. చాలా మంది పెద్ద భారంగా ఈదలేక సతమతమవుతున్నారు. దీనికి కారణాలేమిటి? ఈ నైపుణ్యాలు (చదువడం, రాయడం) వినడం, మాట్లాడడం కంటే చాలా సంక్లిష్టమైనవా? మనిషి మెదడు ఈ నైపుణ్యాల్ని సంతరించుకోవడానికి వెనకబడేంత బలహీనమైందా? ఒకేసారి రెండు మూడు భాషలు కూడా మాట్లాడగల్గుతున్న పిల్లలు మాతృభాషను కూడా ఎందుకు చదవలేకపోతున్నారు? సంవత్సరాల తరబడి శ్రమించినా ఎందుకు అనుకొన్న ఫలితాలు సాధించలేకపోతున్నారు?

పిల్లలు సహజమైన సందర్భాల్లో స్వేచ్ఛగా పాల్గొనడం వల్ల మాట్లాడడం అంత సులభంగా నేర్చుకోగల్గుతున్నారని ఇప్పుడందరం అంగీకరిస్తున్నాం. భయం, ఒత్తిడీ లేని వాతావరణంలో తప్పుల్ని లెక్కించి ప్రతిదీ సరిచేసే పరిస్థితి లేనిచోట, ఎంత నేర్చుకొన్నారని అడుగడుగునా మూల్యాంకనం చేయని పద్ధతిలో వారు నేర్చుకొంటున్నారు.

అంతేకాదు. పిల్లలు భాషను అవసరాల ప్రాతిపదికన నేర్చుకొంటున్నారు. విస్తృత సమాచారం అందుబాటులో ఉండటంతోపాటు అందులోంచి తమ ఇష్టం వచ్చింది, తమక్కావల్సింది ఉపయోగించుకొనే, సంగ్రహించుకొనే స్వేచ్ఛ కూడా వారికి ఉంది. తమ అవసరాల్ని ఏది తీరుస్తుందో దాన్ని మాత్రమే పిల్లలు అభివృద్ధి చేసుకొంటారు. ఈ క్రమం నుంచే పిల్లలు నేర్చుకొంటున్నారు.

భాషా తత్త్వవేత్తలు దీనిమీద ఇప్పటికే కావల్సినన్ని తర్జనభర్జనలు చేశారు. మళ్ళీ దీని జోలికి మనమిక్కడ వెళ్ళనక్కరలేదు. కానీ ఈ నేపథ్యంలో మనం భాషను తరగతి గదిలో నేర్పుతున్న పద్ధతిని మాత్రం సమీక్షించుకోవలసి ఉంది.

సాధారణంగా మనమందరం నేర్చుకొన్నదీ, నేర్పుతున్నదీ అక్షరాల్ని ఒక వరుస క్రమంలో రాయించే (దిద్దించే) పద్ధతి. దీన్ని అక్షరపద్ధతి అంటున్నాం. ప్రతి భాషకూ ఒక అక్షరమాల ఉంటుంది. అందులోని అక్షరాలకు ఒక వరస ఉంటుంది. ఈ వరస ప్రకారం పలికించడం (గుర్తించడం), రాయించడం నేర్పడంతో మనం భాషాబోధనను ప్రారంభిస్తున్నాం. ఆంగ్లంలాంటి భాషకున్న అక్షరమాల చిన్నది. తమిళం లాంటి భాషకు గల అక్షరమాల చాలా సరళమైంది. ప్రతిధ్వనికీ ఒకే అక్షరాన్ని పలుధ్వనులతో పలకడం వారి సంప్రదాయం. సంస్కృతంలో, తెలుగులో అలా కాదు. అక్షరమాల చాలా పెద్దది. వీటికితోడు గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు, సంశ్లిష్టాలు కూడా కలిపితే ఇది చాలా పెద్దదవుతుంది. ఇవన్నీ నేర్చుకోవడమే, గుర్తించి రాయగల్గడమే భాష నేర్చుకోవడంగా మనం పరిగణిస్తున్నాం.

ఒక్క మన భాషకే గాదు, మనదేశంలోనే కాదు ప్రపంచమంతా ఈ పద్ధతి చాలా కాలం నుండి, బహుశా లిపి ఏర్పడినప్పటి నుండి కొంచెం తరతమ తేడాలతో కొనసాగుతోంది. దీనికి అనుకూలంగా వ్యతిరేకంగా చాలా వాదనలున్నాయి. వినడం, మాట్లాడడం చేసినట్లే చదువడం, రాయడం నేర్చుకోలేమేమో అన్నదానిపై తర్జనభర్జలున్నాయి.

అనుకూలంగా మాట్లాడేవారు – "అసలు అక్షరాలు రాకుండా చదువడం ఎవరైనా ఎట్లా నేర్చుకొంటారు?" అని ప్రశ్నిస్తారు. ఒక ఇల్లు కట్టడానికి వరసగా ఇటుకలు పేర్చినట్టే ముందు అక్షరాలు నేర్చుకొన్నాకే రాయడం వస్తుంది. అప్పుడీ అక్షరాల్ని కలుపుకొంటే సరిపోతుందనేది సాధారణమైన సమాధానం. ప్రతి భాషకూ ఒక లిపి ఉంటుంది. ఆ లిపి ఆ భాషకు స్వంతం. భాషా హృదయం లేదా సౌందర్యం (లయ) లిపిలో దాగి ఉంటుంది. అందువల్ల భాష నుంచి లిపిని విడదీయలేం. ఉదాహరణకు తెలుగులోని అచ్చులు వాటిలోని హ్రస్వదీర్ఘాలు ఒకానొక పద్ధతిలో (లయాత్మకంగా) ఉన్నాయి. వాటిని అదే వరసలో నేర్చుకోవడం తప్పనిసరి. అట్లా నేర్చుకోడం వల్ల ధ్వనుల్ని గుర్తించడం తేలిక, వాటిలోని భేదాల్ని లేదా సామ్యాల్ని గుర్తించడం తేలిక అనేది మరో వివరణ. శ, ష, స అనేవి మూడు ఒక వరుసలో ఉండటంవల్లే వాటిలోని సున్నితమైన తేడాని గుర్తించగల్గుతున్నాం. 'అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ' లలో ఒక క్రమం ఉంది. ఒక లయ ఉంది. అవి (అచ్చులు) నేర్పాక హల్లులు నేర్పితే గుణింతాలు నేర్పడం తేలిక, శాస్త్రీయం కూడా. చాలా మంది అభిప్రాయమిది.

వినడం, మాట్లాడడం నేర్చుకొన్నట్టుగా, అంత సహజంగా మనం చదువడం రాయడం నేర్చుకోలేం. భాష మౌఖికంగా అందుబాటులో ఉన్నంతగా రాతలో అందుబాటులో ఉండదు. అంటే వాతావరణం, సందర్భం కల్పించడంలో శ్రవణ, భాషణ నైపుణ్యాలకున్న అవకాశం పఠన, లేఖన నైపుణ్యాలకు లేదు. ఆవశ్యకత ప్రాతిపదికన చూసినా మొదటి రెండింటికి గల ప్రాధాన్యత రెండోవాటికి లేదు. అందువల్ల కూడా రెండూ ఒకే రకంగా నేర్చుకోగల్గడం అసాధ్యం. మరో అంశం ఏమంటే మానవ శరీరాంతర్గతంగానే స్వర యంత్రం ఉంది. అత్యంత సహజంగా ఇతరావయవాలు స్పందించినట్లే ఇదీ స్పందించి ధ్వనుల్ని ఉత్పత్తి చేయగలదు. వినడం, మాట్లాడడం అనేవి ఒక రకమైన స్పందనలు, కానీ చదువడం, రాయడం అలా కాదు. వీటికోసం బయటి పరిసరాల మీద ఆధారపడాల్సిన ఉంది. ఇదొక అదనపు నైపుణ్యమే తప్ప అత్యవసర సహజావసరం కాదు, స్పందనా కాదు. అందువల్ల ఒకేలా నేర్చుకోవడం మొదటి రెండు నైపుణ్యాలకూ, తర్వాతి రెండు నైపుణ్యాలకూ కుదరదనేది మరో సమాధానం.

ఇక రెండో వాదన ఇటీవలది. ఇది ఎక్కువగా భాషాశాస్త్రం మీద, మానవ అభ్యసన పరిశోధనల మీద, మానసిక తత్వశాస్త్రం మీద ఆధారపడి ఉంది. సాపేక్షంగా ఇది ఆధునిక వాదం.

భాషకు లిపి మనం కల్పించుకొన్నదే. అక్షరమాల, అందులోని క్రమం మనకు మనం పెట్టుకొన్నదే. అందువల్ల ఒక్కో భాష ఒక్కో క్రమం ఉంటుంది. ఒకవేళ ఒకే క్రమం ఉన్నట్లు కన్పించినా (ఉదా : ద్రావిడ, ఆర్య భాషలు వేరైనా అక్షర మాలాక్రమం ఒకటిగానే ఉంది) అది ముందుగా ఒక భాష ఏర్పరుచుకొన్న క్రమాన్ని అనుసరించి మరొక భాషవారు పెట్టుకొన్నదే తప్ప మరొకటి కాదు. చాలాకాలం ఒకే వరసలో చదివీ చదివీ అలవాటుపడి దాన్ని సహజ క్రమంగా, ఆ భాషకు మాత్రమే సరిపోయే స్వంత క్రమంగా మనం భ్రమపడుతున్నాం. లయ అనబడేది కూడా చాలావరకు అంతే. సంస్కృతం లాంటి భాషలు వర్ణమాలలోని అక్షరాల్ని వాటి ఉత్పత్తి స్థానాల ఆధారంగా నిర్ణయించాయి. (అ-కంఠ్యం, ఆ-తాలవ్యం). కొన్ని సుదూర భాషల వర్ణమాలల మొదటి అక్షరాలు ఒకటి రెండు ఒకే ధ్వని గలవి ఉండొచ్చు. అది కొంత యాదృచ్ఛికం, కొంత ధ్వనికి గల ప్రాధాన్యత ప్రాచుర్యం, సౌలభ్యం మీద (ఉదా: ఆంగ్లంలో 'ఎ' తెలుగులో 'అ' రెండూ మొదట ఉన్నాయి) ఆధారపడిన విషయం. అంతకు మించి శాస్త్రీయత అక్కడేమీ లేదు. కాబట్టి ఇదే క్రమంలో నేర్చుకోవడం వల్ల భాష నేర్చుకోవడంలో వొరిగేదేమీ ఉండదని వీరి అభిప్రాయం. అంతేగాదు ఈ రోజు కాకుంటే రేపైనా అన్ని భాషలకూ ఓ లిపి (అంతర్జాతీయ లిపి) వీలున్నన్ని తక్కువ అక్షరాలతో వస్తుందని ఇది లిపి పరిణామక్రమమని వీరు నమ్ముతున్నారు. మనం ఎంత కావాలనుకొన్నా కొన్ని అక్షరాలు అదృశ్యమవుతున్నాయి. కొన్ని కొత్తవీ వచ్చి చేరుతున్నాయి. బాగా అభివృద్ధి చెందిన భాషలు అక్షరాల్ని మరీ తగ్గించుకొంటున్నాయి. ఇవన్నీ కూడా లిపి-భాషల మధ్య విడదీయరాని సంబంధం ఉందనడాన్ని వ్యతిరేకిస్తున్న అంశాలుగా వీరు పేర్కొంటున్నారు.

అన్నిటికంటే ముఖ్యమైంది మరొకటి ఉంది. అదేమంటే మనం భాషను ముక్కలు ముక్కలుగా నేర్చుకోవడం లేదు. మొత్తంగానే నేర్చుకొంటున్నాం. పిల్లలు చేసే చిన్న చిన్న ధ్వనులు కూడా సారాంశంలో వాక్యాలే. అట్లాగే వాళ్లు వచ్చీ రాక పలికే చిన్న చిన్న పదాలు కూడా వాక్యాలే. 'అమ్మ' అంటే అమ్మ వచ్చిందనో, కొట్టిందనో, కావాలనో అర్థం మనం మొదట చిన్న చిన్న ధ్వనులు, తర్వాత పదాలు, వాక్యాలు భాషా నిబంధనలు నేర్చుకోవడం లేదు. ఒకే రకమైన ధ్వనుల్ని ముందుగానూ, మరొక రకమైనవి తర్వాత నేర్చుకోవడమూ లేదు.

కేవలం గుర్తు పెట్టుకోవడం ద్వారా, అంటే జ్ఞాపకశక్తి మీద ఆధారపడి కూడా మనం భాషను నేర్చుకోవడంలేదు. అనేక సందర్భాల్లో పాల్గొంటూ మన అవసరాల్ని మాటిమాటికీ ఉపయోగించుకొంటున్నందువల్లనే ఏమాటలైనా మనం నేర్చుకోగల్గుతున్నాం. వినియోగం లేనివి మనం వదిలేస్తాం లేదా మరిచిపోతాం. అట్లాగాక అక్షరాలు నేర్పే పద్ధతిలో కేవలం అక్షరాల్ని వేరుగా నేర్పుతున్నాం. అంటే భాషను ముక్కలు ముక్కలుగా చేసి ఒక క్రమం పెట్టి నేర్పుతున్నామన్నమాట. అంతేగాక అక్షరాలకు అర్థం లేదు. స్వంతంగా వినియోగంలేదు. ఒక రకంగా మొండిగా గుర్తుంచుకొనే సర్కసు తప్ప మరొకటి లేదు. ఇది కృత్రిమమైన క్లిష్టమైన పద్ధతి. ఎన్ని అక్షరాలు నేర్పినా పదాలు రావు. అప్పటి దాకా నేర్చుకొన్న అక్షరాలు ఏమాత్రం వినియోగంలోకి రావు. అలాంటివి ఎలా గుర్తుంటాయి? ఎందుకు గుర్తుండాలి? మానవ అభ్యసన విధానానికే ఇది విరుద్ధం. ఇలా ఈ పద్ధతిని నేడు చాలామంది వ్యతిరేకించి సమగ్ర దృక్పథాన్ని భాషాభ్యసనంలో శాస్త్రీయమైనదిగా ముందుకు తెస్తున్నారు.

పూర్వం మనం ముందు అక్షరాలన్నీ ఒక్కటి కూడా పొల్లు పోకుండా నేర్చుకొని, తర్వాత వాటి గుణింతాలు, ఆ తర్వాత వాటి వొత్తులు నేర్చుకొని అప్పుడు మాత్రమే పదాలు రాసేవాళ్ళం. నిజానికి 'అ' నుంచి 'క' వరకు నేర్చుకోగానే ఎవరైనా 'ఈక', 'ఒక' లాంటి పదాలు నేర్చుకోవచ్చు. ఇది కూడా మనం చేసేవాళ్ళం గాదు.

క్రమక్రమంగా సాంప్రదాయిక అక్షర పద్ధతిలో కూడా మార్పులు వస్తున్నాయి. అవసరం లేని 'ఋ, ౠ' లాంటివి కనుమరుగైనాయి. అంతగా ప్రాచుర్యం లేని మహా ప్రాణాలను (ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ) వరుస నుంచి తప్పించి చివర నేర్పుతున్నారు. కొన్ని అక్షరాలు నేర్పగానే వాటితో వచ్చే పదాలు నేర్పి, ఆ అక్షరాల్ని కల్పిస్తున్నాం. (కొందరైతే మరో ముందడుగు వేసి పదాలతోనే భాష నేర్పడం కూడా చేస్తున్నారు. అర్థంలేని, స్వంతంగా వినియోగంలో లేని అక్షరాల్ని నేర్పడం వల్ల వాటిని గుర్తుంచుకోవడం అసాధ్యమన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారు.)

ఈ పద్ధతిలో అక్షరాల్ని వరస క్రమంలో నేర్పడం ఉండదు. బాగా ప్రాచుర్యంగల, వాడుకలోని పదాల్ని నేర్పి వాటిలోని అక్షరాల్ని కూడా పరిచయం చేస్తారు. దీనివల్ల పదజాలం పిల్లలకు మొదటి నుంచే అందుబాటులో ఉంటుంది. నేర్చుకొన్న ప్రతిదీ వినియోగంలోకి వస్తుంది. గుడ్డిగా గుర్తుంచుకోనక్కరలేదు.

కొన్ని పదాలు నేర్పగానే చిన్న చిన్న వాక్యాలు కూడా నేర్పవచ్చు. అప్పుడు నేర్చుకొన్నది మరింత వినియోగంలోకి వస్తుంది. ప్రతిదీ అర్థవంతంగా కన్పిస్తుంది.

అక్షర పద్ధతి మీద మరొక సవాలు కూడా చాలా విలువైంది ఉంది. ఈ పద్ధతిలో మొదట రాయడం తర్వాత చదువడం నేర్పుతున్నాం. భాషాభ్యసన క్రమానికిది విరుద్ధం. ముందు చదువడం తర్వాత మాత్రమే రాయడమనేది శాస్త్రీయం. ముందు చదవాలంటే అవి గుర్తుంచుకోవాలి. గుర్తుంచుకోవడం వినియోగించుకొనే క్రమంలో మాత్రమే సాధ్యమవుతుంది. అంతేకాదు చదువగలవారు మాత్రమే రాయగల్గుతారు. మనం ఎంత దిద్దినా హిందీ అక్షరాల్ని ఇప్పుడెంతమంది గుర్తుంచుకోగల్గుతున్నాం? దీనిక్కారణం వీటిని వినియోగించకపోవడమే. మన మెదడుకు అవసరం ప్రాతిపదికన ఎన్నిటికైనా గుర్తుంచుకొనే సామర్థ్యం అద్భుతంగా ఉంది.

SCERT TELANGANA

దీనికి మరో ముక్తాయింపు కూడా లేకపోలేదు. అసలు ఏ విద్యావంతుడైనా చదువడానికి వినియోగించుకోవడంలో 10వ వంతు కూడా రాయడానికి భాషను వినియోగించుకోడు. మహా కవులకు కూడా ఇది వర్తిస్తుంది. గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు వయోజన విద్య నేర్పించేటప్పుడు పలకా బలపాలుండేవి కాదు. వారి విద్యలో రాయడానికి స్థానమే లేదు. కేవలం చదువడం మాత్రమే నేర్పేవారు. దీనర్థం మనం రాయడం నేర్పనక్కర లేదని కాదు చదువడానికి రాయడం నేర్చుకోవడం తప్పనిసరి అవసరం కాదని చెప్పడానికి మాత్రమే.

మరి ఈ పద పద్ధతిలో కూడా ఉన్నదేమిటి? ప్రాచుర్యం గలవి, సులభమైనవి అనే పేర కొన్ని పదాల్ని వాటి అక్షరాల్ని ఎంపిక చేసి మళ్ళీ ఒక క్రమాన్ని నిర్దేశించుకొని భాష నేర్పడమే గదా! నేర్పినవి వినియోగంలోకి రావడం తప్ప, అర్థవంతంగా నేర్చుకోవడం తప్ప వినడంలా, మాట్లాడడంలా ఇది భాషను మొత్తంగా నేర్పడం కాదుగదా. ఇది సహజమైన ప్రక్రియ కాదుగదా! ఇంకా చెప్పాలంటే ఒక రకంగా అక్షరాలు ముందు నేర్పే పద్ధతికి అంతో ఇంతో దగ్గరిదే గదా! ఈ చర్చా లేకపోలేదు.

భాషా ప్రపంచాన్ని (అక్షరాలు, పదాలు, సంభాషణలు, పాటలు, కథలు) విద్యార్థికి వీలున్నంత అందుబాటులో ఉంచి పలు సందర్భాల్లో వాటిని విరివిగా వినియోగించుకొనేట్టు చేయడం ద్వారా భాషను మొత్తంగానే నేర్పవచ్చు అనే వాదమొకటి బలంగా ఉంది.

ఇందులో ఏ క్రమమూ ఉండదు. ఏ నిర్దేశమూ ఉండదు. మాట్లాడడం నేర్చుకొన్నట్టే పిల్లలు మొత్తంగా భాషను నేర్చుకొంటారు. ఇది కూడా సాధ్యమే అనడం కన్నా ఇదే శాస్త్రీయం అనేవాళ్ళూ నేడు తక్కువగా లేరు.

లిపి మానవుడికి తెలిసి కొన్ని వేల సంవత్సరాలు గడిచినా దీన్ని నేర్పడం పట్ల ఇంత తర్జనభర్జనలు ఇప్పటికీ జరగడం విచిత్రంగా మనకు కన్పించవచ్చు. కానీ శాస్త్రం పెరుగుతున్న కొద్దీ, పరిశోధనలు నూతనాంశాల్ని ఆవిష్కరిస్తున్న కొద్దీ ఇట్లాంటి తర్కాలు ముందుకు వస్తూనే ఉంటాయి. ఆచరణలో ఏవి సాధ్యమైతే అవి నిలుస్తాయి. మిగిలినవి అవి ఎంత ఆధునికమైనవైనా, ఎంత ప్రాచీనమైనవైనా గతిస్తాయి.

ఎటొచ్చీ పిల్లల్ని హింసించకుండా, వారి సహజ స్వభావానికి, అభ్యసన క్రమానికి సంబంధం లేకుండా గుడ్డిగా యాంత్రికంగా నేర్పడం ఒక్క భాషకే కాదు దేనికైనా న్యాయం చేకూర్చదు. ఇది అన్నిటికీ వర్తించే సాధారణ సూత్రం. దీన్ని మనసులో ఉంచుకొన్నప్పుడు మనం పాటించే పద్ధతుల్లో ఏ లోపాలున్నాయో మనకే సులభంగా అర్థమవుతుంది.

# 7. పిల్లలు చదివే కథల పుస్తకాలు ఏవి?

***- కొడవటిగంటి కుటుంబరావు, సంవేదన, అక్టోబర్ 1968***

మన దేశంలో బాలసాహిత్యమంటూ ఇప్పుడిప్పుడే వస్తున్నది. బెంగాలీ, హిందీ మొదలైన భాషలలో రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం కూడా బాలపత్రికలుండినట్టు తెలుస్తోంది. తెలుగులో మాత్రం బాల పత్రికలు స్వాతంత్ర్యం వచ్చే రోజుల్లోనే బయలుదేరాయి.

నా చిన్నతనంలో బాలసాహిత్యమంటూ వేరే లేదు. నాకు చదువటమూ, రాయటమూ రాగానే సుమతీ శతకం కంఠస్థం చెయ్యమన్నారు. వావిలకొలను వారు రచించిన పాకెట్ సైజ్ కథల పుస్తకాలేవో ఉండేవి. భాగవతం నుంచి కుచేలోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం లాంటి కథలు చదివాను. వాటిలోని కొన్ని పద్యాలు నాకిప్పటికింకా జ్ఞాపకం ఉన్నాయి.

అర్ధ శతాబ్దం క్రితం ఇదే బాలసాహిత్యం, నిజానికిది పిల్లల కోసం ప్రత్యేకించి రాసిన సాహిత్యం కాదు. పెద్దల సాహిత్యమే. పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికి వచ్చేదంతా పిల్లల సాహిత్యంగా చలామణీ కావటం మన సంప్రదాయం. మనం ఈ రోజు బాల సాహిత్యం గురించి పాశ్చాత్యుల అభిప్రాయాలు అరువు తెచ్చుకొని లాభం లేదు.

ఇంచుమించు ఇరవై ఏళ్ళుగా బాలసాహిత్యంతో నాకు గల సంబంధాన్ని బట్టి బాల సాహిత్యం ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అన్న అభిప్రాయాలు కొన్ని ఏర్పరుచుకొన్నాను. కొంత కాలమయ్యాక వాటికి కాలదోషం పట్టవచ్చు. ప్రస్తుతానికి ఈ నా అభిప్రాయాలు సముచితమైనవని భావించి వాటిని ఇక్కడ చెబుతున్నాను.

పశుపక్ష్యాదులు పాత్రగా గల నీతి కథలూ, దేవతలూ, రాక్షసులూ, మాంత్రికులూ, అతీత శక్తులూ మొదలైన వాటితో కూడిన దేవతా కథలూ గడిచిపోయిన యుగాలకూ, సమాజానికీ సంబంధించిన జానపద కథలూ బాల సాహిత్యంలో ప్రముఖ స్థానం కలిగి ఉంటాయి.

**వాస్తవికత :**

పైన చెప్పిన కథలలో వాస్తవికతకు చోటు లేదు. "బుల్లి చేపల చేత మాట్లాడించటంలోనే ఉన్నది చిక్కంతా!" అన్నాడట ఆలివర్ గోల్డ్‌స్మిత్ చేపలూ, కాకులూ, ఎలుకలూ మాట్లాడటం వల్ల వాస్తవికత పోతుందని అతడు భయపడి ఉంటాడు. కాని బాల సాహిత్యంలో అలాంటి వాస్తవికత అవసరం. పిల్లలు తాము వినే (చదివే) కథలలోని సన్నివేశాలనూ, సంఘటనలనూ తమ పరంగా అన్వయించుకోనవసరం లేదు. వాళ్ళు వాటికి ఎడంగా ఉండే ఆనందం పొందాలి. "అనగనగా ఒక రాజు, ఆరాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చి ఎండవేశారు... ఏ రాజు? ఏడుగురు వేటకు పోయి ఏడు చేపలేనా తెచ్చారు? ఏడు చేపలు ఎండేస్తే ఎవరి ముక్కులోకి?" ఇలాంటి సందేహాలు వేటికీ కథలో తావులేదు.

కొన్ని నీతి కథలను కొందరు ఆధునికం చెయ్యాలని ప్రయత్నిస్తారు. ఇది పొరపాటు. మాంసం ముక్క నోట కరుచుకొన్న కాకిని నక్క, "కాకిబావా, కాకిబావా! ఒక్క పాటపాడు!" అనగానే ఈ ఆధునిక కాకి మాంసం ముక్కను కాలి కింద పెట్టుకొని, పాటపాడి నక్కను 'ఫూల్' చేస్తుంది. ఇది నీతికథ కాదు, జర్నలిజం.

పిల్లల కథలు వర్తమాన జీవితానికి సంబంధించి ఉండాలనీ, అందులో వాస్తవికతకు చోటు కలిగించాలనీ కొందరు కొన్ని రకాల రచనలు చేస్తారు. మాటవరుసకు సీత పుట్టిన రోజు పండుగ అనుకోండి. సీతకు పుట్టిన రోజు పండుగ చేస్తారు. బామ్మ తలంటి పోస్తుంది. నాన్నారు తెచ్చిన కొత్తపూల పరికిణి కట్టుకొంటుంది. మామయ్య తెచ్చిన పూల జాకెట్టు వేసుకొంటుంది. అన్న తెచ్చిన కొత్త రిబ్బను ఎంచక్కా పెట్టుకొంటుంది. అమ్మ పూరీలు, జిలేబీలు, మైసూర్‌పాకూ, బాదం హల్వా చేసి పెడుతుంది.

ఇదే విధంగా తంతు జరిగిపోతుంది. ఇది పిల్లల కథ కాదు. పెద్దవాళ్ళు నెలల పిల్లలతో (వాళ్ళకర్థమవుతుందనుకొనీ, వాళ్ళ భాషే మాట్లాడ్తున్నామనుకొనీ) 'ఓంతిలా? అయి కావాలా?' అన్నట్టుగానే ఉంటుంది ఇలాంటి కథ కూడానూ. ఇటువంటి కథలు మరీ జాస్తిగా చదివితే పిల్లలకు తమ పరిసరాల మీద చాలా రోత పుడుతుంది. సినిమాలలో చూపే ప్రేమ నిజమనుకొన్నవాడు వాస్తవ జీవితంలోని ప్రేమ చూసి అనుకొన్నట్లుగా పిల్లలు పెద్దలయ్యాక, వంచింపబడ్డామనుకోగలరు. ఎందుకంటే ఈ కథల్లో ఉండేది 'స్టెరిలైజ్' చేసిన జీవితం వాస్తవంగా ఉన్నట్లు భ్రమగొల్పే అవాస్తవం. చేపలూ, కొంగలూ మాట్లాడే కథలు ఇలా మోసం చెయ్యవు.

**మౌలిక భావాలు :**

బాల సాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగానాటాలి. ధైర్యసాహసాలు, నిజాయితీ, స్నేహపాత్రత, త్యాగబుద్ధీ, కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి. అన్యాయాన్ని జయించటం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా ఉన్నా, పిల్లల మనస్సులకు చాలా మేలు చేస్తాయి. దురాశా, ఓర్వలేని తనమూ, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ మొదలైనవి శిక్షించబడటం కూడా పిల్లలకు తృప్తినివ్వాలి.

కొన్ని కొన్ని సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించటమూ, ప్రమాదం తెచ్చిపెట్టటమూ జరుగుతుంది. భూతదయ చాలా మంచిది. నిస్సహాయులపట్ల దయ చూపటం వరకూ ఇబ్బందిలేదు. కాని దుర్మార్గుల పట్ల చూపే దయ ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుచేతనే బోను నుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలికాదు. అది తెచ్చి పెట్టిన ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్కయుక్తిగా తప్పిస్తుంది. యుక్తి కథలకు బాల సాహిత్యంలో చాలా స్థానం ఉంది.

స్థూలంగా చెప్పాలంటే పిల్లల్లో దౌర్బల్యాన్ని పెంపొందించేది మంచి బాల సాహిత్యం కాదు. మహాసత్త్వుల కథలు ఉత్తమ బాల సాహిత్యం. ఒక లక్ష్యం పెట్టుకొన్నాక మహాసత్త్వుడైన వాడు ఎన్ని ప్రమాదాలనూ లక్ష్యపెట్టడు. అటువంటి పాత్రలు గల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు కారెక్టర్ అంత బాగా ఏర్పడుతుంది. మన దేశాలవంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బు మీద దృష్టి ఏర్పడటం కన్నా 'కారెక్టర్' ఏర్పడటం చాలా అవసరం.

రాక్షసులను మనుషులు జయించటమూ, ధనికులను వాళ్ళ సేవకులు భంగపరచటమూ, అతి సామాన్యమైన వ్యక్తులలో అసాధారణ శక్తులుండటమూ లేదా వారికవి లభ్యం కావటమూ - ఇలాంటి ఇతివృత్తాలు గల జానపద కథలు ప్రపంచ మంతటా ఉన్నాయి. వాస్తవ సంప్రదాయాలకు ఎదురు వెళ్ళే ఈ కథలు చదవటంవల్ల కూడా పిల్లలకు కొంత లాభం ఉన్నది. ముఖ్యంగా చిన్న పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూ లాంటివి అతి తేలికగా అబ్బుతాయి. ఆ భయాలను తగ్గించే దొంగల కథలూ, దయ్యాల కథలూ పిల్లలు చదివి ఉండటం మంచిది.

దేవుడి మీద భక్తినీ, మత విశ్వాసాలనూ ప్రచారం చెయ్యటానికే రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిది కాదు. కథల్లో దేవతలూ, భక్తులూ ఉండరాదని కాదు. దేవుణ్ణి నమ్ముకొంటే అన్ని సుఖాలూ ఒనగూడతాయన్న అభిప్రాయాన్ని పెద్దలు కలిగి ఉండటం ఎంత తప్పో, పిల్లలకు ఇవ్వటం అంతకు పదింతలు తప్పు, కథలో నెగ్గవలసినది మనుష్యయత్నమూ, మనిషి సద్బుద్ధీనూ, ఇది చాలా ముఖ్యం.

**రచనా విధానం :**

బాల సాహిత్యం రాసేటప్పుడు కథనం పెద్దవాళ్ళు పిల్లలతో మాట్లాడుతున్నట్టుండాలనుకోవటం నా బుద్ధికి చాదస్తంగా కనిపిస్తుంది. “అప్పుడేమయిందనుకొన్నారూ” “రాజుకో కూతురుందనుకొన్నాం కాదూ?.. చూశారా, వాడి దుర్మార్గం వాణ్ణి ఏ స్థితిలోకి తెచ్చిందో?” ఇట్లా అడుగడుగునా బాల పాఠకులను తట్టుతూ ఉండటం అనవసరం అనుకొంటాను.

రచనలో వ్యర్థపదాలూ, ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ పిల్లలను అంతగా ఆకట్టవు. ‘కీకారణ్యం’, ‘కటికచీకటి’, ‘పండువెన్నెల’, ‘పెద్ద కెరటాలతో ఉప్పెన’ ఇట్లాంటి మాటలతో వాళ్ళు ఎంతైనా ఊహించుకోగలరు.

పాత్రలు చాలా మంచివాళ్ళయినా కావాలి, చాలా చెడ్డవాళ్ళయినా కావాలి. చాలా తెలివిగల వాళ్ళయినా కావాలి. వట్టి మూర్ఖులైనా కావాలి. చాలా అందంగానైనా ఉండాలి. వికారంగానైనా ఉండాలి. ఓ మాదిరి మంచీ, సుమారైన తెలివీ, ఎటూగాని అందమూ బాల సాహిత్యానికి అవసరం. పాత్రల అంతస్సంఘర్షణలు కూడా అంతే.

పిల్లల కోసం రాయటం ఒక గొప్ప కళ. తెలుగులో ఆ కళను చెప్పుకోదగినంతగా వృద్ధి చేసినవారెవరూ ఉన్నట్టు కనబడదు. కొందరు పాత్రోచిత భాష ప్రవేశపెట్టాలని హీన పాత్రల చేత యాసగా మాట్లాడించటం లాంటి ప్రయోగాలు చేస్తారు. నా దృష్టిలో ఇది గూడా ఈనాటికీ పొరపాటే. కథల్లో సంభాషణలు ఉండక తప్పదు. కాని వాటిలో అంత వాస్తవికత నిరుపయోగం.

**బాలగేయాలు, ఇతర రచనలు :**

అదృష్టవశాత్తూ ఈనాడు మనలో చక్కని బాలగేయాలు రాసేవారున్నారు. నిజానికి పెద్ద వాళ్ళకన్నా పిల్లలు గేయాలను ఎక్కువగా ఆనందించగలరు. బాలగేయ రచనలు పిల్లలకు ఎంతగా అందుతున్నాయో నాకు తెలీదు. కొన్నిటికి బహుమతులు కూడా లభించాయనుకొంటాను.

పిల్లలకు విజ్ఞానం కూడా కొంతవరకూ అవసరమే. ఈ స్పుత్నిక్ - హైడ్రోజన్ బాంబు యుగంలో వాళ్ళు తెలుసుకోదగిన వైజ్ఞానిక విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆకాశానా, భూమిమీదా, సముద్రం అడుగునా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఆరోగ్య సంబంధమైన అంశాలు చిన్నతనం నుంచీ తెలుసుకోదగినవి ఎన్నయినా ఉన్నాయి. అడవిలో చెట్లలాగా ఈనాటి పిల్లలు వీటిని గురించి ఏమీ తెలుసుకోకుండా పెరగటం చాలా తప్పు.

**బాల గ్రంథాలు :**

బాల గ్రంథాలు చూడటానికి అందంగా ఉండాలి. అచ్చు చక్కగా ఉండాలి. బొమ్మలు ఊహలను కదిలించేవిగా ఉండాలి. వాటిలో ఎట్లాంటి అచ్చుతప్పులు ఉండరాదు. అవి చవగ్గా కూడా ఉండాలి.

వ్యాపార యుగంలో ఈ రెండూ కుదరవు. అందుకని సోషలిజం వచ్చేదాకా ఈ సమస్యను తడిపి ఉంచడానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుతం ఉన్న మార్గాలు ఏవంటే.

1) పిల్లల కోసం వేసే పుస్తకాలకు ప్రభుత్వం, లేక ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వటం,

2) ప్రచురణ కర్తలు ఈ పుస్తకాలను అనేక వేల సంఖ్యలో ముద్రించటం (లక్షల సంఖ్యలో కాకపోతే).

పుట్టిన రోజు పండుగలకూ, ఇతర పండుగలకూ పెద్ద వాళ్ళు పిల్లలకు మిఠాయి వగైరాలతో బాటు చక్కని పుస్తకాలు కూడా బహూకరించడం. ఇతర దేశాలలో ఇరవై అయిదు రూపాయలు ఖరీదు చేసే పిల్లల పుస్తకాలు సైతం అచ్చు అవుతున్నాయి. పెద్ద వాళ్ళు బహూకరించకపోతే నిత్య ఖర్చులో నుంచి పిల్లలు అట్లాంటి పుస్తకాలు కొనటం సాధ్యమా?

పిల్లల పుస్తకాల ప్రచురణ ఆంధ్రలోనే చాలా వెనుకబడి ఉన్నట్టు కనబడుతుంది. మంచి ముద్రణాలయాలు లేకపోవటమూ, బాల పుస్తకాల ప్రచురణ పెట్టుబడిదార్లను ఆకర్షించలేకపోవటమూ, అందుకు కారణాలు కావచ్చు. పిల్లలకు తగినట్టుగా బొమ్మలు వేసే చిత్రకారులు కూడా చాలా తక్కువగానే ఉన్నట్టు కనిపిస్తారు.

పిల్లలు పుస్తకాలకు గిరాకీ రాగానే అందరూ బొమ్మల రామాయణాలు, భారతాలూ ప్రచురించారు. రామాయణ, భారతాలు పిల్లలకు అనవసరమననుగానీ, వాటికన్నా చాలా మంచి బాల సాహిత్యం ఉన్నది. రాసేవాళ్ళూ, వేసేవాళ్ళూ ఉంటే.

## మీ పిల్లలు

**మీ పిల్లలు మీ స్వంతం అనుకోనేవారు, వాళ్ళొక నిరంతరజీవన ప్రవంతికి బిడ్డలు. మీ ద్వారా జన్మ లభించినంతమాత్రన, వాళ్ళు మీ నుంచే పుట్టినట్లుకాదు. వాళ్ళు మీతో ఉన్నంతమాత్రాన, వాళ్ళు మీ వాళ్ళైనట్లు కాదు. మీరు వారికి ప్రేమను పంచివ్వండి, అంతేకానీ మీ ఆలోచనల్ని రుద్దకండి, కాదని మరవకండి వాళ్ళ ఆత్మలు రేపటి ప్రపంచం కోసం తపిస్తుంటాయి. ఈ ప్రపంచాన్ని మీరు చూడలేరు, కలనైనా కనలేరు. వాళ్ళలా మీరుండే ప్రయత్నం చేయండి, వాళ్ళను మీలా మార్చేందుకు మాత్రం పూనుకోకండి. జీవితం వెనక్కి నడువదని గుర్తించండి. వమీరు విల్లు అయితే, మీ పిల్లలు అందులోంచి దూసుకెళ్ళే బాణాలు సుమండీ!**

**- ఖలీల్ జిబ్రాన్**

# 8. మన చదువుల్లో కథల స్థానం

– ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం

మన స్కూళ్ళలో ఒకటీ రెండు తరగతులకైనా రోజూ ఒక పీరియడ్ కథలు చెప్పుకోవడానికుంటే ఎంత బావుంటుంది! ప్చ్! మన పిల్లలు ఆ మాత్రం భాగ్యానికైనా నోచుకోలేకపోతున్నారు. ఈ అవకాశమే ఉంటే బడిలో చేరిన పిల్లలు బడి నుంచి జారిపోకుండా సగం సమస్య పరిష్కారమయ్యేది. 'కథలు చెప్పుకొంటే డ్రాపౌట్ తగ్గుతారా' అని నన్ను చాలా మంది ఎగతాళిగా చూడొచ్చు. ఇంత పెద్ద సమస్యను ఇంత తక్కువగా పరిగణిస్తున్నానని నన్ను ఎద్దేవా చెయ్యొచ్చు. ఇట్లాంటి సలహా నేనిచ్చినప్పుడు నాపట్ల వెటకారంగా (సానుభూతితోనూ) చూసిన సీనియర్ అధికార్ల నెందరినో నేనెరుగుదును. ఏం చేద్దాం మరి? వారి 'అపార పరిపాలనానుభవం' వాళ్ళనలా తయారు చేసింది! ఒకప్పుడు ఈ అధికార్లూ నాలాగే ఎంతో కొంత ఆలోచించి ఉండకపోరు. కానీ పాపం వాళ్ళు సీనియర్లయిపోయాక ఇట్లా మారిపోయారు!

ఇంతకన్నా ఘోరం ఏమంటే మన ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో కథలకు కాసింత చోటయినా చిక్కడంలేదు. "కథల ప్రాధాన్యం' మీద మొత్తం శిక్షణా కోర్సుల్లో ఎక్కడయినా ఓ పాఠం ఉంటే ఉండొచ్చు. అంతకంటే కొంచెం లోతుకు పోయిన పాపాన ఈ సంస్థలెప్పుడూ పోవు.

నాకో తీరని కల ఉంది. అదేమంటే మన టీచర్లకు కనీసార్హతగా ముప్ఫై కథలయినా తడుముకోకుండా చెప్పడం ఉండే రోజు ఎప్పుడొస్తుందా అని. మన ప్రాచీన కథల మీద ఈ మాత్రం పట్టు ఉండే టీచర్లుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో గదా అని! 'పట్టు' అంటే గందరగోళపరచకుండా, గజిబిజి చెయ్యకుండా సాఫీగా చెప్పగల్గడం అన్నమాట.

కథలు చెప్పుకోవటం మన సమాజపు సహస్రాబ్దాల సంప్రదాయం, వారసత్వం! ఒకటీ రెండా? వేలాది సాంప్రదాయక కథలు చెవి నుంచి చెవికి, గుండె నుంచి గుండెకు ఎన్ని శతాబ్దాల పాటు ఎక్కిపొయ్యాయో! అంత దూరం నేనాశించడం లేదు గానీ కనీసం ముప్ఫై కథలు చెప్పగల్గితే మన ఒకటి రెండు తరగతుల పిల్లలు ఎన్నో విలువలు నేర్చుకొంటారు. ఇతర సబ్జక్టులతో పాటు కథలకింత చోటివ్వగల్గితే ఎన్నో విషయాలు పిల్లలకు తెలుస్తాయి. మనం చెప్పే ఇతర పాఠ్యాంశాలు కూడా కావల్సినన్ని తెలుస్తాయి.

### కథలెక్కడ దొరుకుతాయి?

సాంప్రదాయిక కథలంటే ఏమిటి? వీటి ప్రాధాన్యత ఏమిటి? దీన్ని మనం పరిశీలించాలి. ఈ కాలపు కుర్ర టీచర్లను కథలు చెప్పమంటే పిల్లల పత్రికల్ని తిరగేస్తున్నారు. కామిక్స్‌ను, వాస్తవగాథల్ని, చివరికి పెద్ద పెద్ద జోక్స్‌ను సైతం పిల్లలకి కథలుగా చెప్పడానికి పూనుకొంటున్నారు. ఇవన్నీ కథల జాబితాలోనే వస్తాయి? వస్తే రావచ్చు. కానీ మన ఆరేడేళ్ళ పిల్లల్ని ఇవి మన పాత కథలంత ప్రభావితం చేస్తాయా అనేది మాత్రం అనుమానాస్పదం.

మన సాంప్రదాయక కథలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ఆ లక్షణాలు ప్రస్తుత పత్రికల్లో వస్తున్న కథల్లో కన్పించడం లేదు. మంచి కథకుండే లక్షణాలేమిటి? వీటిని తర్వాత పరిశీలిద్దాం. దీనికి ముందు ఇట్లాంటి మంచి కథలెక్కడ దొరుకుతాయో చూద్దాం.

పంచతంత్రం, జాతక కథలు, మహాభారతం, అరేబియన్ నైట్స్, విక్రమాదిత్య కథలు, వివిధ ప్రాంతాల జానపద కథలు మనకు ఎన్ని మంచి కథల్నయినా అందిస్తాయి. ఇదొక పెద్ద భాండాగారం. గులిస్తాన్, బోస్టన్, బీర్బల్, తెనాలి రామలింగడు, జానపదాలు లాంటివి కావల్సినన్ని దొరుకుతాయి. ఒక్క మన దేశానికే గాదు ప్రపంచమంతా మంచి కథలు కోకొల్లలు. 'ఇంత పరిశోధన మాకెక్కడ సాధ్యం' అని మీరనవచ్చు. కథలు చెప్పాలనే అనుకొంటే మంచి కథల్ని ఎన్నుకోవడం, వెతుక్కోవడం చాలా చిన్నపని అని నా అభిప్రాయం.

## మంచి కథ ఎట్లా ఉంటుంది?

ఏది మంచి కథ అని నన్నెవరైనా ప్రశ్నిస్తే పిల్లలు తరతరాల నుంచి దేన్ని అద్భుతంగా ఆస్వాదిస్తున్నారో అదే మంచి కథ అని నేను జవాబిస్తాను. ఇక్కడ న్యాయ నిర్ణేతలు పిల్లలే తప్ప మనం కాదని నా దృఢ విశ్వాసం. మన పంచతంత్రంలోని 'సింహం-కుందేలు' కథనే తీసుకోండి. దీన్ని మనం చాలా సీదాసాదా కథగా భావిస్తాం. కానీ లోతుల్లోకి వెళ్లితే ఇందులోని మంచి కథ లక్షణాల్ని మనం పసిగట్టవచ్చు. ఈ కథలోని మలుపుల్ని ఇప్పుడు కొంచెం పరిశీలిద్దాం.

మన బుజ్జి కుందేలు సింహానికి ఆహారంగా వెళ్ళాల్సిన దుర్దినం వచ్చింది. తీరిగ్గా కుందేలు సింహం గుహ దగ్గరకెళ్ళేటప్పటికి ఆకలితో సింహం నకనకలాడిపోతోంది. మిన్నూ మన్నూ తెలిసే స్థితిలో లేదది. ఇప్పుడు మన కుందేలు తన అబద్ధాల పురాణాన్ని ప్రారంభించాలి. సింహంతో కనీసం మాట్లాడ్డానికయినా తగిన సందర్భమేనాయిది? ఏ మాత్రం కాదని కథ వినే వాళ్ళందరికీ తెలుసు. అయినా కుందేలు తానెందుకు ఆలస్యంగా రావల్సి వచ్చిందో, దారిలో తనని మరో సింహం ఎలా అడ్డగించిందో ప్రాణాలకు తెగించి చెప్పింది. ఆకలి కంటే కోపం తీవ్రమైందని కుందేలుకు తెలుసు. సరిగ్గా ఆ పాయింటునే అది పట్టుకొంది. పెత్తందార్లకు అహంకారం ఎక్కువ. అది ఏ మాత్రం దెబ్బతిన్నా వాళ్ళు ఓర్చుకోలేరు. అందుకే సింహం ఆకల్ని అవతలబెట్టి శత్రువు సంగతి తేల్చుకోవాలని కుందేలు వెంట నడిచింది. గుడ్డిగా బావి దగ్గరికి చేరింది.

మళ్ళీ ఇది కుందేలుకు కష్టకాలం (కథలో ఇదో మలుపు). ఇక్కడ కూడా కుందేలు తెలివిగా సింహం తెలివితక్కువ ఆవేశం మీదా, అసూయ మీద ఆధారపడింది. సింహం బావిలోకి చూసి తన బింబాన్ని శత్రుసింహం అనుకొని దూకి దిక్కులేని చావు చచ్చింది.

ఇన్నాళ్ళూ ఇంత ప్రచారం పొందిన ఈ కథను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. ఈ కథా వస్తువేమీ సామాన్యమైంది కాదు. దుర్మార్గమైన అధికార పిశాచం ముందు ప్రాణాల్ని ఉంచి బయటపడ్డం దాదాపు అసాధ్యమైన వేళ కుందేలు లాంటి బడుగు ప్రాణి పాపం ఏం చెయ్యాలి? అనేది ఇక్కడున్న సమస్య. నిజానికిది చాలా పెద్ద విషయం. సాధారణంగా ఇంత పెద్ద విషయాల్ని మనం పిల్లలకు దూరంగా ఉంచాలనుకొంటాం. విచిత్రమేమంటే పిల్లలు ఇంత పెద్ద విషయాన్నే ఇష్టపడతారు! ఎందుకిష్టపడతారు? దాన్ని తర్వాత పరిశీలిద్దాం.

ఇక్కడ మరో అంశం కూడా మనం పరిశీలించాలి. ఒక బక్క ప్రాణి మహా బలవంతుడైన ఒక శత్రువు బారిన పడి కష్టాల్లో చిక్కుకొన్న సందర్భమిది. ఇందులోంచి బయటపడ్డానికి ఈ బక్క జీవి ఒక ఎత్తుగడ వేసింది. ఈ ఎత్తుగడలో ఏ మాత్రం 'నీతి' లేదు. మరో సందర్భంలో ఇట్లాంటి అబద్ధాలు చెపితే మనం కుందేల్ని టక్కరి కుందేలు కింద లెక్కగడతాం. కానీ ఇక్కడ ఈ బడుగు ప్రాణి అసాధారణమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. అమోఘమైన ధైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్ని చూపింది. చిట్టచివరి దాకా ఏ మాత్రం తొణక్కుండా నిలబడికార్యం సాధించింది. ఇందుకోసం ఒక పెత్తందారుతో సాధారణ బడుగు వ్యక్తి మాట్లాడినట్టే భయం భయంగా మాట్లాడింది. అనుకొన్న పని నెరవేర్చుకొంది.

ఈ కథ నడకను కూడా మనం పరిశీలించాలి. కథారంభంలో జంతువులు సింహంతో కుదుర్చుకొన్న ఒప్పందం ఫలితంగా ఒక వింత శాంతి నెలకొంటుంది. పైకి కాలం సజావుగా నడుస్తున్నట్లు కన్పించినా ఇది దినదినగండమే. ఉన్నట్టుండి కుందేలు వంతు రావడంతో అసలు కథ తెరమీదికి వచ్చేస్తుంది.

ఇక మన కథ ఒక్క క్షణం కూడా ఆగకుండా చకచకా సాగిపోతుంది. మన కుందేలు ఈ కష్టం నుంచి బయటపడాలంటే ఒక్క నిమిషం వ్యర్థం చేసినా కొంప మునుగుతుంది. అదొక ఎత్తుగడ వేసింది. ఆ ఎత్తుగడేమీ నల్లేరు మీద నడక కాదు. మహా ప్రమాదకరమైంది. అయినా కుందేలు దానికే పూనుకొంది. శ్రోతకిక్కడ గుక్క తిప్పుకొనే వీలుండదు. ఏ మాత్రం తటపటాయింపుకు అవకాశం ఉండదు. అతడిప్పుడు కుందేలు పక్షపాతి. అది ఏం చేసినా అతనికది ఎంతో న్యాయంగా ఉంటుంది! ప్రతిదీ మన శ్రోత కుందేలు వైపు నుంచే ఆలోచించడం మొదలు పెడతాడు!

ఈ కథను పిల్లలెందుకంతగా ఇష్టపడుతున్నారో గుర్తించడానికి ఈ పరిశీలన సరిపోతుందనుకొంటాను. తమను అందులో చూసుకొని మమైకం కాగల ఒక పాత్ర, ఒక హీరో ఈ కథలో వారికి చిక్కింది. అదే కుందేలు. పిల్లల రోజువారీ జీవితంలో కూడా కుందేలు ఎదుర్కొన్న సవాళ్ళ వంటివి ఎన్నో ఎదురవుతుంటాయి.

పిల్లలు చిన్నవాళ్ళు, బలహీనులు, ఎక్కువ సందర్భాల్లో వాళ్ళకిష్టం లేనిదాన్ని వాళ్ళు చెయ్యాల్సివస్తుంటుంది. అధికారం, శారీరకాధిక్యత గల వారి వల్ల వాళ్ళెప్పుడూ కష్టాల పాలవుతుంటారు. భయాందోళనలకు గురవుతుంటారు. కుందేలు ఎదుర్కొనే సవాళ్ళతో పిల్లలెదుర్కొనే సవాళ్ళకెంతో సామ్యం ఉంది. దీన్ని మనం ఎప్పుడూ గుర్తించం. మన పద్ధతిలో మనం అధికారమంతా మన చేతిలోనే పెట్టుకొని వాళ్ళతో నిత్యవ్యవహారాలు జరుపుతుంటాం.

హఠాత్తుగా ఒక బంధువో, మరొకరో చనిపోతే పిల్లల మీద అది ఎంత ప్రభావం కల్గిస్తుందో, వాళ్ళెంత ఆందోళనకు గురవుతారో మనం గుర్తించం. అట్లాగే వాళ్ళు తమ కంటే శక్తివంతులైన పెద్దలతో పడే ఘర్షణను కూడా మనం గమనించం.

అందువల్లనే కథా ప్రారంభంలోనే పిల్లలు కుందేలులో తమను చూసుకొంటారు. కథ నడిచే కొలదీ కుందేలు వారికి పెద్ద ఆకర్షణగా మారుతుంది. కుందేలు ఒక ఎత్తుగడ పన్నింది. అది ఫలించింది. దీంతో తన సమస్యనేగాదు అందరి సమస్యనూ కుందేలు పరిష్కరించింది. పిల్లలు ఇలాంటి పరిష్కారాన్నే ప్రేమిస్తారు. కుందేలు ఎత్తుగడలో పిల్లలకు నచ్చే మరో అంశం కూడా ఉంది. అదేమంటే ఏదో ఒక సాకు చెప్పి అది తప్పించుకొనజూడ్డం. ఎందుకు ఆలస్యమైంది? అని సింహం అడిగితే కుందేలు చెప్పిన సాకు పిల్లల్ని ఎందుకాకర్షిస్తుందో చెప్పగలరా? ఎందుకేముంది పిల్లలు కూడా ఇలా సాకులు చెప్పి 'కష్టాల్నించి' బయటపడేవాళ్ళే గదా! అందుకని ఈ ఎత్తుగడతో కుందేలు తనను కాపాడుకోవడమే గాదు సింహాన్ని అంతంచేసింది. శత్రువును హతమారిస్తే తప్ప పాపం కుందేలు ప్రమాదం నుంచి బయటపడలేదు. అంటే ఈ కథ మనుగడ కోసం సాహసంతో చేసే విధ్వంసాన్ని నాటకీయంగా మన ముందు పెడుతోంది. ఇందులో ఏమి నీతి ఉంది? మనుగడకోసం చేసే పోరాటం తప్ప ఇందులో ఏ నీతి లేదు. పిల్లల వైపు నుంచి చూస్తే తప్ప నిజానికి కథలో మనం అభినందించదగ్గది ఏదీ లేదు. పెద్దలుగా మనం చూస్తే ఈ కథ నీతిలేని కథ. కుందేలు చేసింది పచ్చి మోసం తప్ప మరేమీ కాదు.

**కథల ప్రయోజనం ఏమిటి? :**

అంటే పిల్లలకు చెప్పడానికి ఎన్నుకొనే మంచి కథల్లో నీతి తప్పనిసరి కాదన్నమాట! అయితే 'సింహం - కుందేలు' కథలో ప్రత్యక్ష నీతి గాకపోయినా పరోక్షనీతి లేకపోలేదు. పిల్లల్ని భావోద్రేకానికి గురిచేసే అంశం ఇందులో ఒకటి ఉంది. ఒక ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఎంత నిబ్బరంగా నిదానంగా ఉండాలో అది చెపుతుంది. సరైన ఆలోచన చురుకుదనం అప్పుడే సాధ్యమని కూడా ఈ కథ చెపుతుంది.

కానీ సాంప్రదాయకార్థంలో ఇలాంటి పరోక్ష నీతిని కథా నీతిగా లెక్కించలేం. నీతి స్పష్టంగా ఉండాలి గానీ ఏదో డొంక తిరుగుడుగా వెతికి వెతికి చూస్తే తప్ప కనబడకుండేదిగా ఉండకూడదు.

ఈ చర్చా సారాంశం ఏమిటి? పిల్లల్లో నైతిక విలువల్ని పెంచడం మన సాంప్రదాయక కథల ప్రధానోద్దేశం కాదు. కథలు చెప్పడం వల్ల వచ్చే అసలైన లాభాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు వాటిని చూద్దాం.

**మంచి శ్రవణం :**

మంచి శ్రోత అంటే ఎవరు? చివరి దాకా వినేవాడే మంచి శ్రోత. కానీ చాలా మంది చివరిదాకా వినరు. మనం పిచ్చాపాటీ మాట్లాడేటప్పుడు కూడా చాలామంది మధ్యలోనే అడ్డం వస్తుంటారు. మనం చెప్పబొయ్యేది ముందే తెలిసి వాళ్ళిలా చేస్తే కొంత అర్థం చేసుకోవచ్చు కానీ అసలు వీళ్ళకి అంతదూరం వినడానికే ఓపిక ఉండదు. పెద్ద పెద్ద మేనేజిమెంటు, పరిపాలనా కోర్సుల్లో సైతం ఈ రోజుల్లో ఓపిగ్గా వినడాన్ని ఓ నైపుణ్యంగానే గాక ఓ మంచి లక్షణంగా కూడా పరిగణిస్తున్నారు. కథలు చెప్పడం చాలా చిన్న వయస్సు నుంచే ఇలా జాగ్రత్తగా ఓపిగ్గా వినే లక్షణాన్ని పెంపొందిస్తుంది. పెద్దయ్యాక ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కథలు చెప్పడం, వినడం ఒక మహత్తర సంప్రదాయంగా గల మన దేశంలో ఎదుటి వాడిని ఓపిగ్గా వినేవాళ్ళ సంఖ్య ఈ రోజుల్లో తగ్గిపోవడం చాలా విచిత్రంగా అన్పించవచ్చు. కానిది వాస్తవం. చిన్న వయస్సులో పిల్లలకు కథలు చెప్పకపోవడం దీనికొక ప్రధాన కారణమని నా అభిప్రాయం. నాగరికత పెరిగాక పిల్లలకు కథలు చెప్పడానికి మనకు తీరిక చిక్కడంలేదు. దీని ఫలితం మనల్ని ఈ దుస్థితికి తెచ్చింది.

**ఊహించడం, తర్కించడం :**

తమకు నచ్చిన కథను పిల్లలు మళ్ళీ మళ్ళీ వినాలనుకొంటారు. తమకు తెలియకుండా ఇట్లాంటి కథల పట్ల వాళ్ళు మక్కువ పెంచుకొంటారు. రెండోసారో మూడోసారో కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందో ముందే వాళ్ళు చెప్పగల్గుతారు. ఇలా జరగబొయ్యేది ముందుగా చెప్పగల్గడం ఒక సామర్థ్యం. మళ్ళీ మళ్ళీ ఒకే కథ వినడంవల్ల ఇట్లాంటి సామర్థ్యం పెరుగుతుంది. వాళ్ళ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వాళ్ళ సర్వతోముఖాభివృద్ధికిది దోహదపడుతుంది. మొదటి రెండు తరగతుల పిల్లలు చదువడం నేర్చుకొనేదశలో ఈ 'ముందుగా చెప్పగల్గడం' అనే సామర్థ్యం ఎంతైనా ఉపయోగపడుతుంది.

గణితం నేర్చుకోవడంలో కూడా ఈ సామర్థ్యం విలువ ఎనలేనిది. గణిత సూత్రాలన్నీ 'ముందుగా ఊహించి చెప్పగల్గడం' మీదనే కదా ఆధారపడతాయి. అందువల్ల గణిత అభ్యసనానికీ ఈ కథా శ్రవణ సామర్థ్యానికి మధ్య ఓ సామ్యం, సంబంధం ఉందని నా అభిప్రాయం. కథకు కూడా కొన్ని నిబంధనలు, పద్ధతులు ఉంటాయి. వాటిని పిల్లలు కథలు వినేకొద్దీ పట్టుకొంటారు. ఇలా పట్టుకొనే కొద్దీ వాళ్ళు ముందుగా ఏం జరగబొయ్యేదీ ఊహించి మరింత బాగా చెప్పగల్గుతారు. అలాంటి పిల్లలు గణిత సూత్రాల్ని కూడా ఇంతే బాగా పట్టుకోగలుగుతారు.

**మరో ప్రపంచం :**

పిల్లలు తమ చుట్టూ చూస్తున్న ప్రపంచాన్ని కథలు విస్తృతపరుస్తాయి. తాము ఎప్పుడూ పాల్గొనని సందర్భాలను, చూడని మనుషులను, పాత్రలను వాళ్ళు కథల్లో చూస్తారు. ఇలాంటి వాటితో మనకేం పని అని మీరనుకోవచ్చు. కానీ ఇవి కూడా మన జీవితంలో భాగాలు! వాటిని ఎప్పుడూ మనం చూడకున్నా అవి మనల్ని, మన ఆలోచనల్ని కదిలిస్తాయి. చిన్న వయస్సులో ఈ కదలిక మరింత ఎక్కువగా ఉంటుంది. జీవితాంతం ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుంది. తమ చుట్టూ ఒక్క చెడ్డమనిషి కూడా లేకున్నా పిల్లలు చెడ్డవాళ్ళను గురించి ఆలోచిస్తారు. అలాగే అసాధారణ ప్రతిభావంతుల్నీ, బుద్ధిమంతుల్నీ, అందగాళ్ళనూ కలుసుకొనే ఛాన్సు తమకెప్పుడైనా దక్కకపోతుందా అని ఆరాటపడతారు. ఆదర్శమూర్తుల్ని అభిమానించడం పిల్లల మనస్తత్వంలో ఒక భాగం. అలాగే ప్రమాదాలన్నా దుష్టశక్తులన్నా భయపడ్డం కూడా వాళ్ళ స్వభావంలో భాగం. మన సాంప్రదాయక కథలు పిల్లల ఈ మనస్తత్వాన్ని కనుగుణంగా ఉండటం వల్లనే ఇంత కాలం పిల్లల్నిలా ఆకర్షింపగల్గుతున్నాయి. అక్షర ప్రపంచంలోకి ఇంకా అడుగు పెట్టని బిడ్డ ఓ అమ్మమ్మ కథలో అద్భుతమైన మరో ప్రపంచాన్ని చూస్తుంది. అది తన వాస్తవ ప్రపంచం కంటే ఎంతో విస్తృతంగా ఉంటుంది. పిల్లలకు కథల్లో కన్పించే ఈ మరో ప్రపంచం గజిబిజిగా గందరగోళంగా ఉండదు. అందులో ఓ క్రమబద్ధత ఉంటుంది. ఆ క్రమబద్ధతలోనే కొన్ని నైతిక విలువలుంటాయి. కానీ ఆ విలువలు మనం నమ్మే సాంప్రదాయకార్థంలో ఉండవు. ఆ కథల్లో వంచితుడే గెలుస్తాడు. అయితే ఇట్లా గెలవడానికి వాడు కొన్ని పద్ధతులు పాటిస్తాడు. అవి అనైతికమైనవిగా మనకు సాంప్రదాయకార్థంలో కన్పించవచ్చు. ఆకలితో నకనకలాడే సింహానికి కుందేలు చెప్పిన అబద్ధాలు ఇట్లాంటివే.

**నూతన పదజాలం :**

కథలు చెప్పడం పిల్లల భాషా ప్రపంచాన్ని ఎలా విస్తృతం చేస్తుందో కూడా మనం చూడొచ్చు. మాటలు పూర్తిగా వ్యక్తిగత ఆస్తి, ఆ మాటలతో ప్రపంచానికి మనం పేర్లు పెట్టే తీరు కూడా వ్యక్తిగతమైనదే. కానీ ఇదే పదజాలం సామాజిక ఆస్తి కూడా. ఎందుకంటే మన అనుభవాల్ని ఇతరులతో పంచుకోవడానికి ఈ మాటలే ఆధారం. పదాలకున్న ఈ వ్యక్తిగత, సామాజిక లక్షణాలే పదాల అర్థాల్ని నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పిల్లవాడికి 'ఆకలి' అంటే ఏమిటో అనుభవం నుంచి తెలుసు. దీన్నుంచే సింహం 'ఆకలి'తో ఉన్నప్పుడు ఎట్లా ఉండి ఉంటుందో పిల్లవాడు గ్రహించగలడు. ఇలా 'ఆకలి' అనే తనకు తెలిసిన పదం సింహానికి కూడా వర్తింప చేసుకునేలా ఈ కథ శ్రోతకు సహకరిస్తుంది. మరికొన్ని కథలు వినేకొలదీ మరికొన్ని పదాల సామాజికార్థాలు పిల్లలకు తెలుస్తాయి. తన స్వంత పదజాలాన్ని ఇతరులకు వర్తింపజేసుకొనే క్రమం వేగిరమవుతుంది. తర్వాత 'చదువడం'లోకి వెళ్ళే పిల్లలకు ఇది చాలా ఉపకరిస్తుంది.

పైన మనం చెప్పుకొన్న నాలుగు కథాప్రయోజనాల్లోని అంశాలు చదవడానిక్కూడా వర్తిస్తాయి. పిల్లలు చదివేకొలదీ భాషాసూత్రాలను, నిర్మాణాన్ని అర్థం చేసుకోగల్గుతారు. ముందుగా ఊహించి చెప్పగల్గడం పెరిగే కొలదీ చదువడంలో సామర్థ్యం పెరుగుతుంది. భాషా నిర్మాణంలో సూత్రాలతో పరిచయం పెరిగే కొద్దీ వాక్యంలో తర్వాత ఏమీ వచ్చేదీ పిల్లలు గ్రహిస్తారు. ఇలా చూస్తే కథలు చెప్పడం పిల్లల భాషా జ్ఞానాన్ని పెంచడానికి అమోఘంగా ఉపకరిస్తుంది!

SCERT TELANGANA

**కథా నైపుణ్యం :**

కథలు చెప్పాలనుకొన్నప్పుడు మనకా కథ బాగా మనసుకు పట్టి ఉండాలి. అందులో తడబాటు ఏమీ ఉండకూడదు. తడబడితే మధ్యలో అతుకు కన్పిస్తే కథను ఖూనీ చేసినట్టే లెక్క. బాగా మనసుకు పట్టిన కథ అయితే మనం సాఫీగా చెప్పగలం. అలా చెప్పగల్గినప్పుడే కథ చెప్పేవాడికీ, వినేవారికీ మధ్య ఒక సజీవ సంబంధం ఉంటుంది.

అట్లాగే కథ బాగా మన మనసుకు పట్టి ఉంటే ఆ కథకు సంబంధించిన ఒక స్కెచ్ మన మనస్సులో ఉంటుంది. అప్పుడు శ్రోతల పరిస్థితిని బట్టి మనం ఇష్టం వచ్చినట్లు దాన్ని మార్చుకోగలం. ఒక్కోసారి కథను పెంచాల్సి వస్తుంది. ఒక్కోసారి తగ్గించాల్సి వస్తుంది. కుందేలు సింహం ముందు నిలబడ్డప్పుడు కథను మనం సాగదియ్యలేం. అక్కడే వేగంగా కథ నడవాలి. సింహం ఆకలితో నకనకలాడుతూ ఆలోచిస్తున్నప్పుడు కథను మనం నెమ్మదిగా చెప్పొచ్చు. అలాగే కుందేలు భయం భయంగా తన ఎత్తుగడను నెమరేసుకొంటూ అడవిలోంచి వస్తున్నప్పుడు కథను అంత వేగంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇదంతా మనకు కథ మీద ఉన్న పట్టునుబట్టి ఉంటుంది.

ఇక కథలోని సంభాషణల సంగతేమిటి? వాటినెలా చెప్పాలి అనే ప్రశ్నలున్నాయి. దీనికి మనం పలు మార్గాల్ని రెండు రకాల స్వరాలతో పలకొచ్చు. హావభావాల్ని ప్రదర్శిస్తూ చెప్పొచ్చు. చిన్నసైజు తోలుబొమ్మల్ని ఆడిస్తూ చెప్పడం వల్ల సంభాషణలు చాలా రక్తికడతాయి. ఒక్కో పాత్రను గురించి చెపుతున్నప్పుడు తరగతి గదికి ఈవైపు నుంచి ఆవైపునకు పచార్లు చేస్తూ చెప్పొచ్చు. ఇలా ఎన్నో సృజనాత్మక పద్ధతుల్ని పాటించవచ్చు. ఇవన్నీ పిల్లలకు చాలా ఉత్తేజాన్నిస్తాయి. ఒకే కథను ప్రతి సంవత్సరం చెప్పాల్సిరావచ్చు. ఒకే కథను ఒకే సంవత్సరంలో పలుసార్లు చెప్పాల్సి రావచ్చు. దీనికి తగ్గట్టుగా మనం తయారుకావాలి. ఒక కళగా కథాకథనాన్ని అధ్యయనం చెయ్యాలి. అలవరచుకోవాలి. ఇది ప్రతి టీచరుకూ ఒక తప్పనిసరి సవాలు.

కథలు చెప్పడం తన జీవితంలో విడదీయరాని భాగమైతే ఏ టీచరు జీవితమూ నిస్సారంగా ఉండదని నా గట్టి నమ్మకం. ఇది జరగాలంటే ప్రాథమిక పాఠశాలల పాఠ్యాంశాల పట్ల మన దృక్పథంలో కూడా తీవ్రమైన మార్పు రావాలని నా దృఢ విశ్వాసం.

# 9. పిల్లలూ - పుస్తక ప్రపంచం

- కీర్తి జయరాం, ఢిల్లీ

నాలుగైదేళ్ళ పిల్లల్లో వస్తున్న మార్పును మీరు జాగ్రత్తగా గమనించండి. ఈ మార్పు ఇంటి వాతావరణం నుంచి బడి వాతావరణంలోకి అడుగుపెట్టడమే గదా అని మీరనవచ్చు. కానీ ఈ మార్పులో అంతర్లీనంగా ఓ అంశం దాగి ఉంది. అదేమంటే ఈ వయస్సులోనే పిల్లలు తమ అభిప్రాయాల్ని, ఆసక్తుల్ని మౌఖిక పద్ధతి నుండి అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరించడం ప్రారంభిస్తారు. బడికే రానిది అక్షరాలెక్కడివి? అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరణ ఎక్కడిది అని మీరనవచ్చు..

### అక్షర ప్రపంచంలోకి తొలి అడుగు :

ఈ అంశం మీద చాలా పరిశోధనలు ఇటీవల జరిగాయి. భాషాతత్వవేత్తలు, మనస్తత్వవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేశారు. మాటల్లోంచి రాతల్లోకి మారే ఈ పరిణామక్రమాన్ని మనం పిల్లలు చేసుకొనే ఆటవస్తువుల్లో, వేసుకొనే బొమ్మల్లో, గీసుకొనే పిచ్చిరాతల్లో, ఏర్పరుచుకొనే గుర్తుల్లో, అమూర్తసంకేతాల్లో మనం గమనించవచ్చు.

పెద్దల్లాగా వ్యవహరించాలని పిల్లలకు అంతులేని ఉబలాటం ఉంటుంది. ఇందుకోసం పిల్లలు పై పద్ధతుల్ని కనిపెడతారు. కొత్త సమాచార వ్యవస్థను రూపొందించుకొంటారు. అక్షర ప్రపంచంలోకి ఇట్లానే వాళ్ళు అడుగిడతారని మనం గుర్తుంచుకోవాలి.

ఆటల్లో పిల్లలకు ఓ చిన్న పెట్టె ఇల్లుగా మారిపోతుంది. ఓ కర్రపుల్ల గుర్రం అయిపోతుంది. మట్టిలో చిన్నపుల్లతో వాళ్ళ రాసే గీతల్లో ఎక్కడెక్కడి ఊహలూ సాక్షాత్కరిస్తాయి. పెద్దలు చేసే పనులన్నీ వీళ్ళిలా చేస్తుంటారు. మనం కొంచెం జాగ్రత్తగా గమనిస్తే మనం చేసే చేష్టలన్నీ పిల్లలు కొత్త రూపాల్లో చేస్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది.

ఈ సంకేతాల్ని పిల్లలు ఎక్కడి నుండి సంపాదించుకొంటారు? తమ వాతావరణం నుంచే సంపాదించుకొంటారు. మరి పల్లెటూరి పిల్లల వాతావరణం, పరిసరాలు వేరు. పట్టణ విద్యాధిక కుటుంబాల్లోని పిల్లల పరిసరాలు వేరు. సహజంగానే అక్షరాలు, చిత్రాలు, బొమ్మలు, దృశ్యాలు, గ్రామీణ పిల్లలకు అందుబాటులో ఉండవు. పుస్తకాలు వారికి దొరకవు. మౌఖికంగా అందే పాటలు. కథలు, జోకులు, వినోదాంశాలు కూడా ధనికుల పిల్లల కందుబాటులో వున్నట్టు పేదపిల్లల కందుబాటులో వుండవు. టి.వి.లో, అగ్గిపెట్టెల మీద, వస్తువుల ప్యాకెట్ల మీద కన్పించే అక్షరాలే వీళ్ళకి అక్షర ప్రపంచం! ఇక తమ తల్లిదండ్రులు కాగితాలతో, కలంతో పనిచెయ్యడం వీళ్ళ ఊహకు్కూడా అందని విషయం, కనీసం క్యాలెండర్లు, ఫోటోలు, దృశ్యాలకు్కూడా అవకాశం ఉండదు. బడిలో అడుగు పెట్టినప్పుడు మాత్రమే వాళ్ళవన్నీ చూస్తారు. బడిలో వున్నంతసేపు మాత్రమే వాళ్ళకీ అవకాశం ఉంటుంది.

### మన పద్ధతి - మన వాచకాలు :

ఇక పిల్లలు చదువడం, రాయడం ఎట్లా నేర్చుకొంటారో చూద్దాం. అక్షరాంటే ధ్వనుల సంకేత రూపాలు. అక్షర రూపానికీ ధ్వనికీ సంబంధం ఏమీ ఉండదు. ధ్వనులను పేర్చి పదాలు, పదాల్ని కూర్చి వాక్యాలు రూపొందించాలి. ఇదొక సంక్లిష్ట ప్రక్రియ. అయితే వాస్తవానికి వినడం, మాట్లాడడం కూడా ఇలాంటి ప్రక్రియే. వేల ధ్వనులుంటాయి. వేల పదాలుంటాయి. వస్తువుకీ పదాలకీ మధ్య సంబంధం ఏమీ ఉండదు. ఇక వాక్య నిర్మాణం సరేసరి. అయినా పిల్లలు అద్భుతంగా చెప్పింది అర్థంచేసుకొంటున్నారు. మాట్లాడుతున్నారు. ఇదెట్లా జరుగుతోంది?

భయం, జంకూ లేకుండా మాట్లాడనిచ్చినందువల్లే పిల్లలు మాటలు నేర్చుకొంటున్నారు. రాయడం కూడా అంతే! ఇష్టం వచ్చినవి – అవి అనుభవాలు కావచ్చు, ఊహలు కావచ్చు, పిచ్చిపిచ్చివి కావచ్చు. వాగడానికి వీలుండబట్టే పిల్లలు మాటకార్లుగా మారుతున్నారు. రాతలోనూ అంతే. అసలు పిల్లలకో లోకం ఉంటుంది. ఆ లోకాన్ని వ్యక్తీకరించుకొనే రూపంలోనే భాష వారికి పట్టుబడుతుంది. భాషలోని ఏ నైపుణ్యమైనా ఇట్లానే వంటబడుతుంది.

ఇప్పుడు మన స్కూళ్ళ దగ్గరకొద్దాం. అక్షరాలతో మనం ప్రారంభిస్తాం. ఈ అక్షరాలు కేవలం అమూర్త సంకేతాలు, ఆ అక్షరాలు కూడా ఒక క్రమంలోనే ఉంటాయి. ఆ క్రమంవల్ల పిల్లలకి వొరిగేదేమిటో ఎవ్వరికీ తెలియదు. పిల్లలక్కావల్సింది తమ ఆసక్తుల్ని వ్యక్తీకరించడం తప్ప అక్షరమాలలోని హ్రస్వదీర్ఘాల్ని, పరుష సరళాల్ని గుర్తించడం కాదు. వ్యాకరణ పాండిత్యం కాదు. దీన్ని మనం మరచిపోతాం.

అక్కడితో ఆగదు. ఈ అక్షరాలన్నిటినీ గుర్తుంచుకోవాలి. ఎప్పుడో ఏడాది తర్వాత వాడుకోవాలి (పదాలుగా!) ఇక అక్షరాల్ని వాడుకోవడంలో మనం పెట్టే ఆంక్షలు కోకొల్లలు. మూసపోసినట్టు పిల్లలందరూ ఒకే పదాలు వల్లించాలి. ఒకే వాక్యాలు చదవాలి. ఈ పదాలకీ పిల్లల అవసరాలకీ సంబంధం ఉండదు. వీళ్ళ లోకంతో అసలే సంబంధం ఉండదు. అంతా మనం బిగించిన చట్రంలోనే జరగాలి.

అక్షరమాలను దిద్దించే పద్ధతి ఎంత వికృతమైందో మన వాచకాలు కూడా అంతే వికృతంగా ఉంటాయి. వాచక నిర్మాణం ధ్వనుల క్రమాన్ని పరిచయం చెయ్యడంతో ముడిపడి వుండటం ఒక వికారమైతే అపరిచిత, అర్థరహిత, కృత్రిమ పదాలూ, వాక్యాలూ మరో వికారం. 'తమది' అని ఆనందించే అంశం వీటిలో పిల్లలకి ఒక్కటీ ఉండదు.

ఇవన్నీ చాలక తప్పులెక్కడా దొర్లకూడదని మనం గొంతు మీద కత్తి పెడతాం. కొత్త విషయాల్లోకి పోతే తప్పులొస్తాయి. అందువల్ల వాచకం వేదమవుతుంది. కంఠస్తం పరమార్థమవుతుంది. ఇక్కడితో పిల్లల ఊహలు ఖతం. ఆసక్తులు ఖతం. ఆలోచనలు ఖతం. అత్యున్నత వర్గాల స్కూల్లోనైనా, మామూలు ప్రభుత్వ స్కూల్లోనైనా సారాంశం మాత్రం ఇదే.

**పుస్తకాలూ – పిల్లలూ :**

పిల్లలు అక్షర ప్రపంచంలోకి ఎలా అడుగిడతారో మనం మొదట చూశాం. దీనికి కొనసాగింపుగా మన పాఠశాలల్లో ఏమైనా చెయ్యగలమా? పేదపిల్లలు ఇంట్లో అక్షర ప్రపంచానికి దూరమెట్లా అవుతారో మనం చూశాం. దీనికి పరిష్కారం మనం బడిలో ఏమైనా చూపగలమా? ప్రాథమిక స్థాయిలో అక్షరలోకంలోకి అడుగిడే మన పిల్లలకు పుస్తకాలు ఏమైనా సాధించిపెడతాయా అనేది ఇప్పుడు చూద్దాం. ఇందుకోసం నా అనుభవాలు కొన్ని చెపుతాను.

1990 ప్రారంభంలో ఎస్.సి.ఇ.ఆర్.టి. ఢిల్లీలో ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. ఇది 12 మున్సిపల్ స్కూళ్ళలో అమలు జరిగింది. మూడవ తరగతి స్థాయిలో ఎక్కువమంది పిల్లలు బడి మానేస్తున్నారని గుర్తించి ఈ ప్రాజెక్టు చేపట్టారు. 3వ తరగతి పిల్లల్ని కొందర్ని గుర్తించారు. వీరికి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా 1,2 తరగతుల పిల్లల్ని నూతన పద్ధతిలో అక్షర ప్రపంచంలోకి అడుగిడేలా చెయ్యడం దీని లక్ష్యం.

ఈ ప్రాజెక్టులోకి ప్రవేశించగానే 1,2 తరగతుల పిల్లలకు వాచకాలు తప్ప ఎట్లాంటి పుస్తకాలు అందుబాటులో లేవని మాకు తేలిపోయింది. దాదాపు పిల్లలందరూ చదవాలన్నా, రాయాలన్నా సతమతమవుతున్నారు. వాచకాల్లోని వాక్యాల్ని కొంచెం తారుమారు చేస్తేచాలు వాళ్ళు చదవలేకపోతున్నారు. వాళ్ళర్థవంతంగా ఏమీ చదువడంలేదని, కేవలం వల్లిస్తున్నారని మాకర్థమైపోయింది. అదే సమయంలో ఈ పిల్లలకి చదవాలనే తృష్ణ విపరీతంగా వుండటం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది.



SCERT TELANGANA

మొదట మేం కథలు చెప్పడంతో మొదలెట్టాం. తెలిసిన కథలు, కొత్త కథలు లెక్కలేనన్ని పిల్లల ప్రపంచంలో పుట్టుకొచ్చాయి. ఆ తర్వాత కథను మధ్యలో ఆపేసి తర్వాత ఏం జరిగిందో చెప్పమన్నాం. ఒక్కొక్కరు ఒక్కోలా ముగించారు. తాము స్వతంగా కథలు అల్లినట్టు పిల్లలు ముచ్చటపడ్డారు. వాచకాల్ని వదిలేసి ఆ తర్వాత కథలు పెద్దగా చదివి విన్పించసాగాం. పిల్లలు స్వేచ్ఛగా ఆరుబయట ఎవరిష్టం వచ్చినట్టు వారు కూర్చునే వారు. కథలు వినేవారు. చిన్నపిల్లలు కోసం పెద్ద పిల్లలు పుస్తకాలు సేకరించారు. ఆదివారం దినపత్రికలు పట్టుకొచ్చారు. పిల్లలు వీటిలోని బొమ్మల్ని చూసేవారు. తమలో తాము మాట్లాడుకొనేవారు. విచిత్రం ఏమంటే మనం చాలా చిన్నవని, పనికిరానివనీ అనుకొన్నవి కూడా పిల్లల్లో మహా ఉత్సాహం కలిగించేవి. పిట్టలు, పురుగులు, జంతువులు, ఆకులు, పూలు కూడా వాళ్ళతో గుసగుసలాడేవి. ఇట్లా పుస్తకాల్ని 'చదువడం' పిల్లలు మొదలెట్టారు. ఈ 'చదువడం' విచిత్రంగా ఉండేది. ఓ సింహం బొమ్మ ఉందనుకోండి. 'నేను కూడా అడవికి వెళ్ళా, పెద్ద సింహాన్ని గుహలో చూశా' అని ఓ పిల్లతన ఉత్తుత్తి 'అనుభవాన్ని' దీనికి జోడించేది. ఓ పువ్వు కన్పిస్తే చాలు' ఇట్లాంటి పూలు మా ఊళ్ళో బోలెడు పూస్తాయి' అని మరో పిల్ల అనేది. అంటే పిల్లలీ బొమ్మలతో, కథలతో మమేకమై వాటిని స్వంతం చేసుకొనేవారు. ఆ స్కూళ్ళ టీచర్లు మొదట దీన్ని అర్థం చేసుకోలేక పోయారు. వాళ్ళ దృష్టిలో పలకలమీద రాయడమే అక్షరాలు నేర్చుకోవడం. ఇదంతా దండగమారి పని అనీ, వాళ్ళ సమయం వృథా అవుతోందనీ వాళ్ళ అభిప్రాయం. కానీ తర్వాత భాష నేర్చుకోవడంలో దీని ప్రాధాన్యత గుర్తించి వాళ్ళు కూడా క్లాసులో కథలు మొదలెట్టారు.

దీన్ని మేం మరికొంత విస్తృతం చేశాం. అక్షరాలతో, పదాలతో ఆటలాడ్డం, అంత్యానుప్రాసాలు, స్వంతవాక్యాలు చెప్పడం నుంచి నచ్చిన పదాల్ని చూసి రాయడం దాకా దీనికి జోడించాం. పిల్లలకు అక్షరాలు, పదాలు, వాక్యాలు ఇట్లా పరిచయమయ్యాయి. అక్షరాల రూపాలతో పాటు కొన్ని అక్షరాలు ఎడమ నుంచి కుడికి వరుసగా పేరిస్తే పదాలుగా, పదాల్ని పేరిస్తే వాక్యాలుగా మారతాయనే సంగతీ వాళ్ళు పసిగట్టారు. వాళ్ళు బొమ్మలేసేటపుడు, పిచ్చిరాతలు కూడా వాక్యాల్లో వరుసగా వుండేవి. కొందరైతే పదాల్ని రాసేవారు. బొమ్మలకు పేర్లు పెట్టేవారు. బొమ్మలేసి అది చేస్తున్న పనిని చింకిరిబింకిరిగా రాసేవారు.

అన్నిటికంటే విశేషం గంటల తరబడి పిల్లలీ పుస్తకాలతో గడపడం. వాటిని తిప్పుతూ బొమ్మల్ని వేళ్ళు పెట్టి చూస్తూ, చేతులతో తడుముతూ, ముద్దు పెట్టుకొంటూ వాళ్ళు ఏమోమో చేసేవారు. వాళ్ళకి చాలామందికి చదువడం ఏమీరాదు. అయినా చదువుతున్నట్టే తల పుస్తకంలో పెట్టి ఏమేమో మాట్లాడేవారు. వాటి మీద రాసేవారు. కాపీ చేసేవారు. ప్రతి దానికీ తమ జీవితాన్ని, అనుభవాన్ని జోడించేవారు. స్వేచ్ఛగా వదిలినందువల్లనే ఇది సాధ్యమైంది. 'ఇలాకాదు ఇలా చెప్పాలి' అని ప్రతిసారీ తప్పులు వెతకడం లేనందువల్లే ఇది వీలైంది.

## ఒక్కో మెట్టు పైపైకి :

ఈ ఉత్సాహం మాకు మరింత పనిపెట్టింది. మేం మరిన్ని సేకరించాల్సి వచ్చింది. సేకరించాం. చార్టులు, బొమ్మలు గోడకు వేలాడదీశాం. పిల్లల రాతల్ని కూడా గోడకు తగిలించాం. వాళ్ళ బొమ్మల్ని ప్రదర్శించసాగాం. ఇవన్నీ పిల్లలు చూడ్డానికి (చదవడానికి) అందుబాట్లో ఉండేంత ఎత్తులో ఉంచాం. ఇలా మాకూ కొత్త కొత్త ఆలోచనలు రాసాగాయి. గోడమీద రకరకాల సంజ్ఞలు రాయడం ఈ ఆలోచనల్లో ఒకటి. ఈ సంజ్ఞలు ఒక్క వాక్యంలో ఉంటాయి. ఉదాహరణకి ' మీచేతులు

పైకెత్తండి', 'ఆడుకొందాంరండి', 'అదిగో ఆ చెట్టును తాకి పరిగెత్తిరండి' ఇట్లాంటి సంజ్ఞలన్నమాట. వీటిని పిల్లలు చదివి అలా చేసేవారు. చూస్తుండగానే ఇదొక ఆటలా మారిపోయ్యింది. పెద్ద పిల్లల్ని ఈ సంజ్ఞలు రాయమనేవాళ్ళం. వాళ్ళు పోటీ పడేవాళ్ళు. అలాగే ఆసక్తి కలిగించే శీర్షికలున్న బొమ్మల్ని తగిలించేవాళ్ళం. పుస్తకాల పేర్లు బోర్డు మీద రాసి ఆ పుస్తకాల్ని గుర్తించమనేవాళ్ళం. పొడుపు కథలు రాసేవాళ్ళం. ఇట్లా పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు మాస్టార్లయి పొయ్యారు!

దీన్ని ఇంకో మెట్టు ఎక్కించడానికి మరో ఆలోచన చేశాం. పిల్లల అనుభవాల్ని రన్నింగు బోర్డు మీద రాయించాం. మొదటి దశలో ఇవి చిన్న చిన్న ఆలోచనలే కావచ్చు. "నేనీరోజు ఒక పిట్టను చూశా', 'నిన్న మా ఇంటికి ఒక కుక్క వచ్చింది.' నా పుస్తకం చినిగిపొయ్యింది. నాకు ఏడుపొచ్చింది.' ఇట్లాంటి అనుభవాలన్నమాట. ఇలా రాయడంలో పిల్లలు చాలా తప్పులు రాసేవాళ్ళు. మాక్కావల్సింది ఆలోచనలేగాని వ్యాకరణం కాదుగా, ఇష్టారాజ్యంగా రాయమనేవాళ్ళం. పిల్లలు ఈ రాతలు చుట్టూ మూగేవాళ్ళు. చదివేవాళ్ళు. చర్చించుకొనేవాళ్ళు. చదవలేనివాళ్ళు చదవగలవాళ్ళ దగ్గర చెప్పించుకొనేవాళ్ళు. అక్షరాల్ని మెల్లమెల్లగా గుర్తించేవాళ్ళు.

ఇంకో తమాషా పని ఏమంటే చిన్న పిల్లల అనుభవాల్ని పెద్ద పిల్లలు రాయడం, చిన్న పిల్లలు ఏవేవో చెప్పేవాళ్ళు. పెద్ద వాక్యాలుగా, పిచ్చి పిచ్చి వాక్యాలుగా అవి ఉండేవి. వాటిని అట్లానే రాయమనేవాళ్ళం. వాటిని మళ్ళీ చదివి వాళ్ళకి విన్పించేవాళ్ళం. వాటిని గోడకు వేలాడతీసేవాళ్ళం. ఆ తర్వాత చిన్న పిల్లలు కూడా రాయసాగారు. అట్లా రాయడానికి వాళ్ళకంత భాషరాదుగదా అందుకోసం ఒక బొమ్మ వెయ్యమనేవాళ్ళం. ఆ బొమ్మకింద ఏదో ఒకటి రాయమనేవాళ్ళం లేదా పెద్ద పిల్లల చేత రాయించేవాళ్ళం. అయితే ఒక జాగ్రత్త తప్పకుండా తీసుకొనేవాళ్ళం. అదేమంటే ఏం రాసినా పిల్లల భాషలోనే ఉండాలి.

ఈ అనుభవాన్ని నేను మాటల్లో చెప్పలేను. పిల్లలు ఎంత ఆనందిస్తారో! ఎంత ఉబలాటపడతారో! కానీ మనం గమనిస్తే ఇందులో చదువడం, రాయడం నేర్చుకోవడంలోని ప్రాథమిక దశ ఉంది. అచ్చం ఇది వినడం, మాట్లాడ్డం నేర్చుకొనే దశలాంటిది.

### సంచీలో పుస్తకాలు :

కొంతకాలం నేనూ, మా పిల్లలు కలిసి ఒక గ్రామంలో ఒక గ్రంథాలయం నడిపాం. గ్రంథాలయం అంటే ఏమిటో అనుకొనేరు. ఒక సంచిలో పుస్తకాలు ... అంతే! వీటిని ప్రతి శుక్రవారం బడికి తీసుకెళ్ళేవాళ్ళం. ప్రశ్నలు వేసేవాళ్ళం. పిల్లలచేత ఆ కథల్ని పలురకాల ముగింపులతో తిరగచెప్పించేవాళ్ళం. కొంతకాలం తర్వాత పుస్తకాలు ఇంటికిచ్చి మళ్ళీ శుక్రవారం తీసుకొనేవాళ్ళం. ఎనభైశాతం పిల్లలు పుస్తకాలు ఏమాత్రం చించకుండా తెచ్చేవాళ్ళు. పుస్తకాలతో పాటు ఆటలు, పాటలు, పొడుపుకథలు, అక్షరాలతో క్రీడలు, స్వీయ కథనాలు, బొమ్మలు వెయ్యడాలు, కథలు రాయడాలు, పాటలు రాయడాలు కూడా చేశాం. ఇదంతా పెద్ద హంగామాగా మారిపొయ్యింది. శుక్రవారం వస్తోందంటే చాలు పిల్లలు ఎక్కడలేని సంబరాన్ని ప్రదర్శించేవారు. క్రమంగా ఇది పెద్ద పిల్లలకు, బడి మానేసిన అమ్మాయిలకూ పాకింది. వాళ్ళని సభ్యులుగా చేర్చుకుని పుస్తకాలు ఇవ్వసాగాం. ఆ చిన్న ఊళ్ళో మాకు 120 మంది సభ్యులయ్యారు. చినిగిపోయిన పుస్తకాల్ని అతికించడం, అట్టలు వేయించడం, మరీ చినిగిపోయినవి కత్తిరించి ఛార్టులుగా మార్చడం - ఇవన్నీ పిల్లలే చేసేవారు. ఈ అనుభవం మాకు నేర్పిందేమంటే పిల్లల ఉత్సాహానికి తగినన్ని పుస్తకాలు మా వద్దలేవు. ఈ దేశంలో చిన్నారి పిల్లల పుస్తకాల క్కూడా ఎంత దారిద్ర్యమో!



SCERT TELANGANA

## భోజన విరామంలో పుస్తక పఠనం :

నా మరో అనుభవం చెపుతా వినండి. మా స్కూల్లో మధ్యాహ్న విరామ సమయంలో నేను ఇట్లాంటి గ్రంథాలయాన్నే నడిపాను. పుస్తకాలు తీసుకెళ్ళడం ఒక రూంలో తాళ్ళకి వేలాడదీయడం నా పని. పిల్లలు మెల్లగా గుమిగూడ్డం ప్రారంభించేవారు. కొందరు దూరంగా నిలబడి చూచేవారు. కొందరు బొమ్మల్ని తిరగేసేవారు. మరికొందరు తీసుకొని చదివేవారు. ఇలా క్రమంగా నా లైబ్రరీ ' జనాదరణ' పొందసాగింది. లంచ్‌టైంలో నేను స్టాఫ్‌రూంలో లేకుండా ఏమైపోతున్నానో నా తోటి టీచర్లకు కొన్నాళ్ళు తెలిసేది కాదు. ఆ తర్వాత వాళ్ళు అర్థం చేసుకొన్నారనుకోండి. క్రమంగా నేను పుస్తక మిత్రుల్ని తయారుచేసుకొన్నాను. వాళ్ళకి పుస్తకాలు ఇంటికివ్వడం మొదలుపెట్టాను. ఇక్కడ కూడా నన్ను వెంటాడిన సమస్య పుస్తకాల కొరత. మంచి పిల్లల పుస్తకాల కొరత.

చివరిగా ఒక్కమాట. పిల్లలకి పుస్తకాల్ని తమవిగా అన్పించేలా చెయ్యాలి. అంటే వాళ్ళు స్వంతం చేసుకోవాలి. అప్పుడు పిల్లలు పుస్తకాల వెంట పడతారు. పిల్లలు ఈ చిన్న లైబ్రరీల్ని అద్భుతంగా నిర్వహిస్తారు. రెండోది వాళ్ళ ప్రపంచం వాళ్ళకి అందులో కన్పించాలి. అలాంటి పుస్తకాలుండాలి. మూడోది స్వేచ్ఛగా వాళ్ళిష్టం వచ్చినట్లు వాళ్ళు పుస్తకాల్ని వాడుకోనివ్వాలి. చూడ్డం కూడా చదవడమే అని మనం గుర్తించాలి. నాలుగవది పుస్తకాల చుట్టూ మనం రకరకాల కృత్యాలు చేపట్టాలి. పిల్లల ఆసక్తులు, ఆనందాతిరేకాలు, అనుభూతులు రాబట్టాలి. వాటితో భాషను అనుసంధానం చెయ్యాలి. అప్పుడు వాళ్ళ స్వప్నలోకమంతా మన ముందు సాక్షాత్కరిస్తుంది. ప్రాథమికదశలో ఇట్లా చెయ్యడం భాష నేర్చుకోవడంలో (చదువడం, రాయడంలో) చాలా కీలకపాత్ర వహిస్తుందని మనం నమ్మితేనే ఇలా చెయ్యగలం. వాచకాలు వల్లించడమే భాష నేర్చుకోవడం కాదని మనం ఒప్పుకొంటేనే ఇది సాధ్యం!

# 10. సార్వత్రిక గురువులు

**రవీంద్రనాధ్ ఠాగూర్ (07.05.1861 - 07.08.1941) :** స్కూలంటే పెద్దపులి బోనులాగా, ద్వీపాంతరవాస శిక్షలాగా ఉందని తరచూ రవీంద్రుడు బాధపడేవాడు. బ్రిటిష్‌వారి గుమాస్తాలను తయారుచేసే విద్యా పరిశ్రమ పాఠశాలలకు భిన్నంగా, శాంతినికేతన్, విశ్వభారతి విద్యా సంస్థలను స్థాపించి స్వేచ్ఛగా విద్యను ఎలా నేర్చుకోవాలో మనకు నేర్పించారు. మాతృభాషలో విద్యాబోధనను సమర్థించారు రవీంద్రకవి. కేవలం నాలుగు గోడల మధ్య చదువులూ - పరీక్షల ద్వారా సమగ్రజ్ఞానం రాదనీ, స్వయంకృషీ, ఆలోచన ద్వారా మాత్రమే జ్ఞానం సంపాదించాలని అన్నారు. బట్టీపట్టడం విద్యకాదనీ, నేర్చుకోవడంలో పొందే ఆనంద అనుభవమే నిజమైన విద్య అనీ తన శాంతినికేతన్ ద్వారా నిరూపించారు. శాంతినికేతన్‌లో రవీంద్రుని మార్గంలో చదువుకున్న సరోజినీ నాయుడు వంటి ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. విద్యపైన రవీంద్రుడి అద్భుత వ్యంగ్య రచన 'చిలకమ్మ చదువు' ప్రతి ఒక్కరూ చదివితీరాలి.

**గాంధీ (01.10.1869 - 30.01.1948) :** ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం చేసిన గాంధీ భారతదేశంలో ప్రాతిపదిక విద్య ప్రయోజనాన్ని తన రచనల ద్వారా ప్రచారం చేయడమేకాదు, స్వయంగా తన కుమారుడికీ, ఇతరులకూ విద్యను నేర్పే బాధ్యతను కూడా చేపట్టారు. విద్యార్థులకు వ్యాయామంతోబాటు వృత్తివిద్యానూ నేర్పాలని, ప్రవర్తన వ్యక్తిత్వం, శీలం వంటి వాటి ద్వారా ఆత్మశిక్షణను పొందే విధంగా విద్యార్థులను తయారుచేయాలనీ చెప్పిన గాంధీ విదేశీ భాషలో విద్యాబోధనను తీవ్రంగా వ్యతిరేకించారు. 1937లో సేవాగ్రాంలో గాంధీ స్థాపించిన పాఠశాలలో మూడు గంటల వృత్తివిద్యా శిక్షణ, రెండు గంటలు పుస్తక పఠనమూ తప్పనిసరి. ఉపాధ్యాయులు కేవలం బోధించడమే కాదనీ పాఠాలలోని సారాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యపుస్తకాలకు బానిసల్లా మారకుండా, తమ సొంత అనుభవజ్ఞానంతో బోధించాలని గాంధీ భావించారు.

**మరియా మాంటిస్సోరి (31.08.1870 - 06.05.1956) :** ఉపాధ్యాయులే పిల్లల్ని అనుసరించాలనే మాంటిస్సోరి శిశు కేంద్ర విద్యకు ఆద్యురాలు. ఆట పాటలద్వారా విద్యబోధించే ఈ విధానం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమంలా మాంటిస్సోరి బడులు వెలిశాయి. బాలలకు కూడా తమదైన ఒక ప్రపంచం ఉంటుందనీ, అందులో హాయిగా జీవించేహక్కు వారికుందనీ, వారిని పువ్వుల్లా స్వేచ్ఛగా పెంచాలని ఆమె ప్రపంచాన్ని కోరేవారు. వెలుగునిచ్చే తరగతి గదులు. ఉత్సాహాన్ని కలిగించే బోధనోపకరణాలు వంటి కొత్త అంశాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మాంటిస్సోరి ఇటలీ దేశపు తొలి మహిళా డాక్టరు. స్త్రీవాది. ఆరేళ్ళలోవున్న పిల్లల గ్రహణశక్తి పెంచేందుకు, వికలాంగులకోసం నూతన బోధనోపకరణాలు తయారుచేశారు. ఇటలీలో ముసోలినీ ఈమె ఆధ్వర్యంలో స్కూళ్ళను నడిపినప్పటికీ ఆ పిల్లలకు జాతీయ ఉన్మాదాన్ని నూరిపోయడం సహించలేక ఆ బాధ్యత నుండి వైదొలిగారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో మన దేశంలో 6 సంవత్సరాలు జీవించిన మాంటిస్సోరి మన దేశంలో గిజూభాయి వంటి విద్యావేత్తలకు ఆదర్శంగా నిలిచారు.

**ఏ.యస్.నీల్ (17.10.1883 - 23.09.1973) :** ప్రస్తుతం అమలులోవున్న పెట్టుబడిదారీ విద్యావిధానంపై విసుగెత్తిపోయిన ఏ.ఎస్.నీల్ అనే స్కాట్లాండ్ ఉపాధ్యాయుడు ఇంగ్లాండులోని ఒక కొండపైన సమ్మర్‌హిల్ అనే స్కూలును ప్రారంభించారు. ఈ స్కూల్లో టైంటేబుల్ లేదు. పరీక్షలు అసలేలేవు. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ స్కూలును ప్రయోగాత్మకంగా నడిపారు. ఆడ, మగ పిల్లలకు కలిపి చదువు చెప్పడం ద్వారా వారి మధ్య చెడుప్రవర్తనా సమస్యలు ఉండవని రుజువుచేశారు. ఈ ప్రయోగాత్మక విద్యావేత్త. సహజంగా చురుకుగా, తెలివిగా జన్మించిన పిల్లల్ని నేటి స్కూళ్ళు తమ బట్టీ పద్ధతులతో ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజానికి విధేయుల్లా, బానిసల్లా తయారుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నీల్. కఠినమైన క్రమశిక్షణ పిల్లల్ని మేధావులుగా కాదు విలన్లుగా తయారుచేస్తుందంటారు. ఎవరికినచ్చిన అంశాన్ని వారు నేర్చుకునే అవకాశం కల్పిస్తే పిల్లలు స్వేచ్ఛగా ఎదుగుతారనే నీల్ అటువంటి నూతన బోధనాపద్ధతిని పాటించారు. టీచర్లకు మానసిక రుగ్మతలుంటే (ప్రాబ్లం టీచర్) అనే ఆయన రాసిన పుస్తకాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తప్పక చదవాలి.

**గిజూభాయి బగేకా (15.11.1885 - 23.06.1939) :** పిల్లల విద్య, మానసిక వికాసాల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన గిజూభ్యాయ్ బగేకా గుజరాత్‌లోని చిట్టల్‌లో జన్మించారు. పిల్లలు ఇతన్ని ఆప్యాయంగా 'మీసేల అమ్మ' అని పిలిచేవారు. 1922లో కస్తూర్బాగాంధీతో కలసి బాలమందిర్‌ను స్థాపించిన గిజూభాయి మాంటిస్సోరి విద్యా పద్ధతిని ప్రచారం చేసేందుకు పలు సభలు నిర్వహించారు. పిల్లల మానసిక వికాసం, పెంపకం వంటి అంశాలపై గిజూభాయి ఎన్నో పుస్తకాలు రాశారు. పిల్లల అభివృద్ధి ఆయా పౌర సమాజాలపై ఆధారపడి ఉంటుందని, ఏ దేశపు అభివృద్ధినైనా నిర్ధారించాలంటే ఆ దేశంలోని పిల్లల జీవితాల్ని ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పారు గిజూభాయి. ప్రాథమిక విద్యారంగంలో అమూల్యమైన మార్పులకు ఆద్యుడయ్యారు. పిల్లలలో ప్రేరణ కల్పించడం - నైతిక విలువలతో ఉండం, సామాజిక బాధ్యతను కలిగివుండడం. ఉపాధ్యాయుని కనీస అర్హతలుగా గిజూభాయి పేర్కొంటారు. "భారత విద్యా రంగానికి గిజూభాయి ఆదర్శం" అని పలువురిచే మన్ననలు అందుకున్న మహోన్నతుడు మన గిజూభాయి. తన అనుభవాలను క్రోడీకరించి 'పగటికల' వంటి పలు పుస్తకాలు రాశారు.

**మకరెంకో (13.01.1888 - 01.04.1939) :** అల్లరి పిల్లల్లో సైతం అద్భుత మార్పులు తీసుకువచ్చిన ఆచరణశీలి మకరెంకో. విప్లవానికి పూర్వం రష్యాలోని దోపిడీ వ్యవస్థలో దొంగలుగా తయారైన పిల్లల్ని, వేలాది యువజనుల్ని విద్యా శిక్షణ ద్వారా మేధావులుగా తయారుచేసే లోకాన్ని ఆశ్చర్యపరిచారు మకరెంకో. విద్యాబోధన శాస్త్రం అన్ని శాస్త్రాలకన్నా ప్రాముఖ్యమైనదనీ, ఉపాధ్యాయులు సమిష్టికృషి చేయడం ద్వారా మాత్రమే బాలబాలికలను ఆదర్శ పౌరులుగా తయారుచేయగలరనీ, నిజమైన విద్యాబోధన వ్యక్తిని సమిష్టిగా మారుస్తుందనీ అంటారు. సమిష్టి విద్యా బోధనలో వ్యక్తిగత శ్రద్ధ అంతర్భాగమనీ, విద్యను బోధించే సాధనాలన్నీ పరిస్థితులకు అనుకూలంగా మారుతూ ఉండాలనీ, నిరంతర అధ్యయనం, శిక్షణ, అనుభవం ద్వారా మాత్రమే మంచి విద్యాబోధనా నైపుణ్యం అలవడుతుందనే మకరెంకో మాటలు ఉపాధ్యాయ లోకానికి అనునిత్య ఆచరణ సూత్రాలు. విద్యపైన 100కు పైగా పుస్తకాలను మకరెంకో రాశారు.

**జ్యోతిబా పూలే (11.04.1827 - 28.11.1890), సావిత్రీబా పూలే (03.01.1831 - 10.03.1897) :** అంబేద్కర్‌కి గురువైన జ్యోతిబాపూలే విద్యార్థి దశ నుంచే సమాజంలో అసమానతలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. శూద్రకులస్తుల కోసం దేశంలో మొట్టమొది పాఠశాల పూలే స్థాపించారు. అణగారిన ప్రజల కోసం ఎన్నో గ్రంథాలయాలనూ, పాఠశాలలనూ ప్రారంభించి గొప్ప రచనలు చేశారు. తన భార్య సావిత్రీబా పూలేకి చదువు నేర్పించి ఆమె చేత బాలికల పాఠశాల ప్రారంభించారు. ఆ పాఠశాలలోనే సావిత్రి టీచర్‌గా మారి దళిత బాలికలకు పాఠాలు నేర్పారు. మన దేశ మొదటి స్త్రీ ఉపాధ్యాయురాలు సావిత్రే. ఎన్నో అగ్రకుల, పెత్తందార్ల, రౌడీల పీడననూ, అవమానాన్ని ఎదుర్కొంటూ ఆమె ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. తమ కాలంలో దళిత, అణగారిన జనం అభ్యున్నతి కోసం ఈ దంపతులు తమ ఆస్తినీ, జీవితాన్ని త్యాగం చేసి విద్య నేర్పించడం ద్వారా దళిత, శూద్ర సమాజాలలో విప్లవాత్మకమైన ఆలోచనా విధానం చోటు చేసుకొనేందుకు ఆద్యులయ్యారు. విద్యను ఆయుధంగా అసమాన సమాజంపై ఎక్కుపెట్టిన ఘనులు ఈ దంపతులు.

**సొసాకు కొబయాషి (18.06.1893 - 1962) :** తమకళ్ళముందు జరిగే విషయాలను చూసి పిల్లలు నేర్చుకొంటారని. అందుకు తగినట్లుగా వాస్తవికంగా బోధించాలనే కొబయాషి టోక్యోలో జన్మించారు. ఇందుకోసం టోక్యోలో ఏకంగా రైలుబడి అనే పాఠశాలను ప్రారంభించారు. 7 రైలు పెట్టెలే ఈ బడి తరగతి గదులు. రైతులు, కార్మికులు, చేతిపనివారు కూడ అధ్యాపకులే. ఏ రోజుకారోజు, ఏ పాఠ్యాంశాలు నేర్చుకోవాలో చెబుతారు. పిల్లలు ఇష్టం వచ్చిన సబ్జెక్టును నేర్చుకోవచ్చు. రోజూ షికార్లు, ఆట, పాటలూ, సంగీతం తప్పనిసరి. తిట్టం, కొట్టడం, అవమానించడం, ఒక బిడ్డతో ఇంకొకర్ని పోల్చడం నిషేధం. క్రమబద్ధమైన సంగీతంలా ఈ స్కూలు నడిచిన తీరును టెట్సుకో కురొయనాగి అనే రచయిత్రి 'రైలుబడి' అనే పుస్తకంగా రాశారు. ఈమె కూడా ఆ స్కూల్‌లో చదివిన విద్యార్థే. ఒక అజరామమైన విద్యావిధానాన్ని రైలుబడి ద్వారా ప్రవేశపెట్టిన కొబయాషి సంగీతపట్టభద్రుడు. 1945లో టోక్యోపై జరిగిన బాంబుదాడిలో ఈ పాఠశాల సర్వనాశనమైంది. మనకూ ఇటువంటి బళ్ళు ఉంటే మన పిల్లఉ అసలు ఇంట్లో నిలుస్తారా?

SCERT TELANGANA

# రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాదు

## ప్రాథమిక స్థాయి - తెలుగు - ఉపాధ్యాయ శిక్షణ, నవంబర్-2018

## నమోదుపత్రం - ప్రారంభ పరీక్ష

**అ) సాధారణ వివరాలు**

1) ఉపాధ్యాయుడు / ఉపాధ్యాయని పేరు : ____________________

2) పనిచేస్తున్న పాఠశాల, మండలం, జిల్లా : ____________________

3) మొబైల్ నెంబర్, ఇ-మెయిల్ ఐడి : ____________________

4) విద్యార్హతలు : ______________ 5) బోధనానుభవం : ______________

6) గతంలో విషయనిపుణిడిగా పనిచేశారా? అవును / కాదు

7) 'అవును' ఐతే ఏ స్థాయిలో పనిచేశారు? మండలం / జిల్లా / రాష్ట్రం

8) విషయనిపుణుడిగా పాల్గొన్న శిక్షణా కార్యక్రమాల పేర్లు : ____________________

9) మాడ్యూల్స్ / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్నారా? అవును / కాదు

10) 'అవును' ఐతే వాటి పేర్లు : ____________________

____________________

____________________

**ఆ) శిక్షణాంశాలు - విషయావగాహన**

**గమనిక : ఒక్కొక్క ప్రశ్నకు ఐదు వాక్యాలలో జవాబులు రాయండి. ఒక్కొక్క ప్రశ్నకు '5' మార్కులు.**

1) పిల్లలు భాషను బడికి రాకముందు ఎలా నేర్చుకొన్నారు? దీని తరగతి గది అధ్యయనం ఏమిటి?

____________________

____________________

____________________

____________________

____________________

2) సాధారణంగా పిల్లలు ఎలా నేర్చుకొంటారు? భాషకు నేర్చుకోవడానికి సంబంధం ఉందని భావిస్తున్నారా? ఎలా? వివరించండి.

3) ప్రాథమిక స్థాయి తెలుగువాచకాల తాత్త్వికతకు చెందిన ఐదు కీలక సూత్రాలను తెలుపండి.

4) 1వ తరగతి పాఠ్యపుస్తకంలో సంసిద్ధతా పాఠాల ఉద్దేశ్యం ఏమిటి? ఇవి పూర్తయ్యేసరికి విద్యార్థులు ఏమేమి చేయగల్గాలి?

SCERT TELANGANA

5) 3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకంలో సంసిద్ధతాపాఠాల ఉద్దేశం ఏమిటి? వీటిని ఎలా నిర్వహించాలి? ఏదైనా ఒక సంసిద్ధతా పాఠం ఆధారంగా రాయండి.

6) 1 లేదా 2వ తరగతిలోని పాఠాలలో విషయం అమరిక ఎలా ఉంది? ఏదైనా ఒక పాఠాన్ని ఎలా బోధించాలో తెలుపండి.

7) బడికి రాకముందు పిల్లలు చదువగలరా? మీ అభిప్రాయం తెలుపండి. దీని తరగతి గది అన్వయం ఏమిటి?

SCERT TELANGANA

8) ప్రాథమిక స్థాయిలో లేఖన సామర్థ్యం కలిగిన పిల్లలు ఏమేమి చేయగలరు? దీనికి సంబంధించిన అభ్యసన ఫలితాలు రాయండి.

9) 2017 నవంబర్ మాసంలో నిర్వహించిన జాతీయస్థాయి సాధన పరీక్ష ఫలితాలలో తెలుగు సబ్జక్టుపరంగా పిల్లల ప్రగతి ఎలా ఉంది? దీనికి కారణాలు ఏమని భావిస్తున్నారు?

10) ప్రాథమిక స్థాయిలో పిల్లల భాషాభివృద్ధి కోసం ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుంది?

సంతకం



SCERT TELANGANA